సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 349

మంగళవారం 11-3-2025


'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



'2027' పై ఇప్పుడే చెప్పను!

వచ్చే వరల్డ్‌కప్ ఆడటంపై రోహిత్ స్పందన.. స్వదేశానికి చేరిన భారత క్రికెటర్లు -14లో



ఐపీఓలు అంత ఈజీ కాదు

ఎస్ఎంఈల నిబంధనలు కఠినతరం చేసిన సెబి -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తమిళులు అనాగరికులు!

తమిళులు 'అనాగరికులు' అంటూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి.

- వివరాలు 6లో▶



ఈసీ తీరుపై అన్నీ అనుమానాలే!

ఓటర్ల జాబితాలో అవకతవకలు, నకిలీ ఓటర్ కార్డులు, ఓటర్ల తొలగింపు అంశాలను విపక్ష పార్టీలన్నీ లోక్‌సభలో లేవనెత్తాయి.

- వివరాలు 6లో▶



లలిత్ మోదీ పాస్‌పోర్ట్ రద్దు

ఐపీఎల్ మాజీ వ్యవస్థాపకుడు లలిత్ మోదీకి జారీ చేసిన పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని వనౌతు ప్రధాని అధికారులను ఆదేశించారు.

- వివరాలు 6లో▶



కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ

సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా గతంలో సేవలందించిన బ్యాంకింగ్ రంగ ప్రముఖుడు మార్క్ కార్నీను కెనడా ప్రధాని పీఠం వరించింది.

- వివరాలు 6లో▶

కేసీఆర్‌ను కొట్టింది నేనే.. గద్దె దింపిందీ నేనే!

పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చిందీ నేనే

నాది ముఖ్యమంత్రి స్థాయి.. ఆయనది మాజీ సీఎం స్థాయి

విలేకరులతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

కేసీఆర్ చెల్లని రూపాయి.. ఆయన గురించి మాట్లాడటం వృథా

బీఆర్ఎస్‌కు తెలంగాణతో సంబంధం లేదు

- రాష్ట్రానికి ఏమీ జరగొద్దని ఆ పార్టీ నేతలు కోరుకుంటున్నారు.. రాష్ట్ర అభివృద్ధి కోసం 39 సార్లు కాదు. 99 సార్లు అయినా ఢిల్లీకి వెళ్తా
- కేంద్రం నుంచి వచ్చిన నిధులపై కిషన్‌రెడ్డి చర్చకు సిద్ధం కావాలన్న సీఎం.. తెలంగాణ నుంచి వెళ్లిన దానికంటే కేంద్రం నుంచి ఒక్క రూపాయి ఎక్కువ వచ్చినా సన్మానం చేస్తానంటూ సవాల్



సాక్షి, హైదరాబాద్: 'కేసీఆర్‌ను బండకేసి కొట్టింది నేనే.. పీసీసీ అధ్యక్షుడిగా ఉండి ఎన్నికల్లో ఓడగొట్టిందీ నేనే. గద్దె దింపింది నేనే..ఆ కుర్చీలో కూర్చుందీ నేనే. సీఎంగా ఉండి పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి గుండు సున్నా ఇచ్చింది నేనే. ప్రస్తుతం నాది ముఖ్యమంత్రి స్థాయి. ఆయనది మాజీ ముఖ్యమంత్రి స్థాయి..' అని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. స్థాయి అంటే ఏంటని, ఎలా వస్తుందని ప్రశ్నించారు. 'ఉదయం నుంచి సాయంత్రం వరకు తాగితే స్థాయి వస్తుందా? డ్రగ్స్ పెట్టుకుని పార్టీలు చేసుకుంటే వస్తుందా?..' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసిన అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులతో కలిసి సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబిచ్చారు. కేసీఆర్ స్థాయికి కాంగ్రెస్‌లో ఎవరూ సరిపోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యల గురించి విలేకరులు ప్రశ్నించగా రేవంత్ స్పందించారు.

కేసీఆర్‌కు ఇప్పుడు అసెంబ్లీకి వచ్చే స్థాయి లేదు


'కేసీఆర్‌కు ఇప్పుడు అసెంబ్లీకి వచ్చే స్థాయి లేదు. ఆయనకు, కొడుకు కేటీఆర్‌కు బలుపు తప్ప ఏమీ లేవు. ఆ కుటుంబానికి ఎందుకంత బరితెగింపో అర్థం కావడం లేదు. అయినా కేసీఆర్ చెల్లని రూపాయి. ఆయన గురించి మాట్లాడడం వృథా. బీఆర్ఎస్ చేసిన అప్పులు, తప్పుల కారణంగానే రాష్ట్రం ఈ పరిస్థితుల్లో ఉంది. రాష్ట్ర అభివృద్ధి కోసం 39 సార్లు కాదు. 99 సార్లు అయినా ఢిల్లీకి వెళ్తా. అయినా బీఆర్ఎస్‌కు తెలంగాణతో సంబంధం

మిగతా 12వ పేజీలో ▶

కిషన్‌రెడ్డి తెచ్చిన మెట్రో ఎక్కడ?

'రీజనల్ రింగు రోడ్డు ఇచ్చామంటూ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ చెప్పిన మాటను నిలబెట్టుకోవాలి. నేను మెట్రో తెచ్చానని కిషన్‌రెడ్డి అంటున్నాడు. హైదరాబాద్‌లో జైపాల్‌రెడ్డి తెచ్చిన మెట్రో కనపడుతోంది కానీ కిషన్‌రెడ్డి తెచ్చిన మెట్రో ఎక్కడుంది? కేంద్రం నుంచి రావాల్సిన ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి భట్టి నిర్వహించిన సమావేశానికి రమ్మంటే సమయం లేదని కిషన్‌రెడ్డి చెప్పారు. మరి కేంద్రమంత్రి ఖట్టర్ సికింద్రాబాద్‌లో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల సమీక్షకు ఎందుకు వెళ్లలేదు? కేంద్రమంత్రి ఖట్టర్ కూడా కిషన్‌రెడ్డిని హడావుడిగా పిలిచాడా? కేసీఆర్ ఫీలవుతాడనే ఆ సమావేశానికి కిషన్‌రెడ్డి వెళ్లలేదు. కేసీఆర్ చెప్పిన చదువు మా దగ్గర చెపితే ఎలా?..' అని రేవంత్ అన్నారు.

ప్రణయ్ హంతకుడికి ఉరి



పరువు హత్య కేసులో ఒకరికి మరణశిక్ష, ఆరుగురికి జీవిత ఖైదు

నల్లగొండ జిల్లా రెండో అదనపు, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎన్.రోజారమణి తీర్పు


మృతుడు ప్రణయ్ (ఫైల్)

2018లో మిర్యాలగూడకు చెందిన ప్రణయ్, అమృత వర్షిణి ప్రేమ వివాహం

వారి కులాలు వేరుకావడంతో రగిలిపోయిన అమృత తండ్రి మారుతీరావు

రూ.కోటి సుపారీ ఇచ్చి ప్రణయ్ హత్య.. పక్కా ఆధారాలతో కేసు నమోదు చేసిన పోలీసులు


దోషి సుభాష్‌శర్మ

- 2020లోనే ఆత్మహత్య చేసుకున్న మారుతీరావు.. ప్రణయ్‌ను నరికిన సుభాష్‌శర్మకు మరణశిక్ష.. హత్యకు ప్లాన్ చేసిన, తోడ్పడిన మరో ఆరుగురికి జీవిత ఖైదు
- 78 మంది సాక్షుల విచారణ, 523 పేజీలతో తీర్పు

16లో

దోషులకు సరైన శిక్ష పడింది – ప్రణయ్ తండ్రి బాలస్వామి

ఆధారాలన్నీ పక్కాగా సేకరించడంతోనే.. – నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ 16లో



యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో గవర్నర్ 2లో

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం యాగశాలలో మహా పూర్ణాహుతిలో భాగంగా నిర్వహించిన పూజల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గ్రూప్–1 మెయిన్స్ మార్కులు విడుదల

సబ్జెక్టుల వారీగా వెబ్‌సైట్‌లో ఉంచిన టీజీపీఎస్సీ

అభ్యర్థులు వారి లాగిన్ ద్వారా చూసుకోవాలని వెల్లడి

- 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకే అందుబాటులో..
- అభ్యంతరాలుంటే రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు
- రీకౌంటింగ్ పూర్తయిన తర్వాతే జనరల్ ర్యాంకింగ్స్ విడుదల

5లో

హైటెక్ హంగులతో సమీకృత గురుకులాలు

నాణ్యమైన చదువుతోపాటు ఆకట్టుకునే వసతులు ఉండేలా నిర్మాణాలు



- విడివిడిగా అకడమిక్, డార్మెటరీ, వంట, భోజనశాల భవనాలు
- అధ్యాపకులు, ఇతర సిబ్బందికి క్యాంపస్‌లోనే భారీ క్వార్టర్లు

2లో

రియల్ బ్రోకర్లతో రేవంత్ స్కాం

ఎఫ్ఎస్ఐపై పరిమితులు విధించి టీడీఆర్‌కు డిమాండ్ పెంచే కుట్ర

ఇన్‌సైడ్ ట్రేడింగ్ లాంటి ఈ కుంభకోణంపై ఈడీ, సీబీఐ విచారణ జరపాలి

కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారన్న రాహుల్ వ్యాఖ్యలు రేవంత్‌ను ఉద్దేశించినవే

బీసీ రిజర్వేషన్లపై సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ఆమరణ దీక్ష చేయాలి

గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారు

మీడియాతో ఇష్టాగోష్టిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్ల అండతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. వేల కోట్ల భారీ కుంభకోణానికి తెరలేపుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆరోపించారు. త్వరలో హైదరాబాద్‌లో ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ)పై పరిమితులు విధించడం ద్వారా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్)కు కృత్రిమ డిమాండ్ పెంచే కుట్ర జరుగుతోందన్నారు. హైదరాబాద్‌లో టీడీఆర్‌లను ఎవరు అడ్డగోలుగా కొన్నారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆవరణలోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో కేటీఆర్ సోమవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'త్వరలో ఎఫ్ఎస్ఐపై పరిమితులను బూచిగా చూపి టీడీఆర్‌లను తిరిగి బిల్డర్లకు

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

సభ హుందాతనం పెరిగేలా ఏర్పాట్లు చేయండి



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు, యంత్రాంగం సహకరించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. సభ హుందాతనం పెరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

- వివరాలు 2లో▶

ఐదుగురు ఎమ్మెల్సీలు ఏకగ్రీవమే!



ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం సోమవారం నామినేషన్ల గడువు ముగిసే సమయానికి ఐదు స్థానాలకు గాను ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. సభలో ఉన్న బలాబలాలను బట్టి మూడు అధికార కాంగ్రెస్‌కు, ఒకటి బీఆర్ఎస్‌కు దక్కడం ఖాయమయ్యాయి.

- వివరాలు 2లో▶

ఆర్థిక ఇబ్బందులకు కుటుంబం బలి!



ఆర్థిక ఇబ్బందులకు నలుగురు సభ్యుల కుటుంబం బలైన విషాద సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న భార్యాభర్తలు, అంతకుముందు తమ ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చినట్లుగా అనుమానిస్తున్నారు.

- వివరాలు 12లో▶

సొరంగంలో ముమ్మరంగా తవ్వకాలు

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మిగిలిన ఏడుగురు కార్మికులను వెలికితీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రమాదస్థలంలో ఆదివారం టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్ సింగ్ మృతదేహం లభించిన డీ2 పాయింట్ సమీపంలో తవ్వకాలు జరుగుతున్నాయి.

- వివరాలు 5లో▶

ఇదండీ సంగతి



తమకూ ఏదైనా పదవి రాకపోతుందా అని ప్రాక్టీస్ చేస్తున్నార్సార్!

క్లుప్తంగా...

స్వదేశీ దర్శన్ 2.0 కింద రాష్ట్రంలో రెండు ప్రాజెక్టులు

- లోక్‌సభలో కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: స్వదేశీ దర్శన్ 2.0 కింద తెలంగాణలో రెండు ప్రాజెక్టులు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ రెండు ప్రాజెక్టులకు రూ. 95 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చెప్పారు. ఈ స్కీం కింద రాష్ట్రంలోని భువనగిరి కోట, అనంతగిరి ఫారెస్ట్‌లో ఎకో టూరిజం అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం లోక్‌సభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. స్వదేశీ దర్శన్ స్కీం కింద.. దేశంలో 58 గమ్యస్థానాలను గుర్తించి 34 ప్రాజెక్టులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 2024–25 ఆర్థిక సంవత్సరంలో 23 రాష్ట్రాల్లో 40 ప్రాజెక్టులను 'రాష్ట్రాలకు ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం (ఎస్‌ఏఎస్సీఐ)– ఐకానిక్ టూరిస్ట్ సెంటర్లను ప్రపంచ స్థాయికి అభివృద్ధి చేయడం' స్కీం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.3,295.76 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ స్కీంలో రామప్ప దేవాలయ ప్రాంత సుస్థిర పర్యాటక సర్క్యూట్‌కు రూ. 73.74 కోట్లు, నల్లమల సోమశిల వెల్నెస్ – ఆధ్యాత్మిక విహారయాత్ర ప్రాజెక్ట్‌కు రూ. 68.10 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి లోక్‌సభలో చెప్పారు.

'పాలమూరు- రంగారెడ్డి'కి జాతీయ హోదా సాధ్యంకాదు

- రాజ్యసభలో కేంద్ర జల్‌శక్తి శాఖ స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (పీఆర్‌ఎల్‌ఐపీ)కు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించే అంశం తమ పరిశీలనలో లేదని కేంద్ర జల్‌శక్తి శాఖ పార్లమెంట్ వేదికగా స్పష్టం చేసింది. పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం టెక్నో–ఎకనామిక్ అప్రైజల్ అమలు సాధ్యం కానందున.. ప్రాజెక్ట్ ప్రతిపాదనను 2024 డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తిప్పి పంపినట్లు జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి సోమవారం రాజ్యసభలో వెల్లడించారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం గతంలో డిమాండ్ చేసిందని తెలిపారు. అయితే కేంద్ర జల్‌శక్తి శాఖ పథకాల జాబితాలో ఏదైనా ప్రాజెక్ట్‌ను చేర్చడానికి లేదా పరిశీలించడానికి సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), అడ్వైజరీ కమిటీ ఆ ప్రాజెక్ట్‌ను ఆమోదించడం తప్పనిసరి అని పేర్కొన్నారు.

రైల్వే సమస్యలను పరిష్కరించండి

- రైల్వే బోర్డు చైర్మన్ సతీశ్‌కుమార్‌తో ఎంపీ వద్దిరాజు భేటీ



సతీశ్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న వద్దిరాజు

సాక్షి, న్యూఢిల్లీ: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని రాజ్యసభ సభ్యుడు, బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో పలు రైల్వే సమస్యలపై ఆయన ఢిల్లీలో సోమవారం రైల్వే బోర్డు చైర్మన్ సతీశ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. పలు ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, కేటాయింపులు జరగాల్సిన నిధులపై చర్చించి, వినతిపత్రాన్ని అందజేశారు. పలు రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, కొత్తగా ప్లాట్‌ఫామ్‌ల ఏర్పాటు, పాత వాటి విస్తరణ, కోవిడ్‌కు ముందు రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించడం, అదనపు హాల్ట్‌లు, మరిన్ని రైలు సర్వీసులను ప్రారంభించడం తదితర అంశాలను ఎంపీ రవిచంద్ర బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

రాష్ట్రానికి ఎయిర్‌పోర్టులు రాకుండా రాజకీయ కుట్ర

- కాంగ్రెస్ ఎంపీలు గడ్డం వంశీ కృష్ణ, రఘురాంరెడ్డి ఆరోపణ

సాక్షి, న్యూఢిల్లీ: రామగుండంలోని బసంత్‌నగర్, ఖమ్మం కొత్తగూడెంలో విమానాశ్రయాలు రాకుండా రాజకీయ కుట్ర జరుగుతోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి ఆరోపించారు. ఈ కుట్రలకు చెక్‌పెట్టి ఆయా ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టులు వచ్చేలా పోరాడతామని స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పలువురు పార్టీ ఎంపీలతో కలిసి గడ్డం వంశీకృష్ణ, రఘురాంరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి ఒత్తిడి తెస్తామన్నారు.

సమీకృత గురుకులాలు దేశవ్యాప్తంగా రావాలి: కాంగ్రెస్ ఎంపీలు

యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు దేశవ్యాప్తంగా అందుబాటులోకి రావాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఈ పాఠశాలలను నెలకొల్పుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 11 వేల కోట్లు మంజూరు చేయడంపై ఎంపీలు మల్లు రవి, రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్, కడియం కావ్య, సురేశ్ షెట్కార్, రఘురాంరెడ్డి, గడ్డం వంశీ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

హైటెక్ హంగులతో సమీకృత గురుకులాలు

నాణ్యమైన చదువుతోపాటు ఆకట్టుకునే వసతులు ఉండేలా నిర్మాణాలు

- విడివిడిగా అకడమిక్, డార్మెటరీ, వంట, భోజనశాల భవనాలు
- అధ్యాపకులు, ఇతర సిబ్బందికి క్యాంపస్‌లోనే భారీ క్వార్టర్లు



ఏ నిర్మాణానికి ఎంత ?

ప్రధాన భవన సముదాయాల నిర్మాణానికి:	రూ.140 కోట్లు
ప్రహరీ, పచ్చిక బయళ్లు, సెక్యూరిటీ బ్లాక్, కాంక్రీట్ డ్రైయిన్, రోడ్లు, ఎస్టీపీ, ప్లే గ్రౌండ్స్, భూగర్భ సంప్, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, నీటి సరఫరా వ్యవస్థ, లిఫ్టులు, వీధి దీపాలు, సౌర విద్యుత్ వ్యవస్థ తదితరాలు	రూ. 30 కోట్లు
ఎలక్ట్రిక్ ఉపకరణాలు, డిజిటల్ బోర్డులు, లైబ్రరీ, ఫర్నిచర్, క్రీడా పరికరాలు, వంటగది వ్యవస్థ, పన్నులు తదితరాలు:	రూ. 30 కోట్లు

→ 58 నియోజకవర్గాల్లో ఈ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.11,600 కోట్లు ఖర్చు చేయబోతోంది. ఒక్కో క్యాంపస్‌కు రూ. 200 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే కొడంగల్, మధిర, సూర్యాపేట నియోజకవర్గాల్లో వీటి నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఈ మూడు నియోజకవర్గాలు కాకుండా మరో 55 నియోజకవర్గాలకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడాలేని విధంగా ఆధునిక హంగులతో కూడిన భారీ సమీకృత గురుకుల క్యాంపస్‌లు అందుబాటులోకి రాబోతున్నాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'ను ప్రతిష్టాత్మకంగా నిర్మించేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. మంచి విద్యాబోధన, మెరుగైన వసతులు, మానసిక–శారీరక వికాసానికి వీలున్న పరిస్థితులు, హాస్టల్ వసతి, ఆరోగ్యకర, ఆహ్లాదకర వాతావరణం, శుభ్రతతో కూడిన భోజనం..ఇలా అన్ని రకాలుగా ఇవి మెరుగ్గా ఉండేలా తీర్చిదిద్దబోతున్నారు. ఇందుకోసం తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చర్యలు ప్రారంభించింది. గతంలో రోడ్లు, భవనాల శాఖలో ఈఎన్‌సీగా పనిచేసి పదవీ విరమణ పొందిన గణపతిరెడ్డిని ప్రభుత్వం తాజాగా దీనికి ఎండీగా నియమించింది.

ఇన్ఫోసిస్‌తో ఒప్పందం..

ఈ గురుకులాల్లో విద్యాబోధనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. పాఠ్యాంశాల తయారీ, బోధన పద్ధతులు, ఆధునిక బోధన వ్యవస్థ ఏర్పాటు.. తదితరాల్లో టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్‌తో ఒప్పందం చేసుకోనుంది. ఇప్పటికే ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకనితో ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు జరుపుతున్నారు. ఈ గురుకులాల్లో పూర్తిగా డిజిటల్ బోర్డులు వాడుతారు.

ఒక్కో క్యాంపస్ ఇలా...

యూనివర్సిటీల మాదిరిగా విశాలమైన ప్రాంతాల్లో ఈ సమీకృత గురుకుల సముదాయాలను నిర్మిస్తారు. ఒక్కో గురుకులం 25 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. కనీసం 2,560 మంది విద్యార్థులు, అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సంబంధించి 640 మంది చొప్పున ఉండేలా ఏర్పాట్లు చూస్తారు. వాటిల్లో నిర్ధారిత దామాషాలో ఓసీ విద్యార్థులను కూడా చేర్చుకుంటారు.

→ అకడమిక్ బ్లాక్, డార్మెటరీ బ్లాక్, వంట, భోజనశాల, స్టాఫ్ క్వార్టర్స్ సముదాయం విడివిడిగా ఉంటాయి.

→ విద్యార్థులకు పాఠాలు బోధించే అకడమిక్ బ్లాక్ రెండంతస్తులతో నిర్మిస్తారు. ఇందులో 64 తరగతి గదులు, 10 ప్రయోగశాల గదులు, 12 ఉపాధ్యాయుల గదులు, ఒక పరిపాలన బ్లాక్, గ్రంథాలయం, 12 టాయిలెట్లు ఉంటాయి. ఇలాంటివి నాలుగు బ్లాక్స్ ఉంటాయి.

→ విద్యార్థుల వసతి గృహాలకు సంబంధించి 11 బ్లాక్స్ నిర్మిస్తారు. ఒక్కో బ్లాక్‌లో 148 డార్మెటరీ హాల్స్ ఉంటాయి. వీటిని జూనియర్ హాస్టల్స్, సీనియర్ హాస్టల్స్‌గా విడివిడిగా కేటాయిస్తారు. జూనియర్ సెక్షన్‌లో ఒక్కో హాలులో 14 మంది విద్యార్థుల సామర్థ్యంతో 120 హాల్స్ ఉంటాయి. వాటిల్లో 1,680 మంది విద్యార్థులుంటారు. సీనియర్ సెక్షన్‌లో 376 మంది విద్యార్థులుండేలా 28 హాళ్లను నిర్మిస్తారు.

→ 41,860 చదరపు అడుగుల విస్తీర్ణంలో వంట, భోజన శాల బ్లాక్ ఉంటుంది. ఇందులో రెండు డైనింగ్ హాల్స్, ఒక వంటశాల, 2 వెజ్, నాన్‌వెజ్ స్టోర్లు, ఒక కోల్డ్ స్టోరేజ్, ఒక మల్టీపర్పస్ హాల్, ఇండోర్ గేమ్స్ హాల్ ఉంటాయి. 1,280 మంది చొప్పున రెండు షిఫ్టుల్లో దీన్ని వినియోగించుకునేలా ప్లాన్ చేశారు. అధ్యాపకులు, సిబ్బంది కోసం కూడా ట్రిపుల్, డబుల్, సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్స్ నిర్మిస్తారు.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు విజయశాంతి, అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం. చిత్రంలో సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి పొంగులేటి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, దామోదర, ఎమ్మెల్యేలు సామెల్, బీర్ల అయిలయ్య, సీపీఐ సీనియర్ నేత నారాయణ

అతిరథులు తోడుగా.. అట్టహాసంగా

- నామినేషన్లు దాఖలు చేసిన ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు
- హాజరైన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎమ్మెల్యేలు
- సీపీఐ అభ్యర్థి నామినేషన్ దాఖలు కార్యక్రమానికీ హాజరు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్‌లు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం ఉదయం గన్‌పార్కు వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించిన అనంతరం అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్న ఈ ముగ్గురు.. పార్టీ ముఖ్య నేతలు తోడు రాగా మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డికి తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, రామచంద్రునాయక్‌లతో పాటు పలువురు ఎమ్మెల్యేలు వారి వెంట ఉన్నారు.

విజయశాంతి ఆలస్యంగా..

నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి సహా ఇతర నేతలు అసెంబ్లీకి చేరుకున్న తర్వాత.. సీఎల్పీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షుడు అభ్యర్థులకు బీ ఫామ్‌లు అందజేశారు. తొలుత అద్దంకి దయాకర్‌తో పాటు శంకర్‌నాయక్‌లకు బీ ఫామ్‌లు అందజేశారు. అప్పటికింకా విజయశాంతి రాకపోవడంతో కొంతసేపు సీఎం, డిప్యూటీ సీఎం తదితరులు అక్కడే వేచి చూశారు. కానీ ఆమె రాక ఆలస్యం కావడంతో ఇద్దరు అభ్యర్థులతో కలిసి అంతా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు. ఆ తర్వాత కొంతసేపటికి అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్న విజయశాంతి నేరుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి సీఎం, డిప్యూటీ సీఎం తదితరులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఇలావుండగా కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షమైన సీపీఐ నుంచి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం కూడా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకుడు నారాయణ, రాష్ట్ర నేతలు పల్లా వెంకట్‌రెడ్డి, అజీజ్‌పాషా, పశ్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి చేసిన సేవలకు గుర్తింపు: కాంగ్రెస్ అభ్యర్థులు

కాంగ్రెస్ పార్టీ కోసం తాము చేసిన సేవలకు గుర్తింపు లభించిందని విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌లు చెప్పారు. తమను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తమపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయబోమని, ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తామని అన్నారు. సోమవారం నామినేషన్ల దాఖలు అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడం తెలంగాణ ఉద్యమకారులకు దక్కిన గౌరవమని విజయశాంతి చెప్పారు. గతంలో బీఆర్‌ఎస్‌ను ఓడగొడతారనే ఉద్దేశంతో బీజేపీలో చేరానని, అయితే, బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటి కావడంతో మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చానని చెప్పారు. అందరికంటే కాంగ్రెస్ పార్టీ కోసం తానే ఎక్కువ పనిచేశానని అన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తానని అద్దంకి దయాకర్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడతామని అన్నారు. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఉన్నానని శంకర్‌నాయక్ చెప్పారు. తనను గుర్తించినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

మొత్తం 8 నామినేషన్లు దాఖలు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా మొత్తం 8 మంది నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ముగ్గురు, సీపీఐ, బీఆర్‌ఎస్‌ల నుంచి ఒక్కొక్కరు నామినేషన్లు దాఖలు చేశారు. ఇక శ్రీకాంత్ సిలివేరు, చంద్రశేఖర్ చలికా, బోగా తిలక్‌లు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. అయితే స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు స్క్రూటినీలోనే తిరస్కరణకు గురయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ

టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: సామాజిక న్యాయానికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీనేనని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. కులగణన చేసినా, ఎస్సీలను వర్గీకరించినా అటు పార్టీ, ఇటు ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నేతలకు పదవులిచ్చినా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తొలిదఫా ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలు, మైనార్టీలకు అవకాశమిచ్చామని, రెండు రాజ్యసభ సీట్లలో ఒకటి బీసీకి ఇచ్చామని, ఇప్పుడు మూడు స్థానాలకు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సీట్లు కేటాయించామని తెలిపారు. ముఖ్యమంత్రిగా రెడ్డి సామాజికవర్గ నాయకుడికి అవకాశం ఇస్తే పీసీసీ అధ్యక్షుడిగా బీసీ వర్గానికి చెందిన తనను నియమించారన్నారు. ఎలాంటి అవకాశం వచ్చినా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అవకాశాలు కల్పిస్తోందని, సామాజిక న్యాయానికి తెలంగాణ రోల్ మోడల్‌గా మారిందని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

సభ హుందాతనం పెరిగేలా ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా, బండ ప్రకాశ్, శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి

- బడ్జెట్ సమావేశాల ఏర్పాట్లపై ముందస్తు సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- సమష్టిగా పనిచేసి విజయవంతం చేయండి: మండలి చైర్మన్ గుత్తా
- హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్, డీజీపీ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు, యంత్రాంగం సహకరించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. సభ హుందాతనం పెరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ఏర్పాట్లపై సోమవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో ఆయన ముందస్తు సమావేశం నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా, అసెంబ్లీ, మండలి చీఫ్ మార్షల్స్ కరుణాకర్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ సమావేశాల కంటే బడ్జెట్ సమావేశాలు ఎక్కువ రోజులు జరుగుతాయని, ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. సభ సజావుగా జరిగేలా పోలీసుశాఖ తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. సభ జరుగుతున్న సమయంలో ఎలాంటి ఆందోళనలు జరగకుండా చూడాలని, ఇంటెలిజెన్స్ వ్యవస్థ చురుకుగా, సమర్థవంతంగా పనిచేయాలని చెప్పారు. సభ్యులు సమయానికి సభకు చేరుకునే విధంగా ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా ఇవ్వాలని, సరైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సభ్యులకు ఇవ్వాలని చెప్పారు. సమాధాన పత్రాలను ముందుగానే సభ్యులకు పంపాలని, తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించాలన్నారు. అసెంబ్లీలో జరుగుతున్న చర్చలకు అనుగుణంగా ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు విజయవంతం చేసేందుకుగాను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, సమష్టిగా పనిచేయాలన్నారు. పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని, సమావేశాలు జరిగే రోజుల్లో అసెంబ్లీ, మండలి చుట్టూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేయాలని, వీఐపీల నివాసాలు, అసెంబ్లీ రూట్‌లో భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సభ సజావుగా జరిగేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామన్నారు.

సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలి: సీఎస్

సాక్షి, హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు సత్వరంగా పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై సోమవారం ఆమె సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. బడ్జెట్ సమావేశాల్లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని సూచించారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, పలు శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు.

ఉప ఎన్నికలు వస్తే మేమూ సిద్ధమే

- ఎంపీల ప్రెస్‌మీట్‌లో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తే తాము సిద్ధంగా ఉన్నామని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికలకు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంటున్నారు..ఇటీవల సుప్రీంకోర్టు సైతం ఆ విషయంలో నోటీసులు జారీ చేసిందని మీడియా కాంగ్రెస్ ఎంపీలను ప్రశ్నించింది. దీనిపై ఎంపీ రఘువీర్ రెడ్డి స్పందిస్తూ 'ఎన్నికలు వస్తే రాజకీయ పార్టీలుగా సిద్ధంగా ఉండాల్సిందే కదా. మాది రాజకీయ పార్టీ, ఎన్నికలు వస్తే పోటీ చేయాల్సిందే, అధికారంలో ఉన్నాం కాబట్టి ఎన్నికలు వస్తే పోటీ చేస్తాం. సుప్రీంకోర్టు నోటీసులు మాత్రమే కదా ఇచ్చింది, తుది తీర్పు రావాల్సి ఉంది. సుప్రీం ఇచ్చే తుది తీర్పుకు లోబడతాం...ఒక రాజకీయ పార్టీగా ఎన్నికలకు వెనక్కిపోయే ఆలోచన ఉండదు' అన్నారు.

యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో కొనసాగుతున్న శ్రీస్వామి అమ్మవార్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న గవర్నర్‌కు ముఖ మండపంలో ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు.. శ్రీస్వామి వారి లడ్డూ ప్రసాదంతో పాటు శ్రీనృసింహస్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్తర మాడ వీధిలోని యాగశాలలో నిర్వహించిన మహా పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఆయన వెంట కలెక్టర్ హనుమంతరావు, ఆర్డీఓ కృష్ణారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తదితరులున్నారు.

యాదగిరి క్షేత్రంలో వైభవంగా శ్రీచక్ర తీర్థం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు పాంచరాత్ర ఆగమానుసారం కొనసాగుతున్నాయి. ఆలయంలో సోమవారం ఉదయం నిత్యపూజలు చేసిన ఆచార్యులు ప్రథమ ప్రాకారంలోని ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీచక్ర ఆళ్వారుడికి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, ఆలయ మాడ వీధుల్లో ఊరేగించి విష్ణు పుష్కరిణిలో శ్రీచక్ర తీర్థ స్నానం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పునీతులయ్యారు. రాత్రి ఆలయంలో శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవాలను ఆగమశాస్త్రం ప్రకారం జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం రాత్రి శృంగార డోలోత్సవం నిర్వహిస్తారు. శృంగార డోలోత్సవంతో 11 రోజుల బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఐదుగురు ఎమ్మెల్సీలు ఏకగ్రీవమే!

- మండలిలో ఖాళీ అయ్యే ఐదు ఎమ్మెల్యే కోటా సీట్లకు ఐదు నామినేషన్లే దాఖలు
- బీఆర్‌ఎస్ రెండో అభ్యర్థిని నిలపకపోవడంతో తప్పిన ఎన్నికలు
- 13న అధికారికంగా ప్రకటించనున్న ఎన్నికల కమిషన్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం సోమవారం నామినేషన్ల గడువు ముగిసే సమయానికి ఐదు స్థానాలకు గాను ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం, బీఆర్‌ఎస్ నుంచి దాసోజు శ్రవణ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. సభలో ఉన్న బలాబలాలను బట్టి మూడు అధికార కాంగ్రెస్‌కు, ఒకటి బీఆర్‌ఎస్‌కు దక్కడం ఖాయం కాగా, మిగిలిన ఐదో స్థానంలో గెలిచేందుకు ఈ అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఒకవేళ బీఆర్‌ఎస్ రెండో అభ్యర్థిని నిలబెడితే ఎన్నిక నిర్వహించాల్సి వచ్చేది. కానీ ఆ పార్టీ నుంచి కేవలం ఒక్క అభ్యర్థి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈనెల 12న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియలు జరగనున్నాయి. నిబంధనల ప్రకారం ఉపసంహరణల ప్రక్రియ ముగిసేసరికి ఉన్న నామినేషన్లను పరిగణనలోకి తీసుకుంటారు. ఉపసంహరణల సమయం ముగియగానే ఐదు స్థానాలకు ఐదు నామినేషన్లు మాత్రమే మిగిలితే అందరు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి అధికారికంగా ప్రకటిస్తారు. మొత్తం మీద పోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితులు లేకపోవడంతో నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలావుండగా..మరో ప్రధాన పార్టీ ఎంఐఎం కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంది.

దాసోజు శ్రవణ్ నామినేషన్

- రిటర్నింగ్ అధికారికి రెండు సెట్ల పత్రాలు సమర్పణ
- హాజరైన బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ తదితరులు




రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి దాసోజు శ్రవణ్. చిత్రంలో కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు, తలసాని

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ పార్టీ తరఫున దాసోజు శ్రవణ్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీలోని బీఆర్‌ఎస్ శాసనసభా పక్ష కార్యాలయానికి చేరుకున్న శ్రవణ్‌ను.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి తదితరులు ఆయన్ను అభినందించారు. అనంతరం కేటీఆర్ నేతృత్వంలో మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు విజయుడు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద తదితరులతో కలిసి శ్రవణ్ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. 2023లోనే గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్‌ను శాసనమండలికి నామినేట్ చేసినా బీజేపీ అడ్డుకుందని, కానీ తమ పార్టీ అధినేత కేసీఆర్ అందరి ఆమోదంతో మరోమారు ఆయనకు అవకాశం ఇచ్చారని చెప్పారు. పార్టీ మారకుండా ఉంటే 2014లోనే శ్రవణ్ ఎమ్మెల్సీ అయ్యేవారని వ్యాఖ్యానించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు గతంలోనే ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ అవకాశం ఇచ్చిన విషయం గుర్తు చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు చూసి షాకయ్యా

- నాకు సినిమా ఆఫర్ వచ్చింది... ఇటీవలే కథ విన్నా
- చిట్‌చాట్‌లో జగ్గారెడ్డి వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు చూసి షాక్ అయినట్లు ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. ఇంకా ఆ షాక్ నుంచి కోలుకోలేకపోతున్నానన్నారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'పార్టీ రాష్ట్ర ముఖ్య నేతల దగ్గరకు నా సమస్యను తీసుకెళ్లాను. ఒకరేమో నవ్వడం, ఇంకొకరేమో తల ఊపడం, మరొకరేమో మౌనంగా ఉన్నారు. నాకు అసలు ఆ హావభావాల అర్థంఏంటో ఇప్పటికీ తెలియడం లేదు. కమ్మ సామాజికవర్గానికి చెందిన నాయకుడు జెట్టి కుసుమకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని పార్టీని కోరాను. ఈ అంశంపై పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌ను కలిసి విజ్ఞప్తి చేశాను. ఢిల్లీకి వచ్చి కుసుమ అంశం మాట్లాడాలని అనుకున్నా. ఈ విషయాన్ని సీఎంకు ముందే చెప్పాను' అని జగ్గారెడ్డి చెప్పారు. రాహుల్ గాంధీని సమయం అడిగానని, ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వగానే అన్ని అంశాలు మాట్లాడతానని తెలిపారు.

వెండితెరపై ఆఫర్ వచ్చింది...

తాను త్వరలో వెండితెరపై కనిపించబోతున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఓ సినిమాలో మాఫియాను ఎదిరించి ఆడపిల్ల పెళ్లి చేసే క్యారెక్టర్ చేస్తున్నానన్నారు. 'జగ్గారెడ్డి...వార్ ఆఫ్ లవ్' పేరుతో తీయబోయే ఈ సినిమా వచ్చే ఏడాది ఉగాదికి పూర్తికానుందని తెలిపారు. ఇటీవల ఒక వ్యక్తి తన వద్దకు వచ్చి స్టోరీ చెప్పారని, ఆ కథ నచ్చి నటించేందుకు సుముఖత వ్యక్తం చేశానన్నారు. తన ఒరిజినల్ లైఫ్, క్యారెక్టర్‌లోని కొన్ని సంఘటనలు ఈ స్టోరీలో ఉంటాయని చెప్పారు. కాగా, చాలా మంది తన నిజజీవితంలో జరిగిన ఎస్పీపై అటాక్, ఇతర ఘటనలు ఉంటాయా? అని మెసేజ్‌లు పెడుతున్నారని చెప్పారు. సీఎం, పీసీసీ చీఫ్ అనుమతి తీసుకొని నటిస్తానని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.



వైద్యుడు మానవాళి బలహీనతల్ని చూస్తాడు.
న్యాయవాది దుష్టత్వాన్ని చూస్తాడు.
వేదాంతి మూర్ఖత్వాన్ని చూస్తాడు.
– ఆర్థర్ షోపెన్‌హోవర్

సాక్షి
మంగళవారం, 11 మార్చి 2025

ట్రంప్ శాంతిమంత్రం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈసారి ఎవరి అంచనాలకూ అందకూడదన్న సంకల్పంతో ఉన్నట్టు కనబడుతోంది. సరిగ్గా నెల్లాళ్ల క్రితం ఆయన ఇరాన్‌పై ఆంక్షల తీవ్రతను పెంచారు. అంతే కాదు... తనను చంపటానికి ప్రయత్నిస్తే ఇరాన్ తుడిచిపెట్టుకుపోతుందని తీవ్రంగా హెచ్చరించారు. తనకేం జరిగినా వెనువెంటనే ఇరాన్‌పై దాడి చేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చానన్నారు. నాలుగు రోజుల క్రితం ఆయన హఠాత్తుగా స్వరం మార్చారు. అణు ఒప్పందంపై చర్చలకు రావాలని ఇరాన్‌కు పిలుపునిచ్చారు. అందుకు సంబంధించి తాజాగా ఒక లేఖ కూడా విడుదల చేశారు. సైనిక చర్య తీసుకుంటే ఇరాన్ భయంకరమైన పరిణామాలు చవిచూసే పరిస్థితి ఏర్పడుతుంది గనుకే చర్చలకు పిలుపునిచ్చానని ట్రంప్ వివరణనిచ్చారు. తొలిసారి అధికారంలోకొచ్చినప్పుడు అంతక్రితం ఒబామా హయాంలో కుదిరిన అణు ఒప్పందాన్ని కాస్తా ట్రంప్ 2018లో ఏకపక్షంగా రద్దుచేశారు. అది కేవలం అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం కాదు. వియన్నాలో 2015 జూలై 14న కుదిరిన ఆ ఒప్పందంపై భద్రతామండలిలోని అయిదు శాశ్వత సభ్య దేశాల(అమెరికా, చైనా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్)తో పాటు జర్మనీ, యూరప్ యూనియన్(ఈయూ)లు, ఇటు ఇరాన్ సంతకాలు చేశాయి. ఆంక్షలు సడలించటానికి అంగీకరించాయి. ఆ సమయంలో కారాలూ మిరియాలూ నూరిన రిపబ్లికన్‌లు తాము అధికారంలోకొస్తే ఒప్పందాన్ని రద్దు చేస్తామని ప్రకటించారు. ఇజ్రాయెల్ సైతం ఒప్పందాన్ని చారిత్రక తప్పిదంగా అభివర్ణించింది. ట్రంప్ ఏక పక్షంగా ఒప్పందం నుంచి వైదొలగినప్పుడు తమతో ఎందుకు చర్చించలేదని భాగస్వామ్య పక్షాలు ప్రశ్నించాయి. తాము మాత్రం ఆ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని ప్రకటించాయి. జో బైడెన్ హయాంలో పాత ఒప్పందానికి ప్రాణప్రతిష్ఠ చేస్తారనుకుంటే సాధ్యపడలేదు.

ట్రంప్ తాజా ప్రతిపాదనలో చర్చల ప్రస్తావన ఉన్నా నిజానికది మరిన్ని డిమాండ్లు తమ ముందుంచి లొంగదీసుకోవటానికేనని ఇరాన్ మత నాయకుడు ఆయతొల్లా అలీ ఖమేనీ చేసిన ప్రకటనను కొట్టిపారేయలేం. ఎందుకంటే ఇరాన్‌లో తమ కీలుబొమ్మ పాలకుడు మహమద్ రెజా పహ్లేవీ (ఇరాన్ షా) 1979లో జరిగిన ఇస్లామిక్ విప్లవంలో పదవీచ్యుతుడైనప్పటినుంచీ అమెరికా ఆగ్రహావేశాలతో రగిలిపోయింది. ఆనాటినుంచి కొనసాగిన ఆంక్షల పర్వం ఎడతెరిపి లేకుండా నాలుగున్నర దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ఎప్పటికప్పుడు కొత్త ఆంక్షలు విధించటం కూడా పరిపాటైంది. 1988లో 290 మందితో వెళ్తున్న ఇరాన్ ప్రయాణికుల విమానాన్ని సైనిక విమానంగా భావించి అమెరికా కూల్చివేసింది. తాను విధించిన ఆంక్షల్ని మరింత విస్తృతం చేయటానికి 2006లో భద్రతామండలిలో తీర్మానం చేయించింది. 2012లో ఈ ఆంక్షలు మరింత కఠినతరం చేశారు. పర్యవసానంగా పసిపిల్లలకు పాలడబ్బాలు, ఔషధాలు మొదలుకొని అనేక నిత్యావసర వస్తువులు దొరక్క ఇరాన్ ప్రజానీకం తల్లడిల్లిపోయారు. అకాల మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. తన ప్రధాన ఆదాయ వనరైన ముడిచమురు ఎగుమతుల్లో సింహభాగం నిలిచిపోవటంతో... అమెరికా బ్యాంకుల్లోవున్న వేలాదికోట్ల విలువైన బంగారం, నగదు డిపాజిట్ల స్తంభించటంతో ఇరాన్ ఎన్నో అగచాట్లు పడింది. అణ్వాయుధాల విషయంలో ఇరాన్ వాదన సమంజసమైనది. అణు కార్యక్రమంపై కేవలం తమతోనే చర్చిస్తే సరిపోదని, పశ్చిమాసియా దేశాలను సైతం భాగస్వాముల్ని చేయాలని ఆ దేశం మొదటినుంచీ కోరుతోంది. ఆ చర్చ అంతిమంగా ఈ ప్రాంతంలో అణ్వస్త్ర నిషేధానికి తోడ్పడాలని వాదిస్తోంది. గత ఒప్పందం రద్దయ్యాక అమెరికా, ఇరాన్‌లమధ్య పరస్పరం అవిశ్వాసం పెరిగిపోయింది. దాన్ని తొలుత తొలగిస్తే తప్ప అడుగు ముందుకు పడదు. ట్రంప్ తాజా ప్రతిపాదనలోని ముఖ్యాంశాలేమిటో ఎవరికీ తెలియదు. ఒబామా హయాంలో కుదిరిన పాత ఒప్పందం ఇరాన్‌కు అనుకూలంగా ఉన్నదని ట్రంప్ ఆరోపించారు. దాన్ని మరింత పకడ్బందీగా మారుస్తామన్నారు. ఖమేనీ స్పందన స్పష్టంగా ఉంది. తాము కేవలం ఇరాన్ అణు కార్యక్రమానికి పరిమితమై మాట్లాడతామని, ఇతర అంశాలు ఒప్పుకోబోమని చెప్పారు. క్షిపణుల తయారీ వ్యవహారంపై మాట్లాడే ఉద్దేశంతోనే అమెరికా స్వరం మార్చిందని ఆయన అభిప్రాయంలా కనబడుతోంది.

సంస్కరణవాది మసూద్ పెజెష్కియాన్ నిరుడు జూన్‌లో ఇరాన్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యాక ఆ దేశం వైఖరి మారింది. అగ్రరాజ్యాలతో చర్చించి 2015 నాటి అణు ఒప్పందం వంటిది కుదుర్చుకోవటానికి తాను సిద్ధమని ఆయన ఇప్పటికే చెప్పారు. అటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్‌కు మంచి సంబంధాలే వున్నాయి. ఇరాన్‌తో ఒప్పందానికి తన వంతు కృషి చేస్తానని ఇప్పటికే పుతిన్ హామీ ఇచ్చారు. అమెరికా నిఘా వర్గాల అంచనా ప్రకారం ఇరాన్ ఇంకా అణ్వస్త్ర తయారీ స్థాయికి ఎదగలేదు. ట్రంప్ తొలి ఏలుబడి నాటికి పశ్చిమాసియాలో ఇరాన్ దాదాపు ఏకాకి. సౌదీ అరేబియాతో దానికి ఘర్షణ వాతావరణం ఉండేది. ఇప్పుడలా కాదు. ఇరాన్‌తో దాదాపు పశ్చిమాసియా దేశాలన్నిటికీ మెరుగైన సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రపంచ వాణిజ్యాన్ని ఛిద్రం చేస్తున్న యెమెన్‌కు చెందిన హౌతీ మిలిటెంట్లతో ఇరాన్‌కు సాన్నిహిత్యముంది. అందువల్ల ఇరాన్‌తో నిజంగా ఒప్పందం కుదిరితే అది ప్రపంచ శాంతికి దోహదపడుతుంది. అయితే ఇరాన్‌నుంచి ఆశించే ఎలాంటి ఆచరణనైనా ఇజ్రాయెల్‌కు కూడా వర్తింపజేసినప్పుడే ఇదంతా సాధ్యమవుతుంది. కాని పక్షంలో ఈ సమస్య రావణకాష్ఠంలా రగులుతూనే ఉంటుంది.

నవ భారత ప్రణాళిక

విశ్లేషణ



మోహన్ గురుస్వామి

ఒక సమాఖ్య దేశంగా భారత్ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. దేశంలోని భిన్నత్వాలన్నింటినీ కలిపి ఉంచే లక్ష్యంతో ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగానికి పెను సవాలు ఎదురవుతోంది. భిన్న జాతులు, సంస్కృతులు, భాషల సమ్మేళనంతో కూడిన భిన్నత్వమే దీని ప్రత్యేకత. జనాభా కూర్పు కూడా ఈ దేశం హిందీ భాష, హిందుత్వ భావజాలంతో నిండి పోయేందుకు అవకాశం కల్పించదు.

విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చాలి!

ఈ దేశంలో ప్రతి రాష్ట్రమూ తనదైన రీతిలో ఒక ప్రత్యేక జాతి లాంటిది. అందుకే రాజకీయ, ఆర్థిక విషయాల్లో వీటి మధ్య సమతౌల్యతను కాపాడాల్సిన అవసరముంది. 2026లో ప్రభుత్వం ప్రారంభించ తలపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పార్లమెంటులో కొన్ని రాష్ట్రాల శక్తిని తగ్గించేదిగా ఉంటుంది. జనాభా నియంత్రణ ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను ఇచ్చేందుకు ఆ రాష్ట్రాలు చేసిన కృషికి లభించనున్న ప్రతిఫలమా ఇది! జనాభా నియంత్రణలో మంచి ఫలితాలు సాధించని రాష్ట్రాలకు మరిన్ని పార్లమెంటరీ నియోజకవర్గాలను సృష్టించటం ద్వారా ప్రోత్సాహకాలు లభించనున్నాయి. ఈ నేపథ్యంలో ఒక్క విషయమైతే స్పష్టం చేయాలి. ఈ పునర్విభజన ప్రకియను తక్షణం నిలిపివేయాలి. ప్రస్తుతం ఉన్న పార్లమెంటరీ నియోజకవర్గాలను మార్చడంపై శాశ్వత నిషేధం విధించాలి.

ఇది సాంకేతిక పరిజ్ఞాన యుగం. నాణ్యమైన విద్య ఉన్న వారే సామాజిక ఫలాలను నిర్ణయిస్తారు. నియంత్రణ మొత్తం కేంద్రం చేతుల్లో ఉన్నప్పటికీ ఉన్నత విద్యారంగం ఇప్పటివరకూ ఆశించిన ఫలితాలనైతే ఇవ్వలేదు. ఉన్నత విద్య నాణ్యత కూడా ఆశించిన ప్రమాణాల మేరకు లేదు. కాబట్టి విద్య మొత్తాన్ని రాష్ట్రాల జాబితాలోకి చేర్చడం మంచిది. రాష్ట్రాలపై ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్), యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) వంటి సంస్థల పెత్తనానికి ఫుల్‌స్టాప్ పడాలి. దేశానికి నాణ్యమైన ఆధునిక వైద్య, న్యాయ, సామాజిక శాస్త్రాల విద్య అవసరం. నాణ్యమైన విద్యను అందించే విషయంలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడేలా చేయాలి కానీ, పరిపాలన పేరిట కేంద్రం పెత్తనం చలాయించ కూడదు.

పన్నుల వాటా 66 శాతానికి చేరాలి!

రాష్ట్రాలు ఆర్థికంగా స్వావలంబన, స్వతంత్రత సాధించినప్పుడే సమాఖ్య స్ఫూర్తి వర్ధిల్లుతుంది. ఆర్థిక వనరుల విషయంలో రాష్ట్రాలకు మరిన్ని మార్గాలు అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల మేరకు రాష్ట్రాలకు పన్నుల ఆదాయంలో 42 శాతం మాత్రమే లభిస్తోంది. పైగా ఇటీవలి కాలంలో కేంద్రం వద్దనే వనరులను కేంద్రీకరించే ధోరణి కనపడుతోంది. ఈ పరిస్థితి మారాలి. రాష్ట్రాలకు దక్కాల్సిన పన్నుల వాటా క్రమేపీ 66 శాతానికి చేరాలి. కేటాయింపులు కూడా జనాభా, తీసుకొచ్చిన ఆదాయం, సగటు కంటే ఎంత ఎక్కువ ఉంది అనే అంశాలతో కూడిన సూచీ ఆధారంగా జరగాలి. రాష్ట్రాలకు అందాల్సిన మొత్తాల విడుదలల్లోనూ అనవసరమైన జాప్యాన్ని చూస్తున్నాం. రాష్ట్రాల ఆదాయాలను కేంద్ర పథకాలకు ఉపయోగిస్తున్నారు. రాష్ట్రాలు తమ ప్రణాళికలు, హామీలను నెరవేర్చుకునేందుకు వీలుగా ఆదాయం ఎక్కడికక్కడ పంపిణీ



జరిగేలా ఒక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉంది. కేంద్రం ద్వారా నిధుల విడుదలల్లో ఆలస్యం జరిగితే ఆర్‌బీఐ ప్రైమ్ లెండింగ్ రేట్లతో రాష్ట్రాలకు వడ్డీ చేర్చి ఇవ్వాలి.

దేశాద్యంతం చరిత్ర, సంస్కృతులు ఒక్క తీరున లేవు. ప్రతి ప్రాంతంలోనూ తనదైన ప్రత్యేకత కలిగిన చారిత్రక, సాంస్కృతిక కేంద్రాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వపు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) వీటి నిర్వహణ, సంరక్షణల్లో ఘోరంగా విఫలమైంది. ఆకతాయిలు పలు స్మారకాలను ధ్వంసం చేశారు. అన్ని రాష్ట్రాల్లో, ప్రాంతాల్లోనూ ప్రత్యేకమైన సంస్కృతి, చరిత్ర ఉన్న నేపథ్యంలో వాటి సంరక్షణ, నిర్వహణ బాధ్యతలు ఆయా రాష్ట్రాలకే అప్పగించాలి. ఆయా వనరులపై కేంద్రం పెత్తనం చలాయించకుండా వెంటనే రాష్ట్రాలకు బదలాయించాలి. సంకుచిత సైద్ధాంతిక భావజాలం కారణంగా ఏఎస్ఐ, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టే ధోరణి కనిపిస్తోంది.

సహజ వనరులపై హక్కు

రైతుల నుంచి సేకరించే పంటలకు మద్దతు ధర ఇవ్వడం ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉంది. ఈ సేకరణ ఒక రకమైన సబ్సిడీనే కాబట్టి... ఆయా నిధులను వ్యవసాయ భూమి విస్తీర్ణం ఆధారంగా రాష్ట్రాలకే కేటాయించాలి. దేశాద్యంతం పండే పంటల్లో ధాన్యమే ఎక్కువ కాబట్టి అన్ని రాష్ట్రాల్లోనూ ధాన్యం సేకరణకు కనీస మద్దతు ధర అందించాలి. ఒకవేళ అన్ని రాష్ట్రాలకూ ఈ పద్ధతి అనువుగా ఉండదనుకుంటే... ఆయా రాష్ట్రాలకు గ్రాంట్ల రూపంలో నష్టపరిహారాన్నైనా అందించాలి.

వాయు కాలుష్యంలో శిలాజ ఇంధనాల వాటా దాదాపు 20 శాతం. చౌక ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగం (ప్యాకేజింగ్, ఒకసారి వాడి పారేయడం) వల్ల జల వనరులకు తీవ్ర నష్టం జరుగుతోంది. దీన్ని అరికట్టేందుకు వాడి పారేసే ప్లాస్టిక్ తయారీకి ఉపయోగించే ముడి సరుకులపై సుంకాలు విధించాలి. విద్యుత్తుతో, హైడ్రోజెన్ ఫ్యూయెల్ సెల్స్‌తో నడిచే వ్యక్తిగత, రవాణా వాహనాల వాడకాన్ని ప్రోత్సహించాలి. వీటిపై పన్నులు ఎత్తివేయడం, వాడుతున్నందుకు ప్రోత్సాహకాలు అందించడం చేయాలి. గంగా పరీవాహక ప్రాంతాన్ని మినహా మిగిలిన చోట్ల బొగ్గు, ఇనుము, అల్యూమినియం, రాగి, జింక్, నికెల్ వంటి ఖనిజ నిక్షేపాలు బోలెడున్నాయి. ఈ ప్రకృతి వనరులపై సహజంగానే ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలకు హక్కు ఉంటుంది. కాబట్టి ఖనిజాన్వేషణ, వెలికితీత హక్కులు, ఆదాయం కూడా ఆయా రాష్ట్రాలకే చెందాలి.

ఆర్మీలో కొన్ని ప్రాంతాలకేనా అవకాశం?

సాయుధ దళాలు, పారామిలిటరీ దళాల్లో నియామకాలు కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. దేశంలోనే అతి పురాతనమైన పదాతిదళ రెజిమెంట్... మద్రాస్ రెజిమెంట్. నీలగిరి కొండల్లోని వెల్లింగ్టన్‌లో దీని ప్రధాన కేంద్రం ఉంది. దీంట్లో మొత్తం 29 బెటాలియన్లు ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలు మొత్తం అంటే సుమారు 27 కోట్లు లేదా దేశ జనాభాలో 22 శాతం మంది దీని పరిధిలోకి వస్తారు. మరోవైపు సిఖ్ రెజిమెంట్‌కు నియామకాలు 80 లక్షల జనాభా నుంచి జరుగుతూంటాయి. ఈ రెజిమెంట్‌లో 24 పదాతిదళ బెటాలియన్లున్నాయి. పంజాబ్ కేంద్రంగా ఉండే అన్ని రెజిమెంట్స్‌ను కలుపు కొంటే మొత్తం 74 బెటాలియన్లు ఉన్నాయి. మూడు కోట్ల మంది నుంచి ఈ నియామకాలు జరుగుతాయి. దేశ రక్షణ కోసం ఏర్పాటైన వ్యవస్థలో ఈ రకమైన ప్రాతినిధ్యం ఎంత వరకూ సబబు? గ్రామీణ ప్రాంత యువతకు మేలైన ఉద్యోగావకాశం కల్పించే మిలిటరీలో అన్ని ప్రాంతాలకూ తగిన ప్రాతినిధ్యం కల్పించాలి.

పెట్టుబడులు ఎక్కువ అవసరమయ్యే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు రెండూ కేంద్రం నియంత్రణలోనే ఉండటంతో పాటు ఈ రంగంలోకి అడుగుపెట్టడం పెద్ద వ్యాపారవేత్తలకే సాధ్యమయ్యే పరిస్థితి. జనాభాలో ఎక్కువమందికి చేరువ కాగల అవకాశమున్న రేడియోపై కూడా పెత్తనం కేంద్రానిదే. ఇలా కాకుండా ఎఫ్‌ఎం బ్యాండ్లపై రేడియో ఛానళ్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని స్థానికులకు కల్పించాలి. ప్రైవేట్, ప్రభుత్వ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు పని చేస్తున్నప్పుడు... సమాచారం కోసం అత్యధికులు ఆధారపడే రేడియో ప్రైవేటు, రాష్ట్ర ప్రభుత్వ వనరులతో ఎందుకు నడవకూడదు?

భారతదేశ ఏకత్వం అందరికీ సముచిత గౌరవమన్న దానిపై ఆధారపడి ఉండాలి. రాజకీయ భేదాలు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రాలన్నిటినీ భారత రాజ్యాంగం ఒక్కటిగా ఉంచుతోంది. అందరూ తమ గొంతు వినిపించేందుకు అవకాశం లభిస్తోంది. ఒక కేంద్రీకృత వ్యవస్థగా, ఏకస్వామ్యంగా మార్చేందుకు చేసే ఏ ప్రయత్నమైనా... అసలు ఉద్దేశాన్ని, సమాఖ్యను ముక్కలు చేస్తుంది.

వ్యాసకర్త ఫ్రీలాన్స్ కామెంటేటర్, రచయిత
mohanguru@gmail.com

- కొన్ని రాష్ట్రాల శక్తిని తగ్గించేదిగా ఉన్న పునర్విభజన ప్రకియను నిలిపివేయాలి. ప్రస్తుత పార్లమెంటరీ నియోజక వర్గాలను మార్చడంపై శాశ్వత నిషేధం విధించాలి.
- ప్రస్తుతం రాష్ట్రాలకు పన్నుల ఆదాయంలో 42 శాతం మాత్రమే లభిస్తోంది. ఈ పరిస్థితి మారాలి. వాటా క్రమేపీ 66 శాతానికి చేరాలి.
- విద్య మొత్తాన్ని రాష్ట్రాల జాబితాలోకి చేర్చడం మంచిది. రాష్ట్రాలపై ఏఐసీటీఈ, యూజీసీ వంటి సంస్థల పెత్తనానికి ఫుల్‌స్టాప్ పడాలి.

సోషల్ మీడియా

నిధి వేట



'ఛావా'లో మొఘలులు మరాఠాల నుండి బంగారం, వజ్రాలు దోచుకుని మధ్యప్రదేశ్‌లోని అసిర్‌గఢ్ కోటలో దాచినట్లు చూపించారు. సినిమా చూసిన స్థానికులు వాటిని తవ్వితీసేందుకు గునపాలతో కోటలోకి తరలి వెళుతున్నారు! ఈ మూర్ఖత్వానికి జాలేస్తోంది. – రోషన్ రాయ్, ప్రకృతి ప్రేమికుడు

న్యాయమా?



ప్రభుత్వ సర్వే: గత ఏడాది మహిళలు సగటున రోజుకు 289 నిముషాలు జీతం లేని గృహసేవలలో గడిపారు (పురుషులు గడిపింది 88 నిమిషాలు). మహిళలు తమ ఇంటి సభ్యులను చూసుకోటానికి రోజుకు 137 నిముషాలు గడిపారు (పురుషులు గడిపింది 75 నిముషాలు). దీనికి అదనంగా లక్షలాది మంది మహిళలకు 10 నుంచి 11 గంటల పాటు ఆఫీస్ పని, ప్రయాణం!

– రీతూపర్ణ ఛటర్జీ, 'ఫోర్బ్స్' పవర్ ఉమన్

అడవి తల్లులు



మీకు తెలుసా? ఏనుగుల గుంపు అంతా మహిళల సమూహమే. తల్లి, చిన్నమ్మ, అమ్మమ్మ... అన్నీ ఆడ ఏనుగులే. మగ ఏనుగులు చాలా చిన్న వయసులోనే సమూహాన్ని వదిలేస్తాయి. మందలోని తల్లి మాత్రమే కాకుండా అన్ని ఆడ ఏనుగులు పిల్లల సంరక్షణ చూసుకుంటాయి. – పర్వీన్ కస్వాన్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్

మరో అణచివేత



సాంస్కృతిక ఉత్సవాలు జరుపుకొనేందుకు టిబెట్ తప్పకుండా అర్హనీయమైనది. చైనా దురాగత విధానాల వల్ల అది తుడిచిపెట్టుకుని పోకూడదు. టిబెటన్ నగరాల పేరు మార్చటం అనేది చైనా పాల్పడుతున్న అణచివేతకు మరో రూపం మాత్రమే. (10 మార్చ్, టిబెట్ తిరుగుబాటు దినోత్సవం).

– ప్రజ్వాలాల్ రంజన్, కమ్యూనికేటర్

బెలూచిస్తాన్ ఎందుకు భగ్గుమంటోంది?

అభిప్రాయం



డా॥ గోపరాజు నారాయణరావు

బెలూచిస్తాన్, ఖైబర్ పక్తున్‌ఖ్వాల మీద పాకిస్తాన్ ప్రభుత్వం పట్టు కోల్పోయిందని ఫిబ్రవరి 18న అక్కడి మత, రాజకీయ నాయకుడు మౌలానా ఫజలుర్ రెహ్మాన్ ధ్వజమెత్తారు. సాక్షాత్తు నేషనల్ అసెంబ్లీ సాక్షిగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అక్కడి పరిస్థితికి ప్రభుత్వం, సైన్యంతో పాటు ఐఎస్ఐ కూడా కారణమేనని ఆయన అన్నారు. ఈ మాటలు వినిపించిన రెండో రోజునే, ఫిబ్రవరి 20న బెలూచిస్తాన్ మరొకసారి భగ్గుమంది. కామిల్ షరీఫ్, ఇషాన్ సర్వార్ బలోచ్ అనే ఇద్దరు తర్బత్ న్యాయ కళాశాల విద్యార్థుల నిర్బంధాన్ని నిరసిస్తూ ఈ ప్రదర్శనలు జరిగాయి. ఆ రెండు రాష్ట్రాలలోనూ ఆందోళనలు కొత్త కాదు. కానీ జాతీయ అసెంబ్లీలో ఒక ప్రముఖ సభ్యుడు ఈ స్థాయిలో హెచ్చరించడం కొత్త అంశమే.

'పాకిస్తాన్ ఒక విఫల రాజ్యం'

ఇటీవలి కాలంలో బెలూచిస్తాన్ ఉద్యమం గొంతు పెరిగింది. కొద్దికాలం క్రితమే ఐక్యరాజ్య సమితి కార్యాలయం ఎదుట బెలూచ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రదర్శన నిర్వహించిన సందర్భంగా దాని నాయకుడు రజాక్ బలోచ్ చెప్పిన మాటలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. పాకిస్తాన్ ఒక విఫల రాజ్యమనీ, అది బెలూచిస్తాన్, సింధ్, ఆక్రమిత కశ్మీర్‌ల సంపదను అడ్డంగా దోపిడీ చేస్తూ బతుకీడుస్తున్నదనీ ఆరోపించారు. దీనికి చైనా తోడై పాక్ సైన్యానికి శిక్షణ ఇచ్చి, తన కనుసన్నలలో ఉంచుకున్నదని పెద్ద ఆరోపణే చేశారు. పాక్, చైనాలను బెలూచిస్తాన్ నుంచి తరిమేయడమే తమ లక్ష్యమని అన్నారు.

స్వాతంత్ర్యం కోసం పాకిస్తాన్ మీద పోరాడుతున్న బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 'పకడ్బందీ' దాడులు ఉధృతం చేసింది. 75 ఏళ్లుగా సాగుతున్న ప్రత్యేక దేశ పోరాటం మలుపు తిరిగిందని భావించే స్థాయిలో ఈ దాడులు ఉన్నాయి. బీఎల్ఏను పాకిస్తాన్‌తో పాటు అమెరికా కూడా ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. పాకిస్తాన్ లోని బెలూచిస్తాన్ ప్రాంతంతో పాటు ఇరాన్, అఫ్గాన్‌లలోని కొన్ని ప్రాంతాలు కలిపి బెలూచిస్తాన్ అనే స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేయాలని బీఎల్ఏ కోరుతున్నది.

ఇవాల్టి బెలూచిస్తాన్ అంటే దేశ విభజనకు ముందు ఉన్న కలాత్ సంస్థానమే. దీనికి కూడా పాకిస్తాన్‌లో లేదా భారత్‌లో కలవడానికి, లేదంటే స్వతంత్రంగా మనుగడ సాగించే వెసులుబాటు ఇచ్చారు. కానీ జిన్నా ఎత్తులతో ఇది అంతిమంగా పాక్‌లో విలీనం కావలసివచ్చింది. ఇదంతా ఎందుకు చెప్పడమంటే, భారత్, పాక్ రెండూ కూడా వలస పాలన ఇచ్చిన సమస్యలను నేటికీ ఎదుర్కొంటున్నాయి. కశ్మీర్ సమస్యను పాక్ అనుకూలంగా మలుచుకోవాలనుకుంటున్నది. కానీ బెలూచిస్తాన్ వ్యవహారాలకు భారత్ దూరంగా ఉంది.



పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్ ప్రాంతంతో పాటు ఇరాన్, అఫ్గాన్‌లలోని కొన్ని ప్రాంతాలు కలిపి బెలూచిస్తాన్ అనే స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేయాలని బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ కోరుతున్నది.

1947 నుంచే వేర్పాటు బీజం

నిజానికి 1947 నుంచే బెలూచిస్తాన్‌లో వేర్పాటువాదానికి బీజం పడింది. దీని రాజధాని క్వెట్టా. కోటీ యాభయ్ లక్షల జనాభా ఉన్న బెలూచిస్తాన్ ప్రకృతి సంపదల దృష్ట్యా కీలకమైనది. 1947 నుంచి పాకిస్తాన్ ఫెడరల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలోచ్ గిరిజన తెగ ఐదు తిరుగుబాట్లు చేసింది. వీటిలో చివరిది 2000 సంవత్సరంలో మొదలయింది. తమ ప్రాంత వనరులలో స్థానికులకు సింహభాగం ఉండాలన్న డిమాండ్‌తో ఈ తిరుగుబాటు తలెత్తింది. కశ్మీర్ వేర్పాటువాద పోరాటానికి మద్దతు ఇస్తామని బాహాటంగానే ప్రకటించే పాక్ పాలకులు బెలూచీలను దారుణంగా అణచివేస్తున్నారు.

బెలూచీల అశాంతి తీవ్రరూపం దాల్చేటట్టు చేసినది పాక్‌–చైనా ఆర్థిక నడవా. 62 బిలియన్ డాలర్లతో దీనిని నిర్మిస్తున్నట్టు దశాబ్దం క్రితం చైనా ప్రకటించింది. బెలూచిస్తాన్‌కు బంగారుబాతు వంటి గ్వదర్ డీప్ సీ పోర్టు నిర్మాణం చైనా చేతిలో పెట్టడం కూడా వారి తిరుగుబాటును తీవ్రం చేసింది. హత్యలే కాకుండా కొన్ని పోలీస్ స్టేషన్‌లను కూడా బెలూచ్ ఉగ్రవాద సంస్థలు లక్ష్యంగా చేసుకున్నాయి. జాతీయ రహదారులను దిగ్బంధనం చేశాయి. రైల్వే లైన్లను పేల్చివేశాయి. 'బీఎల్ఏకు దాడులు చేసే సామర్థ్యం బాగా పెరిగిందని ఈ ఘటనలు నిరూపిస్తున్నాయి. సున్నిత ప్రదేశాలతో పాటు, గహనమైన లక్ష్యాల మీద కూడా దాడి చేసే శక్తి అది సముపార్జించుకున్నది. వీటితో బీఎల్ఏకు విదేశీ సాయం ఉన్నదన్న అనుమానం పాకిస్తాన్‌లో మరింత పెరిగింది' అని పాకిస్తాన్ రాజకీయ, సైనిక వ్యవహారాల వ్యాఖ్యాత ఆయేషా సిద్దిఖీ వ్యాఖ్యానించారు. సాధారణంగా బెలూచిస్తాన్ ఉగ్రవాదుల దాడులను పాకిస్తాన్ ఫెడరల్ ప్రభుత్వం 'శత్రువుల' పనిగా అభివర్ణిస్తూ ఉంటుంది. అయితే భారత వైమానిక దళ మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్ ఉదంతం తరువాత, అంటే 2016 నుంచి బెలూచిస్తాన్ హింసలో భారత్ హస్తం ఉన్నదని కొత్త పల్లవి అందుకుంది. ఇప్పటికీ జాదవ్ పాకిస్తాన్ నిర్బంధంలోనే ఉన్నారు. ఇందుకే బెలూచిస్తాన్‌లో హింసకు సంబంధించి భారత్ మీద పాక్ చేసే ఆరోపణలకు చైనా మీడియా విపరీతమైన ప్రాధాన్యం ఇస్తూ ఉంటుంది.

పశ్చిమ ప్రాంతంలోనే 'తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్తాన్' సంస్థ కూడా పాక్ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెడుతున్నది. చిరకాలంగా బెలూచిస్తాన్ ప్రజల పట్ల పాకిస్తాన్ ప్రభుత్వం అణచివేత వైఖరినే అవలంబిస్తున్నది. అక్కడి పౌరులను అపహరించి మళ్లీ వారి జాడ లేకుండా చేయడం స్థానిక ప్రభుత్వ నిఘా సంస్థలు చేస్తున్న పనేనని 2023 నాటి ఒక నివేదిక పేర్కొన్నది. కనిపించకుండా పోయినవారి కోసం, రాజ్యాంగేతర హత్యలకు వ్యతిరేకంగా గళం ఎత్తుతున్న 'వాయిస్ ఆఫ్ బెలూచ్ మిసింగ్ పర్సన్స్', 'బెలూచ్ యాక్ జెహెతి కమిటీ' సభ్యులను కూడా భద్రతా బలగాలు తీవ్రంగా హింసిస్తున్నాయి. బెలూచిస్తాన్‌లో ఎన్నికలు ప్రహసనంగానే జరుగుతాయి. పౌర ప్రభుత్వాలు, వ్యవస్థలు, సైన్యం ఆ ఎన్నికలను తమకు అనుకూలంగా జరుపుకొంటూ ఉంటాయి. లేదంటే బెలూచిస్తాన్ ఏర్పాటును వ్యతిరేకించే స్థానిక జాతీయ పార్టీలను గెలిపిస్తూ ఉంటారు. బెలూచిస్తాన్‌లో ఉండే బెలూచీలు, పష్తూన్ ప్రజల మధ్య సదా విభేదాలు రాజేయడానికి సైన్యం తన వంతు పాత్రను పోషిస్తూ ఉంటుంది.

బుగ్తీని చంపిన తప్పిదం

బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ మొన్నటి ఆగస్టులో చేసిన దాడులకు మరొక ప్రాధాన్యం ఉంది. అది బుగ్తీ తెగ ప్రముఖుడు అక్బర్ ఖాన్ బుగ్తీ 18వ వర్ధంతి. పర్వేజ్ ముషార్రఫ్ ఆదేశాల మేరకు ప్రయోగించిన క్షిపణి దాడిలో రహస్య స్థావరంలోనే బుగ్తీ మరణించాడు. నిజానికి ఆయన మొదట పాకిస్తాన్ ఫెడరల్ ప్రభుత్వంలో మంత్రి. బెలూచిస్తాన్ ప్రావిన్స్‌కు గవర్నర్‌గా కూడా పని చేశాడు. తరువాత బెలూచీల సాయుధ తిరుగుబాటులో భాగస్వామి అయ్యాడు. జుల్ఫీకర్ అలీ భుట్టో ఉరితీత ఎంత తప్పిదమో, బుగ్తీని హతమార్చడం కూడా అంతే తప్పిదమని విశ్లేషకులు భావిస్తూ ఉంటారు. బుగ్తీని చంపడం బెలూచిస్తాన్ ఉద్యమానికి అమరత్వాన్ని ఆపాదించింది. 1970లో బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ఆవిర్భవించినప్పటికీ, దూకుడు పెంచినది మాత్రం ఆయన మరణం తరువాతే.

ఈ నేపథ్యంలో బెలూచిస్తాన్ ఉద్యమకారులు భారత్ వైపు ఆశగా చూడటం ఒక పరిణామం. వారి ప్రదర్శనలలో భారత్ అనుకూల ప్లకార్డులు ప్రదర్శించడం సాధారణమైంది. పాక్ ప్రస్తుత పరిస్థితులను బట్టి ఆ తుంటరి పిల్లాడికి బుద్ధి చెప్పవలసిన బాధ్యత, హక్కు భారత్‌కు ఉన్నాయని లండన్ కేంద్రంగా పనిచేసే బెలూచిస్తాన్ విముక్తి పోరాట సంస్థ కార్యకర్త ఒకరు అభిప్రాయపడటం విశేషం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఉపవాసాల అసలు లక్ష్యం

పవిత్ర రమజాన్ రాకడతో శుభాల పర్వం మొదలయింది. ముస్లింలు ఎంతో ఉత్సాహంతో ఉపవాస దీక్షలు ప్రారంభించారు. చిన్నపిల్లలు సైతం 'రోజా' పాటించడానికి ఉబలాట పడుతున్నారు. దీనికి కారణం ఏమిటి? అసలు ఉపవాసం ఎందుకుండాలి? దీనికి స్వయంగా దైవమే, 'ఉపవాసం వల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది' అంటున్నాడు. భయ భక్తులంటే ఏమిటి? మానవుడి మనస్సు దుష్కర్మల పట్ల ఏవగింపును, అసహ్యాన్ని ప్రకటిస్తూ, సత్కర్మల పట్ల అధికంగా మొగ్గుచూపే స్థితి. ఈ స్థితిని మానవ ఆంతర్యంలో జనింపజేయడమే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం.



అందుకని ఉపవాసం పాటించేవారు బాహ్య పరిశుభ్రతతోపాటు, అంతశ్శుద్ధిని కూడా పాటించాలి. నోటిని నియంత్రణలో ఉంచుకోవాలి. మాట్లాడే అవసరం లేకపోతే మౌనం పాటించాలి. ఇతరులెవరైనా అకారణంగా రెచ్చగొట్టినా తాము ఉపవాస దీక్ష పాటిస్తున్నామన్న విషయాన్ని మరిచిపోకూడదు. ఈ స్పృహ ఉన్నప్పుడే అన్నిరకాల చెడుల నుండి సురక్షితంగా ఉండే అవకాశం ఉంటుంది. ఉపవాస దీక్ష పాటిస్తున్నప్పటికీ అసత్యం పలకడం, అసత్యాన్ని ఆచరించడం మానుకోనివారు నిజానికి వ్రతం పాటిస్తున్నట్లు కాదు. కేవలం పస్తులుండడంతో సమానం. ఉపవాసదీక్షల పేరుతో ఇలా ఆకలిదప్పులతో పడి ఉండటం పట్ల దైవానికి ఏమాత్రం ఆసక్తిలేదు. మహమ్మద్ ప్రవక్త(స) ఇలా చెప్పారు: 'ఉపవాస దీక్ష పాటించే చాలా మందికి, తమ ఉపవాసాల ద్వారా ఆకలిదప్పుల బాధ తప్ప, మరెలాంటి ప్రయోజనమూ చేకూరదు'.

ఉపవాస లక్ష్యం మనిషిని ఆకలిదప్పులతో మాడ్చి ఉంచడం కాదు. దైవాదేశ పాలనలో మరింత రాటుదేలే విధంగా తీర్చిదిద్దడం. దైవ విధేయతా పరిధిని ఏమాత్రం అతిక్రమించకుండా, అన్నిరకాల చెడుల నుండి సురక్షితంగా ఉంచడం. పవిత్ర రమజాన్‌లో ఏ విధంగా అన్ని రకాల చెడులకు, అవలక్షణాలకు దూరంగా సత్కార్యాల్లో, దాన ధర్మాల్లో, దైవధ్యానంలో, సమాజ సంక్షేమ కార్యకలాపాల్లో పాల్గొంటారో... అలాగే మిగతా కాలమంతా సమాజంలో శాంతి, న్యాయం, ధర్మం పరిఢవిల్లుతూ జీవితం సాఫీగా గడిచిపోవాలని, పరలోక సాఫల్యం సిద్ధించాలన్నది అసలు ధ్యేయం.

– యండి. ఉస్మాన్ ఖాన్



గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.9.34 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఆశ్లేష రా.2.58 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.3.32 నుండి 5.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.38 నుండి 9.26 వరకు, తదుపరి రా.11.00 నుండి 11.48 వరకు, **అమృతఘడియలు:** రా.1.28 నుండి 2.07 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.16, **సూర్యాస్తమయం:** 6.04.


కలెక్టరేట్ భవనంపైకి ఎక్కిన రైతు సురేందర్. చిత్రంలో కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న రైతు, ఆయన తండ్రి రమేశ్

నాకు ఇక చావే శరణ్యం

భూ సమస్యపై కలెక్టరేట్ పైకెక్కిన యువరైతు

మెదక్ కలెక్టరేట్: భూ సమస్య పరిష్కరించాలంటూ ఏళ్ల తరబడి తిరిగి విసిగిపోయా. వెంటనే సమస్య పరిష్కరించకుంటే కిందకు దూకుతానంటూ ఓ యువ రైతు సోమవారం మెదక్ కలెక్టరేట్ భవనం ఎక్కి హల్‌చల్ సృష్టించాడు. హవేళీఘణాపూర్ మండలం శమ్నాపూర్‌కు చెందిన పట్నం సురేందర్ తండ్రి రమేశ్ పేరున 15 గుంటల వ్యవసాయ భూమి ఉంది. పాతూర్ శివారులో మరో ఎకరం పొలం ఉండగా, మరికొంత భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. 2018లో ధరణి వచ్చిన సమయంలో రమేశ్‌కు పట్టాదార్ పాసు పుస్తకం వచ్చింది. కానీ అందులో సురేందర్ ఫొటోతో ఆధార్ లింక్ చేశారు. దీంతో రైతుబంధు, పంట రుణాలు పొందలేకపోతున్నారు. ఇదే క్రమంలో శమ్నాపూర్ శివారులో సురేందర్ గుంట వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. అది అతని తండ్రి రమేశ్ పేరున వెళ్లింది. దానికి సైతం రైతుబంధు రావడం లేదు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ నగేష్ రైతును సముదాయించారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


పొర్లుదండాలతో ప్రజావాణికి వస్తున్న బాధితులు

పొర్లు దండాలతో ప్రజావాణికి

సమస్య పరిష్కరించాలంటూ నినాదాలు

నిర్మల్ చైన్‌గేట్: సమస్య పరిష్కారం కోసం బాధితులు ప్రజావాణికి పొర్లుదండాలు పెడుతూ వచ్చిన ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. లోకేశ్వరం మండలం నరసింహనగర్ తండాకు చెందిన జాదవ్ మోతీరాం, జాదవ్ కిషన్ అన్నదమ్ములు. వీరికి పది ఎకరాల పట్టాభూమి ఉంది. ఈ భూమిని 50 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారు. ఇందులో నుంచి ఎకరంన్నర భూమిని గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణానికి తీసుకుంది. ఇందుకు బదులుగా మరోచోట స్థలం కేటాయిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటివరకు ఎక్కడా స్థలం కేటాయించలేదు. దీంతో బాధితులు కుటుంబ సమేతంగా 77 రోజులుగా కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేస్తున్నారు. వీరి ఆందోళనను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు నుంచి ప్రజావాణి నిర్వహిస్తున్న హాల్ వరకు పొర్లుదండాలు పెడుతూ వచ్చారు. కలెక్టర్ తమ సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. చాలాసేపు నిరసన తర్వాత సంబంధిత అధికారులు ఈనెల 20వ తేదీన గ్రామానికి వచ్చి సర్వే చేస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. దీంతో బాధితులు నిరసన విరమించారు.


ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న రైతు సుధాకర్

పట్టా భూములు లాక్కుంటున్నారు

కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పట్టా భూములను లాక్కుంటున్నారంటూ ఓ రైతు సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. రావిర్యాలకు చెందిన కాసుల సుధాకర్, ఆయన సోదరుడు బాలరాజుకు కొంగరకుర్దు సర్వే నంబర్ 13లో ఆరెకరాల భూమి ఉంది. ఇందులో కొంత గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో పోతోంది. అయితే తమకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండానే ప్రభుత్వం భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసిందని బాధితులు ఆరోపించారు. సోమవారం ఉదయం అధికారులు మార్కింగ్ చేసిన భూముల్లో హద్దురాళ్లు నాటుతున్నారు. బాధితులు అక్కడికి వెళ్లగా, పోలీసులు వెనక్కి పంపించారు. దీంతో దిక్కు తోచనివారు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ప్రధాన గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తుండగా, సుధాకర్ బాటిల్‌లోని పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నాడు. వెంటనే పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని డీఆర్‌ఓ సంగీత వద్దకు తీసుకెళ్లారు. రైతులకు మెరుగైన పరిహారం ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.


ప్రజావాణిలో కలెక్టర్‌కు మొర పెట్టుకుంటున్న వృద్ధ దంపతులు

కన్నబిడ్డలు పట్టెడన్నం పెట్టడం లేదు

కలెక్టర్‌కు గోడు వెళ్లబోసుకున్న వృద్ధ దంపతులు

మెదక్ కలెక్టరేట్: 'కన్నబిడ్డలు కనికరించడం లేదు.. వృద్ధాప్యంతో ఇబ్బంది పడుతున్నా పట్టెడన్నం పెట్టడం లేదు. ఆరెకరాల పొలం ఉంటే.. పెద్దకొడుకు సత్యనారాయణ నాలుగు ఎకరాలు ఆర్‌ఓఆర్ చేసుకున్నడు. రెండెకరాలు చిన్న కొడుకు కాశీనాథంకు వీలునామా రాసిచ్చాం. ఆస్తి వాటాలు పంచుకున్నా. మా బాగోగులు చూడడం లేదు'అంటూ మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్‌కు చెందిన దేసి కోడయ్య, శివలక్ష్మి దంపతులు సోమవారం ప్రజావాణిలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వేడుకున్నారు. 'పెద్దకొడుకు దగ్గరలోనే ఉన్నప్పటికీ ఆలనా పాలనా చూడటం లేదు. చిన్న కొడుకు పటాన్‌చెరులో నివాసం ఉంటున్నడు. ఇద్దరు కొడుకుల పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు.. ఆర్థికంగా ఎదిగినప్పటికీ మమ్మల్ని పట్టించుకోవడం లేదు'అంటూ గోడు వెళ్లబోసుకున్నారు.

పెన్షన్ డబ్బుల కోసం కొడుకులు వేధిస్తున్నారు

కలెక్టర్‌కు విశ్రాంత ఉపాధ్యాయుడి మొర



హనుమకొండ అర్బన్: వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన కొడుకులే తనకు నరకం చూపిస్తున్నారంటూ ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు కన్నీటి పర్యంతమయ్యాడు. అవసాన దశలో తనను ఇంటినుంచి వెళ్లగొట్టారని, పెన్షన్ డబ్బులకోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన పిల్లల నారాయణ (89) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. ఒక కొడుకు ప్రభుత్వ ఉద్యోగం చేసి విరమణ పొందగా, మరో కొడుకు పోలీస్ ఉద్యోగం చేస్తున్నారు. ఇంకో కొడుకు ప్రైవేటు టీచర్. వీరిలో రెండో కొడుకు స్వగ్రామంలో వ్యవసాయం చేస్తుండగా నారాయణ అతనితోనే ఉంటున్నారు. కాగా, ప్రతీనెల వచ్చే పెన్షన్ ఏం చేస్తున్నావంటూ గత కొన్ని సంవత్సరాలుగా ముగ్గురు కొడుకులు తనను వేధిస్తున్నారని, ఏటీఎం కార్డు గుంజుకున్నారని నారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. వృద్ధాప్యంలో ఉన్న తనకు వారి వేధింపులనుంచి రక్షణ కల్పించాలని, తన పెన్షన్, తన ఆస్తులు తను బతికున్నంత వరకు తనకే ఉండేలా అవకాశం కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

భూమి లాక్కొని కొడుకులు వెళ్లగొట్టారు

- కలెక్టర్‌కు మొరపెట్టుకున్న వృద్ధురాలు


కలెక్టరేట్ ఆవరణలో ఎడ్ల నర్సమ్మ

జగిత్యాల టౌన్: 'అయ్యా.. నా కొడుకులు నన్ను మంచిగా చూసుకుంటామని నమ్మించిండ్రు. నా పేరున ఉన్న రూ.15 కోట్ల విలువ చేసే ఆరెకరాల భూమిని గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నరు. ఇప్పుడు పిడికెడు బువ్వ పెట్టకుండా కట్టుబట్టలతో ఇంటినుంచి గెంటేసిండ్రు. దిక్కులేని స్థితిలో గుడిమెట్ల వద్ద అడుక్కుతినాల్సిన దుస్థితి దాపురించింది.. నాకు న్యాయం చేయండి'అంటూ జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు ఎడ్ల నర్సమ్మ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు మొరపెట్టుకుంది. తన సంరక్షణ బాధ్యత చూసేలా కొడుకులపై చర్యలు తీసుకోవాలని గతంలో జగిత్యాల ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా.. వారు ఇద్దరు కొడుకులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారని, ఆ సమయంలో తలా రూ.3 వేల చొప్పున జీవనభృతిగా ఇచ్చేందుకు ఒప్పుకున్నారని, రెండేళ్లుగా రూపాయి కూడా ఇవ్వడం లేదని నర్సమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. '2021లో నా కొడుకులు ఎడ్ల మోహన్, ఎడ్ల రవి మోసపూరితంగా నా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నరు. ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేసి నాకు న్యాయం చేయాలి'అని కలెక్టర్‌ను వేడుకుంది.

ద్రోహం చేసిన వారిని పార్టీ క్షమించదు

- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి సమత

చర్ల: ప్రజలు, పార్టీకి ద్రోహం చేసి పారిపోయిన వారిని పార్టీ ఎన్నటికీ క్షమించబోదని మావోయిస్టు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి సమత హెచ్చరించారు. మావోయిస్టు పార్టీలోని పశ్చిమ బస్తర్ డివిజనల్ కమిటీ మెంబర్ దినేశ్, ఆయన భార్య గంగులూరు ఏరియా కమిటీ సభ్యురాలు కళ మావోయిస్టు పార్టీని వీడి బయటకు వెళ్లిన నేపథ్యంలో సమత సోమవారం లేఖ విడుదల చేశారు. బీజాపూర్ జిల్లాలోని పెదకొర్మాకు చెందిన మోడెం దినేశ్ కొంతకాలంగా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తుండటంతో పార్టీ మందలించిదని, అయినప్పటికీ లక్ష్యపెట్టలేదని చెప్పారు. ఇక బీజాపూర్ జిల్లా పల్నార్‌కు చెందిన తాటి కళ 2007లో పూర్తి స్థాయి కార్యకర్తగా చేరగా, దినేశ్, ఆమె ఇష్టపడడంతో పార్టీ 2015లో వివాహం జరిపించిందని తెలిపారు. అయితే, వీరు శత్రువుకు లొంగి నాలుగు రోజుల క్రితం పార్టీ డబ్బుతో పారిపోయారని తెలిపారు. పార్టీకి ద్రోహం చేసినవారిని పార్టీ క్షమించబోరని సమత ఆ లేఖలో వెల్లడించారు.

గ్రూప్–1 మెయిన్స్ మార్కులు విడుదల

సబ్జెక్టులవారీగా వెబ్‌సైట్‌లో ఉంచిన టీజీపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్ / కేయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 563 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సోమవారం విడుదల చేసింది. పేపర్ వారీగా 7 పేపర్ల మార్కులను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు వారి టీజీపీఎస్సీ ఐడీ, మెయిన్స్ పరీక్షల హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ, వన్‌టైమ్ పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయ్యి మార్కులు తెలుసుకోవచ్చని సూచించింది. ఈ ఫలితాలు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థులు మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవాలని టీజీపీఎస్సీ కోరింది. గ్రూప్–1 నియామకాల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ మార్కుల జాబితా అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. కాగా, నిబంధనల ప్రకారం రిజెక్టెడ్, ఇన్వాలిడ్, డిస్క్వాలిఫైడ్ కేటగిరీలోకి వచ్చిన అభ్యర్థుల మార్కుల జాబితాలను ప్రస్తుతం విడుదల చేయలేదు. అదేవిధంగా కోర్టు ఆదేశాలతో మెయిన్స్ పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కుల జాబితాను హైకోర్టు ఉత్తర్వులకు లోబడి కమిషన్ విడుదల చేయలేదు. ఈ ఫలితాల్లో హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మాందారిపేటకు చెందిన తేజస్విని 900 మార్కులకు 532.5 మార్కులు సాధించారు. ఆమె 2019లో గ్రూప్–2 పరీక్షల్లో ప్రతిభ చూపి మండల పంచాయతీ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించి.. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్–1లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికవుతానని తేజస్విని ధీమా వ్యక్తం చేశారు.

రీకౌంటింగ్‌కు అవకాశం...

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల్లో అభ్యర్థులు తాము సాధించిన మార్కులపై అభ్యంతరాలుంటే రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని టీజీపీఎస్సీ కల్పించింది. అందుకోసం అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున ఫీజును నిర్దేశించింది. ఫీజు చెల్లింపు కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ ఐడీ ద్వారా లాగిన్ అయ్యాక నిర్దేశించిన ఆప్షన్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలోనే చెల్లించాలి. అనర్హతకు గురైన అభ్యర్థులకు రీకౌంటింగ్‌కు అవకాశం ఉండదు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను నోటిఫికేషన్‌లో అనెక్జర్–6లో నిర్దేశించిన ప్రకారం అందుబాటులో ఉంచుకోవాలని కమిషన్ సూచించింది.

త్వరలో జనరల్ ర్యాంకింగ్స్

రీకౌంటింగ్ ప్రక్రియ కొలిక్కి వచ్చిన తర్వాత అభ్యర్థుల మార్కులను మళ్లీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఆ తర్వాత జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్‌ఎల్)ను టీజీపీఎస్సీ విడుదల చేస్తుంది. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో జీఆర్‌ఎల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. ఆ తర్వాత ప్రాథమిక జాబితాకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను విడుదల చేస్తారు. వారికి వ్యక్తిగతంగా కూడా సమాచారం ఇవ్వనున్నట్లు కమిషన్ వెల్లడించింది. ఏవైనా సాంకేతిక సమస్యలకు సంబంధించి కమిషన్ టెక్నికల్ డెస్క్‌ను సంప్రదించాలని టీజీపీఎస్సీ కోరింది. 040–23542185, 040–23542187 ఫోన్ నంబర్లలో లేదా helpdesk@tspsc.gov.inలో సంప్రదించవచ్చని సూచించింది.

నేడు గ్రూప్-2 ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 783 గ్రూప్-2 ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేయనుంది. ఆ తర్వాత 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తారు. ఆ ప్రక్రియ పూర్తిచేసి తుది ఫలితాలను విడుదల చేస్తారు.

ఏడాదిలోనే ఫలితాలు..

రాష్ట్రంలో గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో టీజీపీఎస్సీ రికార్డు సృష్టించింది. గతంలో గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఏళ్ల తరబడి సాగేది. ఈసారి ఏడాది కాలంలోనే కొలిక్కి తెచ్చింది. గతేడాది ఫిబ్రవరి 19న 563 గ్రూప్–1 ఉద్యోగాలకు కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 4,03,465 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది జూన్ 9న 31 జిల్లాల్లో 897 సెంటర్లలో ఓఎంఆర్ పద్ధతిలో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. జూలై 7వ తేదీన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. 1:50 నిష్పత్తిలో 31,383 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేసింది. స్పోర్ట్స్ కోటా విషయంలో హైకోర్టును ఆశ్రయించిన 20 మందికి కోర్టు అనుమతిచ్చింది. మెయిన్స్ పరీక్షలు గతేడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించింది. ఈ పరీక్షలకు మొత్తం 31,403 మంది హాజరు కాగా, మొత్తం 7 పేపర్లు రాసిన వారు 21,093 మంది మాత్రమే. తాజాగా వీరిలో టీజీపీఎస్సీ నిబంధనల ప్రకారం అర్హత సాధించినవారి మార్కులు విడుదల చేసింది.

5,11,61,104 జీరో కరెంట్ బిల్లులు

- ఏడాది పూర్తిచేసుకున్న గృహజ్యోతి

సాక్షి, హైదరాబాద్: పేదల గృహాలకు నెలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం ఈ ఏడాది ఫిబ్రవరి 28తో ఏడాది కాలాన్ని పూర్తి చేసుకుంది. ఈ పథకం కింద ఇప్పటి వరకు 5,11,61,104 జీరో కరెంట్ బిల్లులు జారీ చేసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. 39,86,337 మంది లబ్ధిదారులతో పథకాన్ని ప్రారంభించగా, ప్రస్తుతం 50,36,680కి పెరిగారు. లబ్ధిదారుల తరఫున ఇప్పటి వరకు డిస్కంలకు రూ.1,775.16 కోట్ల విద్యుత్ బిల్లులను సర్కారు చెల్లించింది.

సొరంగంలో ముమ్మరంగా తవ్వకాలు

- మిగతా కార్మికుల ఆచూకీ కోసం కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో మిగిలిన ఏడుగురు కార్మికులను వెలికితీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రమాదస్థలంలో ఆదివారం టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభించిన డీ2 పాయింట్ సమీపంలో సింగరేణి, ర్యాట్‌హోల్ మైనర్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు జరుగుతున్నాయి. కడావర్ డాగ్స్ ద్వారా గుర్తించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుపుతూనే డీ2 నుంచి డీ1 మధ్యలో కార్మికుల రాకపోకలకు అవకాశం ఉండే చోట ట్రెంచ్‌ను తవ్వుతున్నారు. మంగళవారం మరోసారి కడావర్ డాగ్స్‌తో ఆయా ప్రాంతాల్లో గాలించనున్నారు.

17వ రోజుకు చేరిన సహాయక చర్యలు..

సొరంగంలో గత నెల 22న ప్రమాదం చోటుచేసుకోగా 17 రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సోమవారం సొరంగం వద్ద రెస్క్యూ బృందాల నిపుణులతో తాజా పరిస్థితిపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్ ఉన్నతస్థాయిలో సమీక్షించారు. మరోవైపు సొరంగంలో తవ్వకాల వల్ల పైకప్పు నుంచి శిథిలాలు పడే అవకాశం ఉండటంతో ప్రాణనష్టాన్ని నివారించడానికి అన్వీ రోబోటిక్స్‌కు చెందిన రోబోలను మంగళవారం సాయంత్రం అధికారులు రంగంలోకి దించనున్నారు.


ప్రమాద స్థలంలో కడావర్ డాగ్స్‌తో గాలింపు చేపడుతున్న రెస్క్యూ బృందాలు

నేడు స్వదేశానికి తెలుగువారు

- థాయ్‌లాండ్ మీదుగా ఢిల్లీకి రాక
- మయన్మార్, థాయ్‌లాండ్‌లతో ఫలించిన కేంద్ర దౌత్యం
- బాధితుల విడుదలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి చొరవ


ఇండియాకు రానున్న తెలుగువారు

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొలువుల కోసం వెళ్లి మయన్మార్‌లోని చైనీస్ సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లో బందీలుగా మారిన భారతీయుల తరలింపు మొదలైంది. 540 మందిని రెండు విమానాల్లో తీసుకురానున్నారు. తొలుత వీరిని పొరుగున 11. కి.మీల దూరంలో ఉన్న థాయ్‌లాండ్‌లోని మై సోట్ పట్టణానికి తరలించి అక్కడున్న విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తరలిస్తారు. ఇందులో భాగంగా సోమవారం 270 మందితో తొలి విమానం థాయ్‌లాండ్‌లోని మై సోట్ నుంచి ఢిల్లీకి బయల్దేరింది. మంగళవారం మరో 270 మందితో రెండో విమానం ఇండియాకు రానుంది. ఇందులో తెలంగాణకు చెందినవారు 23 మంది, ఏపీ వారు 19 మంది ఉన్నారు. ప్రస్తుతం వీరంతా మయన్మార్‌లోని మేవాడీ జిల్లాలో ఆర్మీ పరిరక్షణలో ఉన్నారు. వీరందరినీ మంగళవారం ఉదయం మయన్మార్ ఆర్మీ ట్రక్కుల్లో తొలుత థాయ్‌లాండ్‌లోని మైసోట్‌కు, అక్కడి ప్రత్యేక ఆర్మీ విమానంలో ఇండియాకు తీసుకొస్తారు.

బండి సంజయ్ జోక్యంతో...

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం రంగపేట గ్రామానికి చెందిన మధుకర్‌రెడ్డి కొలువు కోసం వెళ్లి చిక్కుకున్నాడు. ఈ విషయాన్ని సాక్షి దినపత్రిక వెలుగులోకి తేగానే.. కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించి, భారత విదేశాంగశాఖ, మయన్మార్, థాయ్‌లాండ్ దౌత్యకార్యాలయాలను అప్రమత్తం చేశారు. అదే సమయంలో తెలంగాణ సీఎంవో కార్యాలయంలోని ఎన్‌ఆర్‌ఐ విభాగం, మంత్రి శ్రీధర్‌బాబు కూడా ఎప్పటికప్పుడు బాధితులతో మాట్లాడుతూ ధైర్యం నింపారు. భారత్‌తోపాటు పలు దేశాల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో ఫిబ్రవరి 22న మయన్మార్ తన ఆర్మీని పంపి సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లలో బందీలుగా ఉన్న భారతీయులను రక్షించింది. ఆ రోజు నుంచి వారికి ఆహారం, ఆశ్రయం కల్పించింది.

రంగంలోకి ఎన్ఐఏ..!

మానవ అక్రమ రవాణాపై 'సాక్షి'దినపత్రిక రాసిన వరుస కథనాలు, కేంద్ర నిఘా బృందాలు అందించిన సమాచారంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రంగంలోకి దిగిందని సమాచారం. తమ కుమారుడిని చైనీస్ సైబర్ ఫ్రాడ్ కంపెనీకి విక్రయించారని మధుకర్‌రెడ్డి తల్లిదండ్రులు మానకొండూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఫిబ్రవరి 23న కేసు నమోదైంది. దీంతో ఢిల్లీలో విమానం నుంచి దిగిన వారందరినీ తొలుత ఎన్ఐఏ బృందాలు విచారించి, భారత్‌లోని హ్యూమన్ ట్రాఫికింగ్ ఏజెంట్ల మీద కేసులు నమోదు చేసే అవకాశాలున్నాయి.

ఈసీ తీరుపై... అన్నీ అనుమానాలే!



లోక్‌సభలో విపక్షాల ఆందోళన

- ఓటర్ల జాబితాల్లో అవకతవకలు
- నకిలీ కార్డులు, అడ్డగోలు తొలగింపులు
- ఎన్నికల ప్రక్రియపైనే నీలినీడలు: రాహుల్
- దేశవ్యాప్తంగా అనుమానాలున్నట్టు వెల్లడి
- సభలో పూర్తిస్థాయి చర్చకు డిమాండ్
- తప్పిదాలను ఈసీయే ఒప్పుకుంది: ఖర్గే

ఎన్నికల ప్రక్రియను ప్రహసనంగా మార్చారు

దుయ్యబట్టిన ఆప్, ఆర్జేడీ, ఎస్పీ, బీజేడీ

ఈసీపై కఠిన చర్యలు తీసుకోవాలి: టీఎంసీ

సాక్షి, న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా అవకతవకలు, నకిలీ ఓటర్ కార్డులు, ఓటర్ల సంఖ్యలో అనూహ్య పెరుగుదల, ఇష్టారాజ్యంగా ఓటర్ల తొలగింపు తదితర అంశాలను కాంగ్రెస్‌తో పాటు విపక్ష పార్టీలన్నీ సోమవారం లోక్‌సభలో లేవనెత్తాయి. వీటిపై సందేహాలు, నానాటికీ దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఆరోపణలు మొత్తం ఎన్నికల ప్రక్రియ సమగ్రతనే ప్రశ్నార్థకంగా మార్చాయంటూ ఆందోళన వెలిబుచ్చాయి. పైగా వీటిపై కేంద్ర ఎన్నికల సంఘం అరకొర స్పందన మరిన్ని అనుమానాలకు తావిస్తోందన్నాయి. కనుక ఈ మొత్తం అంశంపై లోక్‌సభలో పూర్తిస్థాయి చర్చ జరగాల్సిందేనని డిమాండ్ చేశాయి. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ జీరో అవర్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. ఇది ప్రతిపక్షాలన్నీ ముక్త కంఠంతో చేస్తున్న డిమాండని ఆయన స్పష్టం చేశారు. స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ ఓటర్ల జాబితాను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేస్తుందా అని ప్రశ్నించారు. ''కేంద్రం తయారు చేయదన్నది నిజమే. కానీ ఇవన్నీ మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అందుకే ఈ అంశంపై సవివరమైన చర్చకు మేం డిమాండ్ చేస్తున్నాం'' అని రాహుల్ బదులిచ్చారు. ''ఓటర్ల జాబితాల విశ్వసనీయతను దేశవ్యాప్తంగా విపక్ష పార్టీలన్నీ ప్రశ్నిస్తున్నాయి. మహారాష్ట్రతో సహా ప్రతి రాష్ట్రంలోనూ ప్రతిపక్షాలు దీనిపై అనుమానాలు లేవనెత్తాయి'' అని గుర్తు చేశారు. ఇది చాలా తీవ్రమైన అంశమంటూ సమాజ్‌వాదీ, ఆర్జేడీ, బిజూ జనతాదళ్, ఆప్ కూడా గొంతు కలిపాయి. దీన్ని పార్లమెంటు చర్చకు స్వీకరించాల్సిందేనని పట్టుబట్టాయి. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతా రాయ్ ఓటర్ల జాబితా అంశాన్ని జీరో అవర్‌లో లేవనెత్తారు. ''ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డు నంబర్లలో నకిలీల సమస్య దశాబ్దాలుగా ఉంది. కానీ



రాహుల్ గాంధీ

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆందోళన అనంతరమే కేంద్ర ఎన్నికల సంఘం దీనిపై స్పందించింది. సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తామని ప్రకటించింది'' అంటూ దృష్టికి తెచ్చారు. అంటే ఇంతకాలంగా తప్పిదాలు జరుగుతూ వస్తున్నట్టే కదా అని ఆయన ప్రశ్నించారు. ''బెంగాల్, హరియాణాల్లో నకిలీ ఓటరు కార్డులు దొరికాయి. ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది. దానిపై అందరూ ప్రశ్నలు లేవనెత్తారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలప్పుడూ ఇలాగే జరిగింది. ఇవన్నీ తీవ్రమైన లోటుపాట్లే. వచ్చే ఏడాది బెంగాల్, అసోం అసెంబ్లీ ఎన్నికలున్నందున ఆలోపే ఓటర్ల జాబితాలను పూర్తిగా సవరించాలి'' అని డిమాండ్ చేశారు. ఈ తప్పిదాలపై దేశ ప్రజలకు ఈసీ బదులివ్వాల్సిందేనన్నారు. ఈ అంశంపై సమగ్ర చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు నిరసనలతో హోరెత్తించారు. ఎన్నికల నిర్వహణలో ఈసీ పక్షపాతరహితంగా వ్యవహరించాలని సమాజ్‌వాదీ సభ్యుడు ధర్మేంద్రయాదవ్ అన్నారు. ''మహారాష్ట్రలో నెలల వ్యవధిలోనే కొత్తగా లక్షలాది ఓటర్లు ఎలా పుట్టుకొచ్చారు? ఢిల్లీలోనూ అదే జరిగింది. 2022లో యూపీలోనూ ఇదే చేశారు'' అని ఆరోపించారు.

రాజ్యసభలోనూ...

రాజ్యసభలో కూడా జీరో అవర్లో ఈ అంశాన్ని లేవనెత్తేందుకు విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రయత్నించారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ అందుకు అనుమతివ్వలేదు. దీనితో పాటు డజనుకు పైగా అంశాలపై 267వ నిబంధన కింద చర్చకు డిమాండ్ చేస్తూ విపక్షాలు ఇచ్చిన నోటీసులన్నింటినీ తిరస్కరిస్తున్నట్టు ప్రకటించారు. దీన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌తో పాటు విపక్షాలన్నీ వాకౌట్ చేశాయి. ''మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య ఆర్నెల్లలోనే ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిపోయింది. ఇదెలా సాధ్యం? దీనిపై కాంగ్రెస్‌తో పాటు విపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు ఈసీ వద్ద సమాధానమే లేదు. ఓటింగ్ ప్రక్రియ కోసం ఉపయోగించిన ఫొటో ఓటర్ల జాబితాను ఎక్సెల్ ఫార్మాట్‌లో మాకు అందజేయాలని డిమాండ్ చేస్తే ఈసీ నేటికీ స్పందించనే లేదు. దేశవ్యాప్తంగా ఓటర్ల పేర్లను ఇష్టారాజ్యంగా తొలగించడం, డూప్లికేట్ ఈపీఐసీ నంబర్ల వంటి తీవ్ర తప్పిదాలు, లోటుపాట్లు ఇష్టారాజ్యాంగా చోటుచేసుకుంటున్నాయి. ఇవన్నీ ఎన్నికల ప్రక్రియ తాలూకు సమగ్రతనే సవాలు చేస్తున్నాయి. పైగా ఈ తప్పిదాలను స్వయంగా ఈసీయే అంగీకరించింది. కనుక వీటన్నింటిపై పార్లమెంటులో చర్చ జరగాల్సిందే. అందుకు మోదీ సర్కారు అంగీకరించాల్సిందే'' అంటూ అనంతరం ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తద్వారా ప్రజాస్వామ్యంపై, రాజ్యాంగంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో కేంద్ర ఎన్నికల సంఘం కొన్నేళ్లుగా ఘోరంగా విఫలమవుతోందని అంతకుముందు టీఎంసీ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ సభలో దుయ్యబట్టారు. ఇందుకు ఈసీపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ''డూప్లికేట్ ఓటర్ కార్డుల అంశాన్ని సీఎం మమతే తొలిసారి లేవనెత్తారు. దీనిపై ఈసీ ఇచ్చిన వివరణ ఎన్నికల నిర్వహణ నిబంధనలకే విరుద్ధంగా ఉంది'' అని ఆరోపించారు. అనుమానాలన్నింటినీ నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్రం, ఈసీపై ఉందని ఆప్ సభ్యుడు సంజయ్‌సింగ్ అన్నారు. ఇటీవలి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హరియాణా పౌరులకు విచ్చలవిడిగా ఓటరు కార్డులిచ్చారని ఆరోపించారు. తద్వారా ఎన్నికల ప్రక్రియనే ప్రహసనంగా ఈసీ మార్చేసిందని దుయ్యబట్టారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఈసీ ప్రయత్నిస్తోందని ఆర్జేడీ సభ్యుడు మనోజ్ ఝా ఆరోపించారు. ''ఎన్నికల ప్రక్రియే పార్లమెంటు ఉనికికి ప్రాణం. ఎన్నికల అవకతవకలపై ఇక్కడ చర్చించేందుకు అవకాశమివ్వకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే లేదు'' అన్నారు.

తమిళులు అనాగరికులు!

లోక్‌సభలో ప్రధాన్ వ్యాఖ్యలు

- మండిపడ్డ డీఎంకే ఎంపీలు
- నాలుక అదుపులో పెట్టుకో: స్టాలిన్
- తమిళ ప్రజలకు ఘోర అవమానమిది
- మోదీ సమర్థిస్తారా అని ప్రశ్నించిన సీఎం
- మంత్రిపై హక్కుల తీర్మానం: కనిమొళి

వ్యాఖ్యలు వెనక్కు తీసుకున్న ప్రధాన్

విద్యార్థుల భవితతో చెలగాటమా?

డీఎంకేకు నిజాయితీ లేదన్న మంత్రి

న్యూఢిల్లీ: మోదీ సర్కారుకు, తమిళనాడులోని అధికార డీఎంకేకు మధ్య కొన్నాళ్లుగా సాగుతున్న రగడ పార్లమెంటునూ తాకింది. 'అనాగరికులు' అంటూ కేంద్ర విద్యా శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. వాటిపై డీఎంకే ఎంపీల నిరసనలు, ఆందోళనలతో సోమవారం రెండో విడత బడ్జెట్ సమావేశాల తొలి రోజు లోక్‌సభ అట్టుడికిపోయింది. తమిళుల ఆత్మగౌరవాన్ని మంత్రి దారుణంగా దెబ్బతీశారంటూ డీఎంకే ఎంపీ కనిమొళి దుయ్యబట్టారు. ఆయనపై సభాహక్కుల తీర్మానం ప్రవేశపెడతామని ప్రకటించారు. ప్రధాన్ వ్యాఖ్యలపై తమిళనాడు అంతటా డీఎంకే శ్రేణులు నిరసనకు దిగాయి. ఆయన దిష్టిబొమ్మలు తగలబెట్టాయి. తమిళనాడు సీఎం స్టాలిన్ కూడా దీనిపై తీవ్రంగా స్పందించారు. ఆయన చెన్నైలో మీడియాతో మాట్లాడారు. ''మంత్రివి అహంకారపూరిత వ్యాఖ్యలు. ఆయన నోరు అదుపులో పెట్టుకోవాలి'' అంటూ హెచ్చరించారు. ''తమిళ ప్రజలందరినీ మంత్రి ఘోరంగా అవమానించారు. దీన్ని ప్రధాని నరేంద్ర మోదీ సమర్థిస్తారా?'' అని ప్రశ్నించారు. మంత్రి వ్యాఖ్యలు దారుణమంటూ కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్షాలు కూడా లోక్‌సభ ప్రాంగణంలో దుయ్యబట్టాయి.

డీఎంకేకు నిజాయితీ లేదు!

సభ ప్రారంభం కాగానే నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అంశాన్ని డీఎంకే సభ్యులు లేవనెత్తారు. దాన్ని తమ రాష్ట్రంపై బలవంతంగా రుద్దేందుకు అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం పీఎంశ్రీ పథకంపై ప్రశ్నకు ప్రధాన్ బదులిస్తూ డీఎంకే ఎంపీల తీరుపై తీవ్రంగా స్పందించారు. వారికి నిజాయితీ లేదంటూ ఆక్షేపించారు. ''కర్ణాటక, హిమాచల్ వంటి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కూడా పీఎంశ్రీని అమలు చేస్తున్నాయి. అది తమకూ అంగీకారమేనని పలువురు డీఎంకే ఎంపీలు నాతో స్వయంగా చెప్పారు. ఈ మేరకు స్టాలిన్ కూడా ప్రకటన చేశారు. తర్వాత ఏ 'సూపర్ సీఎం' జోక్యం చేసుకున్నాడో గానీ, ఉన్నట్టుండి యూటర్న్ తీసుకున్నారు. కేవలం భాషాపరమైన వివాదాలు సృష్టించడమే పనిగా ఫక్తు రాజకీయాలు చేస్తున్నారు. తమిళ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారు'' అంటూ దుయ్యబట్టారు. విద్యార్థుల భవితవ్యం దృష్ట్యా స్వార్థాన్ని పక్కనపెట్టి రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, ఎన్ఈపీకి అంగీకరించాలని హితవు పలికారు. వీటిపై డీఎంకే సభ్యులు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. ఎన్ఈపీ అంగీకారమేనని ప్రధాన్‌తో తామెన్నడూ చెప్పలేదన్నారు. ఆయన పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. నిరసనలు, నినాదాలు, ఆందోళనలతో హోరెత్తించారు. దక్షిణ భారతదేశానికి అన్యాయం చేసే ప్రయత్నాలు మానుకోవాలంటూ డిమాండ్ చేశారు. శాంతించాలంటూ స్పీకర్ విజ్ఞప్తి చేసినా వెనక్కు తగ్గలేదు. దాంతో సభ కాసేపు వాయిదా పడింది. మళ్లీ సమావేశమయ్యాక కూడా రగడ కొనసాగింది. కేంద్రానికి వ్యతిరేకంగా డీఎంకే సభ్యులు నినాదాలు కొనసాగించారు. ఎన్ఈపీని, హిందీ తప్పనిసరంటున్న త్రిభాషా సూత్రాన్ని డీఎంకే ముందునుంచీ వ్యతిరేకిస్తోందని కనిమొళి అన్నారు. ప్రధాన్ వ్యాఖ్యలు, ప్రత్యేకించి ఒక పదం తమను తీవ్రంగా బాధించిందని ఆవేదన వెలిబుచ్చారు. దాంతో మంత్రి స్పందిస్తూ, ''నా సోదరి రెండు అంశాలు లేవనెత్తారు. తమిళనాడు ప్రభుత్వం, ఎంపీలు, తమిళ ప్రజలను ఉద్దేశించి నేనలాంటి పదం వాడకుండా ఉండాల్సిందని అన్నారు. ఆ పదాన్ని వెనక్కు తీసుకుంటున్నా'' అని ప్రకటించారు. అవి రికార్డుల్లోకి వెళ్లబోవని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ తమిళ ప్రజలను అవమానించేలా ప్రధాన్ దారుణ వ్యాఖ్యలు చేశారన్నారు. విద్యావిధానం వంటి అంశాలను ఏ రాష్ట్రంపైనా బలవంతంగా రుద్దరాదని కనిమొళి అభిప్రాయపడ్డారు. పార్లమెంటు ఆవరణలో ఆమె మీడియాతో మాట్లాడారు. మంత్రి తమను అబద్ధాలకోరులు అనడం ఏ మేరకు సబబని ప్రశ్నించారు. త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు అంగీకరించేదే లేదని ఆ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరం కూడా అన్నారు. ''హిందీని మాపై రుద్దడాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదు. ఈ విషయంలో రాష్ట్రంలో అన్ని పార్టీలదీ ఒకే వైఖరి'' అని స్పష్టం చేశారు.



ధరేంద్ర ప్రధాన్

మీపై చర్యలు తప్పవ్

మారన్‌పై స్పీకర్ ఆగ్రహం

డీఎంకే సభ్యుడు దయానిధి మారన్‌పై స్పీకర్ ఓం బిర్లా మండిపడ్డారు. ఎన్ఈపీపై డీఎంకే సభ్యుల ఆందోళన సందర్భంగా పోడియం వద్ద మారన్ ఏవో వ్యాఖ్యలు చేశారు. వాటిపై స్పీకర్ తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. ఆయనపై కఠిన చర్యలు తప్పవని ప్రకటించారు. ''మాట్లాడేటప్పుడు కాస్త నోరు జాగ్రత్త. మీ వ్యాఖ్యలు రికార్డులకు ఎక్కి ఉంటే తక్షణమే చర్యలు తీసుకునేవాడిని'' అంటూ హెచ్చరించారు. మారన్‌పై చర్యలకు తీర్మానం ప్రవేశపెట్టాల్సిందిగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజుకు సూచించారు. లేదంటే తానే చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. సభ గౌరవానికి భంగం కలిగించే ప్రవర్తనను సహించే ప్రసక్తే లేదని స్పీకర్ స్పష్టం చేశారు.

డూప్లికేట్ ఓటర్ కార్డుల జారీ... యూపీఏ హయాంలోనే

విపక్షాల ఆరోపణలపై ఈసీ వర్గాలు

న్యూఢిల్లీ: డూప్లికేట్ ఓటర్ గుర్తింపు కార్డు సంఖ్యల అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం విచిత్రంగా స్పందించింది. దీనితో మోదీ ప్రభుత్వానికి సంబంధం లేదని ఈసీ వర్గాలు సోమవారం పేర్కొనడం విశేషం. ''ఇది వారసత్వపు సమస్య. ఎందుకంటే అలాంటి కార్డులన్నీ 2008–2013 మధ్యే జారీ అయ్యాయి. ఆ సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్నది బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కాదు'' అని అవి చెప్పుకొచ్చాయి. వేర్వేరు రాష్ట్రాల్లో ఒకే ఎపిక్ నంబర్ ఉండటం పరిపాటేనని, ఓటరుకు సంబంధించి మిగతా వివరాలన్నీ వేరుగానే ఉంటాయని దీనిపై ఈసీ ఇప్పటికే వివరణ ఇవ్వడం తెలిసిందే. అయినా సందేహాలను పూర్తిగా నివారించేందుకు నంబర్ల డూప్లికేషన్ సమస్యను మూడు నెలల్లో పూర్తిగా పరిష్కరిస్తామని ప్రకటించింది. ఇలాంటి అవకతవకలనూ ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాల్సిందిగా ఎలక్టోరల్ రోల్స్ వార్షిక అప్‌డేషన్ సందర్భంగా రాష్ట్రాలను ఈసీ గతంలో పలుమార్లు ఆదేశించింది.

కేంద్ర ఉద్యోగులకు డీఏ పెంపు

- వారంలో ప్రకటన వెలువడే అవకాశం
- 1.2 కోట్ల మందికి లబ్ధి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వోద్యోగులకు శుభవార్త. 7వ వేతన సంఘం సిఫార్సుల్లో భాగంగా వారికి కరువు భత్యం (డీఏ) పెంపు పెరగనుంది. వారం రోజుల్లో ఈ మేరకు నిర్ణయం వెలువడే అవకాశముంది. డీఏ, డీఆర్ పెంపు నిర్ణయానికి ఈ బుధవారం జరిగే కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆమోదముద్ర పడుతుందని భావిస్తున్నారు. ఫలితంగా ఉద్యోగుల మూల వేతనంలో డీఏ 55 శాతానికి పెరగనుంది. దీనితో 1.2 కోట్ల మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి కలగనుంది. కేంద్ర ఉద్యోగులకు ఏటా మార్చి, అక్టోబర్ మాసాల్లో రెండుసార్లు డీఏ పెంపు ఉంటుందన్నది తెలిసిందే. మార్చి పెంపు జనవరి నుంచి, అక్టోబర్‌లో ప్రకటించే పెరుగుదల జూలై నుంచి అమల్లోకి వస్తాయి.

అమెరికా ఉత్పత్తులపై 15% టారిఫ్‌లు ప్రకటించిన చైనా

వాషింగ్టన్: చైనా ఉత్పత్తులపై 20 శాతం టారిఫ్‌లు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 4న చేసిన ప్రకటనకు చైనా బదులు తీర్చుకుంది. అమెరికా వ్యవసాయోత్పత్తులు ముఖ్యంగా సోయా, బీఫ్, పోర్క్, చికెన్ ఉత్పత్తులపై అదనంగా 15 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఇప్పటికే మార్గమధ్యంలో ఉన్న ఉత్పత్తులపై ఈ నెల 12వ తేదీ వరకు టారిఫ్‌లను మినహాయించనున్నట్లు చైనా వాణిజ్య శాఖ తెలిపింది. ఈ ప్రకటనతో అమెరికా పెట్టుబడిదారుల్లో భయాలు మొదలయ్యాయి. గతవారం మెక్సికో, కెనడాల దిగుమతులపై ట్రంప్ టారిఫ్‌లను విధించడం ఆయా దేశాలు అమెరికా ఉత్పత్తులపై తిరిగి టారిఫ్‌లను విధించాయి.

కెనడా తదుపరి ప్రధానిగా మార్క్ కార్నీ

జస్టిన్ ట్రూడో స్థానంలో లిబరల్ పార్టీ నాయకుడిగా ఎంపికైన బ్యాంకర్



టొరంటో: కెనడా సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా గతంలో సేవలందించిన బ్యాంకింగ్ రంగ ప్రముఖుడు మార్క్ కార్నీను కెనడా ప్రధానమంత్రి పీఠం వరించింది. ప్రస్తుత ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో రాజీనామా చేస్తానని జనవరిలో ప్రకటించిన నేపథ్యంలో పాలక లిబరల్ పార్టీ నూతన సారథి కోసం ఎన్నికలు నిర్వహించగా కార్నీ ఘన విజయం సాధించారు. దాంతో తదుపరి ప్రధానమంత్రిగా 59 ఏళ్ల కార్నీ త్వరలో బాధ్యతల స్వీకరించనున్నారు. ట్రంప్ సారథ్యంలోని అమెరికాతో కెనడా వాణిజ్యయుద్ధానికి దిగిన వేళ కెనడా ప్రధాని పగ్గాలు కార్నీ చేపడుతుండటం గమనార్హం. ఆదివారం లిబరల్ పార్టీ సారథ్యం కోసం జరిగిన ఓటింగ్‌లో కార్నీ 1,31,674 ఓట్లు సాధించారు. మొత్తం ఓట్లలో ఏకంగా 85.9 శాతం ఓట్లు కార్నీ కొల్లగొట్టడం విశేషం. గతంలో మహిళా ఉపప్రధానిగా సేవలందించిన క్రిస్టినా ఫ్రీలాండ్ రెండో స్థానంలో సరిపెట్టుకున్నారు. ఈమెకు కేవలం 11,134 ఓట్లు పడ్డాయి. అంటే మొత్తం ఓట్లలో కేవలం 8 శాతం ఓట్లు ఈమెకు దక్కాయి. గవర్నమెంట్ హౌస్ లీడర్ కరీనా గౌల్డ్(4,785 ఓట్లు) మూడో స్థానంతో, వ్యాపార అనుభవం ఉన్న నేత ఫ్రాంక్ బేలిస్(4,038) నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నారు. మొత్తం 1,51,000 మందికిపైగా పార్టీ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

పదవీ స్వీకారం ఎప్పుడు ?

పార్టీ ఎన్నికల్లో గెలిచినా వెంటనే కార్నీ ప్రధాని పీఠంపై కూర్చోవడం కుదరదు. ట్రూడో ప్రధానిగా రాజీనామా చేసి గవర్నర్ జనరల్‌కు సమర్పించాలి. కెనడా ఒకప్పుడు బ్రిటన్ వలసరాజ్యం కావడంతో ప్రస్తుత బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్–3 సమ్మతితో గవర్నర్ జనరల్.. కార్నీతో నూతన ప్రధానిగా ప్రమాణంచేయిస్తారు. అయితే అక్టోబర్ 20వ తేదీలోపు కెనడాలో సాధారణ ఎన్నికలు చేపట్టాల్సిఉంది. అందుకే కార్నీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించగానే ఎన్నికలకు పిలుపిచ్చే వీలుంది.

ట్రంప్‌ను నిలువరిద్దాం

పార్టీ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించాక వందలాది మంది మద్దతుదారులనుద్దేశించి కార్నీ ప్రసంగించారు. అమెరికా దిగు మతి టారిఫ్‌ల పెంపు అంశాన్ని ప్రస్తావించారు. '' ఇకపై ఏమాత్రం నమ్మలేని దేశం (అమెరికా) మనకు గడ్డు పరిస్థితు లను తీసుకొచ్చింది. అయినాసరే మనం ఈ పరిస్థితిని దీటుగా ఎదుర్కోగలం. అమెరికా దిగుమతి టారిఫ్‌లకు దీటుగా మనం కూడా టారిఫ్‌లు విధిస్తాం. మమ్మల్ని అమెరికా గౌరవించేదాకా ఇవి కొనసాగుతాయి. అమెరికన్లు మా సహ జవనరులు, భూములు, నీళ్ల, ఏకంగా మా దేశాన్నే కోరుకుంటున్నారు. ఏ రూపంలోనూ కెనడా ఎప్పటికీ అమెరికాలో భాగం కాబోదు. ట్రంప్ గెలవకుండా నిలువరిద్దాం'' అని వందలాది మంది మద్దతుదారులనుద్దేశించి కార్నీ ప్రసంగించారు.

బ్యాంకర్ పొలిటీషియన్

కెనడా, బ్రిటన్‌లోని సెంట్రల్ బ్యాంక్‌లకు సారథ్యం వహించి అపార బ్యాంకింగ్ అనుభవం గడించిన మార్క్ కార్నీ ఇప్పుడు కెనడా ప్రధానిగా కొత్త పాత్ర పోషించనున్నారు. బ్యాంక్ ఆఫ్ కెనడా గవర్నర్ హోదాలో 2008లో ఆర్థిక సంక్షోభం నుంచి కెనడాను గట్టెక్కేలాచేసి శెభాష్ అనిపించుకున్నారు. వలసలు, అధికమైన ఆహార, ఇళ్ల ధరలతో ప్రస్తుతం కెనడా సతమవుతున్న వేళ ట్రంప్ టారిఫ్ యుద్ధానికి తెరలేపడంతో కార్నీ తన బ్యాంకింగ్ అనుభవాన్ని పరిపాలనా దక్షతగా మార్చాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

హార్వర్డ్‌లో ఉన్నత విద్య: 1965 మార్చి 16వ తేదీన వాయవ్య కెనడాలోని ఫోర్ట్‌స్మిత్ పట్టణంలో కార్నీ జన్మించారు. తర్వాత ఆల్బెర్టా రాష్ట్రంలోని ఎడ్మోంటన్‌లో పెరిగారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో 1988లో ఉన్నతవిద్య పూర్తిచేశారు. ఈయనకు ఐస్ హాకీ అంటే చాలా ఇష్టం. కాలేజీ రోజుల్లో ఐస్‌హాకీ బాగా ఆడేవారు. తర్వాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డీ సాధించారు. బ్రిటన్‌కు చెందిన ఆర్థికవేత్త డయానా ఫాక్స్‌ను పెళ్లాడారు. వీళ్లకు నలుగురు కుమార్తెలు. కెనడా పౌరసత్వంతోపాటు ఈయనకు ఐరిష్, బ్రిటిష్ పౌరసత్వం కూడా ఉంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు గవర్నర్‌గా పనిచేసినకాలంలో తొలిసారిగా బ్రిటన్ పాస్‌పోర్ట్ సంపాదించారు. గోల్డ్‌మ్యాన్ శాక్స్‌లో దశాబ్దానికిపైగా పనిచేశారు. లండన్, టోక్యో, న్యూయార్క్, టొరంటోలో పనిచేశారు. తర్వాత 2003లో బ్యాంక్ ఆఫ్ కెనడాలో డిప్యూటీ గవర్నర్‌గా పనిచేశారు.

3 శతాబ్దాల్లో తొలిసారిగా: 2013 నుంచి ఏడేళ్లపాటు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గా సేవలందించారు. 1694లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను స్థాపించగా గత 300 సంవత్సరాల్లో ఆ బ్యాంక్‌కు గవర్నర్‌గా ఎన్నికైన తొలి బ్రిటీషేతర వ్యక్తిగా 2013లో కార్నీ చరిత్ర సృష్టించారు. బ్రెగ్జిట్ వేళ బ్రిటన్ ఆర్థికసంక్షోభంలో కూరుకుపోకుండా బ్యాంకర్‌గా కార్నీ సమర్థవంత పాత్ర పోషించారు. 2020లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను వీడాక ఐక్యరాజ్యసమితిలో వాతావరణ మార్పులు, ఆర్థిక అంశాలపై ప్రత్యేక దౌత్యవేత్తగా సేవలందించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సుప్రీం జడ్జిగా బాగ్చీ నియామకం

న్యూఢిల్లీ: కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈయన పేరును సుప్రీంకోర్టు జడ్జిగా సిఫార్సుచేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం మార్చి ఆరో తేదీన నిర్ణయించడం తెల్సిందే. జస్టిస్ బాగ్చీని సుప్రీంకోర్టు జడ్జిగా నియమిస్తున్నట్లు న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో సోమవారం ఒక పోస్ట్‌చేశారు. 1966 అక్టోబర్ మూడున జన్మించిన ఈయన సుప్రీంకోర్టులో ఆరేళ్లపాటు జడ్జిగా కొనసాగనున్నారు. ఈ కాలంలోనే పదోన్నతి పొంది సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిగానూ సేవలందించే అవకాశముంది. జస్టిస్ కేవీ విశ్వనాథన్ 2031 మే 25వ తేదీన రిటైర్ అయ్యాక జస్టిస్ బాగ్చీ సీజేఐగా సేవలందించే వీలుంది. ఈయన 2031 అక్టోబర్ రెండోతేదీన పదవీవిరమణ చేస్తారు. హైకోర్టు జడ్జీలు 62 ఏళ్లకు, సుప్రీంకోర్టు జడ్జీలు 65 ఏళ్లకు రిటైరవుతారు. 2011 జూన్ 27వ తేదీన ఈయన కలకత్తా హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. తర్వాత 2021 జనవరి నాలుగోతేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీఅయ్యారు. అదే ఏడాది నవంబర్ 8న తిరిగి కలకత్తా హైకోర్టుకు బదిలీఅయ్యారు. అప్పట్నుంచీ అదే హైకోర్టులో సేవలందిస్తున్నారు. కలకత్తా హైకోర్టులో మొత్తంగా 13 ఏళ్లు పలు రకాల కేసులకు సంబంధించిన కీలక తీర్పులు వెలువర్చారు. సుప్రీంకోర్టులో జడ్జిగా ప్రమాణస్వీకారం చేశాక కోర్టులో జడ్జీల సంఖ్య 33కు పెరుగుతుంది. రాజ్యాంగం నిర్దేశించిన పరిమితి ప్రకారం సుప్రీంకోర్టులో గరిష్టంగా 34 మంది జడ్జీలు ఉండొచ్చు.

ఇంగ్లండ్ తీరంలో రెండు నౌకలు ఢీ

- నౌకల్లో మంటలు, పేలుళ్లు
- మొత్తం 37 మంది సిబ్బంది సురక్షితం
- తెలిపిన స్థానిక ప్రజాప్రతినిధి



మంటల్లో చిక్కుకున్న చమురు ట్యాంకర్, సాధారణ నౌక

లండన్: ఇంగ్లండ్ తూర్పు తీరంలో ఆయిల్ ట్యాంకర్, సరుకు నౌక ఢీకొన్న ఘటనలో రెండు ఓడలకు మంటలు అంటుకున్నాయి. హల్ తీరానికి సమీపంలో సోమవారం ఉదయం 9.48 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. రెండు నౌకల్లోని మొత్తం 37 మందిని రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చినట్లు రవాణా శాఖ మంత్రి తెలిపారని స్థానిక ప్రజాప్రతినిధి గ్రాహం స్టువార్ట్ చెప్పారు. వీరిలో తీవ్రగాయాలతో ఉన్న ఒకరిని ఆస్పత్రిలో చేర్పించారన్నారు.గ్రీస్ నుంచి వచ్చిన అమెరికాకు చెందిన ఎంవీ స్టెనా ఇమాక్యులేట్ పేరున్న ఆయిల్ ట్యాంకర్ గ్రీమ్స్‌బీ పోర్టులో లంగరేసి ఉంది. అదే సమయంలో, స్కాట్లాండ్ నుంచి నెదర్లాండ్స్‌లోని పోటర్‌డ్యామ్ వైపు వెళ్తున్న పోర్చుగల్ సరుకు నౌక సొలొంగ్ దానిని ఢీకొట్టింది. దీంతో, రెండు ఓడల్లో మంటలు చెలరేగాయి. సరుకు ఓడలో సోడియం సైనైడ్ అనే విషపూరిత రసాయన కంటెయినర్లు ఉన్నట్టు సమాచారం. బ్రిటన్ మారిటైం కోస్ట్‌గార్డ్ ఏజెన్సీ ఆ ప్రాంతానికి లైఫ్‌బోట్లను, రెస్క్యూ హెలికాప్టర్‌ను పంపించింది. నౌకల్లో నుంచి బయటకు దూకిన వారిని లైఫ్‌బోట్లలో రక్షించి ఒడ్డుకు చేర్చారు. కాగా, స్టెనా ఇమాక్యులేట్ ఓడలో జెట్–ఏ1 ఇంధనం రవాణా అవుతోందని అమెరికాకు చెందిన మారిటైం మేనేజ్‌మెంట్ సంస్థ క్రౌలీ తెలిపింది. సరుకు నౌక ఢీకొట్టడంతో ట్యాంకర్ దెబ్బతిని ఇంధనం లీకైంది. దీంతో మంటలు వ్యాపించడంతోపాటు పలుమార్లు పేలుళ్లు సంభవించినట్లు వెల్లడించింది. ట్యాంకర్ నౌకలో ఉన్న మొత్తం 23 మంది సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు క్రౌలీ వివరించింది. అమెరికా సైన్యానికి అవసరమైన ఇంధనాన్ని ఈ సంస్థ సరఫరా చేస్తుంది.


లలిత్ మోదీ పాస్‌పోర్ట్ రద్దు

వనౌతు ప్రధాని జొథమ్ ఆదేశాలు

పోర్ట్ విలా: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) మాజీ వ్యవస్థాపకుడు లలిత్ మోదీకి ఇటీవల జారీ చేసిన పాస్‌పోర్ట్‌ను రద్దు చేయాలని పసిఫిక్ ద్వీప దేశం వనౌతు ప్రధానమంత్రి జొథమ్ నపట్ తమ అధికారులను ఆదేశించారు. పరారీలో ఉన్న ఈ నిందితుడు భారత్‌కు అప్పగింత నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. ఐపీఎల్ సారథిగా ఉన్న సమయంలో కోట్లాది రూపాయలను లంచంగా తీసుకున్నాడన్న ఆరోపణలపై దర్యాప్తు విభాగాలు విచారణ చేపట్టాయి. వీటి నుంచి తప్పించుకునేందుకు 2010లో దేశం వీడిన లలిత్ లండన్‌లో ఉంటున్నాడు. అయితే, ఇటీవల వనౌతు పాస్‌పోర్టు పొందిన లలిత్ మోదీ తన భారత పాస్‌పోర్టును లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయానికి అప్పగిస్తూ దరఖాస్తు చేసుకున్నాడు. ఒకవేళ, ఈ దరఖాస్తును భారత ప్రభుత్వం ఆమోదిస్తే మోదీ లండన్‌లో చట్ట విరుద్ధంగా ఉంటున్న వ్యక్తి అవుతాడు. ఈ పరిణామాల నేపథ్యంలో వనౌతు ప్రధాని కార్యాలయం నుంచి సోమవారం తాజా ప్రకటన వెలువడటం గమనార్హం. లలిత్ పాస్‌పోర్టు దరఖాస్తు పరిశీలన సమయంలో ఇంటర్‌పోల్ వంటి అంతర్జాతీయ వ్యవస్థల నుంచి అతడిపై జారీ చేసిన ఎటువంటి నోటీసులు లేని విషయాన్ని అధికారులు గమనించారని చెప్పారు. అయితే, ఇటీవల అంతర్జాతీయ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా లలిత్ పాస్‌పోర్ట్ రద్దు చేయాలని సిటిజన్‌షిప్ కమిషన్‌ను ఆదేశించినట్లు చెప్పారు. లలిత్ మోదీపై అలెర్ట్ నోటీసు ఇవ్వాలంటూ భారత్ ప్రభుత్వం చేసిన వినతులను సరైన ఆధారాల్లేవంటూ ఇంటర్‌పోల్ 24 గంటల్లో రెండుసార్లు తోసిపుచ్చిందని చెప్పారు. అయితే, అతడు భారత్‌కు అప్పగించకుండా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న విషయం స్పష్టమైనందునే పాస్‌పోర్టు రద్దుకు ఆదేశాలిచ్చినట్లు వనౌతు ప్రధాని వివరించారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 11 । మార్చి । 2025



..మహా ముదుర్లు!

డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు తప్పించుకునేందుకు మందుబాబులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. పోలీసులు ఎంత పకడ్బందీగా వ్యవహరిస్తున్నా.. కొత్త కొత్త వ్యూహాలను అనుసరిస్తున్నారు. -8లో



జర పైలం..

చూస్తుండగానే వేసవికాలం వచ్చేసింది.. మరి ఎండల నుంచి రక్షణకు నగరవాసులు సిద్ధం కావాల్సిందే. అందుకు ఏర్పాట్లు చేసుకోవాల్సిందే.. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
35.0/21.0

వాతావరణం

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.



క్యాంటీన్‌లో మహిళలతో మాట్లాడుతున్న మేయర్

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

మేయర్ విజయలక్ష్మి

- జీహెచ్‌ఎంసీ ఆఫీసులో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం


లక్డీకాపూల్: మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ...మహిళ వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆసక్తి గల స్వయం సహాయక సంఘాల మహిళలచే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందేలా చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్న జూబ్లీహిల్స్ సర్కిల్‌కు చెందిన స్నేహిత స్వయం సహాయక సంఘం సభ్యులకు మేయర్ విజయలక్ష్మి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యు.సి.డి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, డి.సి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న భానుడు

భానుడు భగ్గుమంటున్నాడు. వాతావరణం వేగంగా మారిపోయింది. మార్చి నెల మొదటి వారంలోనే గరిష్టంగా 35 నుంచి 37.1 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత నమోదవుతూ వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సాధారణం కంటే రెండు మూడు డిగ్రీల ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రత మరింత అధికంగా నమోదయ్యే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

- సాక్షి, సిటీబ్యూరో





హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌ను పునఃసమీక్షించాలి

సీఎంకు బీజేపీ నేతల లేఖలు



గన్‌ఫౌండ్రీ: హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌లో జోన్ల నిర్ణయం పేద రైతులకు నష్టం కలిగించేలా ఉందని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. రైతులకు అనుకూలంగా జోన్లను మార్చాలనే డిమాండ్‌తో రెండు రోజుల్లో బీజేపీ తరపున భారీ ఉద్యమాన్ని చేపడతామని ఆయన వెల్లడించారు. ఈ మేరకు సీఎంకు లేఖలు రాస్తున్నామని తెలిపారు. సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ..హెచ్‌ఎండీఏ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాలోని 70 మండలాలు, 24 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు, సుమారు 750 గ్రామాలు ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు తదితర ప్రాంతాల అభివృద్ధి కోసం 2013లో మాస్టర్‌ప్లాన్ రూపొందించారని, కానీ గత 11 సంవత్సరాలుగా ఎటువంటి మార్పులకు నోచుకోని జోన్లు ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయం రైతులకు ఎంతో నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఈ గ్రామాలలో ఒక వైపు ఇండస్ట్రియల్ జోన్లుగా విభజించడం వలన పేద, సన్నకారు రైతుల భూములు ఇళ్ల నిర్మాణానికి అవకాశం లేని కన్సర్వేషన్‌లాంటి జోన్లలో ఉన్నాయని తెలిపారు. హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్ పునఃసమీక్షించి రైతులకు అనుకూలంగా జోన్లను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైతులతో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాయించడంతో పాటు ప్రత్యక్ష ఉద్యమాలకు కూడా సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, రంగారెడ్డి రూరల్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి పాల్గొన్నారు.

సిటీ కేంద్రంగానే ఉగ్ర చరిత్ర!



హరేన్ పాండ్యాను కాల్చింది అస్గరే

- ప్రణయ్ హత్యకు ప్రధాన సూత్రధారి
- మీర్జా ఎస్కేప్ కేసులోనూ ఇతడి పాత్ర
- ఈ కేసుల్లో అబ్దుల్ బారీ నిందితుడే
- సలీమ్‌నగర్‌లో ఇతడి అడ్డా
- 'ప్రణయ్ తీర్పు'తో మళ్లీ తెరపైకి





అస్గర్ అలీ



అబ్దుల్ బారీ



మారుతిరావు

సాక్షి, సిటీబ్యూరో:

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్యకు కీలక సూత్రధారులుగా ఉండి, సోమవారం జీవితఖైదు పడిన అస్గర్ అలీ, అబ్దుల్ బారీ సామాన్యులు కారు. అత్యంత దారుణమైన నేరచరిత్ర కలిగిన వీరిపై నమోదైన కేసుల్లో అత్యధికం హైదరాబాద్ కేంద్రంగానే ఉన్నాయి. మీర్జా ఎస్కేప్, భారీ పేలుళ్లకు కుట్ర తదితరాలు వాటిలో ఓ మచ్చుతునకలు మాత్రమే. వీరిద్దరూ గుజరాత్ మాజీ హోం మంత్రి హరేన్‌పాండ్యా హత్య కేసులో ప్రధాన సూత్రధారులుగా ఉన్నారు. అప్పట్లో ఆయనపై ఐదు రౌండ్లు కాల్పులు జరిపింది సైతం అస్గరే అని సీబీఐ ఆరోపించింది.

పాకిస్తాన్‌లోనూ ఉగ్రవాద శిక్షణ...

నల్లగొండలోని దారుల్‌షిఫా కాలనీకి చెందిన మహ్మద్ అస్గర్ అలీకి జునైద్, అద్నాన్, చోటు అనే పేర్లు కూడా ఉన్నాయి. 1992 డిసెంబర్‌లో జరిగిన బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత ఉగ్రవాదానికి ఆకర్షితుడయ్యాడు. కాశ్మీర్‌కు చెందిన ముస్లిమ్ ముజాహిదీన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. వారి ప్రోద్బలంతో అక్కడకు వెళ్ళిన అస్గర్ ప్రాథమిక ఉగ్రవాద శిక్షణ తీసుకున్నాడు. ఆపై అక్రమంగా సరిహద్దులు దాటి పాకిస్తాన్‌కు వెళ్లిన ఇతగాడు అక్కడి ఉగ్రవాద శిక్షణ శిబిరాల్లో తుపాకులు కాల్చడం నుంచి నుంచి ఆర్డీఎక్స్‌తో తయారు చేసిన బాంబులను పేల్చడం వరకు వివిధ రకాలైన శిక్షణలు తీసుకున్నాడు. పాకిస్తాన్ నుంచి తిరిగి వచ్చిన అస్గర్ నల్లగొండలోని ప్యార్ సూఖాబాగ్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ బారితో సహా మరికొందరితో ముఠా ఏర్పాటు చేశాడు.

ఆ కేసుల్లో మీర్జా నిందితుడిగా...

బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత కర సేవకుల్ని టార్గెట్‌గా చేసుకుని నగరంలో రెండు దారుణ హత్యలు జరిగాయి. 1993 జనవరి 22న వీహెచ్‌పీ నేత పాపయ్య గౌడ్‌ను చాదర్‌ఘాట్‌లోని మహబూబ్ కాంప్లెక్స్ సమీపంలో, అదే ఏడాది ఫిబ్రవరి 2న అంబర్‌పేట్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో మాజీ కార్పొరేటర్, బీజేపీ నేత నందరాజ్ గౌడ్‌ను హత్య చేశారు. ఫసీ మాడ్యుల్ చేసిన ఈ దారుణాలకు మీర్జా ఫయాజ్ అహ్మద్ అలియాస్ ఫయాజ్ బేగ్ సూత్రధారిగా, ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. మౌలాలీ రైల్వే క్వార్టర్స్‌కు చెందిన ఇతడి పాత్ర దీనికి ముందూ అనేక కేసుల్లో ఉంది. పాపయ్య గౌడ్, నందరాజ్ గౌడ్‌లను హత్య చేసిన కేసుల్లో మీర్జా ఫయాజ్ బేగ్‌కు జీవితఖైదు పడింది. మిగిలిన కేసుల విచారణ కోసం చర్లపల్లి జైలులో ఉన్న ఇతడిని నాంపల్లి కోర్టుకు తీసుకువచ్చేవారు.

తప్పించి తీసుకువెళ్లిన ద్వయం..

మీర్జాను తప్పించడానికి అస్గర్, బారీ తదితరులు పథక రచన చేశారు. 1996 డిసెంబర్ 19న నాంపల్లి న్యాయస్థానం నుంచి ఎస్కేప్ చేయించారు. అస్గర్ ఇతడిని తనకున్న పరిచయాల నేపథ్యంలో కాశ్మీర్‌కు పంపి ముస్లిమ్ ముజాహిదీన్ ఉగ్రవాదులతో కలిసి పని చేసేలా చేశాడు. జైలు నుంచి ఎస్కేప్ అయిన కొన్ని రోజులకే అక్కడ జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాల చేతిలో మీర్జా హతమయ్యాడు. చాలాకాలం వరకు మీర్జాను ఎస్కేప్ చేసింది ఎవరనేది రహస్యంగానే ఉండిపోయింది. 1997 ఫిబ్రవరిలో అస్గర్, బారీ సహా పది మంది నిందితుల్ని సిటీ పోలీసులు నాంపల్లి వద్ద పట్టుకున్నారు. ఆ సమయంలో వీరి నుంచి మూడు కేజీల ఆర్డీఎక్స్, మూడు హ్యాండ్ గ్రెనేడ్లు, రెండు పిస్టల్స్, 40 రౌండ్లు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో భారీ విధ్వంసం సృష్టించడానికి వచ్చినట్లు తేల్చారు. ఈ విచారణ నేపథ్యంలో మీర్జా ఎస్కేప్‌లోనూ అస్గర్, బారీల పాత్ర కీలకమని వెలుగులోకి వచ్చింది.

ఐఎంఎంఎంలోనూ అస్గర్ పాత్ర..

ఆజం ఘోరీ అనే ఉగ్రవాది (జగిత్యాలలో 2000 ఏప్రిల్ 6న ఎన్‌కౌంటర్ అయ్యాడు) ఇండియన్ ముస్లిమ్ మహ్మదీ ముజాహిదీన్ (ఐఎంఎంఎం) పేరుతో ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేశాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన అస్గర్ దీనికి సానుభూతిపరుడిగా మారి తనకంటూ ఓ ప్రత్యేక మాడ్యుల్ (గ్యాంగ్) ఏర్పాటు చేసుకున్నాడు. గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్‌పాండ్యను హత్య చేయడానికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు 2003లో కుట్ర పన్నాయి. ఈ బాధ్యతల్ని మధ్యవర్తుల ద్వారా అస్గర్‌కు అప్పగించాయి. బారీ తదితరులతో కలిసి రంగంలోకి దిగిన ఇతడు ఆ ఏడాది మార్చి 26న తన ఇంటి సమీపంలో వాకింగ్ చేస్తుండగా కారులో వెళ్ళి కాల్చి చంపాడు. స్వయంగా తుపాకీ పట్టుకున్న అస్గర్ ఐదు రౌండ్లు పాండ్యపై కాల్చడంతో ఆయన కన్నుమూశారు.

అప్పట్లో మేడ్చల్‌లో అరెస్టు...

ఈ కేసు దర్యాప్తు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ అదే ఏడాది ఏప్రిల్ 17న మేడ్చల్‌లోని ఫామ్ హౌస్‌లో తలదాచుకున్న అస్గర్, బారీలను పట్టుకున్నాయి. సుదీర్ఘకాలం గుజరాత్‌లోని సబర్మతి జైల్లో ఉన్న వీరిని కింది కోర్టు దోషులుగా తేల్చినా..గుజరాత్ హైకోర్టులో ఈ కేసు వీగిపోవడంతో 2011లో బయట పడ్డారు. ఆ తర్వాత నగరంలో వీరిపై నమోదైన కేసుల్లో కొన్ని వీగిపోవడం, మరికొన్నింటిలో బెయిల్ రావడంతో బయటకు వచ్చారు. ఆ తర్వాత మలక్‌పేటలోని సలీమ్ నగర్‌లో ఓ అడ్డా ఏర్పాటు చేసుకున్నాడు. 2011 తర్వాత వీరి పేర్లు ఎక్కడా వెలుగులోకి రాలేదు. 2018లో ప్రణయ్ హత్య కేసులో అరెస్టు కావడంతో పోలీసులు, నిఘా వర్గాలు ఉలిక్కిపడ్డాయి. హరేన్ పాండ్యా కేసును గుజరాత్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఈ విచారణ అనంతరం అస్గర్‌కు జీవిత ఖైదు పడింది. దీంతో 2019 ఆగస్టులో ఇతడిని సబర్మతి జైలుకు తరలించారు.

సిటీలోనే మారుతిరావు ఆత్మహత్య

2020లో ఖైరతాబాద్ వైశ్య భవన్‌లో దుర్ఘటన

- న్యాయవాదిని కలవడానికి వచ్చి బలవన్మరణం
- అప్పట్లో ఘటనాస్థలి నుంచి సూసైడ్ నోట్ స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ప్రణయ్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అమృత తండ్రి మారుతిరావు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. 2020 మార్చి 7న ఖైరతాబాద్‌లో ఉన్న వైశ్య భవన్‌లో బస చేసిన ఆయన మరుసటి రోజు విగతజీవిగా కనిపించారు. న్యాయవాదిని కలవడానికి వచ్చి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తేల్చారు. అప్పట్లో మారుతిరావు బస చేసిన గది నుంచి పోలీసులు సూసైడ్ నోట్ సైతం స్వాధీనం చేసుకున్నారు. మారుతిరావు తన వాహనంలో డ్రైవర్ బెల్లంకొండ రాజేష్‌తో కలిసి నగరానికి వచ్చారు. 2020 మార్చి 7 సాయంత్రం 6:40 గంటలకు ఖైరతాబాద్ చింతల్‌బస్తీలో ఉన్న ఆర్య వైశ్య భవన్ రూమ్ నెం.306లో బస చేశారు. న్యాయవాది వస్తారంటూ డ్రైవర్‌తో చెప్పిన మారుతిరావు అతడిని కారులోనే ఉండమన్నారు. ఆ రోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో బయటకు వచ్చిన మారుతిరావు డ్రైవర్‌ను పిలిచి ఎదురుగా ఉన్న మిర్చీ బండీ నుంచి గారెలు, కారులో కొన్ని కాగితాలు తెప్పించుకున్నారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో తన గదిలో ఏసీని బాగు చేయించుకున్న మారుతిరావు.. లోపల నుంచి తలుపులు వేసుకుని పడుకున్నారు. మరుసటి రోజు (2020 మార్చి 8) ఉదయం మిర్యాలగూడలో ఉన్న ఆయన భార్య గిరిజ ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో డ్రైవర్ రాజేష్‌కు ఫోన్ చేయగా.. అతడు పైకి వెళ్లి ప్రయత్నించిన అతడు చివరకు వైశ్య భవన్ నిర్వాహకుల ద్వారా సైఫాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు గదిలోకి ప్రవేశించగా...మంచంపై విగతజీవిగా పడి ఉన్న మారుతిరావు కనిపించారు. ఆ గదిలో ఓ సూసైడ్‌నోట్ పోలీసులకు లభించింది. అందులో 'గిరిజా క్షమించు...అమ్మా అమృత అమ్మ దగ్గరకు రా అమ్మా' అని మాత్రమే ఉన్నట్లు పోలీసులు చెప్పారు. అప్పట్లో వైశ్య భవన్ వద్దకు వచ్చిన మారుతిరావు సోదరుడు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ... వాస్తవాలు తెలుసుకొని వార్తలు రాయాలని, ఊహా కల్పనతో వార్తలు రాయవద్దని దురుసుగా మాట్లాడారు. తాజాగా ప్రణయ్ కేసులో శ్రవణ్‌కు జీవితఖైదు పడటం గమనార్హం.

'పవర్'ఫుల్!

11 కేవీ ఫీడర్లపై ఆన్‌లైన్ మానిటరింగ్

- కోతలు, సరఫరాలో హెచ్చుతగ్గుల గుర్తింపు కోసం ప్రత్యేక టెక్నాలజీ
- ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటుతో సమస్యలకు చెక్
- ఈ నెల చివరి నాటికి రెండువేల ఫీడర్ల పరిధిలో అమలుకు సన్నాహాలు



గ్రేటర్‌లో సర్కిళ్ల వారీగా ఉన్న ఫీడర్లు

సర్కిల్	11 కేవీ ఫీడర్లు
బంజారాహిల్స్	310
సైబర్‌సిటీ	437
హబ్సిగూడ	381
హైదరాబాద్ సెంట్రల్	307
హైదరాబాద్ సౌత్	323
మేడ్చల్	467
రాజేంద్రనగర్	588
సరూర్‌నగర్	330
సికింద్రాబాద్	269

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు.. హెచ్చుతగ్గుల సమస్య తక్షణ గుర్తింపు.. పరిష్కారం కోసం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే లైన్ టు లైన్, పోల్ టు పోల్ తిరిగి అధిక ఒత్తిడికి గురవుతున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న ఇన్సులేటర్లు, ఫ్యూజ్ బాక్స్‌లు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, లూజు లైన్లను గుర్తించి వాటిని 'సాసా' వెబ్ పోర్టల్‌లో పొందుపరిచిన డిస్కం.. తాజాగా 11 కేవీ ఫీడర్ల రియల్ మానిటరింగ్ కోసం 'ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం'(ఎఫ్‌ఓఎంఎస్)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. తద్వారా ఏ ఫీడర్‌పై ఎంత ఒత్తిడి ఉంది.. ఏరోజు, ఎన్ని నిమిషాల పాటు సరఫరా నిలిచిపోయింది.. ఎంత సమయంలో సరఫరా పునరుద్ధరించారు.. వంటి పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నిక్షిప్తమవుతుంది. డిస్కం కేంద్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులతో పాటు క్షేత్రస్థాయిలోని ఏఈల మొబైల్ ఫోన్లకు ఈ సమాచారం వెళ్లిపోతుంది. దీంతో లైన్ల నిర్వహణ, పునరుద్ధరణ పేరుతో క్షేత్రస్థాయి ఇంజనీర్లు అడ్డగోలుగా అమలు చేస్తున్న ఎల్సీలకు చెక్ పడనుంది. అంతేకాదు ఫీడర్లపై పడుతున్న ఒత్తిడిని కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధిక ఒత్తిడి కారణంగా ఫీడర్లలో సమస్యలు తలెత్తకుండా ముందే జాగ్రత్తపడేందుకు ఈ సాంకేతిక పరిజ్ఞానం తోడ్పతుంది.

అంతరాయాలకు ఆస్కారం లేకుండా..

జీహెచ్‌ఎంసీ పరిధిలో 11 కేవీ ఫీడర్లు 3,412 వరకు ఉన్నాయి. ఒక్కో ఫీడర్ కొన్ని కిలోమీటర్లు విస్తరించి ఉంటుంది. ఫీడర్‌పై 25 నుంచి 50 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటాయి. ఒక్కో డీటీఆర్ పరిధిలో 50 విద్యుత్ కనెక్షన్లు ఉంటాయి. మెజార్టీ గృహ యజమానులు విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకునే సమయంలో ఒక కిలోవాటు, రెండు కిలోవాట్లకే పరిమితం అవుతుంటారు. ఆ తర్వాత ఏసీ, కూలర్లు, గ్రీజర్, రిఫ్రిజిరేటర్, మిక్సీ, టీవీ, ఫ్యాను.. ఇలా పదుల సంఖ్యలో ఎలక్ట్రికల్ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. సామర్థ్యానికి మించి విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో ఆ భారం సమీపంలోని డీటీఆర్, సబ్ స్టేషన్లలోని ఫీడర్లపై పడుతోంది. పగటి ఉష్ణోగ్రతలకు తోడు అధిక విద్యుత్ వినియోగంతో తరచూ ఫీడర్ ట్రిప్పవుతోంది. సరఫరాలో అంతరాయాలకు కారణమవుతోంది. ఎఫ్‌ఓఎంఎస్ సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానంతో ఫీడర్‌పై భారం ముందే తెలిసిపోతుంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే అవకాశం లభిస్తుంది. తొలి దశలో మార్చి చివరి నాటికి 2000 ఫీడర్ల పరిధిలో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చాలని నిర్ణయించారు. ఆ తర్వాతి దశల్లో మిగిలిన ఫీడర్ల పరిధిలోనూ ఈ రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయనున్నారు.

'కంటోన్మెంట్'పై త్వరలో కదలిక!

విలీనంపై ముందడుగు

- గ్రేటర్ పాలకమండలి ఎన్నికలకు ముందే ప్రక్రియ..
- విలీన కమిటీ నివేదిక పరిశీలనకు ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరపాలక సంస్థ(జీహెచ్‌ఎంసీ)లో కంటోన్మెంట్ విలీనం ప్రక్రియకు త్వరలోనే ముందడుగు పడనుంది. వివిధ కంటోన్మెంట్ బోర్డులతో పాటు గ్రేటర్ నగరంలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని బల్దియాలో కలిపే అంశంపై కేంద్రం నిర్ణయం తీసుకొని రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. విలీన విధివిధానాలకు సంబంధించి ఒక కమిటీ ఏర్పాటైనప్పటికీ ఇప్పటి వరకు అడుగు ముందుకు పడింది లేదు. విలీనం కోసం నిరీక్షణ తప్ప ఎలాంటి ప్రక్రియ ప్రారంభం కాలేదు.

పాలకమండలి ఎన్నికలకు ముందే..


ఈ నేపథ్యంలో వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు ముగియనుండటం..జీహెచ్‌ఎంసీని రెండు లేదా అంతకన్నా ఎక్కువ కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆలోగా కంటోన్మెంట్ విలీన ప్రక్రియను కూడా పూర్తి చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. జీహెచ్‌ఎంసీని ఎక్కువ కార్పొరేషన్లు చేసేందుకు ముందే కంటోన్మెంట్ విలీన ప్రక్రియ కూడా పూర్తయితే మేలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. విలీనానికి సంబంధించి ఏర్పడిన కమిటీ ఒక నివేదికను రూపొందించినట్లు తెలుస్తోంది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆ నివేదికను పరిశీలించాక, త్వరలో జరిగే సమావేశంలో విలీన ప్రక్రియకు సంబంధించి తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సికింద్రాబాద్ కంటోన్మెంట్ దేశంలోనే పెద్ద కంటోన్మెంట్ కావడం తెలిసిందే.



కంటోన్మెంట్ కార్యాలయం

ఏఓసీకి ప్రత్యామ్నాయ మార్గాలు సైతం

కంటోన్మెంట్‌లోని ఏఓసీకి ప్రత్యామ్నాయంగా రహదారులు, తదితర నిర్మాణాల పనులపై కూడా జీహెచ్‌ఎంసీ దృష్టి సారించింది. ఆ పనులు చేసేందుకు కంటోన్మెంట్‌కు చెందిన 36 ఎకరాల స్థలం అవసరం. అందుకు సంబంధించి పేపర్ వర్క్ దాదాపుగా పూర్తయినప్పటికీ, ఆ భూములకు బదులుగా ప్రత్యామ్నాయ భూముల్ని ఇవ్వాల్సి ఉంది. దీంతో అందుకు తగిన భూములెక్కడో వెతికే పనిలో అధికారులున్నట్లు తెలిసింది. గతంలో నగరానికి దూరంగా వికారాబాద్, శామీర్‌పేట వంటి ప్రాంతాల్లో ఇవ్వాలని యోచించినట్లు సమాచారం. ఆ ఆలోచన ఏమైందో తెలియదు. ఏఓసీ సెంటర్‌కు ప్రత్యామ్నాయ మార్గాల ఆలోచన దశాబ్దకాలంగా ఉన్నప్పటికీ ముందుకుసాగలేదు. ఇటీవల మునిసిపల్ పరిపాలనశాఖ హై సిటీ కింద జీహెచ్‌ఎంసీలో చేపట్టనున్న ఫ్లై ఓవర్లు, తదితరమైన వాటిని నిధులు మంజూరు చేసింది. వాటిల్లో ఏఓసీ చుట్టూ ప్రత్యామ్నాయ మార్గాలకు రూ.960 కోట్లు, ఆర్‌కేపురం ఆర్‌ఓబీకి రూ.210 కోట్లు, ఆర్‌యూబీకి రూ.35 కోట్లు మంజూరు చేసింది.



యువతి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ప్రియుడు పెళ్లికి నిరాకరించాడని మనస్తాపానికి లోనైన ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల్ జిల్లా, ఇమాంపూర్ గ్రామానికి చెందిన ప్రియాంక(27) నగరంలో ఉద్యోగం చేస్తూ వెన్నలగడ్డలోని హాస్టల్‌లో ఉంటోంది. అమె మూడేళ్లుగా రవికుమార్ అనే యువకుడిని ప్రేమిస్తోంది.. అయితే అతను పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి లోనైన ప్రియాంక సోమవారం ఉదయం హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులు...
మహా ముదుర్లు!



డ్రంక్ డ్రైవింగ్ పరీక్షలు తప్పించుకునే ప్రయత్నాలు

- పోలీసుల ఎత్తులకు పై ఎత్తులు
- ప్రత్యేకంగా కొన్ని వాట్సాప్ గ్రూపులు సైతం ఏర్పాటు
- ప్రాంతాల వారీగా తనిఖీ చేస్తున్న ఏరియాలు గుర్తింపు
- వాటిని లోకేషన్స్‌తో సహా గ్రూపుల్లో పోస్టు చేస్తున్న వైనం

సాక్షి, సిటీబ్యూరో: 'శత కోటి దరిద్రాలకు అనంత కోటి ఉపాయాలు' అన్న నానుడిని నగరంలోని మందుబాబులు బాగా ఒంట పట్టించుకున్నట్లున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి చెక్ చెప్పడానికి ట్రాఫిక్ విభాగం అధికారులు ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తున్నారు. వీరికి చిక్కకుండా తప్పించుకోవడానికి 'నిషా'చరులు అనేక మార్గాలు అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసుకోవడం ఇటీవల పెరిగిందని పోలీసులు గుర్తించారు. దీనికి చెక్ చెప్పడానికి అవసరమైన మార్గాల కోసం అన్వేషిస్తున్నారు.

13 ఏళ్ల నుంచి కఠినంగా...

రోడ్డు ప్రమాదాలను సీరియస్‌గా తీసుకున్న ఐక్యరాజ్య సమితిలోని అంతర్భాగమైన డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ రోడ్ సేఫ్టీ పార్టనర్ షిప్ (జీఆర్‌ఎస్పీ) పేరిట అధ్యయనం చేపట్టింది. బ్లూమ్ బర్గ్ యూనివర్సిటీ, జాన్ హాకింగ్ వర్సిటీలతో కలిసి అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న 10 దేశాలను గుర్తించడంతో పాటు వాటి నివారణకు ఆర్‌ఎస్-10 పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. ఆయా దేశాల్లో కొన్ని నగరాలను ఎంపిక చేసుకుని ప్రమాదాల నివారణకు అవసరమైన ఉపకరణాలు అందించడంతో పాటు సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలు ఇచ్చింది. భారత్ నుంచి హైదరాబాద్‌తో పాటు జలంధర్ ఎంపికయ్యాయి. దీంతో 2011 నవంబర్‌లో సిటీ పోలీసులకు బ్రీత్ అనలైజర్లు 10, డిజిటల్ కెమెరాలు 220, బారికేడ్లు 250, రిఫ్లెక్టివ్ జాకెట్లు 550, ఎల్‌ఈడీ బేటన్స్ 450 అందాయి. అప్పటి నుంచి డ్రంక్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్స్ మొదలు కావడంతో పాటు 'నిషా' చరుల్ని కోర్టుకు తరలించడం సాధ్యమైంది. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ చిక్కిన వారికి జరిమానాలతో పాటు జైలు శిక్షలు పడటం మొదలైంది.

'బ్యాక్'తో మొదలై వాట్సాప్ వరకు...

ఈ స్పెషల్ డ్రైవ్స్‌లో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు 'నిషా'చరులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. తొలినాళ్లల్లో ఈ మందుబాబులు రహదారిలో ప్రయాణిస్తున్నప్పుడు ముందు తనిఖీలను గుర్తిస్తే వెంటనే తమ వాహనాన్ని వెనక్కు తిప్పుకుని రాంగ్ రూట్‌లో, లేదా పక్కన ఉన్న సందుల్లోకి జారుకునేవారు. దీనికి చెక్ చెప్పేందుకు ట్రాఫిక్ పోలీసులు 'ఫీల్డింగ్ టీమ్స్' ఏర్పాటు చేశారు. వీరు డ్రైవ్ జరుగుతున్న ప్రాంతానికి కాస్తా ముందు నుంచి కాపుకాసి ఇలా ఉడాయించే వారిని పట్టుకోవడం మొదలెట్టారు. దీంతో మందుబాబులు ఏరియాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి రోజూ వాటిలో తమతమ ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఈ డ్రైవ్స్ జరుగుతున్నాయో పోస్టు చేస్తున్నారు. కొందరు గ్రూపు సభ్యులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉండటంతో దాదాపు అన్ని ఏరియాల సమాచారం ఆ గ్రూపుల్లోకి వచ్చి, మద్యం తాగి ఉన్న వాళ్లు పోలీసులకు చిక్కకుండా జారుకుంటున్నారు.

సిటీలో డ్రంక్ డ్రైవింగ్ కేసుల గణాంకాలు ఇలా

ఏడాది	కేసులు	చార్జిషీట్లు దాఖలు
2023	43,940	45,327
2024	52,080	46,468

చెక్ చెప్పేందుకు మార్గాల అన్వేషణ...

ట్రాఫిక్ విభాగం అధికారులు ఈ డ్రంక్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకోవడానికి చేస్తున్న స్పెషల్ డ్రైవ్స్ సందర్భంలోనూ అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాహనచోదకులతో పాటు పోలీసులకు ఎలాంటి ముప్పు ఉండకూడదనే ఉద్దేశంతో రహదారి స్థితిగతులు తదితరాలను పరిశీలించి ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఈ ఏరియాలు ఒక్కో ట్రాఫిక్ ఠాణాలో గరిష్టంగా ఐదే ఉంటున్నాయి. మరో పక్క ఈ డ్రైవ్స్ చేపట్టడానికి బారికేడ్లు, టోవింగ్ వాహనం సహా మరికొన్ని సదుపాయాలు అనివార్యం. దీంతో పోలీసులు ఆకస్మికంగా వేర్వేరు ప్రాంతాల్లో ఈ డ్రైవ్స్ చేపట్టడం సాధ్యం కావట్లేదు. ఇవన్నీ మందుబాబులకు కలిసి వస్తున్నట్లు ట్రాఫిక్ అధికారులు గుర్తించారు. పోలీసులతో పాటు మద్యం మత్తులో వాహనం నడిపే వారికీ ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. 'నిషా'చరులు ఇలాంటి పై ఎత్తులు వేయడం వల్ల స్పెషల్ డ్రైవ్స్ స్ఫూర్తి దెబ్బతింటోందని చెబుతున్న పోలీసులు వీరిని కట్టడి చేయడానికి పటిష్ట చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు..
- కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఘటన

శంషాబాద్ రూరల్: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లికి చెందిన పెద్దరాజుల రామచంద్రయ్య(55) బంధువుల ఇంట్లో పెళ్లికి హాజరయ్యేందుకు కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఈ నెల 9న వనపర్తి జిల్లా గోపాల్‌పేట్‌కు వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు పెద్దషాపూర్ శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ఘటనలో ముందు సీట్లో కూర్చున్న రామచంద్రయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న అతడి కుమారుడు భాస్కర్, బంధువు అలివేలుకు తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


నర్సింహా రెడ్డి (ఫైల్)

మియాపూర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్వర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాల పట్టణానికి చెందిన సంగిరెడ్డి నర్సింహారెడ్డి (28) విష్ణుప్రియ దంపతులు మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదిత్య నగర్ కృష్ణకాలనీలో నివాసముంటున్నారు. నర్సింహారెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం కుమారుడికి అన్నం తినిపించే విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి లోనైన నర్సింహారెడ్డి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అతను ఎంత సేపటికీ బయటికి రాకపోవడంతో విష్ణుప్రియ స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా నరసింహారెడ్డి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. అతడిని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న మియాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య విష్ణుప్రియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం


రోషన్ మృతదేహం

మియాపూర్: టిప్పర్ లారీని ఓవర్ టేక్ చేయబోయి స్కూటీని ఢీకొని అదుపుతప్పి బుల్లెట్ పై వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లాకు చెందిన రోషన్(27) మూడేళ్లుగా చందానగర్‌లో స్నేహితులతో కలిసి ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి అతను బైక్‌పై చందానగర్ నుంచి మియాపూర్ వైపు వెళ్తుండగా మదీనాగూడ దీప్తీశ్రీనగర్ కాలనీ కమాన్ సమీపంలో ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో స్కూటీని ఢీనడంతో అతడి బైక్ అదుపుతప్పింది. హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి, అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి జహరాబాను ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాసు పుస్తకాలతో పాత లేఔట్ల కబ్జా

హైడ్రా ప్రజావాణికి 63 ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని ప్లాట్ల కబ్జాలో సృష్టించిన పాస్‌పుస్తకాలు కీలక పాత్ర పోషిస్తున్నట్లు హైడ్రాకు ఫిర్యాదులు అందుతున్నాయి. తండ్రులు పొలాలను ప్లాట్లుగా మార్చి అమ్మగా... తనయులు తమ పేరిట పాసు పుస్తకాలు సృష్టించుకుని పాత లేఔట్లను పొలాలుగా మార్చి కబ్జా చేస్తున్నట్లు పలువురు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా 63 ఫిర్యాదులు అందాయి. ఇందులో పాత లేఔట్ల ఆక్రమణలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. కొన్ని రహదారులు, పార్కులకు సంబంధించినవి. అలాగే మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని కబ్జా చేస్తున్నారని, వారిపై ఫిర్యాదు చేసినా స్థానిక అధికారుల నుంచి స్పందన ఉండట్లేదని పలువురు హైడ్రా దృష్టికి తెచ్చారు. తుర్కయాంజల్ చెరువులోకి వెళ్లే వాన నీటికి అడ్డంగా గోడ నిర్మించడంతో కాలనీలను వరద ముంచెత్తుతోందని ఏవీనగర్-2 వాసులు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్ మండలం ప్రతాప్ సింగారంలోని 25.17 ఎకరాల్లో 390 ప్లాట్లతో 1989లో లే ఔట్ వేశారు. అందులో 88 ప్లాట్లు కబ్జా చేశారని, 6.14 ఎకరాల భూమి తనదంటూ ధరణి ద్వారా పాసు పుస్తకాన్ని సృష్టించి కబ్జా చేశారని ప్లాట్లు కోల్పోయిన వారు ఫిర్యాదు చేశారు. తండ్రి అమ్మగా అతని కుమారుడు ఇప్పుడు కబ్జా చేశారని, రైతు బంధు పథకం కింద డబ్బులు కూడా తీసుకున్నారని వాపోయారు. తాము ఫిర్యాదు చేయగా అధికారులు రైతుబంధును వాపసు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. మొత్తం లేఔట్లలో రహదారులు, పార్కులు చెరబట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీ సర్వే నం.63/1లోని 1200 గజాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఆ స్థలాన్ని కేటాయిస్తే మంచి క్రీడా మైదానం సమకూరుతుందని దేవేందర్‌నగర్ కాలనీ వీకర్ సెక్షన్ సొసైటీ ప్రతినిధులు వినతి పత్రం అందించారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీలోని శ్రీరంగాపురంలోని 24 వ వార్డులో 1050 గజాల పార్కు స్థలాన్ని అక్కడి మాజీ ప్రజాప్రతినిధి కబ్జా చేశారని, కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అక్కడ ఆరు కాలనీలకు వెళ్లే దారిని కూడా కబ్జా చేయడంతో దారి లేకుండా పోయిందని వాపోయారు. ఈ ఫిర్యాదులపై హైడ్రా విచారణ చేపట్టింది.

ఘరానా మోసగాడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

కాచిగూడ: మాయమాటలతో ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న ఘరానా మోసగాడిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన పలాష్ పాల్ నగరంలోని వెంగళ్‌రావునగర్‌లో ఉంటూ ఇంటీరియర్ అండ్ ఎక్స్‌టీరియర్ డిజైనర్‌గా వ్యాపారం చేస్తున్నాడు. కొత్తగా భవన నిర్మాణాలు చేస్తున్న యజమానులు, బిల్డర్లకు ఫర్నిచర్ చేయించి ఇస్తానని ఫేక్ వీడియోలను చూపించి నమ్మించేవాడు. ఆ తర్వాత వారి నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసేవాడు. - ఇటీవల బషీర్‌బాగ్, అవంతినగర్ ప్రాంతానికి చెందిన నిఖిత్‌రెడ్డి ఇంటి నిర్మాణం చేస్తుండగా అతడిని సంప్రదించిన పలాష్‌పాల్ ఇంటీరియర్ డిజైన్ చేస్తానని అతడి నుంచి రూ.66 లక్షలు తీసుకుని మోసం చేశాడు. ఇదే తరహాలో శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.16లక్షలు, రాయదుర్గం పీఎస్ పరిధిలో రూ.10 లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. నిఖిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నారాయణగూడ పోలీసులు ఆదివారం వెంగళ్‌రావునగర్ సమీపంలోని కృష్ణకాంత్ పార్క్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు పలాష్ పాల్ బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.18,65,00 ఫ్రీజ్ చేశారు. 120 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు, బైక్, 4 సెల్ ఫోన్లు, పలు డాక్యుమెంట్లు, 535 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ప్లాట్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. పలాష్ పాల్ గతంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని, పలు చీటింగ్ కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసిన నారాయణగూడ పోలీసులను డీసీపీ అభినందించి రివార్డును అందజేశారు. సమావేశంలో ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై జి.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలకు ప్రత్యేక మొబైల్ యాప్!

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి ఉద్యోగుల ఆరోగ్య సేవల కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించింది. బోర్డు పరిధిలో ఆరోగ్య సేవలను మరింత సులభతరం చేసేందుకు రూపొందించిన 'మెడ్ ఫ్లాష్' అనే మొబైల్ అప్లికేషన్‌ను సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి ప్రారంభించారు. హెల్త్ కార్డు ఉన్న ఉద్యోగులకు సత్వర ఆరోగ్య సేవలు అందించేందుకు ఈ యాప్ తీసుకొచ్చారు. ఏదైనా మెడికల్ ఎమర్జెన్సీ తలెత్తినప్పుడు సేవల్ని పొందవచ్చు. యాప్ ద్వారా వివరాలు నమోదు చేసుకుంటే ఏజెన్సీ నిర్వాహకులు వెంటనే స్పందించి.. ఆరోగ్య వివరాలు, మంచి వైద్యం అందించే ఆసుపత్రులను సూచిస్తారు. అవసరమైతే అంబులెన్స్‌ను కూడా ఇంటి దగ్గరకు పంపించే సౌకర్యాన్నీ కల్పించారు. హెల్త్ కార్డులు ఉన్న ఉద్యోగులకు ఇలాంటి క్యాష్ లెస్ సర్వీస్ అందించడం దేశంలోనే మొదటి సారి కావడం విశేషం. జలమండలిలో ఉద్యోగులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్స్ దాదాపు 6685 మందికి హెల్త్ కార్డులు ఉన్నాయి. వీరితో పాటు కుటుంబ సభ్యులు కూడా దీని ద్వారా సంవత్సరానికి రూ. 3 లక్షల వరకు ఉచిత సేవలను పొందవచ్చు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ మాట్లాడుతూ హెల్త్‌కార్డు కలిగిన ఉద్యోగులు, సిబ్బంది యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డివిజన్లలో ఈ యాప్ వినియోగంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్. ప్రవీణ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ. శ్రీధర్, పీఅండ్‌ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్లూ వీసీగా ప్రొ.నాగరాజు బాధ్యతల స్వీకరణ



ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారేన్ లాంగ్వేజస్ సెంట్రల్ యూనివర్సిటీ 4వ వైస్ ఛాన్సలర్‌గా ప్రొ. నాగలపల్లి నాగరాజు సోమవారం ఇన్‌చార్జి వీసీ ప్రొ.హరిబండి లక్ష్మి నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిలో ఐదేళ్లపాటు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గ సెంట్రల్ యూనివర్సిటీ, అరుణచల్ ప్రదేశ్ రాజీవ్ గాంధీ సెంట్రల్ వర్సిటీలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పని చేసిన ఆయన ఒడిశాలోని గంగాధర్ మేహర్ వర్సిటీ వీసీగా పని చేస్తున్నారు. గతంలో ఆయన ఏపీలోని ఆదికవి నన్నయ్య వర్సిటీ, శ్రీ సత్యసాయి వర్సిటీల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశారు.

పిల్లల పెంపకంలో వివక్ష వద్దు


మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఉస్మానియా యూనివర్సిటీ: ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా పెంచాలని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక, ఆంధ్రమహిళ కాలేజీ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళ దినోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల, బాలికలకు చిన్న వయస్సు నుంచే సమాన అవకాశాలు కల్పిస్తే అనుకున్న ఫలితాలు లభిస్తాయన్నారు. అనంతరం నేను ఆడపిల్లను -అందుకే తప్పక చదవాలి అనే శీర్షికతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందిచిన పోస్టర్‌ను సీతక్క ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ డా.కరుణాదేవి, జనవిజ్ఞాన వేదిక నాయకులు రాజా, బీఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.వసుంధర రచయిత్రి జూపాక సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

శిక్షలో శిక్షణలు.. ఉపాధికి బాటలు


శిక్షణను ప్రారంభిస్తున్న సంజయ్, సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: జైలు శిక్షలో భాగంగా వివిధ అంశాల్లో పొందిన శిక్షణ ఉపాధికి బాటలు వేస్తుందని ఉపాధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్ అన్నారు. చంచల్‌గూడ మహిళా జైలులో ఖైదీలకు స్వయం ఉపాధి పథకం కింద ప్రవేశపెట్టిన టైలరింగ్ కోర్సును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కోర్సు వృత్తి నైపుణ్యం, ఆర్థిక స్వతంత్ర్యం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ జైళ్లను పునరావాస ప్రదేశాలుగా మారుస్తున్నాయన్నారు. సంకల్ప పథకం కింద నాక్ సంస్థల సహకారంతో ఈ కోర్సును అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐజీ మురళీబాబు, డీఐజీ డా. శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు నవాబు శివకుమార్ గౌడ్, వెంటకలక్ష్మి, అమరావతి, సిబ్బంది ఉన్నారు.

సైబర్ బాధితుడికి రూ.36.5 లక్షలు రిఫండ్



సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు నేరం బారినపడి రూ.43 లక్షలు కోల్పోయిన బాధితుడికి సిటీ సైబర్ క్రైమ్ పోలీసుల చొరవతో రూ.36.5 లక్షలు రిఫండ్ వచ్చాయి. ఈ చెక్కును డీసీపీ దార కవిత సోమవారం బాధితుడికి అందజేశారు. నగరానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని (71) సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో ట్రాప్ చేశారు. అతడి నుంచి తమ బ్యాంకు ఖాతాల్లోకి రూ.43 లక్షలు బదిలీ చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రావు, ఎస్సైలు మహిపాల్, వెంకటేష్, హెడ్-కానిస్టేబుల్ మహేశ్వర్‌రెడ్డి కేసును దర్యాప్తు చేశారు. బాధితుడికి సత్వర న్యాయం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తూ ఇతడు నగదు డిపాజిట్/ట్రాన్స్‌ఫర్ చేసిన బ్యాంకు ఖాతాలపై దృష్టి పెట్టారు. ఆయా అధికారుల్ని సంప్రదించి వాటిలో ఉన్న మొత్తం ఫ్రీజ్ చేయాల్సిందిగా కోరారు. వీరి స్పందన కారణంగా సైబర్ నేరగాళ్ల చేతికి చేరకుండా రూ.36.5 లక్షలు ఫ్రీజ్ అయింది. ఈ మేరకు న్యాయస్థానానికి సమాచారం ఇచ్చిన అధికారులు కోర్టు అనుమతి పొంది ఆ మొత్తం బాధితుడికి రిఫండ్ చేశారు.

జల్సాల కోసం చైన్ స్నాచింగ్


- నిందితుడి అరెస్ట్.. బంగారం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు

నిజాంపేట్: జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు ఈజీమనీ కోసం చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఈ మేరకు కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం వివరాలు వెల్లడించారు. పాలమూరు జిల్లా అడ్డాకులకు చెందిన మొదలు ప్రవీణ్ సాగర్ తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్నారు. 2017లో ప్రవీణ్ సాగర్ తండ్రి మరణించడంతో జగద్గిరిగుట్ట నుంచి నిజాంపేట్ రాజీవ్‌నగర్ గృహకల్పకు నివాసం మార్చారు. చదువును మధ్యలోనే ఆపేసిన అతడు జొమాటో, స్విగ్గీలో డెలవరీ బాయ్‌గా చేరాడు. అయితే అతడు జల్సాలకు అలవాటుపడ్డాడు. డెలవరీ బాయ్‌గా వచ్చే డబ్బులు సరిపోక ఈజీ మనీ కోసం చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న కెల్ల బాలమ్మ మెడలో ఉన్న 2 1/2 తులాల బంగారు పుస్తెలతాడును దొంగలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం ప్రగతినగర్ ఏరియాలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. ప్రవీణ్ సాగర్‌పై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుండి 2 1/2 బంగారు గొలుసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్, డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ యాదయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో షూట్ కోసం వచ్చి..

- క్వారీ గుంతలో పడి యువకుడి మృతి


యతిన్ మృతదేహం

జవహర్‌నగర్: స్నేహితులతో సరదాగా ఫొటో షూట్ చేసుకునేందుకు వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి మృతి చెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుమలగిరికి చెందిన యతిన్ నాయుడు (21) డిగ్రీ చదువుతున్నాడు. ఆదివారం అతను తన సోదరుడు తనీష్, స్నేహితుడు అభిషేక్‌రాజ్‌లతో కలిసి మల్కారం గుట్టల వద్ద ఫొటోలు తీసుకునేందుకు వచ్చాడు. ఫొటో షూట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి గల్లంతయ్యాడు. సోమవారం ఉదయం డీఆర్‌ఎఫ్ బృందాలు, జవహర్‌నగర్ పోలీసులు గాలింపు చేపట్టి అతడి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి తల్లి గీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు అభినందనలు



ఫిలింనగర్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిని అభినందిస్తున్న నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

ఫిలింనగర్: బంగ్లాదేశీ మహిళల అక్రమ రవాణాను అరికట్టి బాధితులను ప్రజ్వల షెల్టర్ హోంకు తరలించిన ఘటనలో ప్రతిభ కనబర్చిన ఫిలింనగర్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, పంజగుట్ట ఉమెన్ కానిస్టేబుల్ సీనావత్ లావణ్యకు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ రివార్డులు అందజేసి ప్రశంసించారు. మహిళల అక్రమ రవాణాను అరికట్టడంలో వీరు చూపిన శ్రద్ధ, అంకితభావాన్ని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. వీరందరినీ పునరావాస కేంద్రానికి తరలించడంలో వీరు కీలకపాత్ర పోషించారన్నారు.

శ్రీరాంనగర్ బస్తీలో అగ్ని ప్రమాదం



ఖాళీ స్థలంలో మంటలు అంటుకున్న దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని శ్రీరాంనగర్ బస్తీలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో సోమవారం ఉదయం మంటలు చెలరేగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అప్రమత్తమైన చుట్టుపక్కల నివాసితులు వెంటనే ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇవ్వడంతో స్పందించిన అధికారులు మంటలను ఆర్పివేశారు. బస్తీలో ఇళ్ల మధ్యలో ఉన్న ఈ ఖాళీ ప్లాట్‌లో చాలా రోజుల నుంచి చుట్టుపక్కల వారు చెత్తా చెదారం వేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆ మంటలు వ్యాపించాయి. దీంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై కేసు

ఫిలింనగర్: ఇండియా-న్యూజిలాండ్ జట్ల మధ్య చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. గోల్కొండ మొహల్లాగంజ్ బస్తీకి చెందిన జి.నితేష్ డెకరేషన్ వర్క్ చేస్తుంటాడు. ఆదివారం రాత్రి ఓయూ కాలనీ బీమాస్ హోటల్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు ఫిలింనగర్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బెట్టింగ్‌కు పాల్పడుతున్న నితేష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బెట్‌భాయ్9 అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి ఫోన్ సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో..

ఇండియా-న్యూజిలాండ్ జట్ల మధ్య ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భాగంగా ఆదివారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని అమృతా బార్‌లో ఓ వ్యక్తి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. కృష్ణానగర్‌లో నివసించే సినీ కార్మికుడు సీర్ల సాయికిరణ్ బెట్టింగ్‌కు పాల్పడుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి అకౌంట్‌లో డబ్బులు గుర్తించారు. సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధురానగర్ పీఎస్ పరిధిలో..

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ చేస్తున్న యువకుడిని మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం భీమవరం ప్రాంతానికి చెందిన మల్లాడి శివ పదేళ్ల క్రితం నగరానికి వచ్చి ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ సాయికుమార్ ఆదివారం రాత్రి సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా జీటీఎస్ టెంపుల్ వద్ద మల్లాడి శివ వద్దకు వెళ్లేలోగా పారిపోవడానికి ప్రయత్నించాడు. దాంతో అతడి వద్ద ఉన్న ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీలక్ష్మీ సుదర్శన నారసింహ హోమం

సనత్‌నగర్: హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలో శ్రీమదలర్మేల్ మంగా పద్మావతీ సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీలక్ష్మీ సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. అశేష జన సందోహం నడుమ వేద మంత్రాల మంత్రోచ్చారణలతో హోమం కొనసాగింది. ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, నిత్య ఆరాధన, సేవాకాలం, బాలభోగం, తీర్థప్రసాద గోష్ఠి, చతుస్థానార్చనలు, మూలమంత్ర హోమములు తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి.

లక్ష్యం దిశగా అడుగులు

- డీసిల్టింగ్ పనులకు నిధులు మంజూరు
- ఖైరతాబాద్‌కు రూ.93 లక్షలు, జూబ్లీహిల్స్‌కు రూ.1.78 కోట్లు
- మే నెలాఖరుకు పూర్తి చేసేలా ప్రారంభమైన పనులు
- ప్రీ-మాన్సూన్ కార్యాచరణ సిద్ధం చేసిన అధికారులు



ఫిలింనగర్‌లోని ఎంజీనగర్ నాలాలో నిండిపోయిన డీ సిల్టింగ్

బంజారాహిల్స్: వర్షాకాల కార్యాచరణ ప్రణాళికను జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధం చేశారు. వర్షాకాలానికి ముందే నాలాల్లో నుంచి డీసిల్టింగ్ తొలగించే ప్రీ-మాన్సూన్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. మే నెలాఖరు వరకు నాలాల్లో బురద, వ్యర్థాలను తొలగించి వానాకాలంలో వరద నీరు తేలిగ్గా ముందుకు సాగేలా ప్రణాళికలు రూపొందించి ఈ మేరకు డీసిల్టింగ్ పనులకు నిధులు మంజూరు చేశారు. ఈ పనులను ఎప్పటికప్పుడు ఆయా సర్కిళ్ల ఇంజినీర్లు పర్యవేక్షించనున్నారు. ఖైరతాబాద్ సర్కిల్-17, జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో రెండు నెలల పాటు నాలాల్లో నుంచి బురద, మట్టి, వ్యర్థాలు తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించే ప్రణాళికలు కూడా రూపొందించారు. ప్రతి సంవత్సరం ఈ రెండు సర్కిళ్ల పరిధిలో మార్చి మొదటి వారం నుంచే డీ సిల్టింగ్ పనులు ప్రారంభిస్తారు. ప్రధాన నాలాల్లో నుంచి సిల్ట్ తొలగించడం ద్వారా వరదనీటికి అడ్డంకులు తొలగించాలని నిర్ణయించారు.

– ఖైరతాబాద్ సర్కిల్-17 పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో డీ సిల్టింగ్ పనులకు రూ.93 లక్షలు విడుదలైనట్లు డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి వెల్లడించారు.

- ఈ నాలుగు డివిజన్ల పరిధిలో 26 కిలో మీటర్ల మేర చిన్నా, మధ్య, పెద్ద నాలాలు ఉండగా వీటిల్లో డీ సిల్టింగ్ పనులు ప్రారంభమయ్యాయి.
- మే నెలాఖరులోపు పూర్తిగా నాలాల్లో సిల్ట్ తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- సర్కిల్ పరిధిలో మేజర్, మైనర్ నాలాలు 40 వరకు ఉండగా, ఇందులో కారంపూడి బస్తీ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు బల్కాపూర్ నాలా అతి పెద్దది.
- సోమాజిగూడ, ఖైరతాబాద్‌లలో అతి పెద్ద నాలాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం 17,00 క్యూబిక్ మెట్రిక్ టన్నుల సిల్ట్‌ను నాలాల్లో నుంచి తొలగిస్తున్నారు.
- జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో నాలాల్లో నుంచి సిల్ట్‌ను తొలగించేందుకు ప్రీ-మాన్సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రూ.1.78 కోట్లు మంజూరయ్యాయని డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తెలిపారు.
- సర్కిల్ పరిధిలో 19.86 కిలో మీటర్ల పొడవులో నాలాలు విస్తరించి ఉన్నాయి. నాలాల్లో నుంచి డీ సిల్టింగ్ తొలగించేందుకు మే నెలాఖరు లక్ష్యంగా పెట్టుకున్నారు.

– సర్కిల్ పరిధిలో వెస్టిన్ ప్లాజా ఓయూ కాలనీ నుంచి లిమ్రా కేఫ్ గోల్కొండ వరకు అతిపెద్ద బల్కాపూర్ నాలా మూడున్నర కిలోమీటర్ల పొడవులో ఉంటుంది. ప్రతి సంవత్సరం ప్రీ-మాన్సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చిన్న, మధ్య తరగతి, అతి పెద్ద నాలాల్లో నుంచి 423 క్యూబిక్ మెట్రిక్ టన్నుల డీ సిల్ట్‌ను తొలగిస్తున్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఇండో అమెరికన్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో సోమవారం బంజారాహిల్స్ రోడ్డు నంబర్-7లోని ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహించగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. జీవనశైలిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆయన సూచించారు. ఇప్పటి నుంచే ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఇండో అమెరికన్ బీఎస్సీ నర్సింగ్ ఐదో సెమిస్టర్ విద్యార్థులు, కాలేజీ లెక్చరర్లు పల్లవి, షారోన్, అనూజ పాల్గొని విద్యార్థులకు ఆహారపు అలవాట్లపై అవగాహన కలిగించారు. పర్సనల్ హైజీన్, ప్రివెన్షన్ ఆఫ్ కేన్సర్, లైఫ్‌స్టైల్ మాడిఫికేషన్ తదితర అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంపై దృష్టి పెట్టి చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం లక్ష్మీకాంత్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న జేఐసీ సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు

బంజారాహిల్స్: హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్(హోటా)-జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జేఐసీ) టెన్నిస్ నేషనల్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో విజేతలకు జూబ్లీహిల్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, జేఐసీ ప్రెసిడెంట్ కే.సురేందర్ రెడ్డి, సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రవీణ్‌రెడ్డి, హోటా ప్రెసిడెంట్ నంద్యాల నర్సింహారెడ్డి తదితరులు బహుమతులు ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా పలువురు క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. కార్తీక్‌రాజు, శాంతికుమార్, అరుణ్‌కుమార్, బోస్‌కిరణ్, మధుసూదన్ లింగా, కేవీఎస్ మూర్తి, ఆర్‌ఎన్ రమేష్, మెహర్ ప్రకాష్, షెట్టు, శ్యాం, సిద్దార్థ, తేజస్వి, అనిరుధ్, నిఖిల్, అరుణ్‌కుమార్, వాహిద్, సాంబశివారెడ్డి తదితరులు ట్రోఫీలు అందుకున్నారు. పోటీలకు జేఐసీ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సందర్భంగా కిలారు రాజేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు జేఐసీ వేదికగా నిలవడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. క్రీడాకారులకు చక్కని ఏర్పాట్లు చేయడం జరిగిందని, అంతర్జాతీయ ప్రమాణాలతో టెన్నిస్ కోర్టులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అనాథ పిల్లలకు అండగా నిలవాలి



ఫిలింనగర్‌లో లవింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అనాథాశ్రమం ప్రారంభోత్సవంలో నిర్మాత సి.కళ్యాణ్

- నిర్మాత సి.కళ్యాణ్

ఫిలింనగర్: అనాథ ఆశ్రమాలకు అండగా నిలవడంతో పాటు అనాథ బాల, బాలికలకు వారి ఎదుగుదలలో వారి చదువుల కోసం వారి ఉపాధి అవకాశాలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ప్రముఖ సినీ నిర్మాత సి.కళ్యాణ్ కోరారు. ఫిలింనగర్‌లో లవింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ అనాథాశ్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలను ఆదరించాలని, వారిని ప్రోత్సహించి చదివిస్తే సమాజానికి మంచి జరుగుతుందని అన్నారు. అనాథ ఆశ్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బి.పీటర్ పాల్గొన్నారు.

పోలీసు విధులను అడ్డుకున్న వ్యక్తిపై కేసు నమోదు

ఫిలింనగర్: నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులు రాగా వారి కళ్లుగప్పి పరారైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఓ కేసులో భాగంగా అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎన్.వెంకన్న కానిస్టేబుల్ రాఘవేందర్‌తో కలిసి టోలిచౌకి అరవింద్‌నగర్‌కు వచ్చాడు. మహ్మద్ మాజిద్ అనే నిందితుడు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసులో పరారీలో ఉండగా ఇంట్లో ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ వెంకన్న అక్కడికి వచ్చాడు. అదే సమయంలో మాజిద్ సోదరుడు జావీద్ పోలీసుల వద్దకు వచ్చి తన సోదరుడిని బైక్‌పై తీసుకువస్తానంటూ పోలీసులకు చెప్పి ఇంట్లోకి వెళ్లాడు. అయితే మాజిద్ అప్పటికే ఇంటి వెనుక నుంచి తప్పించుకున్నాడు. తన సోదరుడు ఇంట్లో లేడని, ఏమి చేసుకుంటారో చేసుకోండంటూ జావిద్ పోలీసుల విధులకు అడ్డు తగిలాడు. ఆదివారం ఎలా వస్తారంటూ నిలదీశాడు. తాను అడ్వకేట్‌నని, మీ అంతు చూస్తానంటూ పోలీసులను బెదిరించాడు. తమ విధులను అడ్డుకోవడమే కాకుండా నిందితుడైన మాజిద్‌ను పథకం ప్రకారం తప్పించడంలో జావిద్ కీలకపాత్ర పోషించాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఐ వెంకన్న ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జావిద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్: ఆపరేషన్ రోప్‌లో భాగంగా జూబ్లీహిల్స్ పోలీసులు సోమవారం ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-92లోని లోటస్‌పాండ్ రోడ్డులో సుమారు 10 వరకు ఆక్రమణలు తొలగించారు. కొంతకాలంగా లోటస్ పాండ్‌ను ఆనుకుని పెద్ద ఎత్తున ఆక్రమణలు ఏర్పాటయ్యాయి. ఫిర్యాదులు రావడంతో వీటిని తొలగించినట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

మహిళ వంటింటికే పరిమితం కాదు



ఆలీస్‌ను సన్మానిస్తున్న డివిజన్ మహిళలు, యువతులు

వెంగళరావునగర్: సమాజం ఎంతో ముందుకు సాగుతోందని, మహిళ కేవలం వంటింటికే పరిమితం కాదనే విషయాన్ని ప్రతి మహిళ గ్రహించాలని బీఆర్ఎస్ డివిజన్ సీనియర్ నాయకురాలు జింకా ఆలీస్ తెలిపారు. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో మహిళా దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్‌కు చెందిన పలువురు మహిళా నేతలు, యువతులు ఆమెను సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళ అంటే గృహిణి అనే భావనకు ఇకనైనా స్వస్తి పలకాలని పేర్కొన్నారు. మహిళలు తమలోని నైపుణ్యాన్ని వెలికితీసి సత్తాచాటాలని సూచించారు.

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టకండి

సనత్‌నగర్: ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకుంటూ పొట్టచేసుకునే నిరుపేదలను ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. రాంగోపాల్‌పేట, నల్లగుట్ట తదితర ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకుంటున్న వారు సోమవారం ఎమ్మెల్యే తలసానిని వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు. ఎన్నో సంవత్సరాల నుంచి అక్కడే వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇప్పుడు అద్దెలు పెంచుతామని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి తప్ప, అసలు వ్యాపారాలే చేసుకోకుండా ప్రయత్నించడం తగదన్నారు. అసలే వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు షాపుల అద్దెలను పెంచాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాలు



రహమత్‌నగర్: బోరబండ సైట్-2 ఎస్ఆర్ఆర్‌పురంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయ 17 వార్షికోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్వామివారికి 108 కలశాలతో అభిషేకాలు, దీపారాధన, అన్న ప్రసాదం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ వనజ లక్ష్మణ్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త లక్ష్మణ్‌గౌడ్, కమిటీ సభ్యులు బాలకృష్ణ, కాశీరాం, విజయ్, సోమనారాయణ, సోమేష్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో డోపోత్సవం

సనత్‌నగర్: ఈఎస్ఐ సమీపంలోని శ్రీవిజయలక్ష్మీ దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సనత్‌నగర్ మోడల్‌కాలనీలో సోమవారం సాయంత్రం డోపోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విజయలక్ష్మీ ఆలయం నుంచి స్వామి వారిని ఊరేగింపుగా సుందర్‌నగర్ మీదుగా మోడల్‌కాలనీకి తీసుకువచ్చారు. కాలనీ మహిళలు దీపాలు, కోలాట ప్రదర్శనలతో స్వామి వారి ఊరేగింపునకు స్వాగతం పలికారు. అనంతరం దేవాలయానికి అర్చక, సిబ్బంది నిర్వహించిన భక్తిపూర్వక నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.



స్వామివారికి సామూహికంగా హారతులు ఇస్తున్న బాలికలు..

ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మధురానగర్ కాలనీ నేతలు

వెంగళరావునగర్: డివిజన్‌లోని సమస్యలను సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరిస్తామని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి స్పందన లభించింది. ముఖ్యంగా మధురానగర్ కాలనీకి చెందిన అసోసియేషన్ నేతలు కాలనీలోని సమస్యలను తెలియజేశారు. కాలనీలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఫుత్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించుకున్నారని, దాంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వీధి దీపాలు వెలగడం లేదని అనేకమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. కాలనీవాసులు కొంతమంది ప్రధాన వీధుల్లో కుక్కలకు భోజనం ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, ద్విచక్ర వాహనదారులు, వృద్ధులపై కుక్కలు దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. దాదాపు 60 వరకు హాస్టల్స్ ఉన్నాయని, వీటిలో అనేక మందికి కనీసం లైసెన్స్ కూడా లేవని, సంబంధిత శాఖ అధికారులకు ఇవన్నీ తెలిసి కూడా పట్టించుకోవడం లేదని డిప్యూటీ కమిషనర్‌కు తెలిపారు. రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ డివిజన్లలో అనుమతులు లేని నిర్మాణాలు పెరిగిపోతున్నాయని, టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయా డివిజన్లకు చెందిన నేతలు పేర్కొన్నారు. పన్ను వసూళ్ల వ్యవహారంలో అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని రహమత్‌నగర్, ఎర్రగడ్డ ప్రాంత ప్రజలు ఆరోపించారు. స్పందించిన ఉప కమిషనర్ అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తామన్నారు. ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నేతలు కోడె సాంబశివరావు, హనుమంతరావు, గంగారెడ్డి, రాజేంద్రప్రసాద్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం డీఈఈ రామచంద్రరాజు, ఏఎంసీలు బాల్‌రాజ్, యాదగిరి, న్యాక్ ఇంజినీర్ మౌనిక శర్మ, శానిటేషన్ సూపర్‌వైజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వారంలో 10 వేల టన్నుల పండ్ల విక్రయాలు

కేజీపై రూ.20 నుంచి 30 వరకు పెరుగుదల

సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ మాసం ప్రారంభమై వారం రోజులు పూర్తి అయ్యాయి. వారం వ్యవధి లోనే నగరంలో 10 వేల టన్నుల పండ్ల అమ్మకాలు సాగాయి. ప్రతి ఏటా రంజాన్ మాసంలో పండ్ల విక్రయాలు ఎక్కువగానే జరుగుతాయి. ఏటా రంజాన్ నెల ప్రారంభంలో సుమారు 5 వేల టన్నుల వరకు పండ్ల విక్రయాలు జరుగుతాయి. కానీ, ఈసారి దాదాపు రెండింతలు ఎక్కువ జరిగాయని వ్యాపారులు అంటున్నారు. దీనికి కారణం సోషల్ మీడియానే. ఇఫ్తార్ సమయంలో ఇతర వంటకాలు, ప్రత్యేకంగా పిండి వంటకాలకు బదులుగా పండ్లు తింటే ఆరోగ్యానికి మంచిదనే ప్రచారం జరగడమే. ఉపవాసాల విడిచే సమయంలో అన్ని రకాల పండ్లు తింటే శరీరంలో నీటి కొరత తగ్గదని ప్రచారం జరగడంతో ఎక్కువగా పండ్లు ఆరగిస్తున్నారు. దీంతో వినియోగదారులతో మార్కెట్లు కిలకిటలాడుతున్నాయి. ఈసారి ప్రత్యేకంగా విదేశీ పండ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే హోల్‌సేల్‌లో అన్ని రకాల పండ్ల ధరలు తక్కువగా ఉన్నా.. రిటైల్ మార్కెట్ మాత్రం ప్రతి కేజీపై 20–30 రూపాయలు పెంచి విక్రయిస్తున్నారు.

సరోజినీదేవి ఆసుపత్రిలో 'గ్లకోమా వీక్'



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

గోల్కొండ: గ్లకోమా వ్యాధి అత్యంత ప్రమాదకరమైందని, దీన్ని సకాలంలో గుర్తిస్తే కంటిచూపును కాపాడుకోవచ్చని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సోమవారం మెహిదీపట్నంలోని సరోజినీదేవి కంటి ఆసుపత్రిలో వరల్డ్ గ్లకోమా వీక్ నిర్వహించారు. దీనిని రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా చుంగ్తోతో కలిసి ప్రారంభించారు. అనంతరం సరోజినీదేవి ఆసుపత్రి నుంచి మాసబ్‌ట్యాంక్ వరకు నిర్వహించిన గ్లకోమా వాక్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే సరోజినీదేవి కంటి ఆసుపత్రి అత్యున్నత ప్రమాణాలు, ఆధునిక పరికరాలతో కంటి వ్యాధులకు చికిత్సలు చేస్తోందన్నారు. క్రిస్టినా చుంగ్తో మాట్లాడుతూ గ్లకోమా వీక్ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మోదీని, ఆర్ఎంవోలు డాక్టర్ ఇబ్రహీం, డాక్టర్ నీరజతోపాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



జీహెచ్ఎంసీ ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

లక్డీకాపూల్: ప్రజావాణిలో వచ్చిన సమస్యలపై సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో 79 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 49, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు మూడు చొప్పున, యు.సి.డి., హెల్త్, ఫైనాన్స్ విభాగాలకు రెండు చొప్పున, జోనల్ ఆఫీస్(కూకట్ పల్లి), శానిటేషన్, ఎలక్ట్రికల్, లేక్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయి. ఫోన్ ఇన్ ద్వారా రెండు ఫిర్యాదులు వచ్చాయి. బల్దియా పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 108 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గిరిజన సంస్కృతి

గన్‌ఫౌండ్రీ: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేలా ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం ఎంతో సంతోషకరమని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ చిత్రకారుడు డీఎం అర్జున్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలు, పండుగలు అనే అంశంపై రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవుల్లో నివసించే మహిళల సంస్కృతిని, ఆచారాలను, పండుగలను తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఇలాంటి ఎగ్జిబిషన్లను రాబోయే రోజుల్లో మరిన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ సూర్య ధనుంజయ్, విమలక్క, వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో వెన్నెల గద్దర్, సూర్య ధనుంజయ్, విమలక్క తదితరులు

'క్రమ'బద్ధకం!

బాలారిష్టాలు దాటని ఎల్ఆర్ఎస్

- సాంకేతిక సమస్యలతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు
- ఓపెన్ స్పేస్ చార్జీల్లో గందరగోళం
- ఒకే చోట వివిధ రకాల ఓపెన్ స్పేస్ చార్జీలు
- హెచ్ఎండీఏ కాల్‌సెంటర్ నుంచి స్పందన లేదంటున్న దరఖాస్తుదారులు



సాక్షి, సిటీబ్యూరో: 'ఇదిగో ఎల్ఆర్ఎస్...అదిగో ఎల్ఆర్ఎస్' అంటూ ఏడాది కాలంగా సాగదీస్తున్న అక్రమ స్థలాల క్రమబద్ధీకరణ పథకం ఇప్పటికీ సాంకేతిక చిక్కుల్లోనే కొట్టుమిట్టాడుతోంది. ఒక అడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కి అన్నట్లుగా ఈ పథకం నత్తనడకన సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలోనే ఎల్ఆర్ఎస్‌ల అనుమతికి చర్యలు చేపట్టారు. కానీ ఎన్నికల కారణంగా అప్పట్లో ఫైళ్ల పరిష్కారం వాయిదా పడింది. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మరోసారి ఈ పథకాన్ని పునరుద్ధరించారు. కానీ హెచ్ఎండీఏలో సిబ్బంది కొరత, సాంకేతికంగా ఎదురయ్యే సమస్యల దృష్ట్యా పెద్దగా పురోగతి లేకుండా పోయింది. న్యాక్ అనే సంస్థ నుంచి కొంతమంది నిపుణులను కూడా తాత్కాలిక ప్రాతిపదికన నియమించారు. దీంతో ఫైళ్ల పరిశీలన, షార్ట్‌ఫాల్స్ గుర్తింపులో కొంత కదలిక వచ్చింది. హెచ్ఎండీఏ పరిధిలోని ఘట్‌కేసర్, మేడ్చల్, శంకర్‌పల్లి, శంషాబాద్ తదితర జోన్‌లలో 2020లో రూ.1000 చొప్పున ఫీజు చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవాళ్లు సుమారు 3.44 లక్షల మందికి పైగా ఉన్నారు. వాటిలో కొన్ని ఫైళ్లను పరిశీలించి స్థలాల యజమానులకు నోటీసులు కూడా ఇచ్చారు. కొన్ని చోట్ల ఒకస్థాయిలో స్పందన లభించింది. నిబంధనల మేరకు ఫీజులు చెల్లించి స్థలాలను క్రమబద్ధీకరించుకున్నారు. ఈ ప్రక్రియ గాడిలో పడుతున్న తరుణంలోనే ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దించింది. దీంతో ఎల్ఆర్ఎస్‌పైన మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి. తాజాగా ఈ పథకాన్ని ప్రభుత్వం మరోసారి కదిలించింది. మార్చి నెలాఖరు వరకు ఫీజులో 25 శాతం తగ్గింపునివ్వనున్నట్లు ప్రకటించింది.

హైడ్రా రాకతో మార్పులు....

మొదటి నుంచి హెచ్ఎండీఏ అధికారులే క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎల్ఆర్ఎస్ ఇచ్చేవారు. ఈ క్రమంలో చెరువులు, బఫర్‌జోన్‌లు, శిఖం భూములలోని ప్లాట్‌లకు కూడా కొందరు అధికారులు ఎల్ఆర్ఎస్‌కు పచ్చజెండా ఊపినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ నిబంధనలను మార్చారు. ఈ మేరకు హెచ్ఎండీఏ, రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా పరిశీలించిన తరువాతనే ఎల్ఆర్ఎస్ ఇవ్వాలని నిర్ణయించారు. మూడు విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థలాలు నివాస యోగ్యమైన జోన్‌లలోనే ఉన్నాయని నిర్ధారించిన తరువాత మాత్రమే ఎల్ఆర్ఎస్ అందజేయవలసి ఉంటుంది. భవిష్యత్‌లో నిర్మాణదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవనాలను నిర్మించుకొనేందుకు అవకాశం లభిస్తుందని అధికారులు భావించారు. ఈ మేరకు హెచ్ఎండీఏ పరిధిలోని 7 జిల్లాల్లో ఉన్న గ్రామపంచాయతీల్లోని లే అవుట్‌లకు ఎల్ఆర్ఎస్‌లు ఇచ్చేందుకు హెచ్ఎండీఏ అధికారులు నీటిపారుదల, రెవెన్యూ విభాగాల సహకారంతో పనిచేయాల్సి ఉంది. కానీ హెచ్ఎండీఏ పరిధిలోని 3.44 లక్షల దరఖాస్తుల్లో పరిష్కరించినవి చాలా తక్కువగానే ఉన్నాయి.

ఓపెన్ స్పేస్ చార్జీల్లో గందరగోళం

కందుకూరు మండలం పులిమామిడి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన ప్లాట్ ఎల్ఆర్ఎస్ కోసం 2020 లో రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా ఆయన రెగ్యులరైజేషన్ కోసం సంప్రదించగా 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు రూ.1,05,000 చెల్లించాలంటూ నోటీస్ వచ్చింది. ఇది ఆ స్థలం రెగ్యులరైజేషన్ చార్జీ రూ.50,167.68 కంటే ఎక్కువ కావడం గమనార్హం. అదే ఊళ్లో పక్కన ఉన్న మరో స్థలానికి ఓపెన్ స్పేస్ చార్జీలు కేవలం రూ.3,507 చొప్పున వచ్చాయి. మరో చోట రూ.14,056 గా నమోదైంది. ఇలా ఒకే ఊళ్లో ఒకే చోట రకరకాలుగా ఓపెన్ స్పేస్ చార్జీలు నమోదు కావడం వల్ల దరఖాస్తుదారులు తీవ్రమైన గందరగోళానికి గురవుతున్నారు.

స్పందన అంతంత మాత్రమే

మరోవైపు ఎల్ఆర్ఎస్‌పైన వ్యక్తమయ్యే వివిధ రకాల సందేహాల కోసం హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్ 18005998838 నెంబర్‌కు ఫోన్ చేస్తే సరైన స్పందన లభించడం లేదని పలువురు దరఖాస్తుదారులు విస్మయం వ్యక్తం చేశారు.

అధిక నూనె గింజల దిగుబడిపై అవగాహన



నూనె గింజల ప్రదర్శన

ఏజీవర్సిటీ: నూనె గింజల పంటల దిగుబడిపై సోమవారం భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి-నూనె గింజల పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్-ఐఐఓఆర్)లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నూనె గింజల పంటల్లో కొత్త వంగడాలు, నూతన ఆవిష్కరణలు, సేవ ఆధారిత సస్య యాజమాన్య పద్ధతులు, కొత్త బయో ఫర్టిలైజర్, విత్తన శుద్ధి అవసరమైన బయో పాలిమర్ వంటి ఆవిష్కరణలపై చర్చించారు. ఈ సమ్మేళనంలో విత్తనోత్పత్తి, విత్తనాభివృద్ధి, ప్రాసెసింగ్, బయో ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, దేశవ్యాప్తంగా పేరెన్నికగన్న 47 పరిశ్రమలు, వాటి అనుబంధ సంస్థలు, అంకుర సంస్థల నుంచి 70 సంస్థల ప్రతినిధులు, ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు, యువ అంకుర సంస్థ యజమానులు పాల్గొన్నారు. అధిక దిగుబడిని ఇచ్చే హైబ్రీడ్ రకాలపై అవగాహన కల్పించారు. ఐసీఏఆర్-ఐఐఓఆర్‌లో అభివృద్ధి చేసిన పలు ఉత్పత్తులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌కేవీవీ గ్వాలియర్ పూర్వ ఉప కులపతి డాక్టర్ ఎస్.కె.రావు, ఐఐఓఆర్ డైరెక్టర్ ఆర్.కె.మాథుర్, డాక్టర్ ఆర్.డి.ప్రసాద్, ఐసీఏఆర్ డైరెక్టర్ సత్యతారా సత్యవతి, ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజారెడ్డి, కె.ఎస్.వర ప్రసాద్, కె.ఆర్‌కె.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహబంధానికి వేదికగా ఇఫ్తార్ విందులు



ఇఫ్తార్ విందులో ఏసీపీలు ఎస్.ఎన్.జావిద్, సయ్యద్ ఫయాజ్, చంద్రశేఖర్

గోల్కొండ: ప్రజల స్నేహబంధానికి ఇఫ్తార్ విందులు వేదికగా నిలుస్తున్నాయని సికింద్రాబాద్ రైల్వేస్ ఏసీపీ సయ్యద్ నయిముద్దీన్ జావిద్ అన్నారు. సోమవారం తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టోలిచౌకీలోని కార్యాలయంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..యువకులు తమలోని నాయకత్వ పటిమను తెలపడానికి ఇఫ్తార్ విందులు నిర్వహిస్తుండగా..ఉద్యోగులు తమ మధ్య ఉన్న అనుబంధాన్ని తెలపడానికి నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ అకాడమీ ఏసీపీ చంద్రశేఖర్, గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, టీఎఫ్‌సీఓ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్, ఎంజేపీ డైరీ ప్రొడెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ గౌస్ తదితరులున్నారు.

నానో ఆధారిత వ్యవ'సాయానికి' ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో హెచ్‌సీయూ వీసీ బీజే రావు, బయోఫ్యాక్టర్ సీఈఓ ఎల్ఎన్‌రెడ్డి తదితరులు

పరస్పర సహకారానికి హెచ్‌సీయూ, బయో ఫ్యాక్టర్ నిర్ణయం

రాయదుర్గం: వ్యవసాయ రంగంలో నూతన పరిజ్ఞానాన్ని మరింత వినియోగించేలా, పరస్పరం సహకరించుకునేవిధంగా బయోఫ్యాక్టర్ సంస్థ–హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. సోమవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఈ ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించారు. నానో టెక్నాలజీ ద్వారా వ్యవసాయాన్ని మరింత శాస్త్రీయంగా అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన ఈ ఒప్పందంపై రెండు సంస్థల అధికారులు సంతకాలు చేశారు. ఈ ఒప్పందంపై హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగ్, బయోఫ్యాక్టర్ సంస్థ సీఈఓ డాక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా కొత్త నానోకణాల అభివృద్ధి, వివిధ రంగాలకు అనువైన వినూత్న నానోకణాల రూపకల్పనకు పరిశోధన చేయడమే లక్ష్యంగా సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వ్యవసాయం, పౌల్ట్రీ, ఫిషరీస్‌లో నానో టెక్నాలజీ వినియోగంపై బయోఫ్యాక్టర్‌లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తారు. హెచ్‌సీయూ నానో టెక్నాలజీ ల్యాబ్‌లో శాస్త్రవేత్తల శిక్షణకు ఇచ్చేందుకు చర్యలు చేపడతారు. బయోఫ్యాక్టర్ సీఈఓ డాక్టర్ ఎల్ఎన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను శక్తివంతం చేయడానికి, ప్రపంచ ఆహార భద్రతను మెరుగు పరిచేందుకు నానో టెక్నాలజీ కీలకమన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ పరిశోధన విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ సాబత్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ దిబాకర్ దాస్, ప్రొఫెసర్ దిబాకర్‌దాస్, రెండు సంస్థల అధికారులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అద్భుత పురోగతి

సీమెట్ వ్యవస్థాపక దినోత్సవాల్లో డాక్టర్ శివదాను పిళ్లై



మాట్లాడుతున్న బ్రహ్మోస్ ఏరోస్పేస్ వ్యవస్థాపక సీఈఓ అండ్ ఎండీ డాక్టర్ శివదాను పిళ్లై

కుషాయిగూడ: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం అద్భుత పురోగతిని సాధిస్తోందని బ్రహ్మోస్ ఏరోస్పేస్ వ్యవస్థాపక సీఈఓ అండ్ ఎండీ డాక్టర్ ఎ.శివదాను పిళ్లై అన్నారు. చర్లపల్లి పారిశ్రామిక వాడలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ(సీమెట్) 35వ వ్యవస్థాపక దినోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో సీమెట్ పాత్ర కీలకమన్నారు. రీసైక్లింగ్ టెక్నాలజీని పారిశ్రామికవేత్తలకు బదలాయిస్తున్న సీమెట్ శాస్త్రవేత్తల తీరు అభినందనీయమన్నారు. డీఎంఆర్ఎల్ డైరెక్టర్ డాక్టర్ బాలమురళీకృష్ణన్ మాట్లాడుతూ సీమెట్ తయారు చేసే హఫ్నియం, స్పాంజ్, ఇతర పదార్థాలు రాకెట్ నాజిల్ తయారీలో కీలకంగా ఉంటాయని చెప్పారు. దేశంలో ఈ లోహాన్ని తయారు చేసిన ఘనత సీ మెట్‌కే దక్కుతుందన్నారు. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియాలపై భారత ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి పరిశోధనలు సాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రూప్ కోఆర్డినేటర్ సునీతవర్మ, సీ మెట్ డైరక్టర్ డాక్టర్ ఆర్ రతీష్, డాక్టర్ రాజేశ్‌కుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ప్రతినిధులు

మందకృష్ణ రాజీనామా చేయాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

కాచిగూడ: ఎమ్మార్పీఎస్‌కు మంద కృష్ణమాదిగ రాజీనామా చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టం చేయడానికి సిద్ధంగా ఉన్న సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా ఆంధ్ర, తెలంగాణ మాదిగ సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ ఇచ్చి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని రాజీనామా చేయాలనే నైతిక హక్కు మంద కృష్ణకు లేదన్నారు. మాదిగలకు 9 శాతం కోటా వస్తుంటే జీర్ణించుకోలేని మందకృష్ణ మాల ఉపకులాలతో కలిసి వర్గీకరణను అడ్డుకోవాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృపాకర్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మోసపూరితమైన మాదిగ ఉద్యమం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పేర పోగు వెంకటేశ్వరరావు, దండు వీరయ్య, మేరీ మాదిగ, సతీష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జీఎమ్మార్‌కు ఉత్తమ ఎయిర్‌పోర్టు అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: జీఎమ్మార్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) నిర్వహించిన ఎయిర్‌పోర్ట్ సర్వీస్ క్వాలిటీ(ఏఎస్‌క్యూ) సర్వేలో ప్రతిష్ఠాత్మక గౌరవం లభించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 2024 సంవత్సరానికి '15 నుంచి 25 మిలియన్ ప్రయాణికుల వార్షిక సామర్థ్యం(ఎంపీపీఏ) విభాగంలో ఉత్తమ ఎయిర్‌పోర్ట్ అవార్డు లభించింది. ఎయిర్‌పోర్ట్ సర్వీస్ క్వాలిటీ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ప్రయాణికుల సంతృప్తిని అంచనా వేసేందుకు దీన్ని రూపొందించారు. విమానాశ్రయం నుంచి లభించే వివిధ రకాల సేవలపై 30కిపైగా అంశాలను ప్రామాణికంగా తీసుకొని రియల్–టైమ్ సర్వేల ద్వారా ప్రయాణికుల అభిప్రాయాలను సేకరిస్తారు. ఈ అవార్డు లభించడం పట్ల జీహెచ్ఐఏఎల్ సీఈవో ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులకు అందిస్తున్న అత్యున్నతమైన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తూ వినూత్న విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది తమ అందరి విజయమని చెప్పారు. ప్రయాణికులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలను అందజేయనున్నట్లు తెలిపారు.

న్యాయవాదులకు సర్కారు అండగా ఉండాలి

- ఉప ముఖ్యమంత్రికి టీపీసీసీ లీగల్ సెల్ వినతి



భట్టివిక్రమార్కను సన్మానిస్తున్న టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, ఇతర సభ్యులు

సిటీ కోర్టులు: న్యాయవాదులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలవాలని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు, ఇతర చట్టపరమైన సమస్యలపై చర్చించారు. అనంతరం అశోక్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి న్యాయవాదికి ప్రభుత్వం రూ.5 లక్షల వైద్య బీమా కల్పించాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు స్టైపండ్ అందజేయాలని, అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంజయ్ కుమార్, తిరుపతి వర్మ, మోమిన్ రోషన్ జమీర్ సాహెబ్, హైదరాబాద్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ కిషన్ రాజ్ చౌహాన్, వి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ జేఏసీ అధ్యక్షుడు దత్తాత్రేయ అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ దత్తాత్రేయను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు వ్యతిరేకంగా దత్తాత్రేయ మాట్లాడినందుకు ఆయనతోపాటు మరో 10 మంది విద్యార్థులను అరెస్ట్ చేసి ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమావేశంలో మధు, పెద్దమ్మ రమేష్, శ్యామ్, రామకృష్ణ, శ్రీకాంత్, అనిల్, ప్రజాపతి, రఘు, దయాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



డబ్బింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ దశాబ్ది ఉత్సవాల్లో నారాయణమూర్తి తదితరులు

ముగిసిన డబ్బింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఉత్సవాలు

బంజారాహిల్స్: డబ్బింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ దశాబ్ది ఉత్సవాలు ముగిశాయి. ఈ మేరకు సోమవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో అత్యంత వైభవంగా వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.నారాయణమూర్తి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, లేబర్ కమిషనర్ గంగాధర్, తెలుగు టీవీ ఫెడరేషన్ అధ్యక్షుడు రాకేష్, కోశాధికారి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా 10 ఏళ్లల్లో డబ్బింగ్ ఆర్టిస్టుల ప్రస్థానాన్ని గుర్తుచేసేవిధంగా సావనీర్‌ని ఆవిష్కరించారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ డబ్బింగ్ యూనియన్ అనేది ఇంత దృఢంగా ఉండటం చాలా గొప్ప విషయమన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్‌కు ప్రభుత్వం తరఫున సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు నాని, డబ్బింగ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ అధ్యక్షుడు ఆర్‌సీఎం రాజు, కార్యదర్శి వరమ, కోశాధికారి వీవీఎస్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

- మంజీరా ఫేజ్–2లో భారీ లీకేజీకి మరమ్మతులు
- లీకేజీ ఘటనపై ఎండీ అశోక్ రెడ్డి జూమ్ మీటింగ్



మంజీరా పైప్‌లైన్‌కు మరమ్మతు చేపడుతున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్–2, 1,500 ఎంఎం దయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు ఓల్డ్ బాంబే హైవేలోని మొఘల్ రెస్టారెంట్ వద్ద ఏర్పడ్డ భారీ లీకేజీకి జలమండలి మరమ్మతు చేపట్టింది. సోమవారం పంపింగ్ మెయిన్ లీకేజీ ఘటనపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతు పనులపై తాజా పరిస్థితిని, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్, ట్రాన్స్‌మిషన్ అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. లీకేజీ వల్ల నీటి సరఫరాలో అంతరాయం కలిగిన ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని సూచించారు. సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మరమ్మతులను సమీక్షించాలని జలమండలి ఈడీకి సూచించారు. ఈ మేరకు ఈడీ మయాంక్ మిట్టల్ మరమ్మతులను క్షేత్ర స్థాయిలో గంట గంటకు అధికారులతో సమీక్షిస్తున్నారు. సత్వరమే పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరణకు అవసరమైతే మరిన్ని గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఈడీ ఆదేశించారు. పనులను వేగవంతం చేయడానికి మైక్రో లెవల్లో ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన సూచించారు.

ఏఐకి ప్రకృతి వైపరీత్యాలను పసిగట్టే సామర్థ్యం



జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

ఉప్పల్: ప్రకృతి వైపరీత్యాలను సైతం ముందుగా పసిగట్టగలిగే సామర్థ్యం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ఉందని, భవిష్యత్తు అంతా ఏఐదేనని టెక్సాస్ యూనివర్సిటి ప్రొఫెసర్, ఎన్‌జీఆర్ఐ మాజీ డైరెక్టర్ ప్రొ.మృణాల్ కె.సేన్ అన్నారు. రోజువారీ పనులతోపాటు ఎంతో కీలకమైన జియో సైంటిఫిక్ ఫీల్డ్‌లో ఏఐ ప్రధాన పాత్ర పోషించడం గొప్ప పరిణామన్నారు. జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ(ఎన్‌జీఆర్ఐ)లో సోమవారం 'ఏఐ అండ్ ఎంఎల్ జియోఫిజికల్ డెటా'అనే అంశంపై నిర్వహించిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై యువ సైంటిస్టులకు ఏఐ గొప్పతనాన్ని, పనితీరును వివరించారు. అనంతరం చీఫ్ సైంటిస్టు డాక్టర్ అజయ్ మంగాలిక్, పెన్ స్టేట్ యూనివర్సిటీ డా. సంజయ్ శ్రీనివాసన్, డా. కళాచంద్ మాట్లాడుతూ ఎలాంటి క్రిటికల్ సమస్యలైనా సరే ఏఐతో పరిష్కరించగలుగుతున్నామని పేర్కొన్నారు. ఎన్‌జీఆర్ఐ సంస్థ కూడా ఏఐ సేవలను వినియోగించుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఎం.ఓజా, డా. మహంక్ సింగ్ చౌహాన్, డా. కళ్యాణ నెట్టి, ఎన్‌జీఆర్ఐ చీఫ్ సైంటిస్టు దేవేందర్ కుమార్‌లతో పాటు దేశం అన్ని ప్రాంతాల నుంచి 50కిపైగా సైంటిస్టులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, మంగళవారం, 11, మార్చి, 2025

జర పైలం.. మరి..

నగరంలో మొదలైన వేసవి హడావుడి

సంరక్షణకు సిద్ధమైన నగరవాసులు

గ్యాడ్జెట్లు మొదలు దుస్తులు, వాహనాల వరకూ ప్రత్యేకంగా

యేటా వినూత్నంగా మారుతున్న ట్రెండ్స్‌ పై విశ్లేషణ

చూస్తుండగానే వేసవికాలం వచ్చేసింది.. ఓ వైపు అప్పుడే మండుతున్న ఎండలు, మరో వైపు పరిశ్రమలు, వాహనాలు, ఏసీల నుంచి వెలువడే కాలుష్యం. వెరసి హైదరాబాద్‌ నగరంలో ఎప్పటిలానే సమ్మర్‌ ఎఫెక్ట్‌ కొనసాగనుంది. గతేడాది ఇదే మార్చ్‌ నెల్లో అత్యధికంగా 47.2 డిగ్రీ సెంటీగ్రేడ్‌ల ఎండలతో ఇబ్బందులకు గురిచేసింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా మండే ఎండల నుంచి రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్నారు పర్యావరణ, ఆరోగ్య నిపుణులు. వేసవిలో ముఖ్యంగా ముసలివారు, చిన్నారులు అధిక సంఖ్యలో మృత్యువాత పడుతుండటం, ఎలాంటి వేసవి సంరక్షణా తీసుకోకుండా వివిధ కారణాలతో బయటకు వెళ్లే వారు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఈ సందర్భంగా వేసవి నుంచి సంరక్షణను అందించే ప్రాథమిక పద్ధతులు, విధానాల గురించి పలు జాగ్రత్తలు.. - సాక్షి, సిటీబ్యూరో



ఇంటి భోజనమే మేలు..

వేసవిలో కాసింతైనా ఆహార నియమాలను పాటించాలి. జంక్‌ఫుడ్‌, డీప్‌ ఫ్రైడ్‌ ఫుడ్‌, అధిక మసాలాలతో తయారు చేసిన ఆహారాన్ని తగ్గించాలి. తగినంత నీటిని తాగడంతో పాటు వాటర్‌మెలన్‌, షర్బత్‌ విభిన్న రకాల పండ్ల రసాలను తీసుకోవడం వల్ల శరీరం చల్లబడుతుంది. దీంతో పాటు అవసరమైన ప్రోటీన్లను, మినరల్స్‌ను అందిస్తాయి. సాధ్యమైనంత వరకూ ఇంటి భోజనానికే ప్రాధాన్యమివ్వాలని ప్రముఖ న్యూట్రిషనిస్ట్‌ హజర్‌ తెలిపారు. ఉక్కపోత, వేడి ఎక్కువగా ఉంటే కూలర్లు, ఏసీలను ఉపయోగించాలి. ఇంటీరియర్‌ ప్లాంట్స్‌ పెంచుకోవడం వల్ల వాతావరణం చల్లగా ఉంటుంది.



వేసవిలో ప్రతి ఒక్కరికీ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ నియమం నీరు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీహైడ్రేషన్‌కు గురికాకుండా హైడ్రేట్‌ అవ్వాలని ఆరోగ్య నిపుణులు, ఫిట్నెస్‌ ఫ్రీక్స్‌ సూచిస్తున్నారు. శరీరంలో తగినంత నీటి శాతం ఉన్నంత వరకూ వేసవిలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవచ్చు. లేని పక్షంలో ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్యులు చెబుతున్నారు. నగర జీవితంలో తప్పని సరిగా మూడు, మూడున్నర లీటర్ల నీటిని, ఇతర పానియాలను తీసుకోవాల్సిన అవసరముంది. బయటికెళుతున్న సమయంలో వాటర్‌బాటిల్‌ మర్చిపోవద్దు.

వడదెబ్బకు దూరంగా..

వేసవిలో ప్రధాన సమస్య వడదెబ్బ. ప్రతి ఏడాదీ వడదెబ్బతో ప్రాణాలు కోల్పోతున్న వారు కోకొల్లలు. వీలైనంత వరకూ ఎండలకు దూరంగా ఉండటం, ముఖ్యమైన పనులను ఉదయం, సాయంత్రాల్లో చేసుకోవడం ఉత్తమం. తరచూ ఎండలో ఉండేవారు తగినంత విశ్రాంతి, ఫ్యాన్‌ లేదా ఏసీలో ఉండేలా చూసుకోవాలి. ఎక్కువ దూరం వాహనాలపై ప్రయాణాలు చేసేవారు కళ్లద్దాలు, హెల్మెట్‌, టోపీలు తప్పనిసరిగా వినియోగించాలి. చిన్నారులైతే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

సైక్లింగ్‌.. జర భద్రం..

ఈ మధ్య కాలంలో ఈజీ మొబిలిటీలో భాగంగా నగరంలో సైక్లిస్టుల సంఖ్య భారీగా పెరిగింది. అంతేకాకుండా స్కూల్స్‌, గ్రౌండ్స్‌కు వెళ్లే వారు సైతం సైకిల్‌ వినియోగిస్తున్నారు. సమ్మర్‌లో సైక్లిస్టులు జాగ్రత్తగా ఉండాలి. మధ్య మధ్యలో విశ్రాంతి, పానియాలు తీసుకోవడం శ్రేయస్కరం. మధ్యాహ్న సమయాల్లో సైక్లింగ్‌ అంత మంచిది కాదని నగరానికి చెందిన సైక్లింగ్‌ రైడర్‌ రవి తెలిపారు.



కాసింత స్మార్ట్‌గా..



నగర జీవనంలో గ్యాడ్జెట్‌లు సర్వసాధారణం. ఈ నేపథ్యంలో వాతావరణ ఉష్ణోగ్రతలను ఎప్పటికప్పుడు తెలియజేసే స్మార్ట్‌ వాచ్‌లు, ఇతర గ్యాడ్జెట్‌లు వాడటం మంచిది. శరీర ఉష్ణోగ్రత, గుండెపనితీరు, బ్లడ్‌ ప్రెజర్‌, న్యూట్రిషన్‌ తదితర అంశాలను తెలియజేసే గ్యాడ్జెట్‌లు, యాప్‌లు వినియోగించడం మేలని ఈ తరం మెడికల్‌ నిపుణులు సూచిస్తున్నారు.

నో బ్లాక్‌..

ఫ్యాషన్‌ పేరుతో ఎండాకాలంలో నల్లటి దుస్తులు ధరించడానికి స్వస్తి చెప్పాలి. నల్లటి దుస్తులు, వస్తువులు, వాహనాలు అధిక వేడిని గ్రహించి ఆరోగ్యానికి హాని చేస్తాయి. దీనికి పరిష్కారంగా తెల్లటి దుస్తులు లేదా లైట్‌ కలర్స్‌ వేసుకుంటే మేలు. ముఖ్యంగా కాటన్‌ దుస్తులు, మెత్తని స్వభావం కలవి ఉత్తమ ఎంపిక.

సన్‌స్క్రీన్‌తో మేలు..

మండే ఎండలకు కళ్లద్దాలు, తలకు టోపీ, హ్యాండ్‌బ్యాగ్‌లో కర్చీఫ్‌ లేదా న్యాప్‌కిన్స్‌ తప్పనిసరి. ఎండవేడి నుంచి చర్మ సంరక్షణకు సన్‌స్క్రీన్‌ లోషన్స్‌, కూలింగ్‌ లోషన్స్‌ వాడటం కాస్త ఉపశమనాన్ని అందిస్తుంది. ఈ సమ్మర్‌ ముగిసేంత వరకూ ఫ్యాషన్‌ వేర్‌లో ప్రత్యేక శైలిని ఎంపిక చేసుకోవాలి. సమ్మర్‌ కేర్‌ కోసం మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చిన గార్మెంట్స్‌ ఎంచుకోవాలి. చెమటను గ్రహించే దుస్తులు ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడతాయి.





వేడికి దూరంగా ఈవీ..

ఈ మధ్య కాలంలో నగరంలో ఎలక్ట్రిక్‌ వాహనల సంఖ్య భారీగా పెరిగింది. ఈ వాహనదారులు చాలా జాగ్రత్తగా ఉండలాని నిపుణులు చెబుతున్నారు. ఈవీ వాహనాలను ఎండలో పార్క్‌ చేయకుండా నీడలో ఉంచాలి. ఎక్కువ దూరం ప్రయాణించినప్పుడు బ్యాటరీ, ఇంజిన్‌ వేడి కాకుండా మధ్యలో విరామం ఇవ్వాలి. లేదంటే అధిక వేడికి బ్యాటరీలు పేలిపోయే ప్రమాదముంది. టైర్లు అరిగిపోయిన వాహనాలు మరింత జాగ్రత్తగా నడపాలి. టైర్లు వ్యాకోచించడం, రోడ్డుపై డాంబర్‌ కరగడం వంటి కారణాలతో వాహనాలు స్కిడ్‌ అయ్యే ప్రమాదం ఉంది.

మాదాపూర్‌లో 14న హోలీనేషన్‌-2025

పోస్టర్‌ ఆవిష్కరణలో నటి నిషా సింగ్‌ రాజ్‌పుత్‌



బంజారాహిల్స్‌: మాదాపూర్‌లో ఈ నెల 14వ తేదీన రంగుల కేళి హోలీ వేడుకలను అత్యంత అట్టహాసంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం.36లోని టాబెర్నా క్లబ్‌ వేదికగా సోమవారం జరిగిన కార్యక్రమంలో టాలీవుడ్‌ నటి నిషా సింగ్‌ రాజ్‌పుత్‌తో కలిసి నిర్వాహకులు హోలీ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని రౌనాక్స్‌ ఏఐఏఏ మ్యాన్‌మేడ్‌ హిల్స్‌లో జరిగే కలర్‌ఫుల్‌ ఈవెంట్‌కి ప్రముఖ సినీ నటి కాజల్‌ అగర్వాల్‌ ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారని తెలిపారు. ఈ బిగ్గెస్ట్‌ హోలీనేషన్‌–2025 10వ ఎడిషన్‌ స్టార్‌ స్టడెడ్‌ లైనప్‌ వేడుకలో సుమారు 7 నుండి 8 వేల మంది పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఉత్తేజకరమైన రెయిన్‌ డ్యాన్స్‌ సెటప్‌, అత్యుత్తమ పాపులర్‌ ఈటలు, బాలీవుడ్‌ మ్యూజిక్‌, వాటర్‌ గన్లు, రంగురంగుల స్ప్లాష్‌లతో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌ మోడల్స్‌ ఎండీ వంశీ పల్లె, ఆల్వేస్‌ ఈవెంట్స్‌ సుమంత్‌ నాని, రాజు తబెర్ల తదితరులు పాల్గొన్నారు.



మహిళల విజయాలను గౌరవించాలి

సినీ దర్శకురాలు నందినీరెడ్డి, పద్మశ్రీ డాక్టర్‌ మంజుల అనగాని



బంజారాహిల్స్‌: మహిళల బలాన్ని, సాధనలను గౌరవిస్తూ బంజారాహిల్స్‌లోని కేర్‌ ఆస్పత్రిలో ఆసక్తికర ప్రదర్శనలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. సరోజినీనాయుడు, సానియామీర్జా, సుస్మితా సేన్‌, పీవీ సింధు వంటి మహిళలకు అంకితమైన ప్రదర్శనలను ఆవిష్కరించారు. అదేవిధంగా తెలంగాణ గ్రామీణ మహిళల గౌరవార్థం 10 అడుగుల తెలంగాణ గ్రామీణ మహిళ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా సినీ దర్శకురాలు నందినీరెడ్డి, పద్మశ్రీ డాక్టర్‌ మంజుల అనగాని, నార్త్‌జోన్‌ డీసీపీ రష్మీ పెరుమాళ్‌, ప్రముఖ అంకాలజిస్ట్‌ డాక్టర్‌ ప్రజ్ఞా చిగురుపాటి, సీనియర్‌ జర్నలిస్ట్‌ స్వప్న, ఆస్పత్రి జోనల్‌ చీఫ్‌ ఆపరేటింగ్‌ ఆఫీసర్‌ బిజూనాయర్‌ పాల్గొన్నారు. మహిళల విజయాలను గౌరవించడంతో పాటు సమాన అవకాశాలు కల్పించే వాతావరణాన్ని రూపొందించడం ముఖ్యమని, ఈ తరహా కార్యక్రమాలు మార్పుకు దారి చూపుతాయని నందినీరెడ్డి తెలిపారు.

ఉపవాసాల్లో నో నోటిఫికేషన్స్‌..

- 'ఫాస్టింగ్‌ మోడ్‌' ఫీచర్‌ను ప్రారంభించిన స్విగ్గీ
- రంజాన్‌, నవరాత్రి వంటి ఉపవాస సమయాల్లో నో ఫుడ్‌ నోటిఫికేషన్స్‌

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత రంజాన్‌ మాసంతో పాటు నవరాత్రి వంటి ఇతర ఉపవాస సమయాల్లో కస్టమర్లను నోటిఫికేషన్లతో ఇబ్బంది పెట్టకుండా 'ఫాస్టింగ్‌ మోడ్‌' అనే వినూత్న ఎంపికను 'స్విగ్గీ' ప్రారంభించింది. ఇది ఉపవాస సమయాల్లో వినియోగదారులు ఫుడ్‌ డెలివరీ నోటిఫికేషన్‌లను పాజ్‌ చేయడానికి అనుమతించే సరికొత్త ఫీచర్‌. ఈ ఫీచర్‌ ఉపవాస సమయాల్లో జోక్యం చేసుకోదు. వినియోగదారులకు అవసరమైనప్పుడు మాత్రం ఈ వేదిక సిద్ధంగా ఉంచుతుంది. వినియోగదారులు యాప్‌ నుంచి ఈ సెట్టింగ్‌ను సులభంగా ప్రారంభించవచ్చు. అవసరం లేని సమయంలో నిలిపివేయవచ్చు. వినియోగదారులు స్విగ్గీ యాప్‌ నుండి ఎప్పుడైనా ఫాస్టింగ్‌ మోడ్‌ను ఆన్‌ లేదా ఆఫ్‌ చేయవచ్చు. యాక్టివేట్‌ చేసిన తర్వాత.. రంజాన్‌ సందర్భంగా ఉపవాసం ఉండే వినియోగదారులు అందరికీ సహర్‌ (తెల్లవారుజామున), సాయంత్రం 4 గంటల మధ్య ఫుడ్‌ నోటిఫికేషన్‌లు పాజ్‌ చేయబడతాయి. వినియోగదారుల ఉపవాస సమయం పూర్తయిన తరువాత నోటిఫికేషన్‌లు తిరిగి ప్రారంభమవుతాయి. మనం ఆన్‌ చేయాల్సిన అవసరం లేదు. స్విగ్గీ ఆహార పదార్థాలపై 50 శాతం వరకూ తగ్గింపుతో రుచికరమైన వంటకాలు, ప్రత్యేక రంజాన్‌ భోజనాలను అందిస్తుందని యాజమాన్యం తెలిపింది. ఈ ఫీచర్‌ను సంస్థ సృజనాత్మక భాగస్వామి టాలెంటెడ్‌ రూపొందించింది.

మానవ సేవే.. మాధవ సేవగా..

మానవ సేవే మాధవ సేవ.. అనే నానుడిని ఒంటబట్టించుకున్నారు.. గోల్కొండ ప్రాంతానికి చెందిన మహ్మద్‌ నజీబ్‌. సరిగ్గా అదే తలంపుతో గత 18 ఏళ్లుగా పేదల కోసం నిరంతరాయం శ్రమిస్తూ.. నిరుపేదలకు, వలస కూలీలకు సేవలందిస్తున్నారు. తాను స్థాపించిన తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్‌ ఆర్గనైజేషన్‌ ద్వారా పేదల కుటుంబాల్లో తలెత్తే తగాదాలను పరిష్కరిస్తూ వారికి కౌన్సిలింగ్‌ ఇస్తున్నారు. మరోవైపు వలస కూలీలు, నిరుపేదలకు వైద్య సహాయం, నిత్యావసరాలు అందజేస్తున్నాడు. కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో మహ్మద్‌ నజీబ్‌ షేక్‌పేట ఫ్రెండ్స్‌ కాలనీలో ప్రత్యేక వంటశాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఉపాధి కోల్పోయిన వారికి ప్రతినిత్యం వంద కిలోల బియ్యంతో వంట చేస్తూ లేబర్‌ అడ్డాలు, ఆస్పత్రుల వద్ద భోజన ప్యాకెట్లు అందించారు. - గోల్కొండ

- పేదల సేవలో 15 ఏళ్లుగా
- అన్నదానాలు, కౌన్సిలింగ్‌ కేంద్రాలు నిర్వహిస్తూ
- ప్రజల మన్ననలు పొందుతున్న మహ్మద్‌ నజీబ్‌





చిన్ననాటి స్నేహితులతో కలిసి గోల్కొండలోని షేక్‌ పేటలో నిరంతరాయంగా నిరుపేదలకు సేవలందిస్తున్నాడు మహ్మద్‌ నజీబ్‌. స్థానిక ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను గుర్తిస్తూ.. తనకు తోచిన సహాయాన్ని అందిస్తున్నాడు. స్థానికులకు, పేదలకు అండగా నిలుస్తున్నాడు. ముఖ్యంగా లేబర్‌ అడ్డాల వద్ద ఒక్కపూట భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నాడు. కాలనీలో ప్రత్యేకంగా ఓ వంట శాలను సైతం ఏర్పాటు చేశాడు. కరోనా కారణంగా ఉపాధి కోల్పోయిన వారికి ప్రతినిత్యం భోజన ప్యాకెట్లను అందించాడు. పలువురు బాధితులకు ఆక్సిజన్‌ సిలిండర్లను ఉచితంగా అందించాడు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యుల సహాయంతో స్థానికులకు వైద్య సేవలను అందించాడు.

కుటుంబ కలహాలు చక్కబెడుతూ..

టోలిచౌకీలోని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్‌ ప్రధాన కార్యాలయంలో స్థానికుల కుటుంబ తగాదాలు, భార్యా భర్తల కలహాలకు పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. దాదాపు 15 యేళ్లగా చిన్న చిన్న తగాదాలతో విడాకులు తీసుకోడానికి తనవద్దకు వచ్చిన వారికి కౌన్సిలింగ్‌ ఇప్పించి వారి కలహాలకు పరిష్కారం చూపుతున్నాడు. ఇప్పటి వరకూ దాదాపు 350 మంది దంపతులకు కౌన్సిలింగ్‌ ఇప్పించి, వారిని ఏకం చేస్తున్నాడు. మరోవైపు నిరుపేద విద్యార్థులకు ఆర్గనైజేషన్‌ ద్వారా తామున్నామంటూ అండగా ఉంటూ ఫీజులకు తన వంతు సహాయం అందిస్తున్నాడు. చదువు మధ్యలో వదిలేసిన వారిని చదువు కొనసాగించేలా ప్రోత్సహిస్తున్నాడు. ప్రతి యేటా తాము 8 మంది నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకుంటున్నామని, పదో తరగతి వరకూ ఉచితంగా చదువుకునేలా వారికి అండగా నిలబడుతున్నాడు. ప్రస్తుతం ఆర్గనైజేషన్‌ కార్యకలాపాలు తెలంగాణ జిల్లాలకు కూడా విస్తృతం చేస్తున్నట్లు నజీబ్‌ తెలిపారు.



వండర్‌చెఫ్‌లో ఆల్‌-ఇన్‌-వన్‌ కిచెన్‌ రోబో

పద్మశ్రీ అవార్డు గ్రహీత చెఫ్‌ సంజీవ్‌ కపూర్‌

గచ్చిబౌలి: దక్షిణ భారత్‌లో వండర్‌చెఫ్‌ ఔట్‌లెట్లను రెట్టింపు చేస్తామని పద్మశ్రీ అవార్డు గ్రహీత చెఫ్‌ సంజీవ్‌ కపూర్‌ తెలిపారు. కొత్తగూడలోని శరత్‌ సిటీ క్యాపిటల్‌ మాల్‌లో వండర్‌చెఫ్‌ ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దక్షిణాది మార్కెట్లో వంట గది వినూత్న పరిష్కారాలను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. వండర్‌చెఫ్‌ బ్రాండ్‌ ఔట్‌లెట్లను రెట్టింపు చేస్తామని, ఇందులో హైదరాబాద్‌ మార్కెట్‌ ముఖ్యమైందని తెలిపారు. వండర్‌ చెఫ్‌ వినూత్న ఆవిష్కరణలతో హోమ్‌ చెఫ్‌లు ఆరోగ్యకరమైన వంటకాలు తయారు చేసుకునేందుకు వీలుంటుందన్నారు. అధునాతన మౌల్డింగ్‌ టెక్నాలజీలో కాస్ట్‌ ఐరన్‌ వంట సామగ్రి 'ఫెర్రో'ని ప్రవేశపెట్టింది. కత్తిరించడం, ఆవిరి చేయడం, సాటింగ్‌, కలపడం, బ్లెండింగ్‌ చేసేందుకు ఆల్‌-ఇన్‌-వన్‌ కిచెన్‌ రోబోలా పనిచేస్తుంది. చెఫ్‌ సంజీవ్‌ కపూర్‌ స్వయంగా క్యురేట్‌ చేసిన 370కి పైగా వంటకాలతో కూడిన గైడ్‌ సహాయంతో స్క్రీన్లపై చూస్తూ హోమ్‌ చెఫ్‌లు వివిధ రకాల వంటలు చేసుకోవచ్చని తెలిపారు.



క్లుప్తంగా...

అబద్ధాల బ్రాండ్ అంబాసిడర్ హరీశ్‌రావు: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యవహరిస్తున్నారని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. 'పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా సభ విజయవంతమైంది. ఆ కడుపు మంటతో కళ్లలో నిప్పులు పోసుకొని అబద్ధాలు వల్లె వేస్తున్నారు' అని విరుచుకుపడ్డారు. మహిళా సంఘాల బ్యాంకు రుణాలకు ప్రజాప్రభుత్వం వడ్డీలు చెల్లించడం లేదన్న హరీశ్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. 'అసెంబ్లీ వేదికగా మీ బండారాన్ని బయటపెడతాం. ఎవరు మహిళా సంక్షేమానికి ఎంత చేశారు అని తేలుస్తాం'అని హెచ్చరించారు. 'ఐదేళ్లలో మహిళా సంఘాలకు రూ.3,485 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. కేవలం రూ.409 కోట్లు చెల్లించారు. హరీశ్‌రావు ఆర్థికమంత్రిగా చివరి మూడేళ్లలో మహిళా సంఘాల వడ్డీల కోసం నయాపైసా చెల్లించలేదు. మీ పాలనలో మీ ఆడబిడ్డ కవిత ఒక్కరే ఎదిగారు. బతుకమ్మ వేడుకలు అయినా, బీసీ ఉద్యమం అయినా, మహిళా ఉద్యమమైనా కవితే హైజాక్ చేశారు' అని సీతక్క ఆరోపించారు.

15 నెలల పాలనలో... రూ. 1.52 లక్షల కోట్ల అప్పు

ఎమ్మెల్సీ కవిత ధ్వజం



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ 7 లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం... 15 నెలల పాలనలో రూ. 1.52 లక్షల కోట్లు అప్పు చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్లకవిత ధ్వజమెత్తారు. ఇన్ని లక్షల కోట్లు ఏం చేశారో చెప్పాలని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర అప్పులు, ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం, ప్రజల పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి గౌరవం లేదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని అబద్ధాలు చెబుతున్నారని, ఇలాంటి వ్యక్తి రాష్ట్రానికి సీఎం కావడం మన దురదృష్టకరమని మండిపడ్డారు. హామీలను అమలు చేయకుండా తప్పించుకోవడానికి సీఎం దొంగ లెక్కలు చెబుతున్నారని ఆమె మండిపడ్డారు. తప్పుడు లెక్కలతో సొంత రాష్ట్రాన్ని అవమానిస్తున్న ముఖ్యమంత్రి వైఖరిని తీవ్రంగా ఖండించారు. బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు చెల్లిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత పెద్దవాళ్లపై ఉందని, పేద వాళ్లపై లేదని అన్నారు. కేసీఆర్ చేసిన అప్పుకు ప్రతీ పైసాకు లెక్క చెబుతామని, మరి 1.50 లక్షల కోట్ల అప్పులకు లెక్క చెబుతారా అని కవిత ప్రశ్నించారు.

తెలంగాణకు కేటాయించండి

మళ్లీ క్యాట్‌ను ఆశ్రయించిన ఐపీఎస్ అభిషేక్ మహంతి



సాక్షి, హైదరాబాద్: స్థానికత ఆధారంగా తనను తెలంగాణకు కేటాయించాలని కోరుతూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్)లో ఐపీఎస్ అభిషేక్ మహంతి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం ట్రిబ్యునల్ విచారణ చేపట్టనుంది. రాష్ట్ర విభజన సమయంలో ఆయన్ను ఏపీకి కేటాయించారు. కేటాయింపుల అంశంపై గతంలో క్యాట్ ఇచ్చిన ఆర్డర్ సాయంతో తెలంగాణలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్ అధికారులు డీజీ అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి వెంటనే ఏపీకి వెళ్లేలా రిలీవ్ చేయాలని ఫిబ్రవరి 21న రాష్ట్ర సర్కారును ఆదేశించింది. దీంతో 22న తెలంగాణ సర్కార్ అంజనీకుమార్, అభిలాష బిస్త్‌ను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తనను తిరిగి తెలంగాణకు కేటాయించాలని కోరుతూ మరోసారి ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు.

ప్రాధాన్య ప్రాజెక్టులకు పెద్దపీట

గడువులోగా వాటిని పూర్తిచేస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ వెల్లడి
- బడ్జెట్‌లో రూ.18,290 కోట్లు కోరిన సాగునీటి శాఖ



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి గడువులోగా పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల బడ్జెట్ ప్రతిపాదనల రూపకల్పనపై సోమవారం సచివాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టును ప్రాధాన్యతగా తీసుకోవాలని, ఎలిమినేటి మాధవరెడ్డి (ఏఎమ్మార్పీ) ప్రాజెక్టు ఐదో పంప్ ఏర్పాటు పనులను సత్వరం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేసి గోదావరి జలాలతో పాలేరు రిజర్వాయర్‌ను నింపాలని సూచించారు. డిండి ఎత్తిపోతల పథకం పరిధిలో చివరి దశకు చేరుకున్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. గృహజ్యోతి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా పౌరసరఫరాలు, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమీక్షలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, నీటిపారుదల శాఖ సలహాదారులు ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర బడ్జెట్ 2025–26లో నీటిపారుదల శాఖకు రూ.26 వేల కోట్లు కేటాయించాలని ఆ శాఖ కోరింది. సమీక్షలో మాత్రం రూ.18,290 కోట్లు కేటాయించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

చివరి వరకు సాగునీరు: మంత్రులు ఉత్తమ్, తుమ్మల

చేతికొచ్చిన యాసంగి పంటలను కాపాడుకోవడం ప్రభుత్వ కర్తవ్యమని, చివరి వరకు సాగునీరు అందించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సోమవారం సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని, పంటలకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సాగునీరు లభించక పంట నష్టం వాటిల్లుతోందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అన్నపూర్ణసాగర్ నుంచి రంగనాయకసాగర్‌కు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేశామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వివరించారు. సమీక్షలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు

- వారెవరో తేల్చుకోండి అంటూ రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు సూచన
- ఓరుగల్లు గడ్డమీదే బీఆర్ఎస్ రజతోత్సవ సభ



మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్ : తెలంగాణ కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులెవరో కూడా తేల్చుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి మాజీమంత్రి హరీశ్‌రావు సూచించారు. గుజరాత్‌లో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో మోదీ కోవర్టులు ఉన్నారని అన్నాడు..దీనికి బలం కలిగిస్తూ రేవంత్‌రెడ్డి.. మోదీ మంచోడు, కిషన్‌రెడ్డి చెడ్డోడు అని ఎందుకు చెప్పారో గమనించాలన్నారు. ఏప్రిల్ 27న ఓరుగల్లు గడ్డపై నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా హరీశ్‌రావు సోమవారం సాయంత్రం మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్ తదితరులతో కలిసి ఉనికిచర్ల, భట్టుపల్లి శివార్లలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు చేసినట్టు ఆరోపిస్తున్న రేవంత్‌రెడ్డి.. నీ సొంత జిల్లా మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో డీకే అరుణను, మల్కాజిగిరిలో ఈటల రాజేందర్‌ను మీరే గెలిపించారా'అని ప్రశ్నించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలే నరేందర్‌రెడ్డి ఓటమికి కారణమయ్యాయన్నారు. రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అమ్ముడుపోయే చరిత్ర నీకు ఉంది అని, పాలన మీద దృష్టి పెట్టాలని, మొన్నటి ఎన్నికల్లో బడే భాయ్‌కి చోటే భాయ్ ఇచ్చిన గిఫ్ట్‌గా అభివర్ణించారు.

ఆ ఇద్దరి విజ్ఞతకే వదిలేస్తున్నా...

'ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నా పొడవు గురించి మాట్లాడారు. పొడవుగా ఉండటం నాకు దేవుడిచ్చిన వరం. నేను వారిలాగా విమర్శించవచ్చు కానీ విలువలతో కూడిన రాజకీయ నాయకుడిగా ఉన్నాను. నోటికి ఏది వస్తే అది మాట్లాడడం సబబు కాదు.. నా ఎత్తు గురించి మాట్లాడి బాడీ షేమింగ్ చేశారు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు.. వారిలా నేను ఎత్తు గురించి మాట్లాడను. అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా.'అని హరీశ్‌రావు అన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా బీఆర్ఎస్ సభ...

14 ఏళ్ల పోరాటం.. పదేళ్ల పాలన మేళవింపే ఏప్రిల్ 27న ఓరుగల్లు గడ్డపై నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని హరీశ్‌రావు అన్నారు. 'పోరాటాలు, త్యాగాలు, తెలంగాణ ఏర్పాటు లక్ష్యంగా ఏర్పడిన బీఆర్ఎస్ 25 సంవత్సరాల యవ్వనదశకు చేరుకుంది. వరంగల్‌కు బీఆర్ఎస్‌కు ఉద్యమాలకు వీడదీయరాని బంధం ఉంది. అందుకే ఇక్కడి నుంచే రజతోత్సవ సభ జరపాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు'అని చెప్పారు.

రైతుల అభిరుచులకు అనుగుణంగా మారినప్పుడే మనుగడ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: రైతుల అభిరుచులు, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మారుతూ వ్యాపారాభివృద్ధి వైపు సాగినప్పుడే మనుగడ సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన టీజీ ఆగ్రోస్, హాకా, గ్రామీణ నీటి పారుదల సంస్థ, సహకార సంస్థ, గిడ్డంగుల సంస్థల ప్రగతిని సమీక్షించారు. కొన్నేళ్లుగా ఆయా సంస్థలు చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన పురోగతిపై ఆరా తీశారు. వ్యవసాయశాఖకు అనుబంధంగా పనిచేస్తున్న కొన్ని కార్పొరేషన్లు ఒకే విధమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, వాటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. వచ్చే నెలరోజుల్లో సదరు సంస్థలన్నీ తాము నిర్వహిస్తున్న కార్యక్రమాలు, భవిష్యత్‌లో చేపట్టబోయే పనుల గురించి, ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై పూర్తిస్థాయి నివేదికతో రావాలని మంత్రి ఆదేశించారు. ఈ నివేదిక ఆధారంగా ఏఏ సంస్థలను కొనసాగించాలో, వేటిని విలీనం చేయాలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. హాకా ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ హాకా ఆధ్వర్యంలో కొత్త వ్యాపార కార్యక్రమాలకు ఈ సంవత్సరం నుంచి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. తెలంగాణ ఆగ్రోస్ సంస్థ గత సంవత్సర కాలంగా నిర్వహించిన కార్యక్రమాలను సంస్థ ఎండీ రాములు వివరించారు.

కూటమి సర్కారు కుట్రలతో యువశక్తి నిర్వీర్యం

- ఏపీలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పేదింటి బిడ్డలకు ఉన్నత విద్య దూరం
- పుస్తెలు తాకట్టు పెట్టి ఫీజు బకాయిలు చెల్లిస్తున్న తల్లులు

సాక్షి, అమరావతి: ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై మీనమేషాలు లెక్కిస్తూ వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. యాజమాన్యం తరగతి గది నుంచి ఎప్పుడు బయటకు గెంటేస్తుందోనన్న అవమాన భారంతోనే విద్యార్థులు కళాశాలలకు వెళ్తున్నారు. కళ్ల ముందే బిడ్డలు పడుతున్న అవస్థలు చూడలేక పేదింటి తల్లిదండ్రులు ఇళ్లు, పొలాలు, పుస్తెలు తాకట్టు పెట్టిమరీ అప్పులు తెచ్చి ఫీజులు చెల్లిస్తున్న దుర్భర పరిస్థితి కనిపిస్తోంది. వాస్తవానికి గడిచిన విద్యా సంవత్సరంలోని చివరి రెండు త్రైమాసికాలకు కలిపి రూ.1,400 కోట్లు, వసతి దీవెన కింద రూ.1,100 కోట్లను జూన్‌లో చెల్లించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఆ నిధులు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమయ్యేవి. కానీ, కూటమి అధికారంలోకి రావడంతో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ఖర్చులను నిలిపివేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రతి త్రైమాసికానికి రూ.700 కోట్ల చొప్పున ఏడాదికి రూ.2,800 కోట్లు చెల్లించాలి. వసతి దీవెనగా ఏప్రిల్‌లో మరో రూ.1,100 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక విద్యా సంవత్సరంలో రూ.3,900 కోట్లు అందించాలి. కానీ, చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసింది మాత్రం రూ.700 కోట్లే. అందులోనూ పూర్తి సొమ్ములు కళాశాలలకు చేరలేదు. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం రూ.3,200 కోట్లు బకాయిలు పెట్టింది. వచ్చే విద్యా సంవత్సరానికి మరో రూ.3,900 కోట్లను కలుపుకొని మొత్తం రూ.7,100 కోట్లు చెల్లించాలి. తాజా బడ్జెట్‌లో మాత్రం రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. వైఎస్ జగన్ అధికారంలో ఉండగా గతంలో టీడీపీ సర్కారు బకాయిపెట్టిన రూ.1,778 కోట్లు సైతం చెల్లించి విద్యార్థులను ఆదుకున్నారు. ఐదేళ్లలో జగనన్న విద్యా దీవెన కింద రూ.12,609.68 కోట్లు, వసతి దీవెన కింద రూ.4275.76 కోట్లు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో వేశారు.

తొలి సంతకానికి విలువేది?

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు దేవుడెరుగు.. ఉన్న కొలువులు ఊడబీకి వలంటీర్లను నడిరోడ్డుపైకి లాగేశారు. రూ.10 వేలు వేతనం ఇస్తామని ఎన్నికల్లో హామీలు గుప్పించి పీఠం ఎక్కిన తర్వాత 2.60 లక్షల మంది వలంటీర్ల జీవితాలను గాలికి వదిలేశారు. మరోవైపు తొలి సంతకం అంటూ సీఎం చంద్రబాబు ఊదరగొట్టిన డీఎస్సీకి 9 నెలలైనా నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను నిలువునా ముంచారు. సుమారు 16,347 పోస్టులను ప్రకటించి.. డిసెంబరు నాటికి భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను సైతం రద్దు చేశారు. ఇక జనవరి వెళ్లిపోయినా జాబ్ కేలండర్ మాత్రం విడుదల కాలేదు. వైఎస్ జగన్ తీసుకొచ్చిన కొత్త వైద్య కళాశాలలను చంద్రబాబు ప్రైవేటు పరం చేస్తూ పేదింటి బిడ్డలకు వైద్య విద్యను దూరం చేస్తున్నారు.

రేపు ఏపీలో కలెక్టరేట్ల వద్ద నిరసనలు

యువత పోరు చేపట్టి... మొద్దు నిద్రపోతున్న కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు మేరకు.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, నిరుద్యోగ భృతి చెల్లించాలంటూ ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

'ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్' యూనిట్ల ఏర్పాటులో తెలంగాణ ముందడుగు

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



సాక్షి, న్యూఢిల్లీ : గత పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటులో తెలంగాణ ముందడుగు వేసిందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. జాతీయ పౌర విమానయాన పాలసీ–2016 ప్రకారం మేక్ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ పథకాలను ప్రమోట్ చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా ఎయిర్‌క్రాఫ్ట్ మాన్యుఫాక్చరింగ్ కాంపోనెంట్ ఏర్పాటుకు ఎవరైనా ముందుకొస్తే వారికి సెజ్ ప్రోత్సాహకాలు అందించేలా కేంద్ర పౌర విమానయాన శాఖ చొరవ తీసుకుంటుందని చెప్పారు. సోమవారం రాజ్యసభలో ఓ ప్రశ్నకు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సమాధానం ఇస్తూ... గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ మాన్యుఫాక్చరింగ్ కాంపోనెంట్ తయారీ విషయంలో ఎంతో చొరవ తీసుకొని పనిచేసిందని అభినందించారు. నూతన మాన్యుఫాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహాయం తీసుకోకుండానే అవసరమైన ప్రోత్సాహకాలు ఇచ్చిందన్నారు. ఇప్పుడు తెలంగాణలో ఆదిబట్ల ఏరోస్పేస్ సెజ్, నాదర్‌గుల్ ఏరో స్పేస్ పార్క్, జీఎంఆర్ ఏరో స్పేస్ సెజ్, అదానీ ఏరోస్పేస్ పార్క్, అదానీ హార్డ్‌వేర్ పార్క్ 1, 2 ల పేర్లతో నాలుగు కంటే ఎక్కువ ఏరో స్పేస్ పార్కులు ఉన్నాయని సభ దృష్టికి తెచ్చారు. ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలు అనేక ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నప్పుడు, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు.



మోదీని కుటుంబ సమేతంగా కలిసిన ఈటల

- ఈటల మనవడికి స్వయంగా చాక్‌లెట్స్ ఇచ్చిన ప్రధాని

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కుటుంబ సమేతంగా కలిశారు. సోమవారం పార్లమెంట్ ఆవరణలోని ప్రధాని కార్యాలయంలో నరేంద్రమోదీతో 10 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈటల కుటుంబ సభ్యులతో ప్రధాని ముచ్చటించారు. ఈటల రాజేందర్ పెద్ద మనవడు రుషాంగ్‌కి ప్రధాని మోదీ స్వయంగా చాక్‌లెట్లు ఇచ్చారు. మోదీతో జరిగిన ఈ భేటీలో ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున, కుమార్తె నీతా, అల్లుడు అనూప్, కుమారుడు ఈటల నితిన్, మేనల్లుడు రాహుల్, ఇద్దరు మనవళ్లు రుషాంగ్, హృదయాంష్ ఉన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు దక్కాలి

- అనర్హులకు ఇళ్లు ఇస్తే ఏ దశలోనైనా రద్దు చేస్తాం: పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని తేలితే.. నిర్మాణం ఏ దశలో ఉన్నా వాటిని రద్దు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గ్రామ సభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జనవరి 26వ తేదీన మోడల్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసిన 562 గ్రామాల్లో గుర్తించిన మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని ఇకపై లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అర్హులను గుర్తించడంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీలైనంత మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు లభించేలా చూడాలని కోరారు. ఇళ్ల మంజూరులో నిరుపేదలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

నెత్తురోడినా పట్టు వదల్లే!

- అంతర్రాష్ట్ర దొంగను పట్టుకోబోయిన కానిస్టేబుల్
- దొంగ దాడిలో 9 చోట్ల తీవ్ర కత్తి గాయాలు
- అయినా వదలని కానిస్టేబుల్ మల్లెల్లి నరేశ్



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ నరేశ్

సత్తుపల్లి: అంతర్రాష్ట్ర దొంగను పట్టుకొనే క్రమంలో తీవ్రంగా గాయపడినా పట్టు వదలకుండా పోరాడాడు ఓ కానిస్టేబుల్. దొంగ దాడిలో శరీరంపై తొమ్మిది పోట్లు పడి నెత్తురోడుతున్నా ఏమాత్రం వెనక్కు తగ్గకుండా ధైర్య సాహసాలతో పోరాడాడు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీసుస్టేషన్‌కు చెందిన ఐడీ పార్టీ కానిస్టేబుల్ మల్లెల్లి నరేశ్ రోజువారీ విధుల్లో భాగంగా సోమవారం సాయంత్రం బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టాడు. ఈ క్రమంలో పలు చోరీ కేసుల్లో పాత నేరస్తుడైన ఏపీలోని ఏలూరు జిల్లా చాట్రాయికి చెందిన తిరువీధుల సురేందర్ కనిపించడంతో అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా అతడు బైక్‌పై పారిపోసాగాడు. దీంతో కానిస్టేబుల్ పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చి మరో బైక్‌పై వెంబడిస్తూ సత్తుపల్లి శివారులో అడ్డగించాడు. సురేందర్ కత్తితో నరేశ్‌పై ఒక్కసారిగా దాడి చేయగా తల, ఎడమ భుజం, ఎడమ చెవితోపాటు పొట్టపై కలిపి 9 చోట్ల గాయాలయ్యాయి. అయినా అతడు దొంగతో పోరాడాడు. ఇంతలో స్థానికులు, పోలీసులు అక్కడికి చేరుకుని కానిస్టేబుల్ నరేశ్‌ను ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుండగా, పోలీసులు మాత్రం ధ్రువీకరించలేదు. సత్తుపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.కే. అయేషా సరీనా ఆస్పత్రికి చేరుకుని కానిస్టేబుల్ నుంచి వివరాలు సేకరించారు. ఏసీపీ రఘు తదితరులు నరేశ్‌ను పరామర్శించారు.

భావోద్వేగాలను కేంద్రం రెచ్చగొడుతోంది: వెస్లీ

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కట్టబెట్టేందుకు పూనుకుంటోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. కార్పొరేట్ దోపిడీ గురించి ఎవరికీ అర్థంకాకుండా ఉండేందుకు మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతూ సమాజంలో చీలికకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. వాస్తవాలను, కార్పొరేట్ దోపిడీని ప్రజలకు వివరించేందుకు పార్టీ కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. సీనియర్ నేత జి. రాములు అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆర్థిక ఇబ్బందులకు కుటుంబం బలి!

- ఫ్యాన్‌కు ఉరి వేసుకుని దంపతుల బలవన్మరణం
- ఇద్దరు పిల్లలకు విషమిచ్చినట్లుగా అనుమానం
- హైదరాబాద్ హబ్సిగూడలో విషాద ఘటన
- మృతుల స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా మొకురాల



చంద్రశేఖర్‌రెడ్డి



కవితారెడ్డి



శ్రీతరెడ్డి



విశ్వంత్‌రెడ్డి

లాలాపేట (హైదరాబాద్): ఆర్థిక ఇబ్బందులకు నలుగురు సభ్యుల కుటుంబం బలైన విషాద సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న భార్యాభర్తలు, అంతకుముందు తమ ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చినట్లుగా అనుమానిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మొకురాలకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి (40), కవితారెడ్డి (35) దంపతులు హబ్సిగూడ మహేశ్వర్‌నగర్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్ సమీపంలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వారికి తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రీతరెడ్డి (13), ఐదవ తరగతి చదువుతున్న విశ్వంత్‌రెడ్డి (10) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి గతంలో నారాయణ కళాశాలలో లెక్చరర్‌గా పని చేశాడు. గత ఆరు నెలల నుంచి ఉద్యోగం లేకపోవడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. సోమవారం రాత్రి సమీపంలో ఉండే బంధువులు ఫోన్ చేస్తే దంపతులు ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చి ఇంటికి రాగా చంద్రశేఖర్‌రెడ్డి, కవితారెడ్డి చెరొక గదిలో సీలింగ్ ఫ్యాన్లకు చున్నీతో ఉరి వేసుకుని కన్పించారు. ఓ గదిలో మంచంపై పిల్లలిద్దరూ చనిపోయి కన్పించారు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఓయూ పోలీసులు, నలుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీత అబిడ్స్‌లోని ఫిట్జీ స్కూల్లో, విశ్వంత్ హబ్సిగూడలోని జాన్సన్ గ్రామర్ స్కూల్లో చదువుతున్నట్లు తెలిసింది.

కేసీఆర్‌ను కొట్టింది నేనే.. గద్దె దింపిందీ నేనే!

▶ మొదటి పేజీ తరువాయి

లేదు. అందుకే వాళ్లు ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. రాష్ట్రానికి ఏమీ జరగొద్దని ఆ పార్టీ నేతలు కోరుకుంటున్నారు. స్పైడర్ సినిమాలో విలన్ తరహాలో రాష్ట్రంలో ఎవరైనా చనిపోతే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు సంబరపడుతూ, తీన్మార్ డ్యాన్సులు చేస్తున్నారు.

యూజ్‌లెస్ ఫెలో మాట్లాడే మాటలు పట్టించుకోవద్దు

కేసీఆర్ పదేళ్లలో చేయలేని పనులు మేము 14 నెలల్లో చేశాం. కాళేశ్వరం, మేడిగడ్డలు లేకుండానే రికార్డు స్థాయిలో పంటలు పండించాం. అయినా రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పి రొయ్యల పులుసు తిన్నోళ్లు ఎవరు? యూజ్‌లెస్ ఫెలో, హౌలేగాడు మాట్లాడే మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. బీజేపీకి హరీశ్‌రావు లొంగిపోయాడు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు కలిసి పని చేయాలని, కాంగ్రెస్‌ను ఓడించాలనే ఉద్దేశంతోనే డబ్బులు పంచి మరీ బీజేపీకి హరీశ్‌రావు ఓట్లు వేయించాడు..' అని రేవంత్ ఆరోపించారు.

నిధులు ఏ రూపంలో వచ్చినా లెక్కబెడదాం

'తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి వచ్చిన నిధులపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చర్చకు సిద్ధం కావాలి. 2014 జూన్ 2 నుంచి పన్నుల రూపంలో తెలంగాణ నుంచి కేంద్రానికి ఎన్ని నిధులు వెళ్లాయి? మళ్లీ కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎన్ని నిధులు తిరిగి వచ్చాయి? ఏ రూపంలో వచ్చినా సరే లెక్కపెడదాం. నేను, మా ఉప ముఖ్యమంత్రి భట్టి వస్తాం. కిషన్‌రెడ్డితో పాటు ఎవరినైనా రమ్మనండి. చర్చిద్దాం. తెలంగాణ నుంచి వెళ్లిన దానికంటే కేంద్రం నుంచి ఒక్క రూపాయి ఎక్కువ వచ్చినా అక్కడే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తా..' అని సీఎం సవాల్ చేశారు.

ఎక్కువ సాగుతోనే నీటికి ఇబ్బందులు

'గత పదేళ్ల కాలంలో కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక మా నడ్డి విరుగుతోంది. అయినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఎప్పుడైనా యాసంగిలో 35–40 లక్షల ఎకరాలు సాగవుతుంది. కానీ ఈసారి రాష్ట్రంలో ఏకంగా 55 లక్షల ఎకరాలు సాగయింది. అందుకే అక్కడక్కడా నీటికి ఇబ్బందులు వస్తున్నాయి. అయినా ఏ రిజర్వాయర్ నుంచి ఏ మేరకు ఎప్పుడు నీళ్లు ఇవ్వాలన్న దానిపై అధికారులు ఎప్పుడో షెడ్యూల్ సిద్ధం చేశారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకున్నాం. మహారాష్ట్ర నుంచి వచ్చే అనుమతులను బట్టి తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మాణం పనులు ఉంటాయి.

రిజల్ట్స్ వేరు.. రిజర్వేషన్లు వేరు

కృష్ణమాదిగ బీజేపీ నేతలు మాట్లాడినట్టు మాట్లాడుతున్నారు. రిజల్ట్స్ వేరు, రిజర్వేషన్లు వేరు. గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలో పేర్కొన్న రూల్ ఆఫ్ రిజర్వేషన్ల మేరకు ఇప్పుడు ఫలితాలు ప్రకటిస్తున్నాం. పాత నిబంధనలను మేము మార్చలేం. కొత్తగా నోటిఫికేషన్లు ఇస్తే అందరికీ న్యాయం చేస్తాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

రియల్ బ్రోకర్లతో రేవంత్ స్కాం

▶ మొదటి పేజీ తరువాయి

అడ్డగోలు ధరలకు అమ్మేందుకు రేవంత్ ముఠా సిద్ధంగా ఉంది. ఎఫ్ఎస్ఐపై ఉమ్మడి ఏపీలో వై.ఎస్. ప్రభుత్వం అవలంబించిన విధానాన్నే బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కొనసాగించింది. గతంలో టీడీఆర్ పద్ధతిలో రూ. వేల కోట్ల విలువచేసే 400 ఎకరాలను జీహెచ్ఎంసీ ప్రజావసరాల కోసం సేకరించింది. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లకుండా పౌరులకు ఉపయోగపడే ఈ విధానాన్ని రేవంత్ అక్రమ సంపాదనకు మార్గంగా ఎంచుకున్నాడు. ఇన్‌సైడ్ ట్రేడింగ్ లాంటి ఈ కుంభకోణంపై ఈడీ, సీబీఐ విచారణ జరిపించాలి'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అవినీతి మార్గాలు తెలిసింది రేవంత్‌కే..

'దేశ చరిత్రలో అవినీతి మార్గంలో డబ్బు సంపాదనకు అత్యధిక మార్గాలు తెలిసింది రేవంత్‌కే. ఆయన పాలనలో ప్రైవేటు దోపిడీ పెరిగి ప్రభుత్వ ఆదాయం తగ్గింది. కేంద్రంతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకోవడానికే రేవంత్ తరచూ ఢిల్లీ వెళ్తున్నాడు. రేవంత్, కిషన్‌రెడ్డి దొంగాట ఆడుతూ జనం దృష్టిని మళ్లించే ప్రయత్నంలో ఉన్నారు. రేవంత్‌ను ఉద్దేశించే కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు'అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఉపఎన్నికల ఉద్దేశంతోనే మండలి ఎన్నికకు దూరం

స్థానికసంస్థల ఎన్నికలు, 10 అసెంబ్లీ స్థానాల్లో ఉపఎన్నికలు వస్తాయనే ఉద్దేశంతోనే శాసనమండలి పట్టభద్రుల స్థానం ఎన్నికకు దూరంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. ఎమ్మెల్యేల బేరసారాలకు అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే రెండో అభ్యర్థిని మండలి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలపలేదని కేటీఆర్ చెప్పారు.

అసెంబ్లీకి కేసీఆర్ హాజరవుతారు

గవర్నర్ ప్రసంగంతోపాటు బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారని కేటీఆర్ తెలిపారు. అయితే ప్రభుత్వంలో ఉన్న వారు మాట్లాడే పిచ్చిమాటలు, పనికిరాని మాటలు, బూతులు వినాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదని ఒక కొడుకుగా, పార్టీ కార్యకర్తగా తన అభిప్రాయమన్నారు. కేసీఆర్ స్థాయికి కాంగ్రెస్ నేతలు, రేవంత్ ఆవగింజంత కూడా సరిపోరని వ్యాఖ్యానించారు.

మళ్లీ ఫార్ములా–ఈ నోటీసులు రావచ్చు..

ఈ నెల 16 నుంచి 27లోగా మళ్లీ తనకు ఫార్ములా–ఈ కేసు పేరిట విచారణ నోటీసులు రావచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. 'ఫార్ములా–ఈ'ని ప్రశ్నిస్తున్న వారు రూ. 200 కోట్లతో రేవంత్ ప్రభుత్వం నిర్వహించే మిస్ వరల్డ్ పోటీలతో హైదరాబాద్‌కు ఏం ఒరుగుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. బయటి దేశాల్లో జరుగుతున్న మరణాలను రేవంత్ తనకు అంటగట్టడం విడ్డూరమని.. తాను కేసీఆర్ అంత మంచి వాడిని కానని వ్యాఖ్యానించారు. బీసీలకు రిజర్వేషన్లపై రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ఆమరణ దీక్ష చేయాలని డిమాండ్ చేశారు.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 11-3-2025



'అక్క' అనే మాటలో ఆప్యాయత మాత్రమే కాదు... 'భద్రత'ను ఇచ్చే 'భరోసా' కూడా ఉంటుంది. చిన్నప్పుడు స్కూల్లో తోటి పిల్లలు ఏడిపిస్తుంటే... 'మా అక్కకు చెబుతాను' అనడం సాధారణం. అవును. అక్క అంటే ఫ్రెండ్ కాని ఫ్రెండ్. ఏ దాపరికాలు లేకుండా మనసులోని మాటను పంచుకునే అమ్మ కాని అమ్మ! ఇంట్లో కుటుంబ సభ్యులు ఉంటారు. వారితో అన్నీ పంచుకుంటారు. ఇంటికి దూరంగా హాస్టల్లో ఉండే ఆడ పిల్లలకు తోడెవరు? చుట్టూ ఎంతోమంది ఉన్నా, వారితో అన్ని విషయాలు పంచుకోలేక 'నేను ఒంటరిని' అనే భావన ఎటైనా దారితీయవచ్చు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల 'పోలీస్ అక్క'కు ప్రాణం పోసింది.

పోలీస్ అక్క
భద్రత.. భరోసా

ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలలో విద్యార్థినులు వేధింపులు, దాడులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది అమ్మాయిలు తమలో తామే కుమిలిపోతూ చివరకు ఆత్మహత్య వరకు వెళ్తున్నారు. ఇలాంటివి నివారించడానికి 'నేనున్నాను' అంటూ ముందుకు వచ్చింది పోలీసు అక్క.



దత్తత తీసుకుంటారు...

ఒక్కో మహిళా కానిస్టేబుల్‌కు ఒక్కో విద్యాలయం, వసతిగృహం బాధ్యతను అప్పగించారు. 'మీరు అక్కడి విద్యార్థులను దత్తత తీసుకున్నట్లు భావించాలి. వారు మీ కుటుంబ సభ్యులే' అని ఒకటికి రెండుసార్లు చెప్పారు. ప్రతి నెలా ఒకటో శనివారం మహిళా కానిస్టేబుళ్లు తమకు అప్పగించిన గురుకులానికి వెళతారు. ఆ రోజంతా అక్కడే ఉంటూ విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తారు. సొంత అక్కలా వారి యోగక్షేమాలు తెలుసుకుంటారు.

సైబర్‌క్రైమ్, ఉమెన్ ట్రాఫికింగ్, 'గుడ్‌టచ్–బ్యాడ్ టచ్, మహిళల భద్రత, చట్టాలు.. మొదలైన విషయాలపై చర్చిస్తారు. రాత్రి పూట అక్కడే బస చేస్తారు. ప్రస్తుతం 18 పాఠశాలలకు 18 మంది మహిళా కానిస్టేబుళ్లను నియమించారు. వీరి పని తీరును ఎస్పీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

అందుకే... పోలీస్ అక్క

ఎక్కడైనా మహిళలకు ఇబ్బందులు, అడ్డంకులు ఉంటూనే ఉంటాయి. చాలామంది మహిళలకు కాస్త భరోసా, కాసింత ప్రోత్సాహం ఇస్తే చాలు దేన్నైనా సాధించగలరు. నిర్మల్ జిల్లాలో ప్రత్యేకంగా విద్యార్థినులకు అండగా నిలవాలనుకున్నాం. ఇందుకోసమే 'పోలీస్ అక్క' కార్యక్రమం చేపట్టాం. ఎన్నోఏళ్లుగా స్టేషన్‌లకే పరిమితమైన మహిళా కానిస్టేబుళ్లు సైతం తాము పోలీసులం అని గర్వపడేలా ప్రత్యక్ష పోలీసింగ్ చేసేలా డ్యూటీలను అప్పగించాం.

– జానకీ షర్మిల, ఎస్పీ, నిర్మల్

ఆ బాధ నుంచే...

ఎస్పీగా నిర్మల్ జిల్లాలోనే తొలి పోస్టింగ్ తీసుకున్న జానకీ షర్మిలకు ఇక్కడి బాసర ట్రిపుల్ ఐటీలో కొందరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం కలచి వేసింది. విద్యార్థులకు అండగా నిలవడానికి, తనవంతుగా ఏదైనా చేయాలని, వారిలో భరోసా నింపాలనీ అనుకున్నారు. స్వయంప్రతిపత్తి కలిగిన ట్రిపుల్‌ఐటీని మూడునెలల పాటు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అప్పటినుంచి విద్యార్థులతో మమేకమవుతూ వారి సమస్యల గురించి తెలుసుకుంటూ పరిష్కారంపై దృష్టి పెట్టారు. ప్రతి సీనియర్ ఒక జూనియర్‌ని గైడ్ చేయాలని సూచించారు. విజేతలుగా నిలిచిన పూర్వ విద్యార్థులు, ట్రెండింగ్ సెలబ్రిటీలు, మోటివేషనల్ స్పీకర్‌లతో సమావేశాలు, క్రీడాపోటీలు నిర్వహించారు. ఇవి విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపాయి. ధైర్యాన్ని ఇచ్చాయి.



పెట్రోలింగ్ బాధ్యతలు...

తనలాగే మహిళా పోలీసులు ప్రత్యక్ష పోలీసింగ్ చేయాలని ఎస్పీ జానకీ షర్మిల నిర్ణయించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోనే తొలిసారి మహిళా కానిస్టేబుళ్లకు ప్రత్యక్ష పోలీసింగ్ బాధ్యతలు అప్పగించారు. కేవలం స్టేషన్‌లో పనులు చేయడానికి, రిసెప్షనిస్టులుగానే పరిమితమైన ఉమెన్ కానిస్టేబుళ్లు ఇక నుంచి వారానికోసారి పెట్రోలింగ్, డయల్ 100, ఎమర్జెన్సీ, డెయిలీ రూట్ చెకింగ్, వాహనాల తనిఖీలాంటి బాధ్యతలను చేపడతారు. పెట్రోలింగ్‌లో తొలిరోజే సత్తా చాటారు. భైంసా మండలం వట్టోలి గ్రామంలో పేకాట రాయుళ్లను పట్టుకున్నారు.

'పోలీసులు ప్రజల్లో కలిసిపోయినప్పుడే... ప్రజలకు భరోసా, భద్రత' అంటారు.

'పోలీసు అక్క'లాంటి వినూత్నమైన కార్యక్రమాలు ఆ మాటకు బలాన్ని ఇస్తాయి.

– రాసం శ్రీధర్, సాక్షి ప్రతినిధి, నిర్మల్


మడిసార్ కట్టు

కలర్ కల్చర్ కట్టుబాట్లు

చీర.. దాన్ని కట్టుకుంటే వచ్చే అందమే వేరు! దాని ముందు ఎన్ని మోడర్న్ డ్రెస్‌లు అయినా దిగదుడుపే.. అవెంత సౌకర్యాన్నిచ్చినా! అందుకే అందం, అనుకూలత రెండిట్లోనూ అన్నితరాలకూ చీర ఆల్ టైమ్ ఫేవరెట్ అండ్ ఫ్యాషన్ కాస్ట్యూమ్‌గా మారింది. అలాంటి మన సంప్రదాయ కట్టుకు ప్రాంతానికో తీరు ఉంది. కొన్నిటికి వాటి వెనుక పర్యావరణహితాలు కారణాలైతే కొన్నిటికి వాతావరణ పరిస్థితులు కారణాలుగా కనపడుతున్నాయి. ఇంకొన్నిటికి భౌగోళిక స్వరూపాలు కారణంగా నిలుస్తున్నాయి. కేరళలో కనిపించే ఆఫ్ వైట్ విత్ గోల్డెన్ బార్డర్ శారీ (ముండు)నే తీసుకుంటే.. ఆ ప్యాటర్న్ రంగుల్లో కనిపించదు. కేవలం క్రీమ్ కలర్‌లోనే కనిపిస్తుంది. కేరళ తీర ప్రాంతం కాబట్టి.. రంగుల అద్దకంతో ఆ నీటిని కలుషితం చేసుకోకూడదనే పర్యావరణ స్పృహతో ముండును పర్మినెంట్‌గా క్రీమ్‌కలర్‌లో ప్యాక్ చేశారు. కూర్గ్‌కి వెళితే అక్కడ కొడగు కట్టు కనిపిస్తుంది. పశ్చిమ కనుమల్లో ఉన్న కూర్గ్‌ను కన్నడాలో కొడగు అని పిలుస్తారు. కొడగు చీర కట్టులో పమిట కుడివైపు, కుచ్చిళ్లు వెనుకవైపు ఉంటాయి. ఇది హిల్ స్టేషన్ కాబట్టి.. నడవడానికి, రోజువారి పనులకు సౌకర్యంగా ఉండేందుకే ఇక్కడి స్త్రీలు చీరను అలా కట్టుకుంటారు. తమిళనాడులోని బ్రాహ్మణ స్త్రీలు మడిసర్ చీరకట్టులో కనిపిస్తారు.

ఇది తొమ్మిది గజాల చీర. ఇదీ అంతే... రోజువారీ పనులకు ఇబ్బంది కలగకుండా ఉంటుంది. తొమ్మిది గజాలంటే గుర్తొచ్చింది.. తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో.. మహారాష్ట్రలోనూ తొమ్మిది గజాల చీరకట్టు కనపడుతుంది. దీనికి గోచీ చీర అనే వ్యవహార నామమూ ఉంది. ఈ చీరకట్టు కనిపించే ప్రాంతంలోని స్త్రీలు (దాదాపుగా) పొలాల్లో పనిచేసేవారే! చేలల్లో దిగి పనిచేయడానికి అనువుగా ఉండేలా ఈ కట్టును కనిపెట్టుకున్నారని శారీ చరిత్రలో కనిపిస్తున్న సాక్ష్యం. గోవాకు వెళితే.. కుప్పీ కట్టు కనిపిస్తుంది. ఇది తొమ్మిది గజాల కట్టుకు ఆధునిక రూపం. మూలాలను మరవకుండా ఆధునికతనూ అలంకరించుకోవాలనే ఆసక్తిగల ఆడవాళ్లకు ఇష్టమైన కట్టు కుప్పీ. ఇలాంటి వైవిధ్యమైన కట్టులతోపాటు దేశం మొత్తమ్మీద 21 రకాల టెక్స్‌టైల్స్ కూడా ఉన్నాయని, ఇక్కడ కనిపించే రంగులకూ మన ప్రకృతి, పండే పంటలే ప్రేరణ, స్ఫూర్తి అని చెబుతారు రచయిత, హిస్టారియన్, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్, శారీ లవర్ మాళవికా సింగ్.



కుప్పీ స్టైల్ కట్టు


కొడగు కట్టు

టిప్స్

మంచి నిద్రకు...

● పడుకునే ముందు గోరువెచ్చని పాలు తాగితే నిద్ర బాగా పడుతుంది. పాలలో ఉండే న్యూరో ట్రాన్స్‌మీటర్స్ మనసుకు ప్రశాంతతను చేకూర్చి.. చక్కగా నిద్రపోయేలా చేస్తాయి. ● రాత్రి భోజనంలో మజ్జిగ తీసుకోవడం ద్వారా కూడా చక్కగా నిద్ర పడుతుంది. మజ్జిగలో ఉండే ట్రిప్టోఫాన్ నిద్రను ప్రేరేపిస్తుంది. ● రాత్రిపూట అరటిపండు తినడం వల్ల శరీరంలో రక్తసరఫరా పెరిగి ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. ఫలితంగా మంచి నిద్ర పోవచ్చు. ● బాదం పప్పు తీసుకోవడం వల్ల కండరాలు, మనసు రిలాక్స్ అవుతాయి. తద్వారా చక్కని నిద్రపోవడానికి అవకాశం ఉంటుంది. ● పడుకునే ముందు చెర్రీపండ్లు తిన్నా లేదా జ్యూస్ తాగినా.. అందులో ఉండే 'మెలటోనిన్' వల్ల చక్కగా నిద్ర పడుతుంది.



సాగుబడి

పూర్వాభాద్ర కార్తె: మార్చి 17 వరకు

సోషల్ మీడియాలో ఇంటిపంటల వైభవం!

● సోషల్ మీడియా సమాచారంతో తామర తంపరగా విస్తరిస్తున్న సేంద్రియ ఇంటిపంటలు / మిద్దెతోటల సాగు
● 411కి పైగా యూట్యూబ్ ఛానళ్లు.. లెక్కకు మిక్కిలిగా వాట్సప్ గ్రూపులు.. ఫేస్‌బుక్‌లో డైలీ సీరియళ్లుగా అనుభవాలు

సేంద్రియ ఇంటిపంటలు / మిద్దె తోటల సాగు ద్వారా పట్టణాలు, నగరాల్లోని గృహస్తులు తమకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలతో పాటు కొంత వరకు పండ్లను కూడా మేడలపైనే సాగు చేసుకుంటున్నారు. వీరి సంఖ్య తెలుగు రాష్ట్రాల్లో లక్షల్లో ఉంటుంది. గత కొద్ది సంవత్సరాల్లో ఇంటిపంటల సాగు సంస్కృతి ఇబ్బడి ముబ్బడిగా విస్తరించింది.



ఇంటిపంటలు / మిద్దె తోట సాగులో ముఖ్య భూమిక మహిళలదే అని చెప్పొచ్చు. అవగాహన పెంచుకొని సంతృప్తికరంగా వంటింటి వ్యర్థాలతో కంపోస్టు ఎరువు తయారు చేసుకొని, ఇంటి పంటల సాగుకు ఆ కంపోస్టును ఉపయోగిస్తున్నారు. తమ కుటుంబం ఆరోగ్యం కోసం సేంద్రియ పంటలను పెంచుతున్న సాగుదారులు వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకుంటున్నారు.

మిద్దె తోటల నిపుణులు, ప్రచారకర్త తుమ్మేటి రఘోత్తమ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో దాదాపు అన్ని జిల్లాల్లోనూ మిద్దె తోట అనుభవాలను పంచుకోవటానికి, సందేహాలను నివృత్తి చేసుకోవటానికి ఉపయోగపడే ఫేస్‌బుక్ పేజీలు, యూట్యూబ్ ఛానళ్లు, వాట్సప్ గ్రూపులు ఏర్పాటయ్యాయి. ఆయన తన మిద్దె తోట అనుభవాలను ఫేస్‌బుక్ వాల్‌పై సంవత్సరాల తరబడి సీరియల్‌గా రాశారు. అంతే కాదు, తోటి మిద్దెతోట సాగుదారులతో కూడా అనుభవాలను రాయించారు. వంద మంది రాసిన అనుభవాలతో రైతునేస్తం ఫౌండేషన్ ద్వారా సంకలనం ప్రచురించటం విశేషం. సుమారు 60కి పైగా వాట్సప్ గ్రూపులను తుమ్మేటి నిర్వహిస్తున్నారు. ఇవి కాకుండా అర్బన్ టెర్రస్ ఫార్మర్స్ చాలా మంది ఎక్కడికక్కడ తమ బంధుమిత్రులతో వాట్సప్ గ్రూప్‌లు లెక్కకు మిక్కిలిగా ప్రారంభించారు.

మిద్దె తోటల సాగుదారులు యూట్యూబ్ వీడియోలను చూసి ఇతర కిచెన్ గార్డెనర్ల అనుభవాలను తెలుసుకుంటూ తమ కిచెన్ గార్డెనింగ్ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకుంటున్నారు. కొందరు ఇంటిపంటల సాగుదారులు మరో ఒకడుగు ముందుకు వేసి తామే సొంతంగా యూట్యూబ్ ఛానళ్లను ప్రారంభించారు.

సీనియర్ మిద్దె తోట సాగుదారు, వాట్సప్ గ్రూప్‌ల నిర్వాహకురాలు లతా కృష్ణమూర్తి అంచనా ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో 411 పైగా యూట్యూబ్ ఛానళ్లు సేంద్రియ మిద్దె తోటలకు సంబంధించిన విషయాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాయి. మిద్దె తోట సాగుదారులు యూట్యూబర్లుగా మారి విస్తృతంగా వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. వీరిలో కొందరు తమ యూట్యూబ్ ఛానళ్లను మానిటైజ్ చేయటం ద్వారా మంచి ఆదాయాన్ని సైతం పొందుతుండటం విశేషం.

– పంతంగి రాంబాబు



ఆర్థిక సాధికారతతో శక్తి వంతంగా ఎదుగుతున్నారు

మిద్దెతోటల పెంపకం ద్వారా మహిళలు, ముఖ్యంగా గృహిణులు, ఇంటికే పరిమితం కాకుండా పది మందిలోకి ధైర్యంగా రాగలుగుతున్నారు. కుటుంబ బాధ్యతలు కొంత తీరిన తర్వాత వారికంటూ కొంత సమయం కేటాయించుకుంటున్నారు. అది కూడా మిద్దెతోటల సాగు ద్వారా ఆరోగ్యకరమైన జీవన శైలిని ఎంచుకుంటున్నారు. రసాయన రహిత ఆహార ప్రాముఖ్యతను గురించి యూట్యూబ్ వీడియోల ద్వారా అందరికీ తెలియజేస్తూ, ఇంటిపంట సాగుదారుల సంఖ్యను పెంచటంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నారు. ఎంతో కొంత ఆదాయాన్ని కూడా పొందుతున్నారు. మరొకరిపై ఆధారపడకుండా ఆర్థిక సాధికారతతో శక్తి వంతంగా ఎదగగలుగుతున్నారు. కొందరు మిద్దెతోటలకు కావలసిన ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇంకొంత మంది మిద్దెతోటలను నిర్మాణంతో పాటు మెయింటెనెన్స్ కూడా చేస్తున్నారు. మిద్దెతోట సాగుదారులుగా, యూట్యూబర్లుగా సాధారణ మహిళలు సాధికారత సాధించడం ఎంతో అభినందించాల్సిన విషయం. మిద్దెతోటల గురించి అవగాహన కల్పించడానికి 411కి పైగా తెలుగు యూట్యూబ్ ఛానెల్స్ రావడం మంచి విషయం. ఇంకా చాలా మంది మిద్దె తోటలు పెంచడానికి ముందుకు రావాలని మహిళా దినోత్సవం సందర్భంగా కోరుకుంటున్నాను.

– లతా కృష్ణమూర్తి (94418 03407), సీనియర్ మిద్దెతోట సాగుదారు, హైదరాబాద్

బోర్ల రీచార్జ్ టెక్నిక్‌పై 22న ఆన్‌లైన్ శిక్షణ

మార్చి 22న అంతర్జాతీయ నీటి దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌కు చెందిన వాటర్ లైవ్‌లిహుడ్ ఫౌండేషన్ (డబ్ల్యు.ఎల్.ఎఫ్.) గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎండిపోయిన / తక్కువ నీరిస్తున్న బోరుబావుల రీచార్జ్ టెక్నిక్‌పై తెలుగులో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనుంది. 22న మధ్యాహ్నం 2.30 గం. నుంచి 5 గం. వరకు జూమ్ ద్వారా శిక్షణ ఇస్తారు. అసలు మీ బోరుకు రీచార్జ్ సామర్థ్యం ఉందా? లేదా? అని విశ్లేషించే పరికరాన్ని కూడా పరిచయం చేస్తారు. ఈ శిక్షణ పొందగోరేవారు తమ పోస్టల్ అడ్రస్ (పిన్ సహా), ఈమెయిల్ (ఉంటే) వివరాలను 94401 94866 నంబరుకు ఎస్.ఎమ్.ఎస్ లేదా వాట్సప్ ద్వారా ఈ నెల 20 లోగా మెసేజ్ పంపవలసిందిగా డబ్ల్యు.ఎల్.ఎఫ్. డైరెక్టర్, సీనియర్ హైడ్రాలజిస్ట్ రామ్‌మోహన్ తెలిపారు.

పుట్టిన గడ్డపై ప్రజలు చిన్న వయసులోనే కేన్సర్, లివర్, గుండె జబ్బు వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడి మృతి చెందటంతో కలవరపాటుకు గురైన ఆమె అమెరికాలో ఆరంకెల సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి ఏడేళ్ల క్రితం పుట్టింటికి తిరిగి వచ్చేశారు. తమ ఏడెకరాల్లో ఐదంచెల ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. యోగా, ప్లాస్టిక్ రహిత జీవన శైలిని తాను ఆచరిరిస్తూ 2017 నుంచి అనేక ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలసి ప్రచారోద్యమం చేపట్టారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థుల్లో ఎకోఫ్రెండ్లీ లివింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఆమె పేరు అక్కిన భవానీ.


ఫుడ్ ఫారెస్ట్‌లో మహిళా రైతు భవాని

సాఫ్ట్‌వేర్ నుంచి పర్మాకల్చర్‌లోకి..!

● అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదలి స్వగ్రామంలో ప్రకృతి సేద్యం చేపట్టిన మహిళ
● 7 ఎకరాల్లో పర్మాకల్చర్ ఫుడ్ ఫారెస్ట్ సాగు
● పర్యావరణ హిత జీవన శైలిపై ప్రచారోద్యమం

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి భవాని స్వగ్రామం. అమెరికాలో పెద్ద జీతంతో కూడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం 17 ఏళ్లకు పైగా చేశారు. తాను పుట్టిన గడ్డ మీద ఆహార, ఆరోగ్య, పర్యావరణ సంక్షోభాన్ని గుర్తించి, ఉద్యోగానికి రాజీనామా చేశారు. మితిమీరిన రసాయనాలతో ఆహారోత్పత్తి చేయటం, ప్లాస్టిక్ వాడకం, అపసవ్యమైన జీవన శైలి మూల కారణాలని గుర్తించారు. అమెరికాలో ఉండగానే ఆమె యోగా నేర్చుకున్నారు. ప్రకృతికి అనుగుణమైన సాధారణ జీవన శైలిని అలవర్చుకున్నారు. మనకు, భూమికి శాశ్వత ప్రయోజనాన్ని కలిగించే పర్మాకల్చర్ వ్యవసాయ పద్ధతిని నేర్చుకున్నారు. గత 50 ఏళ్లుగా పర్మాకల్చర్‌ను ఆచరిస్తున్న వాషింగ్టన్ (అమెరికా)కు చెందిన మైఖేల్ పిలార్స్కి వద్ద శిక్షణ పొందారు. అనేక దేశాలు పర్యటించి ప్రకృతి వనరుల పరిరక్షణ పద్ధతుల్ని భవాని అధ్యయనం చేయటం విశేషం.

భూమి, నీరు, గాలి, అడవి, భూమిపైన జీవ రాశిని పరిరక్షించుకోవటం ద్వారా మనిషి ఆరోగ్యంగా జీవించవచ్చని.. ప్లాస్టిక్, రసాయన రహిత ఆరోగ్యదాయకమైన జీవన శైలి, యోగా, ప్రకృతి సేద్యం ఇందుకు దోహదపడతాయని భవాని మనసా వాచా కర్మణా నమ్ముతున్నారు. రసాయనాల్లేని ఆహారోత్పత్తితో పాటు యోగా తదితర కార్యకలాపాల ద్వారా.. శారీరకంగా/ మానసికంగా/ఆధ్యాత్మికంగా ఆరోగ్యదాయకమైన జీవనశైలిని అనుసరించటం అవసరమని నమ్ముతున్నారు. ఈ భావాలను తమ గ్రామం కేంద్రంగా ప్రచారం చేయటమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం వర్క్‌షాపులు, స్టడీ టూర్లు, ఫామ్ విజిట్లు నిర్వహించటంతో పాటు 'నర్చర్5' పేరుతో వెబ్‌సైట్‌ను, యూట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తున్నారు.


విద్యార్థినులకు ఇంటి వంటల సాగులో శిక్షణ ఇస్తున్న భవాని

స్వగ్రామానికి తిరిగి వచ్చిన తర్వాత 2019లో పాలేకర్ పద్ధతిలో వరి సాగుతో ప్రకృతి సేద్యం ప్రారంభించారు. తదనంతరం తమ కుటుంబానికి చెందిన 7 ఎకరాల భూమిలో ఫైవ్ లేయర్ మోడల్‌లో వక్క ప్రధాన పంటగా పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేపట్టారు. సేంద్రియ పెరటి తోటల సాగు ద్వారా పోషకాహార స్థాయిని పెంపొందించటం.. పండ్ల తొక్కలతో సేంద్రియ ద్రావణాలు తయారు చేసుకొని వినియోగించటం.. గుడ్డ సంచుల వాడకం.. వంటి అంశాలపై గుంటూరు తదితర ప్రాంత పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. కరోనా సమయంలో జిల్లా అధికారులతో కలసి ఆరోగ్యదాయకమైన జీవన శైలి, యోగా తదితరాలపై ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆహారం, ఆదాయం, ఆరోగ్యం అనే ఫార్ములాతో భవానీ ప్రస్తుతం చినతాడేపల్లిలోని ఏడెకరాల 'పొలంలో ప్రకృతి బడి'ని నిర్మించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఆదాయం కోసం వక్క సాగు, ఆహారం కోసం వివిధ రకాల మంచి పండ్లు, ఆరోగ్యం కోసం ఔషధ మొక్కలు ఒకే చోట పెంచే ఫుడ్ ఫారెస్ట్‌ను పెంచుతున్నారు.

వక్క ప్రధాన పంటగా నాటారు. మొదట అరటి, ఆ తర్వాత పసుపు అంతర పంటలుగా వేశారు. అక్కడక్కడా మామిడి, లిచీ, రాంబోశా వంటి పండ్ల మొక్కలను నాటారు. వక్క చెట్లపైకి పాకించడానికి రెండు రకాల మిరియం పాదులను పెంచుతున్నారు. ఒక మడిని ఔషధ మొక్కల కోసం కేటాయించారు. కుంకుడు, షికాకాయ్ మొక్కలు కూడా నాటారు. ఔషధ మొక్కలతో తల నూనె, పండ్ల పొడి, ఎండిన పూలతో టీ పొడి, పసుపు తదితర ఉత్పత్తులను స్వయంగా తయారు చేసి విక్రయిస్తున్నారు. క్షేత్రంలో మొక్కలన్నిటికీ డ్రిప్ పద్ధతిలో నీటిని అందిస్తున్నారు. పొలం చుట్టూ రక్షణ కోసం వెదురు, వాక్కాయ మొక్కలను నాటారు.

మడినే బడిగా మార్చి బాలలు, యువతకు ప్రకృతి పాఠాలు బోధించాలన్నది ఆమె సంకల్పం. నవతరానికి స్ఫూర్తిని కలిగించే వర్క్‌షాపుల నిర్వాహణ ఆమెకు ఇష్టం. భవానీ కృషిని గుర్తించిన హైద్రాబాద్‌లోని 'మేనేజ్' సంస్థ గత ఏడాది ఉమెన్ అగ్రిప్రెన్యూర్ పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది. జీవితానుభవాలతో 'జర్నీ ఆఫ్ మై మిస్టేక్స్' అనే పుస్తకం రాస్తున్నానని ఆమె తెలిపారు.

– యడ్లపల్లి మురళీకృష్ణ, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
11-3-2025

ముంబై 'ఫైనల్' రేసులో...

ఉత్కంఠ పోరులో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపు • నేడు బెంగళూరుపై నెగ్గితే నేరుగా ఫైనల్‌కు


హర్మన్‌ప్రీత్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) లో అగ్రస్థానంతో నేరుగా ఫైనల్ చేరేందుకు ముంబై ఇండియన్స్ జట్టు విజయం దూరంలో నిలిచింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 9 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది. మొదట ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 179 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (33 బంతుల్లో 54; 9 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించింది. తర్వాత గుజరాత్ 20 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. భారతి (25 బంతుల్లో 61; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) ముంబై బౌలర్లపై విరుచుకుపడింది. జెయింట్స్ ఒకదశలో 92 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఓటమికి సిద్ధమవగా... భారతి ధనాధన్ ఆటతో ఆశలు రేపింది. 41 బంతుల్లో 88 పరుగుల సమీకరణం ఆఖరి ఓవర్‌కు వచ్చేసరికి 6 బంతుల్లో 13 పరుగులుగా మారింది. కానీ 20వ ఓవర్ వేసిన హేలీ... తనూజ (10)ను రనౌట్ చేసింది. తర్వాతి బంతికి సిమ్రాన్ (18; 1 ఫోర్, 1 సిక్స్), చివరి బంతికి ప్రియా (1) వికెట్లు తీసి ఆలౌట్ చేసింది. నేడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగే లీగ్ దశ ఆఖరి మ్యాచ్‌లోనూ గెలిస్తే ముంబై 12 పాయింట్లతో పట్టికలో టాప్ లేపి నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. ప్రస్తుతం ముంబై, ఢిల్లీ క్యాపిటల్స్ 10 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నా... మెరుగైన రన్‌రేట్ కారణంగా ఢిల్లీ 'టాప్'లో ఉంది.

అపురూపంగా అక్కున చేర్చుకొని...

భారత క్రికెటర్ల 'చాంపియన్స్' సంబరాలు


ట్రోఫీతో గిల్


భార్య రివాబాతో జడేజా

దుబాయ్: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల చేతుల్లో నాలుగో ఐసీసీ టైటిల్స్...రవీంద్ర జడేజాకు ముచ్చటగా మూడోది. గిల్, పంత్, పాండ్యా, అక్షర్, అర్‌్ష దీప్ సింగ్, కుల్దీప్ ఏడాది వ్యవధిలో రెండో ఐసీసీ ట్రోఫీని అందుకోగా... షమీ, అయ్యర్, రాహుల్, సుందర్, రాణా మొదటిసారి కప్‌ను ముద్దాడారు... 15 మంది సభ్యుల జట్టులో అందరి ఘనతలు వేర్వేరు కావచ్చు... కానీ ఇప్పటికే ఎన్ని గెలిచినా, ఏం సాధించినా మరో విజయం దక్కినప్పుడు అందరిలో కనిపించే ఆనందం ఒక్కటే... సంబరాల్లో ఎవరూ ఎక్కువ కాదు, ఎవరూ తక్కువ కాదు. ఆదివారం చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకున్న భారత జట్టు ఆటగాళ్ల వేడుకల్లో ఇది స్పష్టంగా కనిపించింది. జడేజా బౌండరీ కొట్టి ఛేదన పూర్తి చేయడంతో మొదలైన జోష్ సోమవారం వరకు సాగింది. స్టేడియంలో ఒకవైపు జట్టు సహచరులతో విజయాన్ని పంచుకుంటూనే మరోవైపు రోహిత్, కోహ్లి, జడేజా, షమీ, గిల్ తమ కుటుంబ సభ్యులతో ట్రోఫీ ఆనందాన్ని ప్రదర్శిస్తూ సుదీర్ఘ సమయం గడిపారు. అక్కడి నుంచి ఇదే ఉత్సాహం డ్రెస్సింగ్ రూమ్‌లోనూ కొనసాగింది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన కేక్‌ను కెప్టెన్ రోహిత్ కట్ చేసిన తర్వాత తమ విజయానుభూతిని అంతా పంచుకున్నారు. అనంతరం హోటల్ చేరుకున్న భారత బృందానికి ఘన స్వాగతం లభించింది. మ్యాచ్ గెలిచిన తర్వాత కుల్దీప్ చెప్పినట్లు రాత్రంతా పార్టీ కొనసాగింది. గిల్, పాండ్యా, వరుణ్ హోటల్ గదుల్లోనే చాంపియన్స్ ట్రోఫీతో ఫోటోలకు పోజులిస్తూ ఈ మధుర క్షణాలను చిరస్మరణీయం చేసుకున్నారు. సోమవారం ఉదయం విజేత కెప్టెన్‌తో ఐసీసీ ప్రత్యేక ఫొటో షూట్ కార్యక్రమం జరిగింది. ముందుగా ఐసీసీ ప్రచార కార్యక్రమంలో భాగంగా టోర్నీ జ్ఞాపికలుగా మ్యాచ్‌లలో ఉపయోగించిన బంతులు, స్టంప్స్‌పై రోహిత్ శర్మ ఆటోగ్రాఫ్‌లు ఇచ్చాడు. ఆ తర్వాత ప్రఖ్యాత బుర్జ్ ఖలీఫా నేపథ్యంగా జరిగిన షూట్‌లో ట్రోఫీతో భారత సారథి సగర్వంగా నిలిచాడు. గత ఏడాది రోహిత్ నాయకత్వంలోనే గెలుచుకున్న టి20 వరల్డ్ కప్‌ను కూడా చాంపియన్స్ ట్రోఫీతో కలిపి ప్రదర్శించడం విశేషం.


వరుణ్ చక్రవర్తి


హార్దిక్ పాండ్యా


అక్షర్ పటేల్

స్వదేశానికి చేరిన టీమిండియా ఆటగాళ్లు

చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచి సంబరాలు ముగించిన వెంటనే టీమిండియా స్వదేశం పయనమైంది. సోమవారం రాత్రికే జట్టు ఆటగాళ్లంతా భారత్‌కు చేరుకున్నారు.

'2027'పై ఇప్పుడే చెప్పను!

వచ్చే వరల్డ్ కప్ ఆడటంపై రోహిత్ స్పందన

- మా విజయాలు అసాధారణం
- జట్టు స్థాయిని చూపించామన్న కెప్టెన్




కుటుంబ సభ్యులతో కెప్టెన్ రోహిత్ శర్మ

దుబాయ్: వరుసగా గత మూడు ఐసీసీ టోర్నీల్లో ఫైనల్ చేరిన భారత జట్టు రెండు టైటిల్స్ నెగ్గి మరో దాంట్లో రన్నరప్‌గా నిలిచింది. ఈ మూడు టోర్నీలు కలిపి 24 మ్యాచ్‌లు ఆడితే ఒక్క వరల్డ్ కప్ ఫైనల్ మినహా మిగతా 23 మ్యాచ్‌లు గెలిచింది. వరుసగా టి20 వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీలలో ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా ట్రోఫీని సాధించింది. ఇది అసాధారణ ఘనత అని, తమ జట్టు స్థాయిని ప్రదర్శించామని భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు. 'నిజాయితీగా చెప్పాలంటే ఇది చాలా పెద్ద ఘనత. మా టీమ్ ఎంత బలంగా ఉందో ఇది చూపించింది. ఆటగాళ్ల ప్రదర్శనతో పాటు వారి మధ్య చక్కటి సమన్వయం, బయటి అంశాలను పట్టించుకోకుండా ఒత్తిడిని అధిగమించి ఇలాంటి విజయాలు సాధించడం అసాధారణం. విజయం సాధించాలనే ఒకే ఒక లక్ష్యంతో అందరూ పని చేశారు' అని రోహిత్ అన్నాడు. వరుసగా రెండు ఐసీసీ టోర్నీలు సాధించడం అంత సులువైన విషయం కాదని, దాని వెనక చాలా శ్రమ ఉందని అతను చెప్పాడు. 'చాలా తక్కువ జట్లు మాత్రమే ఓటమి లేకుండా వరుసగా రెండు ట్రోఫీలు గెలిచాయి. అన్నీ మా వ్యూహాల ప్రకారమే ఆడి సఫలమయ్యాం. వన్డే వరల్డ్ కప్‌లో చాలా అద్భుతంగా ఆడిన తర్వాత కూడా ఫైనల్లో ఓడాం. ఇదే విషయాన్ని కుర్రాళ్లకు చెబుతూ గత రెండు ఫైనల్స్‌కు ముందు చివరి బంతి పడే వరకు పోరాడమని స్ఫూర్తి నింపాం. ఇదే ఫలితాన్ని అందించింది' అని రోహిత్ వెల్లడించాడు. తమ తుది జట్టులో వైవిధ్యమైన ఆటగాళ్లు ఉండటం విజయానికి కారణమని కూడా అతను విశ్లేషించాడు. '1 నుంచి 11వ నంబర్ ఆటగాడి వరకు ఏదో ఒక రూపంలో జట్టు విజయంలో తమ వంతు పాత్ర పోషించారు. ఈ సమష్టితత్వంతో పాటు గెలవాలనే కసి కూడా వారిలో కనిపించింది' అని రోహిత్ వివరించాడు. 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడే విషయంపై తాను ఇప్పుడే ఎలాంటి వ్యాఖ్య చేయనని, ప్రస్తుతానికి తాజా విజయాలను ఆస్వాదిస్తున్నట్లు రోహిత్ స్పష్టం చేశాడు. ఈ ఫార్మాట్ నుంచి తాను రిటైర్ కావడం లేదని ఆదివారమే మ్యాచ్ అనంతరం అతను వెల్లడించాడు. 'ప్రస్తుతం అంతా బాగుంది. భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన అవసరం అప్పుడే లేదు. 2027 వన్డే వరల్డ్ కప్ ఆడతానా లేదా అని ఇప్పుడే చెప్పను. దీని గురించి ఈ సమయంలో మాట్లాడటం అనవసరం. నా కెరీర్‌లో ఒక్కో అడుగు వేసుకుంటూ వెళ్లాను. ముందు ఏం జరుగుతుందో ఎప్పుడూ ఆలోచించలేదు. నా సహచరులతో కలిసి క్రికెట్‌ను ఆస్వాదిస్తున్నాను. అది చాలు' అని రోహిత్ వ్యాఖ్యానించాడు.

ఐసీసీ టీమ్‌లో రోహిత్‌కు చోటు లేదు!

చాంపియన్స్ ట్రోఫీలో ప్రదర్శన ఆధారంగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తమ 'టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్'ను ప్రకటించింది. ఆశ్చర్యకరంగా ఇందులో భారత కెప్టెన్ రోహిత్ శర్మకు మాత్రం స్థానం లభించలేదు. 12 మంది సభ్యుల ఈ జట్టులో టీమిండియా నుంచి కోహ్లి, షమీ, అయ్యర్, రాహుల్, వరుణ్‌తో పాటు 12వ నంబర్ ఆటగాడిగా అక్షర్ పటేల్ ఉన్నాడు. న్యూజిలాండ్ కెప్టెన్ మైకేల్ సాంట్నర్ ఈ టీమ్‌కు సారథి కాగా... రచిన్ రవీంద్ర, ఫిలిప్స్, హెన్రీ (న్యూజిలాండ్), అజ్మతుల్లా, ఇబ్రహీమ్ (అఫ్గానిస్తాన్) ఉన్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఏడవ శతాబ్దంలో...


● ఆదిత్య చిట్టూరి, గోపీచంద్

గోపీచంద్ హీరోగా సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చారిత్రాత్మక సినిమా ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. పవన్‌కుమార్ సమర్పణలో సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ''ఏడవ శతాబ్దం నేపథ్యంతో ఈ సినిమా కథనం ఉంటుంది. ఇప్పటి వరకు చూడని సరికొత్త లుక్‌లో గోపీచంద్ కనిపిస్తారు. 'ఘాజీ'(వాటర్ బ్యాక్ డ్రాప్), 'అంతరిక్షం' (స్పేస్ బ్యాక్‌డ్రాప్), 'ఐబీ 71'(స్కై బ్యాక్‌డ్రాప్) చిత్రాలను తీసిన సంకల్ప్ రెడ్డి అద్భుతమైన చారిత్రాత్మక ఘటన నేపథ్యంతో ఈ సినిమా తీస్తున్నారు. భారతీయ వారసత్వం మరచిపోయిన అధ్యాయానికి ఈ ఘటన జీవం పోస్తుంది. ఈ సినిమా విజువల్ వండర్‌లా ప్రేక్షకులను అలరించనుంది. త్వరలోనే మరిన్ని వివరాలను వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు కెమేరా: ఎస్.మణికందన్.

సగమై.. చెరిసగమై.!


● విష్ణు మంచు, ప్రీతి ముకుందన్


'సగమై.. చెరిసగమై.. ఇక నువ్వు నేను.. ఒక జగమై.. నీ జతగా అడుగేస్తున్నాను..' అంటూ మొదలవుతుంది 'కన్నప్ప' చిత్రంలోని ప్రేమ పాట. విష్ణు మంచు హీరోగా, ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కన్నప్ప'. మోహన్ బాబు, బ్రహ్మానందం, మోహన్ లాల్, శరత్ కుమార్, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ ఇతర పాత్రల్లో నటించారు. స్టీఫెన్ దేవస్సీ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'సగమై.. చెరిసగమై.! ' పాట వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను ఎల్‌వీ రేవంత్, సాహితీ చాగంటి పాడగా, ప్రభుదేవా, బృందా మాస్టర్స్ కొరియోగ్రఫీ చేశారు. ''రంగుల మల్లెలు చల్లెనే హరివిల్లులు మనకోసం... వెన్నెల పందిరి అల్లెనే... రాత్రియేల ఆకాశం..'' అంటూ ఈ పాట సాగుతుంది. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదలవుతోంది.

వేట మొదలైంది


● రజనీకాంత్

ముత్తువేల్ పాండ్యన్ వేట మళ్లీ మొదలైంది. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో సన్‌పిక్చర్ నిర్మించిన చిత్రం 'జైలర్'. ఈ చిత్రంలో రిటైర్డ్ పోలీస్ అధికారి ముత్తువేల్ పాండ్యన్ పాత్రలో నటించారు రజనీకాంత్. 2023లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 'జైలర్' కి సీక్వెల్‌గా 'జైలర్ 2'ను జనవరిలో ప్రకటించిన సంగతి తెలిసిందే. సీక్వెల్‌లోనూ రజనీకాంత్ హీరోగా నటిస్తుండగా, నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్‌పిక్చర్స్ నిర్మిస్తోంది. కాగా 'జైలర్ 2' చిత్రీకరణ సోమవారం నుంచి షురూ అయింది. ''ముత్తువేల్ పాండ్యన్ వేట మొదలైంది. 'జైలర్' చిత్రీకరణ ప్రారంభమైంది'' అంటూ 'ఎక్స్'లో పేర్కొంది సన్‌పిక్చర్స్. తొలి షెడ్యూల్ చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైందని, రజనీకాంత్‌పై కీలక సన్నివేశాలను, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించనున్నారని సమాచారం. ఈ సినిమాకు అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


● కేతికా శర్మ

'భీష్మ'(2020) వంటి హిట్ మూవీ తర్వాత హీరో నితిన్, డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిషోర్ కీలక పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'అది దా సర్‌ప్రైజ్...' అంటూ సాగే మూడో పాటని సోమవారం విడుదల చేశారు మేకర్స్. ఈ ప్రత్యేక పాటని హీరోయిన్ కేతికా శర్మపై చిత్రీకరించారు యూనిట్. ఈ పాటకి చంద్రబోస్ సాహిత్యం అందించగా, నీతి మోహన్, అనురాగ్ కులకర్ణి పాడారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'రాబిన్ హుడ్'. 'అది దా సర్‌ప్రైజ్...' అంటూ సాగే పాటలో కేతికా శర్మ ఎనర్జిటిక్ డ్యాన్స్, గ్లామర్ విజువల్ ట్రీట్‌గా ఉంటాయి. ఈ ఏడాదిలోని బెస్ట్ పాటల్లో 'అది దా సర్‌ప్రైజ్...'కి స్థానం ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: చెర్రీ, కెమేరా: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ బళ్లపల్లి.

నానిగారు సలహాలు ఇచ్చేవారు

- ప్రియదర్శి



''కోర్ట్' కథ నానిగారికి బాగా నచ్చింది. దీంతో నిర్మాణంలో ఏది కావాలన్నా ఏర్పాటు చేయమని నిర్మాతలు దీప్తి, ప్రశాంతిగార్లకు చెప్పారు. వారిద్దరూ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. దీప్తిగారు సెట్స్‌లో ఉండేవారు. నానిగారు మాత్రం అప్పుడప్పుడు మా సినిమా రషెస్ చూసి ఏవైనా సలహాలు, సూచనలు ఇచ్చేవారు'' అని ప్రియదర్శి తెలిపారు. రామ్ జగదీష్ దర్శకత్వంలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కోర్ట్'. నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ మూవీ ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రియదర్శి మాట్లాడుతూ– ''2022లో నేను, రామ్ జగదీష్ 'కోర్ట్' మూవీ గురించి మాట్లాడుకున్నాం. ఇందులో లాయర్ పాత్రని ఓ పెద్ద ఆర్టిస్ట్ చేస్తే బాగుంటుందనుకున్నాడు జగదీష్. కానీ, నేనే చేస్తానని చెప్పడంతో సరే అన్నాడు. పోక్సో కేసు అంటే ఏంటి? ఎలాంటి శిక్షలు ఉంటాయి? అని చాలా పరిశోధన చేసి, ఈ మూవీ తీశాడు జగదీష్. ఈ చిత్రంలో నేను లాయర్ పాత్ర చేశాక వారిపై నాకు గౌరవం పెరిగింది. 'కోర్ట్' సినిమాపై ఉన్న నమ్మకంతోనే 'ఈ చిత్రం నచ్చకపోతే నా 'హిట్ 3' చూడొద్దు' అని నానిగారు చెప్పారు. నా లాంటి నటులు మంచి కథలు చేస్తేనే జనాలు థియేటర్స్‌కి వస్తారు.. లేదంటే రారు. ఏ సినిమా అయినా మంచి వసూళ్లు సాధిస్తే అది కమర్షియల్ హిట్టే. అలా 'కోర్ట్'కి మంచి వసూళ్లు వస్తే నేను కమర్షియల్ హీరోనే(నవ్వుతూ). శాంతా బయోటెక్ ఫౌండర్ అండ్ చైర్మన్ కేఐ వరప్రసాద్‌గారి బయోపిక్ చేయాలని ఉంది. నేను నటించిన 'సారంగపాణి జాతకం' మూవీ ఏప్రిల్‌లో రిలీజ్ అవుతుంది. ప్రస్తుతం 'ప్రేమంటే..' మూవీ చేస్తున్నాను. అలాగే గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో ఓ సినిమా చేస్తాను'' అని చెప్పారు.

అందమైన ప్రేమ కథ


● శ్రీకాంత్ ఓదెల

నాని హీరోగా 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తెరకెక్కించిన డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల నిర్మాతగా మారారు. సమ్మక్క సారక్క క్రియేషన్స్‌ని స్థాపించిన ఆయన 'ఏఐ అమీనా జరియా రుక్సానా–గులాబీ' అనే మూవీని ప్రకటించారు. ఈ మూవీ ద్వారా చేతన్ బండి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రానికి కథను అందించడంతో పాటు చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్‌పై అనురాగ్ రెడ్డి, శరత్ చంద్రలతో కలిసి శ్రీకాంత్ ఓదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమాని ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ''2009లో గోదావరిఖని ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందనున్న అందమైన ప్రేమకథ 'ఏఐ అమీనా జరియా రుక్సానా–గులాబీ'. ఒక అబ్బాయిని గాఢంగా ప్రేమించే ఓ అమ్మాయి లోతైన భావోద్వేగాలను ఈ మూవీ చూపిస్తుంది. ఈ చిత్రం ప్రీ–ప్రొడక్షన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అవతార్ అవకాశం వదులుకున్నా!


● గోవింద

జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన హాలీవుడ్ మూవీ 'అవతార్' ఫ్రాంచైజీ చిత్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉన్న సంగతి తెలిసిందే. ఇలాంటి సినిమాలో నటించే చాన్స్ వదులుకున్నానని బాలీవుడ్ నటుడు గోవింద పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ– ''అమెరికాలోని ఓ సర్దార్‌కి నేనొక బిజినెస్ ఐడియా ఇచ్చాను. అది బాగా వర్కౌట్ అయ్యింది. దీంతో జేమ్స్ కామెరూన్‌కు నన్ను పరిచయం చేశారాయన. మేం ముగ్గురం డిన్నర్ చేస్తూ.. సినిమా గురించి మాట్లాడుకున్నాం. జేమ్స్ చెప్పిన కథ విని, ఈ సినిమాకు 'అవతార్' టైటిల్ బాగుంటుందని చెప్పి, నటించేందుకు ఆసక్తి చూపాను. అయితే ఈ మూవీ కోసం దాదాపు 400 రోజులు పడుతుందని కామెరూన్ చెప్పడంతో సరే అన్నాను. కానీ, నేను ఒక దివ్యాంగుడి పాత్ర చేయాలని, ఈ పాత్ర కోసం శరీరానికి రంగు వేసుకోవాలని చెప్పడంతో నేను నో చెప్పాను. రూ.18 కోట్లు పారితోషికంగా ఇస్తానని చెప్పినా కూడా అంగీకరించలేదు. శరీరానికి రంగు వేసుకుంటే నేను ఆస్పత్రి పాలవుతాను అని జేమ్స్‌తో చెప్పాను. అయితే 'అవతార్'లో నేను చేయాల్సిన పాత్రలో యాక్ట్ చేసిన అతన్ని చూసి ఆశ్చర్యపోయాను.. అతను బాగా నటించాడు'' అని తెలిపారు. ఇదిలా ఉంటే 'అవతార్'లో మూడోభాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' డిసెంబరు 19న రిలీజ్ కానుంది.

కాలమే కరిగింది

వినయ్ కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన ప్రధాన పాత్రల్లో నటించిన పొయెటిక్ మూవీ 'కాలమేగా కరిగింది'. సింగార మోహన్ దర్శకత్వంలో సింగార క్రియేటివ్ వర్క్స్ పతాకంపై మరే శివశంకర్ నిర్మించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ఈ సినిమా రిలీజ్ కానుంది. ''ఆర్టిస్టిక్ వ్యాల్యూస్ ఉన్న లవ్‌స్టోరీగా ఈ మూవీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తుంది. సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● శ్రావణి, వినయ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
217	92
74,115	22,460

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	17,470	▽	728
డోజోన్స్	42,068	▽	743
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,600	▽	80
డాక్స్	22,621	▽	388
షాంఘై	3,366	▽	6
నికాయ్	37,028	△	141

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	85,932
బంగారం (99.5 స్వచ్ఛత)	85,588
వెండి (కేజీ)	96,634

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.87	87.89
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	111.00	113.85
€	యూరో	ఎస్‌బీఐ	92.92	95.59
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.44	58.44
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.98	56.20
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.34	68.02
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.39	23.95
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.89	24.67
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.16	12.98

ఐపీఓల జోరుకు బ్రేక్!!

- వెనక్కి తగ్గుతున్న కంపెనీలు
- సెకండరీ మార్కెట్లో కరెక్షనే కారణం

నెమ్మదించిన పబ్లిక్ ఇష్యూలు



న్యూఢిల్లీ: గతేడాదంతా జోరుగా దూసుకెళ్లిన ఐపీఓల మార్కెట్ ప్రస్తుతం సెకండరీ మార్కెట్లో కరెక్షన్ కారణంగా నెమ్మదించిన ధోరణి కనిపిస్తోంది. గత రెండు నెలలుగా నెలకొన్న పరిస్థితులు దీన్ని సూచిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. 2024 డిసెంబర్‌లో ఏకంగా 16 లిస్టింగ్స్ నమోదు కాగా .. ఈ ఏడాది జనవరిలో అయిదు ఇష్యూలు మాత్రమే వచ్చాయి. ఫిబ్రవరిలో ఈ సంఖ్య నాలుగుకి తగ్గింది. అంతేగాకుండా కొన్ని కంపెనీలు ఐపీఓ ప్రణాళికలను పక్కన పెడుతున్నాయి. జనవరి, ఫిబ్రవరిలో అడ్వాన్స్‌డ్ సిస్-టెక్, ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, వినే కార్పొరేషన్ ఇలా ప్రతిపాదనలను వెనక్కి తీసుకున్న వాటిల్లో ఉన్నాయి. గత రెండు నెలల్లో ప్రధానంగా సెకండరీ మార్కెట్ కరెక్షన్‌కి లోను కావడంతో పలు లిస్టెడ్ కంపెనీల షేర్లపై ప్రతికూల ప్రభావం పడిందని ఈక్విరస్ ఎండీ భావేష్ షా తెలిపారు. దీనితో ఇన్వెస్టర్లు కొత్త లిస్టింగ్‌లవైపు చూడటం కాకుండా ప్రస్తుతమున్న పోర్ట్‌ఫోలియోను కాపాడుకోవడంపై దృష్టి పెడుతున్నారని పేర్కొన్నారు. ఇలా కొత్త ఐపీఓలపై ఇన్వెస్టర్ల ఆసక్తి సన్నగిల్లడంతో పబ్లిక్ ఇష్యూల మార్కెట్ కూడా నెమ్మదించిందని ఆయన పేర్కొన్నారు. పటిష్టమైన ఎకానమీ, మార్కెట్లో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లు భారీగా పెరగడం వంటి సానుకూలాంశాలతో 2014లో ఏకంగా 91 ఐపీఓల ద్వారా కంపెనీలు రూ. 1.6 లక్షల కోట్లు సమీకరించాయి.

అయినప్పటికీ.. ఆశావహమే..

పబ్లిక్ ఇష్యూలపై ప్రస్తుతానికి ఇన్వెస్టర్ల ఆసక్తి సన్నగిల్లినప్పటికీ .. దీర్ఘకాలికంగా చూస్తే మాత్రం మార్కెట్ సానుకూలంగానే కనిపిస్తోందని ఆనంద్ రాఠీ అడ్వైజర్స్ డైరెక్టర్ వి. ప్రశాంత్‌రావు తెలిపారు. పెద్ద ఎత్తున సంస్థలు ఐపీఓకి సిద్ధమవుతుండటమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. 'పెద్ద సంఖ్యలో ప్రాస్పెక్టస్‌లు దాఖలవుతున్నాయి. మార్కెట్లు స్థిరపడటం కోసం కంపెనీలు వేచిచూస్తున్నాయి. ప్రస్తుతం రూ. 67,000 కోట్లు సమీకరించడానికి 45 కంపెనీలకు సెబీ అనుమతులు ఉన్నాయి. మరో రూ. 1.15 లక్షల కోట్ల సమీకరణ కోసం 69 కంపెనీలు అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇందులో 45 కంపెనీలు గత కొద్ది నెలల్లో ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి' అని ఆయన పేర్కొన్నారు. గత రెండు నెలల వ్యవధిలోనే దాదాపు 30 కంపెనీలు సెబీకి ప్రాస్పెక్టస్‌లను సమర్పించినట్లు వివరించారు. సత్వ గ్రూప్, బ్లాక్‌స్టోన్ దన్ను గల నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్ ఈమధ్యే రూ. 6,200 కోట్ల సమీకరణకు సంబంధించి పత్రాలు దాఖలు చేసింది. రాబోయే కొద్ది నెలల్లో మార్కెట్లు స్థిరపడిన తర్వాత ఐపీఓలు మళ్లీ పుంజుకుంటాయనే సంకేతాలు కనిపిస్తున్నాయని షా ఆశాభావం వ్యక్తం చేశారు. మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతుండటంతో పాటు మదుపరులు కూడా కొత్త కంపెనీల్లో తాజాగా ఇన్వెస్ట్ చేయడానికి ముందుకు వస్తారని పేర్కొన్నారు. అయితే, ఇన్వెస్టర్లను ఆకట్టుకోవడానికి కంపెనీలు, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తమ వేల్యుయేషన్లను సరిచేసుకోవాల్సి ఉంటుందని షా అభిప్రాయపడ్డారు.

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా చిన్న, మధ్య తరహా సంస్థ(ఎస్ఎంఈ)ల పబ్లిక్ ఇష్యూలకు నిబంధనలను కఠినతరం చేసింది. వీటిలో భాగంగా లాభదాయకత అంశాన్ని ప్రవేశపెట్టింది. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) పరిమితిని 20 శాతానికి పరిమితం చేసింది. ఇన్వెస్టర్లకు రక్షణ కల్పిస్తూనే పటిష్ట పనితీరు సాధిస్తున్న ఎస్ఎంఈల నిధుల సమీకరణకు అండగా నిలిచే లక్ష్యంతో సంస్కరణలకు సెబీ తెరతీసింది. గత క్యాలెండర్ ఏడాదిలో ఎస్ఎంఈ ఐపీఓలు, ఇన్వెస్టర్ల పార్టిసిపేషన్ భారీగా పెరిగిన నేపథ్యంలో సెబీ తాజా చర్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. లాభదాయకత అంశానికివస్తే పబ్లిక్ ఇష్యూ ప్రణాళికల్లో ఉన్న ఎస్ఎంఈ గత మూడేళ్లలో కనీసం రెండేళ్ల పాటు రూ. కోటి చొప్పున నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించి ఉండాలి. మొత్తం ఇష్యూ పరిమాణంలో 20 శాతానికి మించి వాటాదారులు షేర్లను విక్రయించేందుకు అనుమతించరు. ఇదేవిధంగా వాటాదారుల హోల్డింగ్స్‌లో 50 శాతానికి మించి ఆఫర్ చేసేందుకు వీలుండదు.



నిధుల వినియోగమిలా

సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపులో మెయిన్ బోర్డ్ ఐపీఓ నిబంధనలే ఎస్ఎంఈలకూ వర్తించనున్నాయి. కనీస దరఖాస్తు పరిమాణాన్ని రెండు లాట్లకు సెబీ కుదించింది. తద్వారా అనవసర స్పెక్యులేషన్‌కు చెక్ పెట్టనుంది. సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఐపీఓ నిధుల్లో 15 శాతం లేదా రూ. 10 కోట్లవరకూ(ఏది తక్కువైతే) మాత్రమే కేటాయించేందుకు అనుమతిస్తారు. ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సంస్థలు, సంబంధిత పార్టీల నుంచి తీసుకున్న రుణ చెల్లింపులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఐపీఓ నిధులు వెచ్చించేందుకు అనుమతి ఉండదు. ప్రమోటర్ల కనీస వాటాకుపైన గల ప్రమోటర్ హోల్డింగ్‌కు దశలవారీ లాకిన్ గడువు వర్తిస్తుంది. అధికంగా ఉన్న ప్రమోటర్ వాటాలో ఏడాది తరువాత 50 శాతం, రెండేళ్ల తదుపరి మిగిలిన 50 శాతానికి గడువు ముగుస్తుంది.

ఎస్ఎంఈ ఐపీఓలు అంత ఈజీ కాదు

నిబంధనలు కఠినతరం చేసిన సెబీ • పెరుగుతున్న ఇష్యూలు, ఇన్వెస్టర్ల ఎఫెక్ట్

పబ్లిక్‌కు అందుబాటు

ఎస్ఎంఈలు సెబీకి దాఖలు చేసిన ఐపీఓ ప్రాస్పెక్టస్(డీఆర్‌హెచ్‌పీ)ను 21 రోజులపాటు పబ్లిక్‌కు అందుబాటులో ఉంచాలి. వార్తా పత్రికల్లో ప్రకటనల ద్వారా తెలియజేయాలి. సులభంగా తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌ను సైతం వినియోగించాలి. ఎస్ఎంఈ ఎక్స్ఛేంజ్, కంపెనీ వెబ్‌సైట్, మర్చంట్ బ్యాంకర్.. సంబంధిత డీఆర్‌హెచ్‌పీపై పబ్లిక్ స్పందనకు వీలు కల్పించాలి. ఎస్ఎంఈలు ఐపీఓ తదుపరి మెయిన్ బోర్డులోకి చేరకుండానే నిధుల సమీకరణ చేపట్టాలంటే సెబీ(ఎల్ఓడీఆర్) నిబంధనలు పాటించవలసి ఉంటుంది. చెల్లించిన మూలధనం రూ. 25 కోట్లకు మించవలసి ఉంటుంది. రైట్స్, ప్రిఫరెన్షియల్ కేటాయింపులు, బోనస్ షేర్ల జారీ తదితరాలు ఈ విభాగంలోకి వస్తాయి. గత రెండేళ్లలో ఎస్ఎంఈ ఐపీఓలు భారీగా ఎగసిన నేపథ్యంలో సెబీ నిబంధనలు మరింత కఠినతరం చేసేందుకు ఉపక్రమించింది. 2024లో ఐపీఓల ద్వారా 240 చిన్న, మధ్యతరహా సంస్థలు రూ. 8,700 కోట్లు సమీకరించాయి. అంతక్రితం 2023లో సమకూర్చుకున్న రూ. 4,686 కోట్లతో పోలిస్తే ఇవి రెట్టింపుకావడం ప్రస్తావించదగ్గ అంశం!!

హైదరాబాద్ యూనివర్సిటీతో బయోఫ్యాక్టర్ ఒప్పందం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవ ఎరువుల తయారీలో ఉన్న బయోఫ్యాక్టర్ తాజాగా హైదరాబాద్ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా వివిధ రంగాలకు అనువైన, వినూత్న నానో కణాల రూపకల్పనపై పరిశోధన, వాణిజ్యపర వినియోగానికి అనుగుణంగా ఆవిష్కరణలను చేపడతామని బయోఫ్యాక్టర్ సీఈఓ ఎల్.ఎస్.రెడ్డి తెలిపారు. పంట ఉత్పాదకత, కచ్చిత పోషకాల పంపిణీ, పర్యావరణ అనుకూల నానో పెస్టిసైడ్స్‌ను మెరుగుపరచడం, రసాయనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ భాగస్వామ్య లక్ష్యం అని చెప్పారు. తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడినిచ్చే పరిష్కారాలతో రైతులకు ప్రయోజనం చేకూరుస్తామన్నారు.

ఆఖరి గంటలో అమ్మకాలు

- సెన్సెక్స్ నష్టం 217 పాయింట్లు
- 22,500 దిగువకు నిఫ్టీ



ముంబై: ఆఖరి గంటలో ఆయిల్అండ్ గ్యాస్, పారిశ్రామిక రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో స్టాక్ సూచీలు సోమవారం ఆరంభ లాభాలు కోల్పోయాయి. సెన్సెక్స్ 217 పాయింట్లు నష్టపోయి 74,115 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92 పాయింట్లు పతనమై 22,460 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ఎఫ్ఎంసీజీ, యుటిలిటీ షేర్లు రాణించడంతో లాభాలు ఆర్జించగలిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 408 పాయింట్లు బలపడి 74,741 వద్ద, నిఫ్టీ 123 పాయింట్లు పెరిగి 22,676 గరిష్టాన్ని నమోదు చేశాయి. అయితే ఆఖర్లో అమ్మకాలతో ఆరంభ లాభాలన్నీ మాయమయ్యాయి. చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లలో విక్రయాల పరంపర కొనసాగింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 2.11%, 1.46 శాతం క్షీణించాయి. అమెరికాలో నిరుద్యోగిత రేటు పెరుగుదల, వాణిజ్య సుంకాల అనిశ్చితుల నేపథ్యంలో ఆసియా, యూరప్ మార్కెట్లు నష్టాలు చవిచూశాయి.

→ ఇండస్ఇండ్ బ్యాంకు షేరు 4% నష్టపోయి రూ.901 వద్ద స్థిరపడింది. ప్రస్తుత సీఈఓ పదవీకాలాన్ని మూడేళ్ల పాటు పొడిగించాలంటూ బ్యాంకు అభ్యర్థనను ఆర్‌బీఐ ఒక సంవత్సరానికే అనుమతినివ్వడంతో ఈ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఇంట్రాడేలో 6% క్షీణించి రూ.881 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది.

మాంద్యం భయాలతో అమెరికా మార్కెట్లు క్రాష్..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరతీసిన టారిఫ్ వార్ ఆర్థిక అనిశ్చితులకు దారి తీయొచ్చనే ఆందోళనలతో సోమవారం అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. నాస్‌డాక్ 4%, ఎస్అండ్‌పీ 2.5%, డోజోన్స్ 1.3% నష్టాలతో ట్రేడవుతున్నాయి. టెక్ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే నాస్‌డాక్ ఇండెక్స్‌లోని ప్రధాన షేర్లైన ఆల్ఫాబెట్, అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, టెస్లా షేర్లు 2–14% కుప్పకూలాయి. ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత నవంబర్‌లో టెస్లా షేరు ఆర్జించిన లాభాలన్నీ(50%) తుడిచిపెట్టుకుపోయాయి. టారిఫ్‌ల కారణంగా ధరలు పెరుగుతాయనే ఆందోళనలను ట్రంప్ తోసిపుచ్చారు. అయితే ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశాలను మాత్రం తోసిపుచ్చలేదు.

రూపాయి 36 పైసలు డౌన్

87.31 వద్ద ముగింపు



రూపాయి విలువ నెలరోజుల్లో అతిపెద్ద పతనం చవిచూసింది. డాలర్ మారకంలో సోమవారం 36 పైసలు క్షీణించి 87.31 వద్ద స్థిరపడింది. ఫిబ్రవరి 5 తర్వాత ఒక రోజులో రూపాయికిదే భారీ నష్టం. క్రూడాయిల్ ధరల్లో ఒడిదుడుకులు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయని నిపుణులు తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత్‌కు ఏఐ నిపుణులు కావలెను | ఇక సన్ ఫార్మా 'చెక్‌పాయింట్'

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

అగ్రి పీజీతో.. ఉజ్వల కెరీర్!



అగ్రికల్చర్ సైన్స్ విభాగంలో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశారా.. ఈ రంగంలో ఉజ్వల అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారా.. ముఖ్యంగా ప్రభుత్వ విభాగాల్లో.. కొలువులు కోరుకుంటున్నారా..! మీ లక్ష్యం ఇదే అయితే.. మీకో చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అగ్రికల్చరల్ సైంటిస్ట్ రీసెర్చ్ బోర్డ్ (ఏఎస్ఆర్‌బీ).. ప్రతి ఏటా అగ్రి యూనివర్సిటీల్లో లెక్చరర్‌షిప్ అర్హతకు.. అదే విధంగా అగ్రికల్చర్ రీసెర్చ్ సర్వీసెస్‌లో సైంటిస్ట్ పోస్టులకు, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తోంది. ఇందుకోసం తాజాగా ఏఎస్ఆర్‌బీ-నెట్, ఏఆర్ఎస్, ఎస్‌టీఓ ఎగ్జామినేషన్-2025 విడుదల చేసింది. ఈ నేపథ్యంలో... వీటికి సంబంధించిన వివరాలు, అర్హతలు, అవకాశాలు తదితర అంశాలపై విశ్లేషణ..

» ఏఎస్ఆర్‌బీ-నెట్, ఏఆర్ఎస్, ఎస్‌టీఓ
» నోటిఫికేషన్ విడుదల చేసిన ఏఎస్ఆర్‌బీ
» అగ్రి పీజీ ఉత్తీర్ణులకు ఉజ్వల అవకాశాలకు మార్గం

అగ్రికల్చర్ కోర్సుల్లో ఉన్నత విద్య పూర్తి చేసుకున్నా..అవకాశాలు అంతంత మాత్రంగానే ఉంటాయి అనే అభిప్రాయం. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టేలా.. ప్రభుత్వ వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టేందుకు,అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీసెస్‌లో సైంటిస్ట్‌గా, సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్‌లుగా, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్‌లుగా కొలువు దీరేందుకు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న పరీక్షే.. ఏఎస్ఆర్‌బీ-నెట్, ఏఆర్ఎస్, ఎస్ఎంఎస్, ఎస్‌టీఓ పరీక్ష.

అగ్రి సైంటిస్ట్ కొలువులకు మార్గం.. ఏఆర్ఎస్ టెస్ట్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్)లో.. తమకు అర్హత కలిగిన విభాగాల్లో శాస్త్రవేత్తలుగా కొలువుదీరడానికి ఏఎస్ఆర్‌బీ నిర్వహిస్తున్న ఎంపిక ప్రక్రియ ఏఆర్ఎస్ టెస్ట్. ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి నియామకం ఖరారు చేసుకుంటే.. పే లెవల్ 10తో రూ. 57,700 –1,82,400 శ్రేణితో కొలువు సాధించొచ్చు.

- **55విభాగాలు.. 458ఖాళీలు:** ఏఎస్ఆర్‌బీ తాజాగా ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం- మొత్తం 55 విభాగాల్లో 458 సైంటిస్ట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకునే విభాగానికి సంబంధించిన స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **మూడు దశల్లో ఏఆర్ఎస్ ఎంపిక ప్రక్రియ:** అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీసెస్‌లో సైంటిస్ట్‌ల నియామకానికి ఏఎస్ఆర్‌బీ మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. అవి.. ఏఆర్ఎస్ ప్రిలిమినరీ, ఏఆర్ఎస్ మెయిన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ.
- **ఏఆర్ఎస్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఇలా:** ఏఎస్ఆర్‌బీ మూడు దశలుగా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తోంది.మొదటి దశ ప్రిలిమినరీని ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ పద్ధతిలో 150 మార్కులకు రెండు గంటల వ్యవధిలో రాయాల్సి ఉంటుంది. ప్రిలిమ్స్‌లో నిర్ణీత కటాఫ్ మేరకు మెరిట్ జాబితా రూపొందించి ఒక్కో పోస్ట్‌కు పదిహేను మందిని (1:15 నిష్పత్తి) చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష మూడు గంటల వ్యవధిలో పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో 300 మార్కులకు పెన్ పేపర్ పద్ధతిలో నిర్వహిస్తారు.
- **చివరగా ఇంటర్వ్యూ:** మెయిన్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురిని (1:3 నిష్పత్తి) చొప్పున చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ దశలో నిపుణుల కమిటీ అభ్యర్థులకు సైంటిస్ట్‌గా కొనసాగేందుకు ఉన్న ఆసక్తిని, వ్యక్తిగత సామర్థ్యాలను పరిశీలిస్తారు. ఇందులోనూ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులతో మెరిట్ జాబితా రూపొందించి పోస్టులు, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుంటూ తుది నియామకాలు ఖరారు చేస్తారు.

అర్హతలు

అగ్రికల్చర్, అనుబంధ విభాగాలు, ఇతర నిర్దేశిత స్పెషలైజేషన్లతో పీజీ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** ఆగస్ట్ 1 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు.

అన్-రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు గరిష్ఠంగా ఆరు సార్లు, ఓబీసీ వర్గాల అభ్యర్థులు గరిష్ఠంగా తొమ్మిది సార్లు మాత్రమే ఏఆర్ఎస్ పరీక్ష రాసేందుకు అనుమతి లభిస్తోంది. ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్యార్థులు తమ వయో పరిమితి ముగిసేలోపు ఎన్నిసార్లయినా పరీక్ష రాయొచ్చు.

అగ్రి వర్సిటీల్లో అధ్యాపక వృత్తికి ఏఎస్ఆర్‌బీ-నెట్



జాతీయ స్థాయిలో ఉన్న వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, అదే విధంగా రాష్ట్రాల పరిధిలోని వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో అధ్యాపక వృత్తిలోకి ప్రవేశించేందుకు అర్హతగా నిర్వహించే పరీక్ష.. ఏఎస్ఆర్‌బీ-నెట్. దీనిలో ఉత్తీర్ణత ఆధారంగా.. అగ్రి యూనివర్సిటీల్లో లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడే అర్హత లభిస్తుంది.

- **60 విభాగాల్లో ఏఎస్ఆర్‌బీ:** ఏఎస్ఆర్‌బీ నెట్‌ను మొత్తం అరవై విభాగాల్లో నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న విభాగానికి అనుగుణంగా పీజీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్‌తో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఆ తర్వాత నెట్‌కు హాజరై అందులో స్కోర్ సొంతం చేసుకుంటే ఆ స్కోర్ ఆధారంగా.. స్టేట్, సెంట్రల్ లెవల్ అగ్రి యూనివర్సిటీల్లో లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అర్హత లభిస్తుంది.
- **ఆన్‌లైన్ విధానంలో.. ఏఎస్ఆర్‌బీ-నెట్:** ఏఎస్ఆర్‌బీ నెట్‌ను ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో 150 ప్రశ్నలు- 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ విభాగం నుంచే ఈ ప్రశ్నలు ఉంటాయి. అన్-రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులు 50 శాతం, ఓబీసీ వర్గాలు 45 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ వర్గాలు 40 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.
- **అర్హతలు:** అగ్రికల్చర్ అనుబంధ విభాగాల్లో నెట్‌లో ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు సెప్టెంబర్ 30 లోపు పీజీ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- **వయసు:** జనవరి 1 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

ఎస్ఎంఎస్, ఎస్‌టీఓ పరీక్ష

అగ్రికల్చరల్ సైంటిస్ట్ రీసెర్చ్ బోర్డ్.. అగ్రి పీజీ ఉత్తీర్ణులకు సుస్థిర కొలువు దిశగా నిర్వహిస్తున్న మరో పరీక్ష.. సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ (ఎస్‌టీఓ) ఎగ్జామినేషన్. ఇందులో ఉత్తీర్ణత ఆధారంగా ఐసీఏఆర్, దాని అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో టి-6 లెవల్‌లో సీనియర్ టెక్నికల్ ఆఫీసర్, సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్‌గా కొలువు సొంతం చేసుకోవచ్చు.

- **125 పోస్టుల భర్తీ:** ఏఎస్ఆర్‌బీ తాజా నోటిఫికేషన్ ప్రకారం.. దేశ వ్యాప్తంగా ఐసీఏఆర్, ఐసీఏఆర్ అనుబంధ 64 రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 125 పోస్టులను భర్తీ చేయనున్నారు. సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్‌కు సంబంధించి 41, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్‌కు సంబంధించి 83 పోస్టులు ఉన్నాయి.
- **రాత పరీక్ష, ఇంటర్వ్యూ:** సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్స్ ఎంపికలో భాగంగా రాత పరీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. తొలి దశలో రాత పరీక్షను ప్రిలిమినరీ, మెయిన్స్ దశలుగా ఉంటుంది. ప్రిలిమినరీ పరీక్షలో 150 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. మెయిన్ పరీక్షలో 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ముగ్గురుని (1:3 నిష్పత్తి) చొప్పున పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. 45 మార్కులకు ఉండే పర్సనల్ ఇంటర్వ్యూలోనూ విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుంటూ నియామకాలు ఖరారు చేస్తారు.

అర్హతలు

- సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** మే 21నాటికి 21నుంచి 35 ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ వర్గాలకు నిబంధనలకు అనుగుణంగా సడలింపు లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఏఆర్ఎస్ టెస్ట్, ఎస్ఎంఎస్/ఎస్‌టీఓ దరఖాస్తు చివరి తేదీ:** 2025, ఏప్రిల్ 22 – మే 21 వరకు
- **ఏఎస్ఆర్‌బీ నెట్, ఏఆర్ఎస్/ఎస్ఎంఎస్/ఎస్‌టీఓ(ప్రిలిమినరీ) పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు
- **ఏఆర్ఎస్, ఎస్ఎంఎస్, ఎస్‌టీఓ మెయిన్ పరీక్ష తేదీ:** డిసెంబర్ 7
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://www.asrb.org.in

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ పరీక్ష-2025

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(అసిస్టెంట్ కమాండెంట్) పరీక్ష-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్, సశస్త్ర సీమాబల్‌లో అసిస్టెంట్ కమాండెంట్ల(గ్రూప్-ఎ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 357.
» **ఖాళీల వివరాలు:** బీఎస్ఎఫ్-24, సీఆర్‌పీఎఫ్-204, సీఐఎస్ఎఫ్-92, ఐటీబీపీ-04, ఎస్ఎస్‌బీ-33.
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్/ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2025
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 26.03.2025 నుంచి 01.04.2025 వరకు
» **రాతపరీక్ష తేది:** 03.08.2025.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం.
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 4000 అప్రెంటిస్‌లు

వడోదర(గుజరాత్)లోని బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా ఉన్న బీఓబీ శాఖల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 4000.
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** తెలంగాణ-193, ఆంధ్రప్రదేశ్-59.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ డిగ్రీ లేదా తత్సమాన అర్హతతో పాటు ఏడాది అప్రెంటిస్‌షిప్ అనుభవం కలిగి ఉండాలి. స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి.
» **స్టైపెండ్:** మెట్రో/అర్బన్ ప్రాంతాల వారికి నెలకు రూ.15,000, గ్రామీణ/సెమీ అర్బన్ ప్రాంతాల వారికి నెలకు రూ.12,000.
» **వయసు:** 01.02.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 19.02.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.03.2025
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

సీఎస్ఐఆర్-ఐహెచ్‌బీటీలో 10 జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టులు

పాలంపూర్(హిమాచల్ ప్రదేశ్)లోని సీఎస్ఐఆర్-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ బయోరిసోర్స్ టెక్నాలజీ(ఐహెచ్‌బీటీ)లో జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జనరల్)-07, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)-02, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(స్టోర్స్ అండ్ పర్చేజ్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 28 ఏళ్లు నిండి ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.19,900 నుంచి రూ.63,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.03.2025
» **వెబ్‌సైట్:** https://bankofmaharashtra.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్

క్లుప్తంగా...

బాధ్యతలు చేపట్టిన టీ-హబ్ సీఈఓ కవికృత్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ-హబ్‌లో నూతన సీఈఓ కవికృత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో టీ-హబ్ అధికారుల బృందం సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. టీ-హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు పదవీకాలం ముగియడంతో ఇన్‌చార్జి సీఈఓగా టీ-హబ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ సుజిత్ జాగిర్దార్ కొనసాగారు. అనంతరం టీ-హబ్ అధికారులు, ఉద్యోగులు, స్టార్టప్‌ల నిర్వాహకులు ఆయన్ను అభినందించారు.

ప్రాథమిక కీనే ఫైనల్ కీ

- ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పరీక్షపై ఎంహెచ్ఎస్ఆర్‌బీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: గతేడాది నవంబర్ 11న నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్- 2 పరీక్షలకు సంబంధించి 2024 నవంబర్ 12న విడుదల చేసిన ప్రాథమిక కీనే తుది కీగా నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) సోమవారం ప్రకటించింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో జరిగిన ఈ పరీక్ష ప్రాథమిక కీపై బోర్డు 2024 నవంబర్ 14 సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించింది. వచ్చిన అభ్యంతరాలను సబ్జెక్ట్ నిపుణులతో కూడిన 'కీ'ని కమిటీ సమగ్రంగా పరిశీలించి, ప్రాథమిక కీలో ఇచ్చిన జవాబుల్లో ఎలాంటి తప్పులేదని నిర్ణయించినట్లు బోర్డు తెలిపింది. అందువల్ల ప్రాథమిక కీనే ఫైనల్ కీగా ప్రకటించినట్లు పేర్కొంది. ఫైనల్ కీని ఎంహెచ్ఎస్ఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును త్వరలో విడుదల చేస్తామని ప్రకటించింది. అభ్యర్థులు తమ అకౌంట్‌లోకి లాగిన్ అయ్యి మార్కులను చెక్ చేసుకోవచ్చని సూచించింది.

ఇంటర్ ప్రశ్నలో అస్పష్టత.. అటెంప్ట్ చేస్తే మార్కులు..

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ బోర్డు సోమవారం నిర్వహించిన రెండో సంవత్సరం ఇంగ్లిష్ పేపర్‌లోని 7వ ప్రశ్న పైచార్ట్‌లో గీతల ముద్రణ అస్పష్టంగా ఉన్నట్లు విద్యార్థులు ఇంటర్మీడియెట్ బోర్డు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సబ్జెక్ట్ నిపుణులతో చర్చించిన బోర్డు అధికారులు విద్యార్థులకు న్యాయం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆ ఏడవ ప్రశ్నకు సమాధానం రాయడానికి ప్రయత్నించిన వారందరికీ మార్కులివ్వాలని నిర్ణయించినట్లు ఇంటర్ బోర్డు తెలిపింది.

గద్దర్ పురస్కారాలకు సీఎం ఆమోదం

సాక్షి, హైదరాబాద్: గద్దర్ తెలంగాణ చలనచిత్ర పురస్కారాలకు సంబంధించిన విధివిధానాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదించారని తెలంగాణ చలనచిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను చలనచిత్రాభివృద్ధి సంస్థ ద్వారా త్వరలో విడుదల చేయనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తింపజేయాలి



కవాడిగూడ (హైదరాబాద్): శాసనసభ బడ్జెట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకువస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, గతంలో చెప్పినట్టు ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టానికి రూపకల్పన చేయాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టం తెచ్చేవరకు గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షా ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఎంఆర్‌పీఎస్ మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంద కృష్ణ మాట్లాడుతూ.. గత నోటిఫికేషన్‌లకు వర్గీకరణ వర్తింపచేస్తామని, ఆగస్టు 1న అసెంబ్లీలో సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రీచైతన్య కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన పలు కార్యాలయాల్లో ఆదాయపన్నుశాఖ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న శ్రీచైతన్య కార్పొరేట్ కార్యాలయంతోపాటు, ఆంధ్రప్రదేశ్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లోని ప్రాంతీయ కార్యాలయాల్లో ఉదయం నుంచి ఏకకాలంలో ఈ సోదాలు చేపట్టారు. పన్ను ఎగవేత ఆరోపణలపై అందిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. సీఆర్‌పీఎఫ్ బలగాల భద్రతతో సోదాలు కొనసాగాయి. కాలేజీల నిర్వహణ, విద్యార్థుల ఫీజుల చెల్లింపునకు సంబంధించిన పలు డాక్యుమెంట్లు, సంస్థ ఆయా బ్రాంచీలవారీగా చెల్లిస్తున్న ఆదాయం పన్ను వివరాలను అధికారులు సేకరించినట్టు సమాచారం. ఆదాయం పన్ను నుంచి తప్పించుకునేందుకు విద్యార్థుల నుంచి అధికశాతం ఫీజులను నగదు రూపంలోనే వసూలు చేస్తున్నట్టు గుర్తించారు.

47 ఏళ్ల క్రితం ఆఖరి ఉరి





1978లో ముషీరాబాద్ జైల్లో రామవతార్ యాదవ్ అనే దోషికి శిక్ష అమలు

ప్రస్తుతం రాష్ట్రంలోని ఏ జైలులోనూ లేని ఉరికంబం

ఉరి తీసే తలారీ 'హ్యాంగ్‌మన్' పోస్టులు కూడా లేవు

ఉమ్మడి ఏపీ పరిధిలో రాజమండ్రి సెంట్రల్ జైల్లోనే ఉరికంబం

ప్రణయ్ హత్య కేసులో తీర్పు వెలువడింది. ఏ2గా సుభాష్ శర్మను కోర్టు దోషిగా నిర్ధారిస్తూ మరణశిక్ష విధించింది. అయితే శిక్ష అమలు కావడానికి మూడు అంకాలు దాటాల్సి ఉంటుంది. ఇక్కడ తెరపైకి వచ్చే అంశం ఏమిటంటే.. ప్రస్తుతం రాష్ట్రంలోని ఏ జైలులోనూ గ్యాలోస్ (ఉరికంబం ఉండే ప్రాంతం సాంకేతిక నామం) లేదు. తలారులుగా పిలిచే హ్యాంగ్‌మన్ పోస్టులు అసలే లేవు.

▶ రాష్ట్రపతి వరకు అప్పీల్‌కు చాన్స్..

ప్రస్తుతం ట్రయల్ కోర్టు సుభాష్ శర్మకు మరణశిక్ష విధించింది. అతను ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేసే అస్కారం ఉంది. అంతేకాదు ట్రయల్ కోర్టు కూడా ఈ శిక్ష విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకువెళ్తుంది. ఈ క్రమంలో 'రిఫర్డ్ ట్రయల్'గా పిలిచే విధానంలో హైకోర్టు విచారణ చేయవచ్చు. మరణశిక్షను హైకోర్టు సమర్థిస్తే.. సుప్రీంకోర్టులో అప్పీల్ చేయవచ్చు. అక్కడా చుక్కెదురైతే క్షమాభిక్ష కోరుతూ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేయవచ్చు. రాష్ట్రపతి తిరస్కరిస్తే.. దోషులకు విధించిన మరణశిక్ష పూర్తిగా ఖరారైనట్లే. దీంతో శిక్ష విధించిన న్యాయస్థానానికి సంబంధించిన రాష్ట్రంలో.. మరణశిక్షను అమలు చేస్తారు. సాక్షి, హైదరాబాద్

ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి సంబంధించి ఆఖరి ఉరిశిక్షను 47 ఏళ్ల క్రితం ముషీరాబాద్ సెంట్రల్ జైలులో అమలు చేశారు. 1978లో భారత వైమానిక దళంలో పనిచేసిన ఎయిర్‌మన్ రామవతార్ యాదవ్‌పై హత్య కేసు నిరూపితమై, మరణశిక్ష ఖరారు కావడంతో ఉరి తీశారు. అప్పట్లో ముషీరాబాద్ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా ఉన్న సుబ్బారెడ్డి పర్యవేక్షణలో శిక్షను అమలైంది. తర్వాతి కాలంలో ముషీరాబాద్ సెంట్రల్ జైలును చర్లపల్లి ప్రాంతానికి మార్చారు. ఇక్కడ జైలు నిర్మిస్తున్నప్పుడు గ్యాలోస్ (ఉరికంబం) కోసం ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసినా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఉరికంబం ఉన్న జైలు ఒక్క రాజమండ్రి సెంట్రల్ జైలు మాత్రమే. ఇక తెలంగాణ జైళ్ల శాఖలో హ్యాంగ్‌మన్‌గా పిలిచే తలారీ పోస్టులు లేవు. చాలా ఏళ్లుగా ఉరిశిక్ష అమలు లేకపోవడంతో కొందరు హెడ్-వార్డర్లకే ఈ అంశంలో ప్రాథమిక శిక్షణ ఇస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో 47 ఏళ్ల క్రితం..

రాజమండ్రి సెంట్రల్ జైలులో చివరిసారిగా 1976 ఫిబ్రవరిలో ఉరిశిక్షను అమలు చేశారు. ఓ హత్య కేసులో దోషిగా తేలిన అనంతపురం జిల్లాకు చెందిన నంబి కిష్టప్పను ఉరి తీశారు. తర్వాత కొందరు ఖైదీలను ఉరిశిక్ష అమలు కోసం ఈ జైలుకు తరలించినా అమలు కాలేదు. 1875 నుంచీ గ్యాలోస్ ఉండి, ఇప్పటికీ కొనసాగుతున్న కేంద్ర కారాగారం రాజమండ్రి సెంట్రల్ జైల్ మాత్రమే. స్వాతంత్ర్యం అనంతరం దేశవ్యాప్తంగా వివిధ కారాగారాల్లో దాదాపు 100 మందిని ఉరితీశారు. అందులో అత్యధికంగా 42 శిక్షలను రాజమండ్రి సెంట్రల్ జైల్లోనే అమలు చేశారు. ఉరి అమలుకు ముందు సదరు ఖైదీని ఆఖరి కోరిక ఏమిటని అడగటం ఆనవాయితీ. కిష్టప్ప తన ఆఖరి కోరికగా లడ్డూ తింటానని కోరగా.. జైలు అధికారులు అతడికి లడ్డూలు అందించారు. రాజమండ్రి జైలు తలారీ ధర్మరాజు ఆ ఉరి తీశారు.

రాజమండ్రి జైల్లో 49 ఏళ్ల క్రితం...

అదో ప్రత్యేకమైన గ్యాలోస్..

రాజమండ్రి సెంట్రల్ జైల్లోని గ్యాలోస్ 1980 వరకు ప్రధాన ద్వారం పక్కనే బహిరంగ ప్రదేశంలో ఉండేది. ఉరిశిక్ష అమలు తర్వాత మృతదేహాన్ని ఉరికంబం కింద ఉండే ప్రత్యేక చాంబర్‌లో దింపుతారు. అక్కడి నుంచి నేరుగా ట్రే ద్వారా సంబంధీకులకు అప్పగించాలని, మృతదేహాన్ని జైలుగదుల మీదుగా బయటికి తీసుకురావద్దనే ఉద్దేశంతో అలా ఏర్పాటు చేశారు. 1980 తర్వాత గ్యాలోస్‌ను అడ్మినిస్ట్రేటివ్ భవనం పరిసరాల్లోకి మార్చారు. 2013లో ఈ గ్యాలోస్ ఉన్న ప్రాంతంలోనే రూ.7.5 కోట్లతో కొత్తగా పరిపాలనా భవనాన్ని నిర్మించారు. అయితే గ్యాలోస్‌ను అక్కడి నుంచి మార్చడం ఇష్టం లేక భవనం కింద భూగర్భంలో ఏర్పాటు చేశారు. ఈ తరహా గ్యాలోస్ కలిగిన కారాగారం దేశంలో మరోటి లేదు. అంతేకాదు నిర్మాణాలు ఎన్ని మారినా ఇప్పటికీ బ్రిటిష్‌కాలం నాటి ఇనుప ఉరికంబాన్నే వినియోగిస్తున్నారు. తరచూ దీనికి నూనె రాస్తూ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ప్రణయ్ హంతకుడికి ఉరి

పరువు హత్య కేసులో ఒకరికి మరణశిక్ష, ఆరుగురికి జీవిత ఖైదు

నల్లగొండ జిల్లా రెండో అదనపు, ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి ఎన్.రోజారమణి తీర్పు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దళిత యువకుడు పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో తుది తీర్పు వెలువడింది. ఐపీసీ సెక్షన్ 302, 129 (బీ), 109 ప్రివెన్షన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద నిందితులకు శిక్షలు ఖరారు చేస్తూ.. నల్లగొండ రెండో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి రోజా రమణి సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రధాన నిందితుడు (ఏ1) తిరునగరు మారుతీరావు నాలుగేళ్ల కింద ఆత్మహత్య చేసుకోగా.. ఏ2గా ఉన్న సుభాష్‌కుమార్‌శర్మకు మరణశిక్ష విధించారు. ఏ3గా ఉన్న మహ్మద్ అజ్గర్ అలీ, ఏ4 మహ్మద్ అబ్దుల్ బారీ, ఏ5 అబ్దుల్ కరీం, ఏ6 తిరునగరు శ్రవణ్‌కుమార్, ఏ7 సముద్రాల శివ, ఏ8 ఎంఏ నిజాంలకు జీవిత ఖైదు విధించారు. 2018 సెప్టెంబర్ 14న ప్రణయ్ హత్యకు గురవగా.. సుమారు ఆరున్నరేళ్ల విచారణ తర్వాత నిందితులకు శిక్ష పడింది.

కూతురి ప్రేమ వివాహాన్ని తట్టుకోలేక..

మిర్యాలగూడ పట్టణానికి చెందిన వ్యాపారి, వైశ్య సామాజిక వర్గానికి చెందిన తిరునగరు మారుతీరావు, గిరిజ దంపతులకు అమృత వర్షిణి ఒక్కరే కూతురు. పట్టణంలోని ముత్తిరెడ్డికుంటలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పెరుమాళ్ల బాలస్వామి, ప్రేమలత దంపతుల కుమారుడు పెరుమాళ్ల ప్రణయ్. ఇద్దరూ మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నప్పటి నుంచి ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో 2018 జనవరి 30న హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా నల్లగొండ ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. తన తండ్రి మారుతీరావు నుంచి రక్షణకల్పించాలని అమృత వర్షిణి పోలీసులను కోరారు. దీనితో పోలీసులు ప్రణయ్, అమృత ఇద్దరి తల్లిదండ్రులను మిర్యాలగూడ డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. అనంతరం అమృత ప్రణయ్‌తో కలసి ముత్తిరెడ్డి కుంటలోని ఇంటికి వెళ్లారు. తర్వాత ప్రణయ్ కుటుంబం ఆధ్వర్యంలో వారు వివాహ రిసెప్షన్ చేసుకున్నారు.

సుపారీ గ్యాంగ్‌తో హత్య..: కూతురు ప్రేమ వివాహం, పట్టణంలోనే రిసెప్షన్ చేసుకోవడాన్ని చూసి మారుతీరావు తట్టుకోలేకపోయారు. ప్రణయ్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. సుపారీ గ్యాంగ్‌కు రూ.కోటి ఇచ్చి ప్రణయ్ హత్యకు ప్లాన్ చేశారు. అప్పటికే అమృత, ప్రణయ్ వివాహమై 8 నెలలు గడిచింది. అమృత 5 నెలల గర్భిణి కూడా. 2018 సెప్టెంబర్ 14న ప్రణయ్ తల్లితో కలసి అమృతను మెడికల్ చెకప్ కోసం పట్టణంలోని జ్యోతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రి నుంచి బయటికి వస్తుండగా.. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న బిహారీ సుపారీ కిల్లర్ సుభాష్ కుమార్ శర్మ కత్తితో ప్రణయ్‌పై దాడి చేశాడు. అజ్గర్ అలీ, నిజాం అతడికి సాయం చేశారు. ప్రణయ్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలాడు.



నిందితులను తీసుకెళ్తున్న వాహనం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు



మారుతీరావు, సుభాష్‌కుమార్‌శర్మ, మహ్మద్ అజ్గర్‌అలీ, మహ్మద్ అబ్దుల్ బారి, అబ్దుల్ కరీం, తిరునగరు శ్రవణ్‌కుమార్, సముద్రాల శివ, ఎంఏ నిజాం



కోర్టు వద్ద రోదిస్తున్న శ్రవణ్ కూతురు శ్రుతి

1,200 పేజీలతో చార్జిషీట్..

ప్రణయ్ పరువు హత్య అప్పట్లో జాతీయ స్థాయిలో కలకలం రేపింది. ఆ సమయంలో నల్లగొండ ఎస్పీగా ఉన్న ఏవీ రంగనాథ్ ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు.. ఆస్పత్రిలోని సీసీ ఫుటేజీ ఆధారంగా మిర్యాలగూడ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. 4 రోజుల్లోనే నిందితులను అరెస్టు చేశారు. 9 నెలల పాటు దర్యాప్తు చేసి, 78 మంది సాక్షులను ప్రశ్నించి 2019 జూన్ 19న 1,200 పేజీలతో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. 8 మందిని నిందితులుగా చేర్చారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడైన మారుతీరావు 2020 మార్చి 8న హైదరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లోని గదిలో ఆత్మహత్య చేసుకున్నారు.

సుదీర్ఘ విచారణ అనంతరం..

ఈ కేసులో విచారణ సుదీర్ఘంగా జరిగింది. తాజాగా సోమవారం కోర్టు తుది తీర్పు వెల్లడించింది. ఏ2 సుభాష్‌కుమార్ శర్మకు న్యాయమూర్తి ఐపీసీ సెక్షన్ 302, ప్రివెన్షన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, సెక్షన్ 27 (3), ఆయుధ నిరోధక చట్టం కింద మరణ శిక్ష విధించారు. హత్యలో పాలుపంచుకున్న ఏ3 అజ్గర్ అలీ, ఏ4 మహ్మద్ అబ్దుల్ బారీ, ఏ5 మహ్మద్ అబ్దుల్ కరీం, ఏ6 మారుతీరావు తమ్ముడు తిరునగరు శ్రవణ్‌కుమార్, ఏ7 మారుతీరావు కారు డ్రైవర్ సముద్రాల శివ, ఏ8 ఆటోడ్రైవర్ ఎంఏ నిజాంలకు ఐపీసీ 302 రెడ్‌విత్ 120 (బీ), 109, ప్రివెన్షన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద జీవిత ఖైదు విధించారు. ఇక రూ.10 వేల నుంచి రూ.15 వేలు జరిమానాలు చెల్లించాలని, లేదంటే 4 నెలలు జైలుశిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో వెల్లడించారు.

కోర్టు వద్ద తీవ్ర ఉద్రిక్తత: ప్రణయ్ హత్య కేసులో సోమవారం తుది తీర్పు వెలువడుతుందని తెలిసిన ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో కోర్టు వద్దకు వచ్చారు. దీనితో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యాయవాదులు, సిబ్బంది, నిందితుల కుటుంబ సభ్యులను మాత్రమే కోర్టు లోపలికి అనుమతించారు. న్యాయమూర్తి తీర్పు వెలువరించాక.. నిందితుల కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. తన తండ్రి ఎలాంటి నేరం చేయలేదని, అయినా శిక్ష పడిందంటూ.. తిరునగరు శ్రవణ్‌కుమార్ కూతురు శ్రుతి బోరున విలపించింది. కాగా.. కోర్టు తీర్పు పరువు హత్యలకు పాల్పడే వారికి చెంపపెట్టు వంటిదని ప్రణయ్ హత్య కేసును వాదించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నర్సింహ పేర్కొన్నారు.

అమృతకు బాసటగా కౌసల్య

మిర్యాలగూడ అర్బన్: ప్రణయ్ హత్య ఘటన జాతీయ స్థాయిలో సంచలనం రేపడంతో.. ఇదే తరహాలో బాధితురాలిగా మారిన తమిళనాడు మహిళ కౌసల్య మిర్యాలగూడకు వచ్చి అమృతకు బాసటగా నిలిచారు. కౌసల్య గతంలో శంకర్ అనే యువకుడిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. ఇది తట్టుకోలేని కౌసల్య తండ్రి.. శంకర్‌ను హత్య చేయించాడు. తన భర్త మృతికి కారణమైన వారిని శిక్షించాలంటూ పోరాటం చేసిన కౌసల్య నిందితులకు శిక్షపడేలా చేసింది. ప్రణయ్ ఘటన విషయం తెలిసి మిర్యాలగూడకు వచ్చింది. తనకు జరిగిన అన్యాయం, ఆ కేసులో నిందితులకు పడిన శిక్షలను అమృతకు వివరించి ధైర్యం చెప్పింది. తమిళనాడులోని కేసుకు సంబంధించిన ఫైల్ కాపీని సైతం ఆమె ఇక్కడి పోలీసులకు అందజేసినట్టు సమాచారం.

కేరళ ఎంపీ డిమాండ్‌తో..: కేరళకు చెందిన దళిత సోషల్ ముక్తి మంచ్ జాతీయ నాయకుడు, ఎంపీ సోం ప్రసాద్ మిర్యాలగూడకు వచ్చి.. అమృతను పరామర్శించారు. దేశంలో పరువు హత్యలను నివారించడానికి ప్రణయ్ చట్టం తేవాలని ఆయన పార్లమెంట్ సమావేశాల్లో డిమాండ్ చేశారు. దానితో ఈ అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరిగింది.

సీసీ కెమెరా ఫుటేజీతో దర్యాప్తు మొదలైంది

ప్రణయ్‌ను హత్య చేసిన నిందితులను 4 రోజుల్లో అరెస్టు చేశాం: నాటి ఎస్పీ, ప్రస్తుత హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

- చాలా జాగ్రత్తగా చార్జిషీట్ రూపొందించాం.. ఆ ఫలితమే ఇప్పుడు కనిపిస్తోంది
- పరువు హత్యలు చేసేవారికి, సుపారీ కిల్లర్స్‌కు ఇది గుణపాఠమని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: ''ప్రణయ్ హత్య జరిగిన తర్వాత దొరికిన తొలి ఆధారం మిర్యాలగూడ ఆస్పత్రి వద్ద సీసీ కెమెరాల్లో రికార్డు అయిన వీడియో. అందులో ఓ వ్యక్తి ప్రణయ్‌ను నరకడం వెనుక నుంచి రికార్డు అయింది. అక్కడ మొదలైన దర్యాప్తు సాంకేతికంగా ముందుకు వెళ్లడంతో.. నాలుగు రోజుల్లో నిందితుల అరెస్టు, 19 నెలల్లో చార్జ్‌షీట్ దాఖలు సాధ్యమైంది''అని అప్పటి నల్లగొండ ఎస్పీ, ప్రస్తుత హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ప్రణయ్ హత్య కేసులో నిందితులకు శిక్షపడిన నేపథ్యంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రణయ్ కేసు దర్యాప్తులో అనేక సాంకేతిక అంశాలతో పాటు టీనేజ్ సైకాలజీని నేర్చుకున్నామని రంగనాథ్ చెప్పారు. 'ఈ కేసులో ప్రధాన నిందితుడు మారుతీరావు మీద నాకు జాలి ఉంది. బిడ్డ అంటే అతడికి అమితమైన ప్రేమ. అతడిని అరెస్టు చేసినప్పుడు నీ బిడ్డ మీద నీకు ఎంత ప్రేమో, చనిపోయిన వ్యక్తిపైనా వారి తల్లిదండ్రులకు అంతే ప్రేమ ఉంటుంది కదా? అలా ఎలా హత్య చేయిస్తావు?'అని అడిగా. దానికి మారుతీరావులో బాధ, పశ్చాత్తాపం కనిపించాయి'అని వెల్లడించారు. ఈ తీర్పును హైకోర్టులో అప్పీల్ చేసే అవకాశం ఉందని, అక్కడా దీటుగా నిలబడతామనే ధీమా ఉందని చెప్పారు. ఈ కేసులో మరణశిక్ష విధించడం సుపారీ కిల్లర్స్‌తోపాటు పరువు హత్యలు చేసే వారికి ఓ గుణపాఠమని పేర్కొన్నారు.

ఆధారాలన్నీ పక్కాగా సేకరించడంతోనే..

ప్రణయ్ హంతకులకు శిక్షపై నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ: సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసు విషయంలో అన్ని రకాల ఆధారాలు సేకరించడంతో పాటు 102 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టామని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ చెప్పారు. కేసు వీగిపోకుండా అన్ని ఆధారాలు సేకరించడంలో పోలీసులు చేసిన కృషి వల్లే నిందితులకు శిక్ష పడిందన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తప్పుచేసినవారు శిక్ష తప్పించుకోలేరని పేర్కొన్నారు. ఈ కేసులో పక్కాగా ఆధారాలు సేకరించి, శిక్ష పడేలా చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి పి.శ్రీనివాస్, మిర్యాలగూడ డీఎస్పీ బి.సుధీర్‌కుమార్, ఎస్సై కె.రాజశేఖర్‌రాజు, పీఎస్‌డీ ప్రసాద్, సైదిరెడ్డి, వీరస్వామి, లైజన్ అధికారులు నరేందర్, మల్లికార్జున్‌లను ఎస్పీ అభినందించారు.

దోషులకు సరైన శిక్ష పడింది

- కోర్టు తీర్పు అనంతరం ప్రణయ్ తండ్రి బాలస్వామి



మిర్యాలగూడ అర్బన్: తన కుమారుడు ప్రణయ్‌ను అతి దారుణంగా చంపినవారికి కోర్టు సరైన శిక్ష విధించిందని, పరువు హత్యలకు పాల్పడేవారికి దీనితో కనువిప్పు కలగాలని తండ్రి పెరుమాళ్ల బాలస్వామి పేర్కొన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమృత తండ్రి మారుతీరావు సుపారీ కిల్లర్స్‌తో ప్రణయ్‌ను హత్య చేయించారని, ఆ ఘటనతో తాము చాలా కోల్పోయామని బాలస్వామి చెప్పారు. ప్రణయ్ హత్య తరువాత కూడా చాలా పరువు హత్యలు జరిగాయని, ఇలాంటి వాటికి పాల్పడే వారందరికీ కోర్టు ఇచ్చిన తీర్పుతో కనువిప్పు కలగాలని పేర్కొన్నారు. అంతకుముందు కోర్టు తీర్పు అనంతరం ప్రణయ్ సమాధి వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.

'ఇక కరెంట్ కట్ అయితే.. లోపం ఎక్కడుందో ఠక్కున తెలుస్తుంది'

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సరఫరాలో లోపాలను ఆన్‌లైన్ ద్వారా సత్వరమే గుర్తించి పరిష్కరించడానికి 11కేవీ ఫీడర్లకు.. ఫీడర్ అవుటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఎఫ్ఎంఎస్) అమల్లోకి తెచ్చామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్‌లో ఎక్కడ లోపం ఏర్పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందో ఈ టెక్నాలజీ ద్వారా ఆటోమేటిక్‌గా తెలుసుకోవచ్చు అన్నారు. లొకేషన్‌తో కూడిన ఈ సమాచారాన్ని క్షేత్ర స్థాయిలోని సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్‌కు యాప్ ద్వారా తెలియజేస్తుందన్నారు. యాప్ బజర్‌తో కూడిన శబ్దాలు చేసి ఏఈని అప్రమత్తం చేస్తుందని చెప్పారు. దీంతో తక్షణమే అక్కడకు చేరుకుని మరమ్మతులు పూర్తిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి ఆస్కారముంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు కారణాలు ఏమిటి? వాటిని ఎంత సమయంలో పునరుద్ధరించారు? వంటి సమాచారాన్ని సైతం ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని వివరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 3,412, గ్రామీణ ప్రాంతాల పరిధిలో 5,209 కలిపి మొత్తం 11కేవీ ఫీడర్లు 8,621 ఉండగా, ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో 1,353, గ్రామీణ ప్రాంతాల పరిధిలో 3,081 ఫీడర్లకు ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు.

పరువు హత్యలు ఆగేనా?

సాక్షి, హైదరాబాద్: అల్లారుముద్దుగా చూసుకున్న కూతురు పెళ్లి విషయంలో సొంత నిర్ణయం తీసుకుందనో.. తమ సామాజిక వర్గం కాకుండా ఇతరులను ఇష్టపడిందనో.. అవతలి కుటుంబం తమ తాహతుకు తగినది కాదనో.. ఇలా కారణమేదైనా పరువు, ప్రతిష్టల పేరిట దారుణమైన హత్యలు జరుగుతున్నాయి. పరువు సంగతేమోగానీ.. తమవారిని కోల్పోయి ఓవైపు, హంతకులుగా మారి జైళ్లలో మగ్గుతూ మరోవైపు.. రెండు వైపులా కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. తాజాగా ప్రణయ్ హత్య కేసులో దోషులకు శిక్షలు విధించిన నేపథ్యంలో.. పరువు హత్యలపై మరోమారు విస్తృత చర్చ మొదలైంది.

కులమతాల పట్టింపులతో..: కాలంతోపాటు మనిషి ఎన్నో విషయాల్లో మారుతూ వచ్చినా.. కులమతాల విషయంలో మాత్రం ఇంకా పట్టింపులను వదలని పరిస్థితులు ఉన్నాయి. పిల్లలకు ఇష్ట ప్రకారం చదువులు, నచ్చిన ఉద్యోగం చేసే స్వేచ్ఛ ఇచ్చినా జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే విషయంలో తల్లిదండ్రులు కట్టుబాట్లు పెడుతున్నారు. ఈ క్రమంలో తెగించి కులాంతర వివాహాలు చేసుకున్న పిల్లలపై కక్ష సాధింపులకు దిగుతున్నారు. కొన్నిసార్లు పరువు హత్యలకూ పాల్పడుతున్నారు. ప్రణయ్ హత్య తర్వాత అలాంటి ఘటనలే మరికొన్ని జరిగాయి కూడా.

ఆగని పరువు హత్యలు..

- హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణి ప్రేమ వివాహం చేసుకోవడంతో పగ పెంచుకున్న ఆమె తమ్ముడు.. గతేడాది డిసెంబర్ 1న స్కూటీపై వెళుతుండగా వెంబడించి కొడవలితో నరికి హత్యచేశాడు.
- దండుమైలారం గ్రామంలో ఒక యువకుడిని ప్రేమించిందన్న కోపంతో తన కుమార్తె భార్గవిని తల్లి జంగమ్మ చీరతో ఉరివేసి హతమార్చింది.
- ప్రేమ వివాహం చేసుకున్న నాగరాజు, అశ్రీన్ దంపతులు 2022 మేలో హైదరాబాద్ సరూర్‌నగర్ ప్రాంతంలో బైక్‌పై వెళుతుండగా ఆపి.. నాగరాజును దారుణంగా చంపారు. • 2022 మేలో ప్రేమ వివాహం చేసుకున్న యువతి కుటుంబ సభ్యులు బేగంబజార్ మచ్చి మార్కెట్ సమీపంలో నీరజ్ పన్వర్ అనే యువకుడిని దారుణంగా పొడిచి హత్య చేశారు.

హత్యలు.. ఉగ్రవాద మూలాలు..

- ప్రణయ్ కేసులో శిక్షపడిన దోషులది అంతా నేర చరిత్రే

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ప్రణయ్ హత్య కేసులో శిక్షపడిన దోషులది అంతా నేర చరిత్రే. గుజరాత్ హోం మంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులో అజ్గర్ అలీ, అబ్దుల్ బారి నిందితులుగా ఉన్నారు. వీరిలో అబ్దుల్ బారీ నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందినవాడే. వీరిద్దరికీ ఉగ్రవాద మూలాలు ఉన్నాయి. పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. గుజరాత్ కేసులో కోర్టు అజ్గర్ అలీకి జీవిత ఖైదు విధించగా.. హైకోర్టు ఆ తీర్పును కొట్టివేసింది. దానితో జైలు నుంచి బయటకు వచ్చిన అజ్గర్ అలీ నల్లగొండలోని అబ్దుల్ బారి వద్దకు చేరుకున్నాడు. ఆ సమయంలోనే అబ్దుల్ బారితో కలిసి ప్రణయ్ హత్యలో పాల్గొన్నాడు. అయితే 2019లో సుప్రీంకోర్టు కింది కోర్టు తీర్పును సమర్థిస్తూ, హైకోర్టు తీర్పును కొట్టివేసింది. దీనితో గుజరాత్ పోలీసులు అజ్గర్‌ను ఆ రాష్ట్రంలోని సబర్మతి జైలుకు తరలించారు. అక్కడ జీవిత ఖైదు అనుభవిస్తున్న అజ్గర్‌కు ఇక్కడా అదే శిక్ష పడింది. ఉరిశిక్ష పడిన సుభాష్ కుమార్ శర్మది బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లా జగస్తీసింగ్‌పూర్ గ్రామం. దొంగతనం కేసులో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవిస్తున్న క్రమంలో అబ్దుల్ బారీతో పరిచయం ఏర్పడింది. ప్రణయ్‌ను హత్య చేసేందుకే అబ్దుల్ బారి సుభాష్‌కుమార్‌శర్మను హైదరాబాద్‌కు పిలిపించాడు.

మేధో సంపత్తి ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

పీసీటీ సెమినార్‌లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్‌గోయెల్



జ్యోతి ప్రజ్వలనతో సెమినార్‌ను ప్రారంభిస్తున్న శశాంక్‌గోయెల్

సాక్షి, హైదరాబాద్: మేధో సంపత్తి ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్ గోయెల్ అన్నారు. ఆవిష్కర్తలకు, స్టార్టప్‌లకు పేటెంట్ సహకార ఒప్పందం (పీసీటీ) పేటెంట్లు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (డబ్ల్యూఐపీఓ), కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్ అండ్ ట్రేడ్‌మార్క్ సంయుక్తంగా పీసీటీపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సోమవారం అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోయెల్ మాట్లాడుతూ.. స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాలతో మనదేశం ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. 2024 గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ 39వ స్థానంలో ఉందని డబ్ల్యూఐపీఓలోని మాడ్రిడ్ రిజిస్ట్రీ సీనియర్ డైరెక్టర్ డేవిడ్ ముల్స్ వెల్లడించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
మంగళవారం ; 11-3-2025


విశ్రాంతి గదులు


డ్రెస్సింగ్ రూమ్‌లు


ఓ శిలాఫలకంపై లిపి

అద్భుతం మెట్లబావి

డ్రెస్సింగ్ రూంలు.. విశ్రాంతి గదులు కూడా

- రాతి స్తంభాలతో మూడు అంతస్తులు
- కోరుట్లలో జైన, చాళుక్యుల నిర్మాణం

కోరుట్ల: పెద్ద పెద్ద రాతి స్తంభాలు.. వాటిపై శిలాఫలకాలతో శ్లాబ్ వంటి నిర్మాణాలు. అక్కడక్కడ చిన్న చిన్న విశ్రాంతి గదులు. దుస్తులు మార్చుకునేందుకు అనువైన నిర్మాణాలు. మూడు అంతస్తుల నిర్మాణం. భూమిపై కనిపించేది కేవలం ఒక అంతస్తు మాత్రమే.. మిగిలిన రెండు అంతస్తుల నిర్మాణం భూగర్భంలోకి వెళ్లిపోయింది. క్రీ.శ. 957–1184 మధ్య కాలం నాటి శిల్పుల ఇంజనీరింగ్ శైలికి నిదర్శనంగా నిలిచిన అద్భుతమైన నిర్మాణం జగిత్యాల జిల్లాలోని కోరుట్లలో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.

జైన చాళుక్యుల కాలంలో..

క్రీ.శ. 1042–1068 వరకు వేములవాడ రాజధానిగా పరిపాలన సాగించిన జైన చాళుక్యుల కాలంలో ఈ మెట్ల బావి నిర్మించినట్లు సమాచారం. 7–10వ శతాబ్ది వరకు పరిపాలన సాగించిన కల్యాణి చాళు క్యులు, రాష్ట్రకూటుల హయాంలోనూ ఈ మెట్ల బావి ఆ కాలం నాటి రాజవంశీయుల స్నానాలకు, విశ్రాంతి తీసుకోవడానికి, ఈత నేర్చుకోవడానికి వినియోగించారని చెబుతారు. ఈ మెట్ల బావిలోని రాతి స్తంభాలపై చెక్కిన తీరు అమోఘం. రాతి స్తంభాల కింది భాగంలో భూగర్భమార్గంలో రాజకోటను చేరుకోవడానికి సొరంగం వంటి మెట్ల నిర్మా ణం ఉన్నట్లుగా ప్రచారంలో ఉంది. రాజవంశీయు ల కాలంలో నిషిద్ధ ప్రాంతంగా ఉన్న ఈ మెట్ల బావి ప్రస్తుతం కోరుట్ల మున్సిపల్ అధీనంలో ఉంది.


కోరుట్లలోని మెట్లబావి


మెట్ల బావి చుట్టూ వరుస

ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్

కోరుట్లలోని మెట్ల బావిలో స్నానాలకు వచ్చే రాజవంశీయులకు దుస్తులు మార్చుకోవడానికి అనువుగా మెట్లబావి రెండవ అంతస్తులో చిన్నచిన్న గదులుండటం గమనార్హం. వీటితో పాటు విశ్రాంతి తీసుకోవడానికి మెట్ల బావి చుట్టూ రాతి స్తంభాల మీద నిలబెట్టిన శిలాఫలకాలతో పెద్ద వసారా ఉంది. మెట్ల బావి చుట్టూ దీపాలు వెలిగించడానికి అవసరమైన చిన్నపాటి గూళ్లు ఉన్నాయి. మెట్లబావిపై భాగంలో ఉన్న మెట్లకు వెంబడి ఎడమ వైపు ఉన్న ఓ రాతిపై శిలాశాసనం ఉంది. ఈ శిలాశాసనం సంపూర్ణంగా చదవడానికి వీలు కానట్లుగా సమాచారం. ఈ మధ్య కాలంలో దెబ్బతిన్న కోరుట్ల మెట్లబావిని మున్సిపల్ ఆధ్వర్యంలో బాగు చేయించి కొత్త సొబగులద్దారు. దీంతో ఈ మెట్లబావికి ఇండి గ్లోబల్ నెట్‌వర్క్ నుంచి 2022–23 సంవత్సరంలో ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్ దక్కింది.

అడిషనల్ డీజీ పర్సనల్‌గా అనిల్‌కుమార్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల బదిలీ మేరకు అడిషనల్ డీజీ పర్సనల్‌గా అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అడిషనల్ డీజీ టీజీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌గా ఉన్న అనిల్‌కుమార్‌కు అడిషనల్ డీజీ పర్సనల్‌గా పోస్టింగ్ ఇస్తూ సీఎస్ శాంతికుమారి ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అలాగే టీజీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అడిషనల్ డీజీ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కేటాయించారు.

విజేతలను అభినందించిన డీజీపీ

సాక్షి, హైదరాబాద్: ఆల్ ఇండియా పోలీస్ కబడ్డీ క్లస్టర్–2025 పోటీల్లో విజేతలుగా ప్రతిభ కనబర్చిన పోలీసులను డీజీపీ జితేందర్ సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల పంజాబ్‌లోని జలంధర్‌లో నిర్వహించిన పోటీల్లో తెలంగాణ పోలీసులు నాలుగు రజతాలు, ఐదు కాంస్యాలు సాధించారు. కార్యక్రమంలో ఐజీ ఎం.రమేశ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను మహిళలే గద్దె దింపుతారు

బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టిన మహిళలే ఆ పార్టీని వచ్చే ఎన్నికల్లో గద్దె దింపుతారని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం రోజే మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళల్ని మోసం చేసే కొత్త అవతారం సీఎం రేవంత్ రెడ్డి ఎత్తారని ఆరోపించారు. ఎంత మందిని కోటీశ్వరులను చేశారో సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకరినైనా వ్యాపారవేత్తగా చేశారా? అని శిల్పారెడ్డి ప్రశ్నించారు. మహిళలను కోటీశ్వరులు ఎలా చేస్తారో సీఎం చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహిళలకిచ్చిన హామీలు కొండంతగా ఉంటే వారికి కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక చేసింది గోరంత అని ఎద్దేవాచేశారు.

ఎన్ని కోర్టుల్లో ఆరోగ్య కేంద్రాలున్నాయి?

నివేదిక ఇవ్వాలని రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, వాటి ద్వారా అందిస్తున్న సేవలపై నివేదిక అందజేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం ఆదేశించింది. ప్రస్తుతం ఎన్ని కోర్టుల్లో ఆరోగ్య కేంద్రాలున్నాయి? వైద్యులు, ఔషధాలు తదితర సదుపాయాలు కల్పిస్తున్నారా? అనే వివరాలు తెలియజేయాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. రాష్ట్రంలోని అన్ని కోర్టుల ఆవరణల్లో న్యాయవాదుల అత్యవసర వైద్యం కోసం ఆరోగ్య కేంద్రం, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచేలా ఆదేశాలివ్వాలని న్యాయవాది హర్షవర్ధన్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆరోగ్యం, వైద్యం పొందడం ప్రజల హక్కుఅని పిటిషనర్ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ జనరల్ తరఫున సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ హాజరయ్యారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ వాదనలు వినిపిస్తూ.. అత్యవసర సమయంలో వైద్య చికిత్స అందించేందుకు వైద్యులు, ఇతర సిబ్బందితో పాటు ఎమర్జెన్సీ పరికరాలను అందుబాటులో ఉంచాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. వివరాలు అందజేయాలని రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది.

సామాజిక న్యాయానికి ప్రతీక కాంగ్రెస్ పార్టీ

టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి బిడ్డకు గౌరవం దక్కుతుందని, సామాజిక న్యాయానికి ప్రతీక కాంగ్రెస్ పార్టీ అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక దీన్ని మరోమారు రుజువు చేసిందని చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని విమర్శించే వారికి ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ఓ గుణపాఠమని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీలలో సామాజిక న్యాయం ఉండదన్నారు. కష్టపడి పనిచేస్తున్న యువ నాయకత్వానికి కూడా కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని చనగాని ఆశాభావం వ్యక్తంచేశారు.

ట'మాట' పడిపోయింది



టమాటా ధర పడిపోయి రైతన్నల కళ్లలో కన్నీళ్లు తెప్పిస్తోంది. ధర బాగా పలికి లాభాలు వస్తాయనే గంపెడాశతో సాగుచేసిన టమాటా.. ప్రస్తుతం గిట్టుబాటు ధరలేక నోటమాట రావడంలేదు. అన్నదాతకు పెట్టుబడి కూడా రావడం లేదు. ధర లేనప్పుడు గుత్తులుగా కాసినా ఏం ప్రయోజనం అని విరగకాసిన టమాటా పంటను ఏరుతూ తోట బయట పడేస్తున్న రంగాపూర్ గ్రామానికి చెందిన రైతు కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. 'నాకున్న 20 గుంటల్లో పంట సాగు చేసిన. టమాటాలు ఏరితే కూలీలకు కూడా కైకిలి రావడం లేదు'అని అన్నాడు. ఉన్నచోటనే ఏరి పడేస్తూ 'సాక్షి'కెమెరాకు ఇలా కనిపించాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వు

రాధాకిషన్‌రావు పిటిషన్‌లో వాదనలు ముగించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆ కేసులో రెండో నిందితుడు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో 10 నెలలు జైలులో ఉండి ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యానని, మళ్లీ ఇదే అంశంపై మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని.. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తొలి నిందితుడిగా ఉన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది సుధాంషు వాదనలు వినిపిస్తూ.. 'చక్రధర్‌గౌడ్ కేసులో రాధాకిషన్‌రావును విచారణ చేయాల్సి ఉందని పోలీసులు కౌంటర్ దాఖలు చేయడం సరికాదు. ప్రాథమికంగా అన్ని అంశాలు పరిశీలించిన తర్వాతే అరెస్టు చేయవద్దని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. రాధాకిషన్‌రావు కూడా విచారణకు సహకరిస్తున్నారు. ఇదే ఫోన్ ట్యాపింగ్ కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఒకే అంశంపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చెల్లదు. ఎలాంటి ఆధారాలు లేకున్నా తప్పుడు కేసులో రాధాకిషన్‌రావును ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు'అని పేర్కొన్నారు. పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ.. 'రాధాకిషన్‌రావు గత ప్రభుత్వ పాలకులకు అత్యంత సన్నిహితుడు. హరీశ్‌రావు ఆదేశాల మేరకు చక్రధర్‌గౌడ్ ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. 2020లో రాధాకిషన్‌రావు పదవీ విరమణ చేశాక నాటి ప్రభుత్వ పెద్దలు టాస్క్‌ఫోర్స్ అధికారిగా నియమించారు. పదవీ కాలాన్ని రెండుసార్లు పొడిగించారు. తన నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపట్టరాదని చక్రధర్‌గౌడ్‌ను హరీశ్ బెదిరించారు. రాధాకిషన్‌రావు పిటిషన్‌ను కొట్టివేయండి'అని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చక్రధర్‌గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదులోగానీ, 2024, జూన్ 19న డీజీపీకి చేసిన ఫిర్యాదులోగానీ పూర్తి వివరాలను ఎందుకు పేర్కొనలేదని ప్రశ్నించారు. అన్ని అంశాలను ఫిర్యాదులో ప్రస్తావిస్తే తనను ఏమన్నా చేస్తారేమోనని ఆయన భయపడ్డారని పీపీ బదులిచ్చారు. పీపీ వాదనను సుధాంషు వ్యతిరేకించారు. అనంతరం న్యాయమూర్తి తీర్పు వాయిదా వేశారు. కాగా, ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని రాధాకిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌లో ఫిబ్రవరి 28న జస్టిస్ కె.లక్ష్మణ్ తీర్పు రిజర్వు చేసిన విషయం తెలిసిందే.

ఏప్రిల్ 5 నుంచి ఆస్ట్రేలియాకు అధికారుల బృందం

బొగ్గు గనులు, పర్యాటకంపై అధ్యయనం చేపట్టనున్న సింగరేణి, అటవీశాఖ అధికారులు

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 5 నుంచి 15 మధ్య ఆస్ట్రేలియాలో అధికారుల బృందం పర్యటించనుంది. బొగ్గు గనులు, పర్యాటకం, ఇతర అంశాలపై అధ్యయనంలో భాగంగా దీన్ని చేపట్టనున్నారు. ఈ పర్యటనకు వెళ్తున్న వారిలో సింగరేణి అధికారులతోపాటు అటవీశాఖకు సంబంధించి పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్, సింగరేణి బెల్ట్‌లోని కొందరు అటవీశాఖ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 30తో డోబ్రియాల్ రిటైరవనున్నారు. సీఎంవోలోని అధికారి చొరవతో గత నెలాఖరులో ఏడుగురు ఐఎఫ్ఎస్ అధికారుల బృందం కెన్యా, టాంజానియా పర్యటనకు వెళ్లిరావడం వివాదాస్పదమైంది. పీసీసీఎఫ్ డోబ్రియాల్ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు ఐఎఫ్ఎస్ అధికారులు ఆయన అనుమతి లేకుండానే ఈ పర్యటనకు వెళ్లడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియా పర్యటనతో వివాదాన్ని సద్దుమణిగేలా చేయాలని భావిస్తున్నారా అనేది చర్చనీయాంశమవుతోంది.

బంగ్లా యువతుల అక్రమ రవాణా కేసులో దర్యాప్తు షురూ

నిందితులను ప్రశ్నించిన ఎన్ఐఏ అధికారులు

సాక్షి, హైదరాబాద్: బంగ్లాదేశ్ యువతుల అక్రమ రవాణా కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) దర్యాప్తు ప్రారంభించింది. ఈ మేరకు కేసులో నిందితులైన వెస్ట్ బెంగాల్‌కు చెందిన అజరుల్ షేక్, కమురుల్ షేక్‌లను పీటీ వారెంట్‌పై సోమవారం అదుపులోకి తీసుకుంది. చంచల్‌గూడ జైలు నుంచి మాదాపూర్‌లోని ఎన్ఐఏ కార్యాలయానికి నిందితులను తరలించి ప్రశ్నించారు. అనంతరం నిందితులందరినీ అధికారులు నాంపల్లిలోని ఎన్ఐఏ కోర్టులో హాజరు పరిచారు. గత నెల 25న ఖైరతాబాద్, చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు జరిపిన సంగతి తెలిసిందే. ఈ సోదాల్లో ముగ్గురు మైనర్లు సహా మొత్తం 18 మందిని అరెస్ట్ చేశారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన అజరుల్ షేక్ బంగ్లాదేశ్ నుంచి యువతులను అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దేశభద్రత నేపథ్యంలో అక్రమ చొరబాట్లపై ఎన్ఐఏ దృష్టి సారించింది. అంతర్జాతీయ స్థాయిలో మానవ అక్రమ రవాణా కోణంలో దర్యాప్తు చేస్తోంది.



సోమవారం ట్రైబల్ మ్యూజియంను సందర్శించిన వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు

ట్రైబల్ మ్యూజియంను సందర్శించిన విదేశీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: మాసాబ్ ట్యాంక్ సమీపంలోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో ఉన్న నెహ్రూ సెంటినరీ ట్రైబల్ మ్యూజియంను వివిధ దేశాల ప్రతి నిధులు సందర్శించారు. గయానా, టాంజానియా, సు రినామె, నేపాల్, శ్రీలంక దేశాలకు చెందిన మీడియా అధికారులు, ప్రతినిధులు ట్రైబల్ మ్యూజియంలో తిరి గి రాష్ట్రంలోని గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభి వృద్ధి సంస్థలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన విదేశీ ప్రతినిధులు.. శిక్షణ అనంతరం ట్రైబల్ మ్యూజి యంకు వచ్చారు. మ్యూజియంలో ఉన్న ఆదిమ జాతులు, గిరిజన జాతుల ఆవాసాలు, వృత్తులు, జీవన విధానాలు, ఆర్థిక, సాంస్కృతిక, మత, వస్తుగత సంస్కృతులను మ్యూజియం అధికారులు వారికి వివరించారు. ఆ తర్వాత గిరిజన దృశ్యమాలికను చూపించారు. ఈ సందర్భంగా బంజారా మహిళలు ప్రదర్శించిన బిందెల నృత్యాన్ని వీక్షించి ఉత్సాహంగా వారితో కలిసి విదేశీ ప్రతినిధులు నర్తించారు. అనంతరం వారికి తెలంగాణ బంజారా మహిళలు తయారు చేసే 'పొట్లి' అనే అరుదైన కానుకను అందించారు. గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఇచ్చిన ఆతిథ్యం తమను కదిలించిందని, గిరిజన సంస్కృతి తమ దేశపు, పూర్వీకుల వలస మూలాలను గుర్తుకు తెచ్చిందని విదేశీ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సంస్థ సంచాలకుడు వి.సముజ్వల, మ్యూజియం క్యూరేటర్ ద్యావనపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈలలో పోటీతత్వం పెరిగింది

- పీఎస్‌యూలు స్థానిక ఎంఎస్ఎంఈల ద్వారా పరికరాలు కొనుగోలు చేయాలి
- పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్

సాక్షి, హైదరాబాద్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)లలో పోటీతత్వం పెరిగిందని, ప్రభుత్వరంగ సంస్థలు (పీఎస్‌యూలు), ఎంఎస్ఎంఈ మధ్య పరస్పర సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్ అభిప్రాయపడ్డారు. సోమవారం టూరిజం ప్లాజాలో పీఎస్‌యూలు, భారీ పరిశ్రమలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్సూర్ మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈల ఉత్పత్తులకు రాష్ట్ర పరిశ్రమల శాఖ నాణ్యత ప్రమాణాల సర్టిఫికేషన్ జారీ చేస్తుందని, పీఎస్‌యూలు స్థానిక ఎంఎస్ఎంఈల ద్వారా అవసరమైన ఉత్పత్తులు, పరికరాలను కొనుగోలు చేస్తే ఇరువురూ ప్రయోజనం పొందుతారని తెలిపారు. పీఎస్‌యూలు, భారీ పరిశ్రమలకు రవాణా ఖర్చులు కలిసి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రూ. 250 కోట్ల టర్నోవర్ దాటిన భారీ పరిశ్రమలు తప్పనిసరిగా ఈ ప్లాట్‌ఫామ్స్‌లో నమోదు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు రూపొందించిందని, నగదు ప్రవాహంలో అంతరాయాలు లేకుండా ఇది ఉపయోగపడుతుందని ఆయన వెల్లడించారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమల సాంకేతిక అప్‌గ్రేడేషన్‌కు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వల్ల నైపుణ్యం ఉన్న ప్రతిభావంతులు అందుబాటులోకి వస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ఎం1 ఎక్స్ఛేంజ్ సీఈవో రాయ్ మేథ్యూ, ఇన్‌వాయిస్ మార్ట్ నేషనల్ హెడ్ నికితా బోస్, ఆర్ఎక్స్ఐఎల్ ప్లాట్‌ఫామ్ స్టేట్ హెడ్ వేద్‌ప్రకాశ్, పరిశ్రమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్, ఈసీఐఎస్, మిధాని, ఎఫ్‌సీఐ, బీఎస్ఎన్ఎల్, సెయిల్, మైక్రోసాఫ్ట్ డేటాసెంటర్, సఫ్రాన్ తదితర వంద పరిశ్రమలు, పీఎస్‌యూల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రతిబింబం రామప్ప



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలంలోని రామప్ప దేవాలయం సోమవారం ఉదయం ప్రకృతి అందాలతో దర్శనమిచ్చింది. రామప్ప గోపురం నీడ ప్రతిబింబంతో ఆకట్టుకుంది. గార్డెన్‌లోని చెట్లు, రామప్ప అందాలు రంగురంగులతో దర్శనమివ్వగా గైడ్ వెంకటేశ్ ఫొటోలు తీసి మీడియాకు అందించారు.

క్లుప్తంగా...

కొత్త ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం

విప్‌లకు స్పీకర్ సూచన

సాక్షి, అమరావతి: శాసనసభలో ఇప్పటి దాకా కనీసం ఒక్కసారి కూడా మాట్లాడేందుకు అవకాశం రాని కొత్త ఎమ్మెల్యేలందరికీ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల మిగిలిన రోజుల్లో మాట్లాడేందుకు అవకాశం కల్పించాలంటూ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రభుత్వ విప్‌లకు సూచించారు. సోమవారం జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ... సభలో ఇప్పటికీ ఒక్కసారి కూడా మాట్లాడటానికి అవకాశం రాని కొత్త సభ్యులు సంఖ్య ఎక్కువగా ఉంది. వారందరూ మాట్లాడేందుకు వీలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ విప్‌లు తీసుకోవాలని సూచించారు.

మన బడి-మన భవిష్యత్‌కు రూ.407.91 కోట్లు

సాక్షి, అమరావతి: మన బడి-మన భవిష్యత్ కింద 22,344 పాఠశాలల అభివృద్ధి, ఇతర విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.8,000 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతి మంజూరు చేసింది. తొలి విడతగా రూ.407.91 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో పెండింగ్‌లో ఉన్న పనులు చేపట్టేలా విద్యా శాఖకు అనుమతి ఇచ్చింది.

నిర్మాణాల బాధ్యతల నుంచి టీచర్లను తప్పించాలి

పాఠశాలల్లోని నిర్మాణాల బాధ్యతల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

ఫైళ్ల క్లియరెన్స్‌కు నిర్దిష్ట కాలపరిమితి

సాక్షి, అమరావతి: వైద్య శాఖలో వివిధ స్థాయిల్లో ఫైళ్ల క్లియరెన్స్ కోసం నిర్దిష్ట కాలపరిమితులను విధించాలని ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత ప్రభుత్వం ఒక వైద్యాధికారికి పోస్టింగ్ ఇవ్వడానికి సుదీర్ఘమైన సమయం తీసుకున్నట్టు గుర్తించామని అలాంటి ఘటనలు పునరావృతమవ్వకుండా చూడాలని సూచించారు.

ఆయిల్ పామ్ కంపెనీలకు 24 మండలాలు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: వంట నూనెల జాతీయ మిషన్-ఆయిల్ పామ్(ఎన్ఎంఈవో-వోపీ) కింద బాపట్ల, కృష్ణ, వైఎస్సార్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల్లో కొత్తగా ఎంపిక చేసిన 24 మండలాలను ఆయిల్ పామ్ కంపెనీలకు ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు సోమవారం వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు ప్రణాళిక : సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని క్వాంటమ్ టెక్నాలజీ హబ్‌గా మార్చేందుకు 'క్వాంటమ్ వ్యాలీ'ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఐఐటీ మద్రాస్, టీసీఎస్, ఐబీఎం సహకారంతో ఇందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. దీనికోసం సోమవారం టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రిత్వ శాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, క్వాంటమ్ టెక్నాలజీ సెంటర్ హెడ్ జేబీవీ రెడ్డి తదితరులతో చర్చలు జరిపినట్టు ఎక్స్‌లో తెలిపారు.

2022-23లో ఏపీకి క్యూ కట్టిన పర్యాటకులు

కేంద్ర పర్యాటక శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశానికి విదేశీ పర్యాటకుల సంఖ్య పెరుగుతోందని కేంద్ర పర్యాటక శాఖ తెలిపింది. ఇందులో భాగంగా 2022, 2023 సంవత్సరాల్లో ప్రపంచం నలుమూలల నుంచి 2.78 కోట్ల మంది వచ్చినట్లు లోక్‌సభలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. 2022లో ఏపీకి 1,65,845 మంది, 2023లో 60,426 మంది, 2022-23 సంవత్సరాల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి 4,55,584 మంది వచ్చినట్టు చెప్పారు.

'విద్యార్థులు తమకు తామే పోటీపడాలి'

నూజివీడు: విద్యార్థులకు సర్టిఫికెట్లు ముఖ్యం కాదని నాలెడ్జ్, కమ్యూనికేషన్ ముఖ్యమని ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి అన్నారు. విద్యార్థులు తమ స్వీయ అభివృద్ధిపై దృష్టి పెట్టడంతోపాటు స్వయంగా తమకు తామే పోటీ పడాలని సూచించారు. ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో సాంకేతిక మహోత్సవం టెక్‌జైట్-25ను సోమవారం రాత్రి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుమూర్తి మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో అమలవుతున్న ఇంటిగ్రేటెడ్ కోర్సుల అమలు, విద్యా విధానం, పరిపాలన అభినందనీయమన్నారు. సమస్య అనేది ఒక సవాలని, దానిని చూసి ఎంతమాత్రం వెనక్కు తగ్గకూడదన్నారు. మరో ముఖ్య అతిథి జేపీ మోర్గాన్ ఛేజ్ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.మురళీనాయుడు మాట్లాడారు.

ఇళ్ల లబ్ధిదారుల్లో పీవీటీజీలకు అదనపు సాయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పీఎంఏవై అర్బన్, రూరల్ 1.0 లబ్ధిదారులకు అందించనున్న అదనపు సాయంపై సోమవారం గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులిచ్చారు. పీఎంఏవై 1.0 కింద ఇళ్లు మంజూరైన ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచు, గదబ, ఖోండ్, కుందారెడ్డి, సవర వంటి పర్టిక్యులర్లీ వల్‌నరబుల్ ట్రైబ్ గ్రూప్స్ (పీవీటీజీ)కు రూ.1 లక్ష చొప్పున సాయం అందిస్తామని వెల్లడించారు.



ఆకురాలిన బూరుగు

బూరుగు చెట్టు. ఆకులన్నీ రాలిన చెట్టు కాయలతో కనిపిస్తోంది. పొట్టనిండా దూది నింపుకొన్న ఆ కాయలు చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. అనంతపురంలో ఈ చెట్టును దారిన వెళ్లేవాళ్లు ఆసక్తిగా చూస్తున్నారు. – సాక్షి, అనంతపురం



ఆకలి.. ఆహారం

ఆహారధాన్యాలు పండించేందుకు రైతు పొలం దుక్కిదున్ని నీళ్లు పెడుతున్న వెంటనే వందలాది పక్షులు వాలాయి. పొలంలో పురుగుల్ని ఏరుకుని తినేందుకు పోటీపడ్డాయి. కడుపునిండా తిని తృప్తిగా వెళ్లాయి. విజయవాడ నగరం సమీపంలో సోమవారం కనిపించిన దృశ్యం ఇది. – సాక్షి, విజయవాడ

యనమలకు బాబు 'షాక్' హ్యాండ్

ఎమ్మెల్సీ పదవి రెన్యువల్ చేయని సీఎం • లోకేశ్‌కు నచ్చకపోవడమే కారణం

- ఇక ఆయన రాజకీయ పయనం ముగిసినట్లేనంటున్న నేతలు
- అవమానకరంగా రాజకీయాల నుంచి తప్పించారంటూ సీనియర్ నేత అంతర్మథనం



సాక్షి, అమరావతి: తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ముఖ్య నేతగా ఉన్న యనమల రామకృష్ణుడు రాజకీయాల నుంచి అవమానకరంగా పక్కకు తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తన సమకాలీకుడు, ఎన్టీఆర్ నుంచి టీడీపీని లాక్కునేందుకు స్పీకర్‌గా అన్ని విధాలా సహకరించిన సహచరుడు.. యనమలను పట్టించుకోకుండా చంద్రబాబు చివరి దశలో వదిలేశారనే చర్చ నడుస్తోంది. ఈ నెలాఖరుతో యనమల ఎమ్మెల్సీ పదవికి గడువు ముగియనుండగా, ఆయన సభ్యత్వాన్ని రెన్యువల్ చేయలేదు. ప్రస్తుతం నడుస్తున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలే ఆయన పాల్గొంటున్న చివరి సమావేశాలుగా చెబుతున్నారు. చంద్రబాబు తనయుడు లోకేశ్‌తో పొసగకపోవడం, ఆయన కోటరీని వ్యతిరేకించడం వల్లే యనమలను పూర్తిగా పక్కనపెట్టేసినట్లు తెలుస్తోంది. ముమ్ముందు రాజకీయంగా ఆయనకు ఎటువంటి పదవులు ఇచ్చే అవకాశం లేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఆయన రిటైర్ అయినట్లేనని స్పష్టం చేస్తున్నాయి. పార్టీ కోసం సుదీర్ఘకాలం పని చేసిన వ్యక్తికి ఇంత అవమానకరంగా రాజకీయ ముగింపు ఉంటుందని ఎవరూ ఊహించలేదంటున్నారు. తనకు ఎమ్మెల్సీ పదవి రెన్యువల్ చేయకపోవడంపై యనమల స్పందించకపోయినా తనను కావాలని అవమానించినట్లు సన్నిహితుల వద్ద వాపోయినట్లు తెలిసింది.

కూతురు, అల్లుడికి పదవులు ఉన్నాయనే కారణంతో పక్కకు..

టీడీపీలో ప్రస్తుతం లోకేశ్ మాటే శాసనంగా నడుస్తుండడంతో ఎమ్మెల్సీ స్థానాల్లో యనమల పేరును కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. ఆయన కుమార్తె తుని ఎమ్మెల్యేగా, అల్లుడు ఏలూరు ఎంపీగా ఉండడంతో ఇక ఆయనకు ఎలాంటి పదవులు ఇవ్వాల్సిన అవసరం లేదని చంద్రబాబు సైతం భావించినట్లు ప్రచారం జరుగుతోంది. 2014 ఎన్నికల్లో టీడీపీ గెలిచినప్పుడు ఎమ్మెల్యేగా లేకపోయినా చంద్రబాబు ఆయన్ను ఎమ్మెల్సీగా చేసి ఆర్థిక మంత్రి పదవి ఇచ్చారు. అప్పట్లో తనకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇవ్వాలని కోరినా ఆయన అనుభవాన్ని ఉపయోగించుకుంటానని మంత్రి పదవి ఇచ్చారు. 2019లో టీడీపీ ఓడిపోవడంతో శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా కొనసాగారు. అయితే అంతకుముందు నుంచే పార్టీలో లోకేశ్ పెత్తనం పెరిగిపోవడం, దాన్ని యనమల వంటి పలువురు సీనియర్లు వ్యతిరేకించడంతో చినబాబు ఆగ్రహానికి గురై, వారి ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇప్పుడు అధికారంలో ఉండడంతో యనమలకు పూర్తిగా చెక్ పెట్టి రాజకీయాల నుంచే అనివార్యంగా రిటైర్‌మెంట్ ఇప్పించారనే చర్చ జరుగుతోంది. పార్టీలో తనకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతోనే ఇటీవల ఆయన కాకినాడ పోర్టు, సెజ్ వ్యవహారంలో ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ ఏకంగా చంద్రబాబుకు లేఖ రాశారు. కాకినాడ పోర్టు యజమానిగా ఉన్న కేవీ రావు పేదల భూములు తీసుకుని అక్రమంగా సంపాదించారని, అలాంటి వారిని వెనకేసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. యనమల స్థాయి నాయకుడు ఏకంగా సీఎంని ప్రశ్నిస్తూ లేఖ రాయడం కలకలం రేపింది. అయితే చంద్రబాబు తన మార్కు రాజకీయంతో పార్టీలోనే యనమల వ్యతిరేకుల్ని, సోషల్ మీడియాను ప్రోత్సహించి ఆయనపై ఎదురుదాడి చేయించడంతోపాటు అసభ్యంగా తిట్లు కూడా తిట్టించారు. అప్పటి నుంచి టీడీపీకి, యనమలకు మధ్య దూరం ఇంకా పెరిగిపోయింది.

వాడుకుని వదిలేయడం బాబుకు అలవాటే

ప్రస్తుతం జరుగుతున్న శాసనమండలి సమావేశాల్లోనూ యనమలకు కనీస ప్రాధాన్యం లభించడంలేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. మండలిలో లోకేశ్ ఉన్నప్పుడు ఆయన చూస్తుండగా యనమల దగ్గరికి వెళ్లి మాట్లాడేందుకు సైతం టీడీపీ సభ్యులు జంకుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజకీయంగా అవసరానికి వాడుకుని ఆ తర్వాత పూచికపుల్లలా తీసిపడేయడం చంద్రబాబుకు మొదటి నుంచి అలవాటైన విద్యే. కాబట్టి యనమలకు అదే తరహా ట్రీట్‌మెంట్ లభించిందని విశ్లేషకులు చెబుతున్నారు.

వక్ఫ్ ఆస్తులను ఆదాయ వనరులుగా మార్చాలి

మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్‌తో వక్ఫ్‌బోర్డు చైర్మన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను ఆదాయ వనరులుగా మార్చి ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఉపయోగపడేలా చేయాలని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సూచించారు. విజయవాడలోని రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీధర్‌తో సోమవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వక్ఫ్ బోర్డుకు ఏ విధంగా ఉపయోగపడతాయనే అంశంపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, వక్ఫ్ ఆస్తులను ఉపయోగించి క్రీడా, వ్యాపార, పారిశ్రామిక, వ్యవసాయ, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో వక్ఫ్ బోర్డును అభివృద్ధి పథంలో నడిపించాలని అజీజ్ సూచించారు. వచ్చిన ఆదాయాన్ని మైనారిటీల అభ్యున్నతికి ఉపయోగించాలని కోరారు.

గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ సలహాదారుగా ప్రభాకరరావు

సాక్షి, అమరావతి : గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ సాంకేతిక సలహాదారుగా రిటైర్డ్ ఈఎన్‌సీ టి.ప్రభాకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొంది.

'సాంకేతికత'తో పంటల సాగులో మేలైన పద్ధతులు

వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు



సాక్షి, అమరావతి: పంటల సాగులో సాంకేతిక బదలాయింపును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఆముదం పంట సాగుపై సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న, ఎగుమతులకు అనువైన రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సాగులో విజయవంతమైన వివిధ యాజమాన్య పద్ధతులను సేకరిస్తున్నామని చెప్పారు. వాటిని పరిశీలించి ప్రాంతీయ వ్యవసాయ సాంకేతిక సదస్సుల్లో సిఫార్సులు చేస్తామన్నారు. ఇదే రీతిలో జిల్లా స్థాయి వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు నూతన మార్కెట్ ఆధారిత వ్యవసాయ పరిజ్ఞానం అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. శాస్త్రవేత్త డాక్టర్ నసీరుద్దీన్ మాట్లాడుతూ.. అనంతపురం పరిశోధన కేంద్రం హై క్లియరెన్స్ ట్రాక్టర్ టైర్ సాధనాలను ప్రవేశపెట్టిందన్నారు. మొక్కలకు ఎలాంటి నష్టం కలగదన్నారు. వర్క్‌షాపులో ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిశోధన సంచాలకులు పి.సత్యనారాయణ, వ్యవసాయ ఉప సంచాలకులు బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



హై క్లియరెన్స్ ట్రాక్టర్ టైర్ సాధనాలతో ఆముదం పంటలో చేస్తున్న అంతర కృషి

మీడియా పాయింట్

అన్ని స్థానాలూ గెలుస్తాం



ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఐదింటినీ కూటమి గెలుచుకుంటుంది. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సోము వీర్రాజు 40 ఏళ్లుగా పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తున్నారు. శాసనమండలిలో అనేక అంశాలపై పోరాటం చేశారు. ఇక ముందు కూడా ప్రజాగళమై వ్యవహరిస్తారు. ఏపీని సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం.

– సత్యకుమార్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి

టీడీపీలో బలహీనవర్గాలకు అగ్రతాంబూలం



టీడీపీలో మొదటి నుంచీ బలహీనవర్గాలకు అగ్రతాంబూలమే. ప్రజలు టీడీపీపై ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు పనిచేస్తాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు, విధ్వంసాన్ని మండలి వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్తాను.

– బీద రవిచంద్రయాదవ్, టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



నన్ను శాసనమండలి అభ్యర్థిగా ఎంపిక చేసిన బీజేపీ కేంద్ర న్యాయకత్వానికి, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని కేంద్రం అన్ని విధాలుగా ఆదుకొంటుంది. అభివృద్ధి కార్యక్రమాలకు అడిగిందే తడవుగా కేంద్రం అంగీకారం తెలుపుతోంది.

– సోము వీర్రాజు, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి

వైఎస్సార్‌సీపీ పాలనలో కుర్చీ కూడా దక్కలేదు



వైఎస్సార్‌సీపీ బీసీలను అగౌరవపరిచింది. కార్పొరేషన్ చైర్మన్లు ఇచ్చినా, వారికి కుర్చీలు కూడా ఇవ్వకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవమానించింది. పేరుకే బీసీలు బ్యాక్‌బోన్ అంటూ ప్రచారం చేశారు. గత ఎన్నికల్లో బీసీలు వైఎస్సార్‌సీపీ కుట్రలు గ్రహించి గట్టి బుద్ధి చెప్పారు.

– బీటీ నాయుడు, టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి

లోకేశ్ 'లెక్కే' వేరు..!

- ఆయన చెప్పిన వారికే ఎమ్మెల్సీ సీట్లు
- సన్నిహితుడైన బీద రవిచంద్రకి మరోసారి అవకాశం
- రాజ్యసభ విషయంలోనూ సానా సతీష్‌కు ఛాన్స్
- నామినేటెడ్ పదవుల్లోనూ ఆయన చెప్పిందే వేదం
- గొల్లుమంటున్న సీనియర్లు..

సాక్షి, అమరావతి: టీడీపీలో పదవులు ఒకప్పుడు చంద్రబాబు ఇష్ట ప్రకారం లభించేవి. రకరకాల సమీకరణలు, ప్రాధాన్యతలు, ఆర్థిక వ్యవహారాలను బట్టి పదవులను కట్టబెట్టేవారు. కానీ ఇప్పుడు ఆయన తనయుడు లోకేశ్ ఆశీస్సులు ఉంటేనే పదవులు వస్తాయని టీడీపీలో కింది స్థాయి కార్యకర్తలు సైతం చెబుతున్నారు. ఆయన ఆశీస్సులు ఉండాలంటే ఆర్థికంగా బలవంతులై ఉండాలనే సూత్రం చాలాకాలం నుంచి అమలవుతోంది. గత ఎన్నికల్లో సీట్లు డబ్బు మూటలిచ్చిన వాళ్లకే ఇచ్చారని ఆ పార్టీలోనే బహిరంగంగానే ఆరోపణలు వినిపించాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక మంత్రి పదవులకూ అదే సూత్రాన్ని పాటించినట్లు పార్టీ సీనియర్ నేతలు వాపోయారు.

ఆయన కోటరీకే ఎమ్మెల్సీ పదవులు

ఇప్పుడు ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులోనూ అదే పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. టీడీపీకి మూడు పదవులు దక్కితే మూడు లోకేశ్‌కి అత్యంత విధేయులుగా ఉన్న వారికే లభించాయి. నెల్లూరు జిల్లాకు చెందిన బీద రవిచంద్ర లోకేశ్ కోటరీలో కీలక వ్యక్తి కావడంతోపాటు ఆర్థికంగా బలమైన వ్యక్తి. ఈ నేపథ్యంలోనే రవిచంద్రకు ఎమ్మెల్సీ పదవి వెతుక్కుంటూ వచ్చినట్లు టీడీపీ నాయకులు చెబుతున్నారు. బీటీ నాయుడు కూడా లోకేశ్‌కు దగ్గరి వ్యక్తి కావడంతోపాటు ఆర్థిక పరిపుష్టి కలిగిన నాయకుడే. కావలి గ్రీష్మ లోకేశ్ కోటరీకి చెందిన నేతే. మహానాడులో బూతులు తిడుతూ తొడ కొట్టిన నాయకురాలు కావడంతో ఆమెకు ఎమ్మెల్సీ సీటు కేటాయించారు. ఉత్తరాంధ్రలో అనేక మంది సీనియర్ నేతలు, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నేతలుంటే అంత చురుగ్గా పని చేయని గ్రీష్మకు ఎమ్మెల్సీ పదవి దక్కడానికి చినబాబు ఆశీస్సులు ఉండడమే ప్రధాన కారణమని తెలుస్తోంది.

రాజ్యసభ స్థానాల్లోనూ అంతే

మూడు రాజ్యసభ స్థానాల్లో టీడీపీకి రెండు దక్కగా ఆ రెండింటినీ ధన బలం ఉన్నా సానా సతీష్‌బాబు, బీద మస్తాన్‌రావుకి ఇచ్చారు. సానా సతీష్‌బాబు.. లోకేశ్ కోటరీలో ప్రస్తుతం అత్యంత కీలకమైన వ్యక్తిగా ఉన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీకి భారీగా నిధులు సమకూర్చారు. బీద మస్తాన్‌రావు కూడా డబ్బు మూటలతో వచ్చిన వ్యక్తేనని టీడీపీ నేతలే చెబుతున్నారు. అధికారం కోసం పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరారు.

చినబాబు ఆశీస్సులు ఉంటే.. చింత అక్కర్లేదు..

మరోవైపు నామినేటెడ్ పదవుల విషయంలోనూ లోకేశ్ చెప్పిన వారికే పదవులు వచ్చాయి. కార్పొరేషన్ చైర్మన్లు, సభ్యులు, ఇతర పదవులను ఆయన ఇచ్చిన జాబితా ప్రకారమే కేటాయించారు. పదవుల కోసం ఎవరైనా చంద్రబాబు వద్దకు వెళితే ఆయన తన కొడుకును కలవమని చాలామంది నేతలకు చెప్పినట్లు సమాచారం. దీంతో సీనియర్లు చంద్రబాబు మారిపోయాడని, ఆయన కొడుకును కలవాల్సిన అవసరం ఏమిటని భావించి వెళ్లలేదు. కొందరు వెళ్లి కలిసినా, ప్రయోజనం లేదని చెబుతున్నారు. మొత్తంమీద ఈ పరిణామాలు పార్టీలో సీనియర్లకు ఆందోళన కలిగిస్తున్నాయని సమాచారం.

మీడియా పాయింట్

మా రక్తంలో టీడీపీ ఆదర్శవంతమైన సిద్ధాంతాలున్నాయి

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కావలి గ్రీష్మ



సాక్షి, అమరావతి: 'మా రక్తంలో టీడీపీ ఆదర్శవంతమైన సిద్ధాంతాలు ఇమిడి ఉన్నాయి. బూతులు మాట్లాడితే మంత్రి పదవులు ఇస్తారన్న కల్చర్ వైఎస్సార్‌సీపీది. మహానాడులో నేను ఎందుకు మాట్లాడానో అప్పుడు చెప్పాను.. ఇప్పుడు చెప్పాను. నిండు గర్భిణీ, దళిత మహిళను అయిన నన్ను అవమానించేలా 'సాక్షి'లో కథనం రాయటం చాలా దురదృష్టకరం' అని తాజాగా టీడీపీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం దక్కించుకున్న కావలి గ్రీష్మ అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక సమస్యలను మండలిలో ప్రస్తావిస్తానని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో పది కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 79,478 మంది స్వామివారిని దర్శించుకోగా 26,667 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.05 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

లక్ష్మీహయగ్రీవ పూజ

పొదలకూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని మండల కేంద్రం పొదలకూరులోని శ్రీలక్ష్మి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం అత్యంత వైభవంగా లక్ష్మీహయగ్రీవ పూజ నిర్వహించారు. త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో రుత్వికులు హయగ్రీవ యాగం చేశారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణతులసీదళార్చన



సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీదళార్చన చేశారు. ఘనంగా నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల దాతృత్వం



మర్రిపాడు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమవారం పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ సహకారంతో నెల్లూరులోని జనహిత వాత్సల్య ఫౌండేషన్‌కు రూ.25 వేల నగదును విరాళంగా అందజేశారు. విద్యార్థుల్లో మానవీయతను పెంపొందించేందుకు పాకెట్ మనీలో కొంత భాగాన్ని పొదుపు చేసి అనాథ పిల్లలకు అందజేయాలని ఆంగ్ల ఉపాధ్యాయిని సీహెచ్ కళ్యాణి సూచించారు. ఈ ఆలోచనను స్వీకరించిన విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీలో కొంత మొత్తాన్ని పొదుపు చేశారు. ఉపాధ్యాయులు సైతం తమవంతు నగదును ఇచ్చారు. ఇలా సమకూరిన మొత్తాన్ని వాత్సల్య ఫౌండేషన్‌కు విరాళంగా అందజేశారు.

రేపటి నుంచి ఏపీఈసెట్‌కు దరఖాస్తులు

తిరుపతి సిటీ: ఏపీ ఈసెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. బీటెక్ కోర్సు రెండో ఏడాదిలో నేరుగా ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఏపీఈసెట్‌కు వచ్చేనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లొమా, బీఎస్సీ (గణితశాస్త్రం)లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న, పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష మే 6వ తేదీ నిర్వహించనున్నారు.

ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020పై తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగిన రెండురోజుల జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. పలువురు విద్యావేత్తలు నూతన జాతీయ విద్యావిధానంపై ప్రసంగించారు.

బీఈడీ పరీక్షల్లో నలుగురి డిబార్

వెంకటాచలం: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థుల్ని డిబార్ చేశారు.

ఒత్తిడి ఉంటేనే కొన్ని పనులు పూర్తవుతాయని కొందరి అభిప్రాయం. కానీ అది మితిమీరితే వచ్చే దుష్పరిణామాలు అన్నీ ఇన్నీ కావు. ఆ కాసేపు ఒత్తిడిని భరిస్తే సరిపోతుంది కదా అని సరిపెట్టుకోవాలనుకునేవారు మరికొందరు. కానీ అప్పటి ఒత్తిడి... ఆ అనంతరం కాలంలోనూ తన దుష్ప్రభావాలను చూపుతుంది. అంతేకాదు... మానసిక ఒత్తిడి అన్నది అలా చాలాకాలం పాటు అలా కొనసాగుతుంటే అది శారీరకంగా కూడా అనేక సమస్యలను... ముఖ్యంగా అనేక ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. మానసిక ఒత్తిడి తెచ్చిపెట్టే అనేక శారీరక సమస్యలూ, వ్యాధుల గురించి తెలుసుకుందాం.

మానసిక ఒత్తిడి... శారీరక సమస్యలు!

ఒత్తిడి ఎప్పుడూ తాత్కాలికం కాదు. దాని వల్ల శరీరంలో అనేక ప్రతికూలమైన మార్పులు వస్తాయి. అన్నిటికంటే ముందు ప్రభావితమయ్యేది మన వ్యాధి నిరోధక వ్యవస్థ. దాంతో అది అనేక జబ్బులకూ, శారీరక సమస్యలకు తావిస్తుంది. ఫలితంగా ఎన్నిరకాల వ్యాధులు వస్తాయో చూద్దాం.

ప్రధాన ప్రభావం... వ్యాధి నిరోధక వ్యవస్థపైనే!

మామూలుగా ఎవరికైనా ఎక్కడైనా గాయమైనప్పుడు అక్కడ ఇన్‌ఫ్లమేషన్ రావడం (వాపు వచ్చి ఎర్రబారి మంటగా అనిపించడం) మామూలే. సాధారణంగా దేహంలో ఎక్కడ గాయమైనప్పటికీ ఇలా జరుగుతుంది. గాయాన్ని మానేలా చేయడమనే ప్రక్రియలో వ్యాధి నిరోధక వ్యవస్థ ద్వారా కార్యకలాపాల వల్ల ఇలా వాపు, మంట రావడమనేవి సహజంగా జరుగుతాయి. ఆ తర్వాత అవి మెల్లగా తగ్గిపోతాయి. అయితే ఎవరిలోనైనా అపరిమితమైన ఒత్తిడి ఉన్నప్పుడు ఇన్‌ఫ్లమేషన్ మానడం అనేది బాగా ఆలస్యమవుతుంది. ఈ విషయం కార్నెగీ మెలాన్ యూనివర్సిటీకి చెందిన షెల్డన్ కోహెన్ అనే అధ్యయనవేత్త ఆధ్వర్యంలో జరిగిన అధ్యయన ఫలితాల ద్వారా స్పష్టంగా వెల్లడయ్యింది. ఈ అధ్యయన ఫలితాలు నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తాలూకు మార్గదర్శకాల్లో చోటుచేసుకున్నాయి కూడా. ఒత్తిడి అన్నది శరీరంపై ఎలా దుష్ప్రభావం చూపుతుందన్న విషయం మొదటిసారిగా స్పష్టమైన తార్కాణాలతో వెలుగుచూసింది.

నిజానికి ఎవరిలోనైనా ఇన్‌ఫ్లమేషన్ వచ్చినప్పుడు కార్టిజోల్ అనే హార్మోన్ విడుదలై, అది వ్యాధి నిరోధక అంశాలను ప్రేరేపిస్తుంది. దాంతో ఆ నిరోధక అంశాలు మెల్లగా ఇన్‌ఫ్లమేషన్‌ను నియంత్రిస్తాయి. దాంతో ఇన్‌ఫ్లమేషన్ త్వరగా తగ్గిపోవాలి. కానీ అదేపనిగా చాలాకాలం పాటు ఒత్తిడి కొనసాగుతూ పోతూ ఉంటే ఆ కారణంగా వ్యాధి నిరోధక అంశాలు కార్టిజోల్ వల్ల సరిగా ప్రేరణ చెందవు. ఫలితంగా ఇన్‌ఫ్లమేషన్ తగ్గదు. ఇది మాత్రమే కాకుండా... ఇంకొన్ని ఉదాహరణల ద్వారా కూడా ఈ థియరీ వాస్తవమని తేలింది. సాధారణంగా ఎవరికైనా జలుబు వస్తే, ఒకటి రెండు రోజుల్లో అది దానంతట అదే తగ్గుతుంది. కానీ దీర్ఘకాలం పాటు ఒత్తిడికి గురయ్యే వారిలో జలుబు తగ్గడానికి చాలాకాలం పడుతుంది. ఒత్తిడి ప్రభావం కారణంగా వ్యాధినిరోధక అంశాలపై ప్రతికూల ప్రభావాలు పడటమే ఇందుకు కారణం. ఇలా చూసినప్పుడు మానసికమైన ఒత్తిడి కేవలం మానసికంగానే కాకుండా అది శారీరక సమస్యలైన స్థూలకాయం వంటి వాటిని తెచ్చిపెడుతుంది. ఇలా ఒక్క బరువు పెరగడమనే కారణమే కీళ్లనొప్పులూ వంటి ఇంకా ఎన్నో సమస్యలకు దారితీస్తుందన్న విషయం తెలిసిందే. అంతేకాదు... గుండెజబ్బులు, డయాబెటిస్, జీర్ణకోశ సమస్యలు, డిప్రెషన్, ఆస్తమా, అల్జైమర్స్ వంటి వ్యాధులకు దారితీస్తుందని పరిశోధకులు స్పష్టంగా తెలుసుకున్నారు.





డాక్టర్ ప్రవీణ్ కుమార్ కులకర్ణి
సీనియర్ కన్సల్టెంట్
ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్

ఒత్తిడి ఉన్నట్లు గుర్తించడమిలా...

కొందరు వ్యక్తులు నిత్యం ఒత్తిడికి గురవుతున్నప్పుడు వాళ్లలో తీవ్రమైన ఒత్తిడి ఉన్న విషయమే వారికి తెలియకపోవచ్చు. కానీ కొన్ని శారీరక లక్షణాలతో వారు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న విషయం తెలుస్తుంది. ఆ లక్షణాలివి.. ● ఆకలి లేకపోవడం ● బాగా ఆలస్యంగా నిద్రపట్టడం లేదా అస్సలు నిద్రపట్టకపోవడం (నిద్రలేమి) ● మాటిమాటికీ తలనొప్పి వస్తుండటం ● తరచూ కండరాలు పట్టేస్తుండటం (మజిల్ క్రాంప్స్) ● తరచూ గ్యాస్, కడుపులో మంట వంటి జీర్ణకోశ సమస్యలు ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నప్పుడు ఇవి చాలా సాధారణంగా కనిపించేవే కదా అని నిర్లక్ష్యం చేయకూడదు.



ఒత్తిడి కారణంగా వచ్చే కొన్ని సమస్యలివి...

● **తలనొప్పి :** తీవ్రమైన ఒత్తిడి కలిగినప్పుడు తలనొప్పి రావడమనేది చాలామందిలో చాలా సాధారణంగా కనిపిస్తుండటాన్ని చూస్తుంటాం. భరించలేని ఒత్తిడి కలిగినప్పుడు తలనొప్పులతో పాటు కొందరిలో అది మైగ్రేన్‌ను ప్రేరేపించడమూ జరుగుతుంటుంది. ఇందుకోసం నొప్పి నివారణ మందులు వాడటంతో కిడ్నీ ఫెయిల్యూర్ లాంటి మరికొన్ని సమస్యలు రావడాన్ని వైద్యులు చూస్తుంటారు. ఇలా ఒత్తిడితో వచ్చే సమస్యను ఎదుర్కోవడంలో ఇంకొన్ని సమస్యలు వస్తుండటం వంటి క్యాస్కేడింగ్ ఎఫెక్ట్ చాలామందిలో కనిపించే అంశమే.

● **యాంగ్జైటీ, డిప్రెషన్ :** ఒత్తిడికి గురైన వారు తీవ్రంగా ఉద్వేగాలకు లోనవుతుంటారు. భావోద్వేగాలకు గురైన వారు క్షణికావేశంలో అనేక ప్రతికూల నిర్ణయాలు తీసుకోవడం కనిపిస్తుంది. ఒత్తిడి కారణంగా తీవ్రమైన యాంగ్జైటీకి లోనుకావడం, ఆ యాంగ్జైటీలోని తొందరపాటుతో అనేక సమస్యలు రావడమన్నది చాలామందిలో చూస్తుంటాం. ఇలా భావోద్వేగాలకు గురయ్యేవారిలో దాదాపు 80 శాతం మందికి పైగా తమ వృత్తి (ప్రొఫెషన్) కారణంగా తీవ్ర ఒత్తిడికి లోనై అనేక ప్రతికూల నిర్ణయాలకు పాల్పడుతుంటారు. కాలక్రమంలో ఆ ఒత్తిడి క్రమంగా తీవ్ర నిరాశ, నిస్పృహలకూ అనంతరం అది డిప్రెషన్‌కు దారితీస్తుంది. మన సమాజంలో ఇలాంటి ఉదాహరణలకు అంతేలేదు.


● **జీర్ణకోశ సమస్యలు :** ఒత్తిడి కారణంగా మెదడులో జరిగే మార్పులకూ... దాంతో జీర్ణవ్యవస్థలో కలిగే పరిణామాలకూ దగ్గరి సంబంధముందని ఇటీవల అనేక పరిశోధనల్లో, పరిశీలనల్లో వెల్లడైంది. ఒత్తిడికి గురయ్యేవారిలో చాలామందిలో జీర్ణకోశ సమస్యలు కనిపిస్తుండటం చాలా సాధారణం. ఒత్తిడికి గురికాగానే కడుపులో యాసిడ్స్ స్రవించి మంట రావడం చాలామందికి అనుభవంలోకి వచ్చే విషయమే. ఇలా సుదీర్ఘకాలంలో యాసిడ్ వల్ల మంటలు వస్తుండటం కాలక్రమేణా కడుపులో అల్సర్స్‌కు దారితీయవచ్చు. కడుపులో యాసిడ్ ఎక్కువగా స్రవించగానే దాని ప్రభావం పైకి తన్నడం వల్ల గొంతులోకి మంట రావడం, ఛాతీలో నొప్పి రావడం చాలామందిలో కనిపించేదే. చాలామంది ఆ మంటను కొన్నిసార్లు గుండె పోటుగా అనుమానించడమూ జరుగుతుంటుంది. ఇలా చాలాకాలం పాటు గ్యాస్ పైకి ఎగదన్నుతుండే వారిలో గ్యాస్ట్రిక్ ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ (జీఈఆర్‌డీ) అనే సమస్య కనిపిస్తుంటుంది. ఈ దుష్పరిణామాలన్నీ ఒత్తిడి కారణంగానే జరుగుతాయన్న విషయం గుర్తుంచుకోవాలి. మెదడులో ఒత్తిడి ప్రభావంతో జీర్ణవ్యవస్థ (గట్) దెబ్బతింటుందనీ... అలాగే గట్ ఆరోగ్యం బాగుంటేనే మళ్లీ మానసిక ఆరోగ్యం బాగుంటుందనీ... ఇదొక సైకిల్‌లా జరుగుతుందనేది ఇటీవల చాలా పరిశోధనల్లో వెల్లడైన వాస్తవం.







● **ఆస్తమా :** తీవ్రమైన ఒత్తిడి ఊపిరి అందకుండా చేసే ఆస్తమాను ప్రేరేపిస్తుందని వైద్య పరిశోధనల్లో అనేక సార్లు వెల్లడైంది. ఇలా జరగడాన్ని సైకలాజికల్ ఇండ్యూస్‌డ్ ఆస్తమా అంటారు. నిజానికి పెద్దల్లో ఒత్తిడి కలగడం వల్ల అది వాళ్లకు మాత్రమే పరిమితం కాదు... తల్లిదండ్రుల ఒత్తిడి చూసి, పిల్లలూ తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. దాంతో అది వారి చిన్నపిల్లల్లోనూ ప్రతికూల ప్రభావం చూపి, ఆ చిన్నారుల్లోనూ ఆస్తమా రూపంలో వ్యక్తమయ్యే అవకాశమున్నట్లు అనేక అధ్యయనాల్లో వెల్లడైంది. తీవ్రమైన ఒత్తిడి అనుభవిస్తున్న గర్భవతులనూ, అలాగే తీవ్రమైన కాలుష్యం నెలకొని ఉన్న పరిసరాల్లో నివసిస్తున్న ఇంకొందరిని ఒక అధ్యయనం కోసం ఎంపిక చేశారు. ఈ అధ్యయన ఫలితాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగించేలా ఉన్నాయి. నిజానికి కాలుష్యపు పొగకు గురైన గర్భిణులకు పుట్టిన సంతానం కంటే... తీవ్రమైన ఒత్తిడికి లోనైన గర్భవతులకు పుట్టిన పిల్లల్లో చాలా మందికి ఆ తర్వాతికాలంలో ఆస్తమా వస్తుండటం పరిశోధకలను అబ్బుర పరిచింది. అంటే కాలుష్య ప్రభావం కంటే తీవ్రమైన ఒత్తిడి తాలూకు ప్రతికూల ప్రభావాలే ఎక్కువనేది గత కొంతకాలం కిందట తెలిసి వచ్చిన వాస్తవం.



● **గుండెజబ్బులు :** తీవ్రమైన ఆవేశానికి లోనైనవాళ్లు గుండెపట్టుకుని కుప్పకూలిపోతుండటం సినిమాల్లో చాలా తరచుగా చూసే దృశ్యం. అయితే అది పూర్తిగా సత్యదూరం కాదంటున్నారు పరిశోధకులు. ఏవైనా సమస్యల ఒత్తిడి కారణంగా గట్టిగా అరుస్తుండేవాళ్లు, త్వరగా వాదనల్లోకి దిగేవాళ్లు, త్వరగా కోపగించుకునేవాళ్లలో అనేక మంది ఆ ఒత్తిడి తాలుకు దుష్ప్రభావానికి లోనై గుండె జబ్బులు తెచ్చుకుంటారనేది నిపుణుల మాట. ఒత్తిడి తాలూకు ప్రతికూల ఫలితాలు గుండెజబ్బుల రూపంలో వ్యక్తమవుతుంటాయంటున్నారు కొందరు పరిశోధకులు. గుండెజబ్బులు ఉన్న వారిలో చాలామందిని పరిశీలించి, వారిపై అధ్యయనాలు నిర్వహించినప్పుడు వాళ్లలో నిత్యం భావోద్వేగాలకు లోనయ్యేవాళ్లు, త్వరగా కోపం వచ్చేవారే ఎక్కువగా ఉంటారని ఆ అధ్యయన ఫలితాల్లో తేలింది. అలా ఒత్తిడికి గురయ్యేవారిలో దీర్ఘకాలిక గుండెజబ్బులు వస్తుండటంతో పాటు అవే ఒక్కోసారి గుండెపోటుకు దారితీస్తాయంటున్నారు అధ్యయనవేత్తలు, గుండెజబ్బుల నిపుణులు.




● **స్థూలకాయం :** శరీరంలోని మిగతా భాగాలతో పోలిస్తే... సాధారణంగా పొట్ట, తొడలు, పృష్ఠభాగం(హిప్స్) వంటి భాగాల్లోనే కొవ్వు ఎక్కువగా పేరుకుంటుంది. వీటన్నింటిలో తొడలు, పృష్ఠభాగంలో పేరుకునే కొవ్వు కంటే... పొట్టలో పేరుకునే కొవ్వు వల్ల తీవ్రమైన హాని కలుగుతుందంటున్నారు నిపుణులు. అయితే ఇలా పొట్టభాగంలో కొవ్వు పేరుకోవడమన్నది... ఒత్తిడి అనుభవించే వారిలోనే ఎక్కువగా జరుగుతుందని స్పష్టమైందని అధ్యయనవేత్తలు వెల్లడిస్తున్నారు. మామూలుగా ఇతర చోట్లలో కొవ్వు పేరుకునేవారికంటే పొట్టలో కొవ్వు పేరుకోవడం వల్ల (ఆబ్డామినల్ ఒబేసిటీ) వల్ల ఎక్కువగా హాని జరుగుతుందని తేలడం వల్ల... ఒత్తిడి అనేది మొదట పొట్టభాగంలో కొవ్వు ఎక్కువగా పేరుకునేందుకు దారితీయడంతో పాటు ఆ తర్వాత అది గుండెజబ్బుల వంటి వాటి ద్వారా తీవ్రమైన హానిచేస్తుందని అనేక పరిశోధనల్లో తేలింది.



● **డయాబెటిస్ :** తీవ్రమైన మానసిక ఒత్తిడి డయాబెటిస్‌కు దారితీయవచ్చన్న విషయం అందరికీ తెలిసిందే. మళ్లీ ఇది రెండు రకాలుగా బాధిస్తుంది. డయాబెటిస్ కారణంగా పెరిగే ఆకలి వల్ల అప్పటికప్పుడు దొరికే... తినడానికి ఆరోగ్యకరం కాని ఆహార పదార్థాలైన వేపుళ్లు, నిల్వ పదార్థాలూ, బేకరీ ఐటమ్స్ తినేలా చేస్తుంది. ఇవి తిన్న తర్వాత మళ్లీ రక్తంలో గ్లూకోజ్ మోతాదులు పెరగడంతో బాధితులు అనారోగ్యానికి గురవుతారు. డయాబెటిస్ కారణంగా ఇదొక సైకిల్‌లా సాగుతూ అనారోగ్యానికీ, చక్కెర పెరుగుదలకూ దారితీస్తుంది.



● **వయసు త్వరగా పైబడటం :** ఒత్తిడి వల్ల వయసు పైడాల్సిన సమయం కంటే ముందే వృద్ధులైపోయే మరో దుష్పరిణామానికి అవకాశముంది. తల్లుల, పిల్లల డీఎన్ఏలను పరిశీలిస్తూ జరిగిన ఒక అధ్యయనంలో ఈ ఫలితాలు స్పష్టమయ్యాయి. ఒత్తిడికి గురైన వారు, వారి తల్లిదండ్రులతో పోలిస్తే మీరే త్వరగా వృద్ధాప్య దశకు చేరుకున్నట్లు ఆ అధ్యయన ఫలితాలు పేర్కొంటున్నాయి. నిర్దిష్టంగా చెప్పాలంటే తీవ్రమైన ఒత్తిడితో బాధపడుతున్న కొందరు ఆ వయసుకు కనపడాల్సిన లక్షణాలను చాలా త్వరగా అంటే... 9 నుంచి 17 ఏళ్ల ముందుగానే కనబరుస్తున్నట్లు ఆ అధ్యయన ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.





● **అల్జైమర్స్ డిసీజ్ :** ఒత్తిడి వల్ల మెదడులో కలిగే గాయాలు తీవ్రమై అల్జైమర్స్ డిసీజ్‌కు దారితీస్తుందని కొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఒత్తిడి వల్ల అల్జైమర్స్ డిసీజ్ తీవ్రం కావడంతో పాటు దానివల్ల వచ్చే మరుపు మరింత వేగవంతం కావడం చాలా త్వరత్వరగా జరుగుతుంది. అంటే ఒత్తిడి లేనివారిలో అల్జైమర్స్ డిసీజ్ కాస్త ఆలస్యమైతే... ఒత్తిడి వల్ల అది రావాల్సిన సమయం కంటే ముందుగా వచ్చే అవకాశాలూ ఉన్నాయని స్పష్టమవుతోంది.


● **చాలా ముందుగా మరణించడం (ప్రీ-మెచ్యూర్ డెత్) :** ఒకరి ఆరోగ్య పరిస్థితిని బట్టి వారిలో మరణం ఎప్పుడు సంభవించవచ్చో కొంతమేరకు అంచనా వేయడం చాలా సాధారణ ప్రజలు కూడా చేస్తుంటారు. ఉదాహరణకు 'ఆయన ఇప్పుడే చనిపోవాల్సిన వ్యక్తి కాదు. ఇంకా చిన్నవయసు' లాంటి వ్యాఖ్యానాలు చేస్తుండటం కొందరి విషయంలో వింటుండటం పరిపాటే. తీవ్రమైన దీర్ఘకాలిక ఒత్తిడికి లోనయ్యేవారిలో మరణం చాలా ముందుగానే వస్తుందని అధ్యయనవేత్తలు హెచ్చరిస్తున్నారు.

అధిగమించడం మేలు... అది చేయాల్సిందిలా...

మానసిక ఒత్తిడి వల్ల కలిగే శారీరకంగానూ సమస్యలు ఎదురవుతాయని గుర్తించినప్పుడు చేయాల్సిందల్లా ఆ సమస్యను అధిగమించడానికీ లేదా నియంత్రించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. దీనివల్ల చాలా ప్రయోజనాలే ఉంటాయని తేలింది.ఉదాహరణకు మొదటిసారి గుండెపోటుకు గురైనవారు, ఒత్తిడిని బాగా నియంత్రించుకోగలిగితే 74 శాతం మందిలో రెండో స్ట్రోక్ రాకుండా నివారించుకోగలగడం సాధ్యమేనని కొన్ని అధ్యయనాల్లో తేలింది. పైగా ఇలా ఒత్తిడి నియంత్రణ కారణంగా వ్యాధి నిరోధకశక్తి కూడా పెరిగి అది కూడా జబ్బులను దూరం చేస్తుందని నిరూపితమైంది. ఒత్తిడిని అధిగమించడానికి అనుసరించాల్సిన మార్గాలివి...

● ఏ కారణంగా ఒత్తిడి కలుగుతుందో గుర్తించి, దాని నుంచి దూరంగా ఉండటం. ఉదాహరణకు ఒక వృత్తి వల్ల ఒత్తిడి పెరుగుతుందని గుర్తిస్తే, ఒకవేళ ప్రొఫెషన్‌ను పూర్తిగా మార్చుకునే అవకాశం ఉంటే దాన్ని మార్చుకోవడమే మేలు. అలా మార్చుకునే అవకాశం లేకపోతే ఒత్తిడిని అధిగమించడానికి కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించడం అవసరం. అవి... ● బ్రీతింగ్ వ్యాయామాలు చేయాలి. దాంతోపాటు యోగా వంటి రిలాక్సేషన్ టెక్నిక్స్ అవలంబించాలి ● ఏదైనా అంశం తీవ్రంగా బాధపెడుతుండటం లేదా పదే పదే గుర్తుకొస్తూ పశ్చాత్తాపానికి గురిచేస్తుంటే మరో వ్యాపకంలో పడిపోయి దాన్ని మరచిపోయి, ఒత్తిడి నుంచి విముక్తం కావడానికి ప్రయత్నించడం ● పరిస్థితులను సానుకూల దృక్పథంతో చూడాలి. సమస్యలను అధిగమించాల్సిన పరిస్థితుల్లో ఏ మార్గం ద్వారా వాటిని పరిష్కరించుకోవచ్చో తెలుసుకోవాలి. లేదంటే ఆ పరిస్థితిని అధిగమించడానికి తోడ్పడే నిపుణులను సంప్రదించాలి ● దేహానికి అవసరమైన వ్యాయామాలు చేయాలి. దీని వల్ల మెదడులో దేహాన్ని రిలాక్స్ చేసే, ఆహ్లాదంగా ఉంచే రసాయనాలు విడుదలవుతాయి. ఇవి ఒత్తిడిని తగ్గిస్తాయి.

ఇవేవీ పనిచేయనప్పుడు అవసరమైతే వృత్తినిపుణులైన సైకాలజిస్టులు, కౌన్సెలర్స్‌ను సంప్రదించాలి.



బిజినెస్ రీల్

హోండా కార్స్ ఇండియా ప్రెసిడెంట్‌గా టకాషీ



న్యూఢిల్లీ: వాహన తయారీలో ఉన్న జపాన్ సంస్థ హోండా మోటార్‌కో అనుబంధ కంపెనీ హోండా కార్స్ ఇండియా కొత్త ప్రెసిడెంట్, సీఈవోగా టకాషీ నాకజీమా నియమితులయ్యారు. 2025 ఏప్రిల్ 1న ఈ పదవిని స్వీకరిస్తారు. హోండా కేంద్ర కార్యాలయానికి బదిలీ అయిన టకుయా సమూరా స్థానంలో ఆయన బాధ్యతలను చేపట్టనున్నారు. నాకజీమా 2021 నుండి హోండా మోటార్ రష్యా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. జపాన్ మార్కెట్లో హోండా ఆటోమొబైల్ వ్యాపారం కోసం ఉత్పత్తి ప్రణాళిక, మార్కెటింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్‌కు కూడా ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. నాకజీమా 1994లో హోండాలో చేరారు. మూడు దశాబ్దాలకుపైగా సంస్థలో వివిధ బాధ్యతలు నెరవేర్చారు. అనేక అంతర్జాతీయ మార్కెట్లలో వ్యాపార, ఉత్పత్తి ప్రణాళిక, మార్కెటింగ్, అమ్మకాల వంటి విభాగాల్లో వివిధ పదవులలో పనిచేసిన అపార అనుభవం ఆయన ప్రత్యేకత.

జొమాటో మాతృ సంస్థగా ఎటర్నల్

న్యూఢిల్లీ: జొమాటో లిమిటెడ్ తన కార్పొరేట్ పేరును ఎటర్నల్ లిమిటెడ్‌గా మార్చడానికి అధికారికంగా వాటాదారుల ఆమోదం పొందింది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. క్విక్ కామర్స్ కార్యకలాపాలను వైవిధ్యపరచాలనే ప్రయత్నంలో ఇది ముఖ్యమైన అడుగును సూచిస్తుందని కంపెనీ తెలిపింది. అయితే ఈ మార్పు కార్పొరేట్ సంస్థకు మాత్రమే వర్తిస్తుంది. జొమాటో బ్రాండ్ లేదా యాప్‌నకు కాదు. కంపెనీ తన ఫుడ్ డెలివరీ సేవలను జొమాటో పేరుతో కొనసాగించనుంది. ఎటర్నల్ కింద ప్రస్తుతానికి నాలుగు ప్రధాన వ్యాపారాలు జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్ ఉన్నాయి.

మహిళా క్రికెట్‌కు మద్దతుగా యూనిలీవర్ బ్రాండ్లు

ఐసీసీతో యూనిలీవర్ వాణిజ్య భాగస్వామ్యం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)తో ఎఫ్‌ఎంసీజీ సంస్థ యూనిలీవర్ వాణిజ్య భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. 2027 చివరి వరకు మహిళా క్రికెట్ ఈవెంట్లకు యూనిలీవర్ పాపులర్ బ్రాండ్లు అయిన రెగ్జోనా, డవ్ వాణిజ్య భాగస్వాములుగా వ్యవహరించనున్నాయి. అలాగే, మహిళల క్రికెట్‌కు సంబంధించి అంతర్జాతీయంగా 'క్రియో' కార్యక్రమాల్లోనూ రెగ్జోనా పాలుపంచుకోనుంది. మహిళల క్రికెట్‌కు సంబంధించి ఇది తొలి వాణిజ్య భాగస్వామ్యమని ఐసీసీఐ చైర్మన్ జైషా ప్రకటించారు. దీనివల్ల వాణిజ్య సహకారమే కాకుండా, అంతర్జాతీయ వేదికపై మహిళా క్రికెట్‌ను బలోపేతం చేయొచ్చన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-3-2025

విశాఖ	415-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	410-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
RELIANCE	1,246.40	3.04
TATAMOTORS	647.5	1.23
BEL	276.2	1.19
BAJAJ-AUTO	7,551.00	1.19
HINDALCO	689.95	1.17

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	935	-3.78
NTPC	330.4	-2.22
SHRIRAMFIN	631	-2.07
INFY	1,685.00	-1.8
BPCL	260.49	-1.72

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	4,386
ఎన్‌ఎస్‌ఈ	77,908
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,40,266
ఎఫ్ఐఐ	- 2,035
డీఐఐ	+ 2,320

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	66.06	$	67.28
బ్రెంట్	69.30	$	70.54

భారత్‌కు ఏఐ నిపుణులు కావలెను

- మూడేళ్లలో 12 లక్షలకు నిపుణుల సంఖ్య
- దేశవ్యాప్తంగా కొరత 10 లక్షలకుపైమాటే
- బెయిన్ అండ్ కంపెనీ నివేదికలో వెల్లడి

2027 నాటికి 23 లక్షల ఉద్యోగావకాశాలు



సాక్షి, బిజినెస్ బ్యూరో: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్.. ప్రపంచం అంతా మాట్లాడుకుంటున్న హాట్ టాపిక్ ఇదే. అయితే ప్రపంచ ఏఐ నిపుణులకు కేంద్రంగా మారడానికి భారత్‌కు అవకాశాలు ఉన్నప్పటికీ.. ఈ రంగంలో నిపుణుల కొరతను దేశం ఎదుర్కొనబోతోందని మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బెయిన్ అండ్ కంపెనీ తన తాజా నివేదికలో వెల్లడించింది. పెరుగుతున్న నైపుణ్య అంతరం ఈ రంగంలో దేశ పురోగతికి ఆటంకం కలిగించే ప్రమాదం ఉందని తెలిపింది. 2027 నాటికి భారత ఏఐ రంగంలో 10 లక్షలకుపైగా నైపుణ్యం కలిగిన నిపుణుల కొరత తప్పదని జోస్యం చెప్పింది. అందుబాటులో ఉన్న నిపుణులతో పోలిస్తే 1.5-2 రెట్ల డిమాండ్ ఉంటుందని అంచనాగా వెల్లడించింది. సమస్య నుంచి గట్టెక్కాలంటే కంపెనీలు సంప్రదాయ నియామక విధానాలకు మించి ముందుకు సాగాలి. నిరంతర నైపుణ్యాల పెంపుదలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆవిష్కరణ-ఆధారిత పర్యావరణ వ్యవస్థను పెంపొందించాలి అని వివరించింది.

రీస్కిల్-అప్‌స్కిల్..

పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి భారత్‌లో శ్రామిక శక్తి నైపుణ్యం తిరిగి మెరుగుపరచడం, నైపుణ్యాలను పెంచడం అత్యవసరమని నివేదిక స్పష్టం చేసింది. 'అభివృద్ధి చెందుతున్న సాంకేతిక సాధనాలు, నైపుణ్యాలపై ప్రస్తుత నిపుణుల్లో ఎక్కువ మందిలో తిరిగి నైపుణ్యం మెరుగుపర్చడం, పెంచడంలో సవాళ్లతోపాటు అవకాశాలూ ఉన్నాయి' అని బెయిన్ అండ్ కంపెనీ ఏఐ, ఇన్‌సైట్స్, సొల్యూషన్స్ ప్రాక్టీస్ పార్ట్‌నర్, లీడర్ సైకత్ బెనర్జీ తెలిపారు. 'ప్రతిభ కొరతను పరిష్కరించడానికి బహుముఖ విధానం అవసరం. కంపెనీలు సంప్రదాయ నియామక పద్ధతులకు మించి అంతర్గత ప్రతిభను పెంపొందించడానికి నిరంతర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతిభ కొరత ఒక ముఖ్యమైన సవాల్. కానీ అధిగమించలేనిది కాదు. దీనిని పరిష్కరించడానికి వ్యాపార సంస్థలు ఏఐ ప్రతిభను ఆకర్షించడం, అభివృద్ధి చేయడం, నిలుపుకోవడంలో ప్రాథమిక మార్పు అవసరం' అని నివేదిక వివరించింది.

ఏఐ స్వీకరణలో వెనుకంజ..

ఆకర్షణీయంగా జీతాలు పెరిగినప్పటికీ అర్హత కలిగిన ఏఐ నిపుణుల సరఫరా డిమాండ్ వేగాన్ని అందుకోలేదు. ప్రతిభ అంతరం పెరగడం వల్ల పరిశ్రమల్లో ఏఐ స్వీకరణ మందగించే ప్రమాదం ఉందని నివేదిక వివరించింది. ఉత్పాదక ఏఐ సాంకేతికతలను అమలు చేయడానికి అంతర్గత ఏఐ నైపుణ్యం లేకపోవడం ఒక ప్రధాన అడ్డంకి అని ప్రపంచవ్యాప్తంగా సర్వేలో పాలుపంచుకున్న కంపెనీల ప్రతినిధులు వెల్లడించారు. ఈ కొరత కనీసం 2027 వరకు కొనసాగుతుందని, అంతర్జాతీయ మార్కెట్లలో వివిధ స్థాయిల్లో ప్రభావం ఉంటుందని అంచనాగా చెప్పారు. దేశంలో 2019 నుండి ఏఐ సంబంధిత ఉద్యోగ నియామకాలు ఏటా 21 శాతం దూసుకెళ్లాయి. అయితే వేతనాలు ప్రతి సంవత్సరం 11 శాతం పెరిగాయి.

ఏఐ అవకాశాలు: 2027 నాటికి 23 లక్షలకుపైమాటే. అంటే అందుబాటులో ఉన్న నిపుణులతో పోలిస్తే 1.5-2 రెట్లు అధిక డిమాండ్.

మూడేళ్లలో వనరులు: సుమారు 12 లక్షల మందికి చేరిక

నిపుణుల కొరత : 10 లక్షల మందికిపైగా

డిమాండ్ తీర్చాలంటే: మానవ వనరుల నైపుణ్యం తిరిగి మెరుగుపరచడం (రీస్కిల్), నైపుణ్యాలను పెంచడం (అప్‌స్కిల్) అత్యవసరం.

ఏఐ అభివృద్ధిలో వివక్ష!

- మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటమే కారణం
- మైక్రోసాఫ్ట్ అధికారి హిమానీ అగ్రవాల్ వ్యాఖ్యలు




న్యూఢిల్లీ: కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. దీంతో భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాలలో ప్రబలంగా ఉన్న సామాజిక వివక్ష శాశ్వతంగా పెరిగే ప్రమాదం ఉందని మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా చీఫ్ పార్ట్‌నర్ ఆఫీసర్ హిమానీ అగ్రవాల్ అన్నారు. 'మహిళలను చేర్చుకోవడం అనేది ఉమ్మడి బాధ్యత. విభిన్న దృక్కోణాలు లేకుండా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను (ఏఐ) రూపొందించడం కొనసాగితే.. నేటి వివక్ష రేపటి సాంకేతికతలోకి బలంగా మారే ప్రమాదం ఉంది. ఇది కేవలం సంఖ్యల సమస్య కాదు. మనం నిర్మిస్తున్న భవిష్యత్తు గురించి. ఏఐ ప్రపంచాన్ని రూపొందిస్తుంటే.. ఏఐని రూపొందిస్తున్న వ్యక్తులు ప్రపంచ వైవిధ్యాన్ని ప్రతిబింబించాలి' అని అభిప్రాయపడ్డారు. అందుకే మనం ముందుగానే అడుగు వేయాలని అన్నారు. ఏఐని ముందుకు నడిపించడానికి యువతులలో ఉత్సుకతను రేకెత్తించడం, మెంటార్‌షిప్ నెట్‌వర్క్‌లను బలోపేతం చేయడం, మహిళలకు నైపుణ్యాలు, నాయకత్వ అవకాశాలు ఉన్నాయని తెలియజెప్పాలని పిలుపునిచ్చారు.

ఒక కఠిన పనిగా.. ఉద్యోగ రంగంలోకి ప్రవేశించడం, నిలదొక్కుకోవడం చాలా మంది మహిళలకు ఒక కఠిన పనిగా అనిపిస్తుందని హిమానీ అగ్రవాల్ అన్నారు. మైక్రోసాఫ్ట్ ప్రధాన ఉద్యోగులలో మహిళలు 31.6 శాతం ఉన్నారని చెప్పారు. మరింత మంది మహిళలను చేర్చుకోవడం కోసం కంపెనీ చురుకుగా పనిచేస్తోందని ఆమె వివరించారు. సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండటం చాలా ముఖ్యమని చెప్పారు. అయితే ఈ విభాగంలో డిమాండ్ అధికంగా ఉన్నప్పటికీ మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని తెలిపారు. మహిళలు కేవలం ఉద్యోగ రంగంలోకి ప్రవేశించడమేగాక కెరీర్‌లో అభివృద్ధి చెందేలా చూసుకోవడంలో నిజమైన సవాల్, అవకాశం ఉందన్నారు. 'సాంకేతికత సమానత్వాన్ని అందించే శక్తిని కలిగి ఉంది. సౌకర్యవంత కెరీర్‌లు, విభిన్న ఉద్యోగ బాధ్యతలు అపరిమిత అవకాశాలను అందిస్తుంది. అయినప్పటికీ మధ్య స్థాయి నుండి నాయకత్వానికి కీలక మార్పు చాలా మంది మహిళలకు అడ్డంకిగా మిగిలిపోయింది. ఇక్కడే మహిళలను చేర్చుకునే సంస్కృతి మార్పును కలిగిస్తుంది' అని వివరించారు.

పన్నులు తగ్గించాలని ఎప్పుడూ అడగకండి

- ప్రభుత్వానికి నిధులు అవసరం
- లాజిస్టిక్స్ వ్యయాలు తగ్గిస్తాం
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ: పన్నులు తగ్గించాలంటూ ఎప్పుడూ డిమాండ్ చేయొద్దని, ఎందుకంటే పేద ప్రజల సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం ప్రభుత్వానికి నిధులు అవసరం ఉంటుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పరిశ్రమను కోరారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా రవాణా, రహదారుల శాఖ మంత్రి గడ్కరీ మాట్లాడారు. రెండేళ్లలో లాజిస్టిక్స్ వ్యయం 9 శాతానికి దిగొస్తుందన్నారు. ''జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని అడగొద్దు. ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ. ఒకవేళ మేము పన్నులు తగ్గిస్తే, మరింత తగ్గించాలని కోరతారు. మనిషి మనస్తత్వ తీరు అంతే. మేము పన్నులు తగ్గించగలం. అసలు పన్నులే లేకుండా ప్రభుత్వాన్ని నడపగలం. అలా చేస్తే ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించలేదు''అని గడ్కరీ తన అభిప్రాయాలను పరిశ్రమకు ముక్కుసూటిగా తెలియజేశారు. ధనవంతుల నుంచి పన్నులు వసూలు చేసి, పేద ప్రజలకు ప్రయోజనాన్ని అందించడమే ప్రభుత్వ విధానంగా పేర్కొన్నారు. కనుక ప్రభుత్వానికి కొన్ని పరిమితులు ఉంటాయన్నారు. ప్రస్తుతం దేశంలో లాజిస్టిక్స్ వ్యయాలు 14-16 శాతం మధ్య ఉన్నట్టు మంత్రి చెప్పారు. ''రెండేళ్లలో ఇది 9 శాతానికి వస్తుందని నేను హామీ ఇస్తున్నాను. అప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో మరింత పోటీనివ్వగలం. చైనాలో లాజిస్టిక్స్ వ్యయం 8 శాతంగా ఉంటే, యూఎస్, యూరప్‌లో 12 శాతంగా ఉంది''అని మంత్రి వివరించారు. నాణ్యతలో రాజీ పడకుండా తయారీ వ్యయాలు తగ్గించుకోవాలని పరిశ్రమకు సూచించారు. మూలధన వ్యయాల పెంపుతో మరిన్ని ఉద్యోగాలు కల్పించనున్నట్టు చెప్పారు. ''మీరు కేవలం సంపద సృష్టికర్తలే కాదు. ఉపాధి కల్పనదారులు''అని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చుకునేందుకు దిగుమతులు తగ్గించుకుని, ఎగుమతులు పెంచుకోవాలని పేర్కొన్నారు.

ఇక సన్ ఫార్మా 'చెక్‌పాయింట్'

- అంకాలజీ ఫార్మా సంస్థ కొనుగోలు
- ఒప్పందం విలువ రూ. 3,100 కోట్లు

న్యూఢిల్లీ: అంకాలజీ సంస్థ చెక్‌పాయింట్ థెరప్యూటిక్స్‌ను కొనుగోలు చేయనున్నట్లు దేశీ హెల్త్‌కేర్ రంగ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ తాజాగా పేర్కొంది. ఇందుకు 35.5 కోట్ల డాలర్లు(దాదాపు రూ. 3,100 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. కేన్సర్ వ్యాధి నిరోధక చికిత్సకు సహకరించే చెక్‌పాయింట్ యూఎస్.. నాస్‌డాక్‌లో లిస్టయిన కమర్షియల్ స్టేజ్ కంపెనీ. ఒప్పందం ప్రకారం షేరుకి(కామన్ స్టాక్) 4.1 డాలర్లు చొప్పున సన్ ఫార్మా ముందస్తుగా చెల్లిస్తుంది. చెక్‌పాయింట్ వాటాదారులు కంపెనీ పనితీరు(మైల్‌స్టోన్) ఆధారంగా 0.7 డాలర్లవరకూ కంటింజెంట్ విలువను సైతం అందుకుంటారు. అంకో డెర్మ్ థెరపీలో తమకున్న ఇన్నోవేటివ్ పోర్ట్‌ఫోలియోను తాజా కొనుగోలు మరింత విస్తృతం చేయనున్నట్లు సన్ ఫార్మా ఎండీ దిలీప్ సంఘ్వీ పేర్కొన్నారు. కొనుగోలు లావాదేవీ 2025 జూన్‌కల్లా పూర్తికాగలదని సన్ ఫార్మా అంచనా వేస్తోంది.

కోజిబెలిమాబ్‌కు ఓకే

క్యూరేటివ్ సర్జరీ లేదా క్యూరేటివ్ రేడియేషన్‌కు వీలుకాని వ్యక్తుల వ్యాధిచికిత్సలో అన్‌లాక్సిట్(కోజిబెలిమాబ్-ఐపీడీఎల్)కు యూఎస్‌ఎఫ్‌డీఏ నుంచి చెక్‌పాయింట్ అనుమతి పొందింది. చర్మ కేన్సర్ వ్యాధిగ్రస్తుల చికిత్సలో సన్ ఫార్మా కంపెనీకి మద్దతివ్వగలదని చెక్‌పాయింట్ ప్రెసిడెంట్, సీఈవో జేమ్స్ ఒలీవిరో పేర్కొన్నారు. చెక్‌పాయింట్ వాటాదారులకు ప్రతీ షేరుకి 4.1 డాలర్లు చొప్పున సన్ ఫార్మా చెల్లించనుంది. అంటే మార్చి7 ముగింపు ధరతో పోలిస్తే 66 శాతం ప్రీమియం లభించనుంది. తదుపరి దశలో కోజిబెలిమాబ్ ఔషధానికి లభించే అనుమతుల ఆధారంగా మరో 0.7 డాలర్ల వరకూ పొందే వీలుంటుంది. చెక్‌పాయింట్ మాతృ సంస్థ ఫోర్ట్రెస్ బయోటెక్ ఇంక్‌తో రాయల్టీ చెల్లింపులకు సైతం సన్ ఫార్మా ఒప్పందం కుదుర్చుకుంది.

పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యానికి ముమెంటం ఇన్వెస్టింగ్

టాటా అసెట్ మేనేజ్‌మెంట్ హెడ్ వరదరాజన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్టాక్స్‌కి సంబంధించి నిర్దిష్ట లక్షణాల ప్రాతిపదికన పెట్టుబడులు పెట్టే ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్‌లో భాగంగా ముమెంటం ఇన్వెస్టింగ్‌కి గణనీయంగా ప్రాచుర్యం పెరుగుతోందని టాటా అసెట్ మేనేజ్‌మెంట్ హెడ్ (ప్యాసివ్ ఇన్వెస్ట్‌మెంట్) ఆనంద్ వరదరాజన్ తెలిపారు. డిమాండ్ దృష్ట్యా ఎన్‌ఎస్ఈ ప్రస్తుతం దాదాపు 31 ఫ్యాక్టర్ ఆధారిత సూచీలను అందిస్తోందని వివరించారు. ధరపరంగా బలమైన ట్రెండ్‌ను ప్రదర్శిస్తున్న స్టాక్స్‌ను గుర్తించి, క్రమశిక్షణతో పెట్టుబడులు పెట్టడం ద్వారా అధిక రాబడులను అందించడంపై ముమెంటం ఇన్వెస్టింగ్ ప్రధానంగా దృష్టి పెడుతుందని తెలిపారు. దీర్ఘకాలికంగా మెరుగైన రాబడులను అందుకునేందుకు, పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యాన్ని పాటించేందుకు ఇన్వెస్టర్లు కొంత భాగాన్ని ఈ వ్యూహానికి కేటాయించే అవకాశాన్ని పరిశీలించవచ్చని వరదరాజన్ చెప్పారు. గత కొన్నాళ్లుగా మార్కెట్లు కరెక్షన్‌కు లోను కావడంతో పాటు ఒడిదుడుకులమయంగా ఉంటున్నప్పటికీ నిఫ్టీ మిడ్ క్యాప్ 150 ముమెంటం 50 ఇండెక్స్‌ను ట్రాక్ చేసే ఇండెక్స్ ఫండ్స్ మాత్రం మెరుగ్గా రాణిస్తున్నాయని పేర్కొన్నారు. తమ టాటా నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ముమెంటం 50 ఇండెక్స్ ఫండ్‌లోకి గతేడాది పెట్టుబడులు మూడింతలై సుమారు రూ. 500 కోట్లకు చేరడం వీటిపై పెరుగుతున్న ఆకర్షణకు నిదర్శనమని వరదరాజన్ తెలిపారు.

క్లీన్‌మ్యాక్స్, ఒసాకా గ్యాస్ గ్రూప్ జట్టు

రూ. 1,500 కోట్లతో జాయింట్ వెంచర్

న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి సంబంధించి క్లీన్‌మ్యాక్స్, ఒసాకా గ్యాస్ గ్రూప్ చేతులు కలిపాయి. రూ. 1,500 కోట్లతో 300 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన పోర్ట్‌ఫోలియోను అభివృద్ధి చేసేందుకు జాయింట్ వెంచర్ సంస్థను ఏర్పాటు చేశాయి. దీని పేరు 'క్లీన్ మ్యాక్స్ ఒసాకా గ్యాస్ రెన్యూవబుల్ ఎనర్జీ'గా ఉంటుందని, కర్ణాటక కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తుందని ఒక ప్రకటనలో తెలిపాయి. హరిత ఇంధనం వైపు మళ్లడంలో కార్పొరేట్ క్లయింట్లకు ఇది తోడ్పడుతుందని పేర్కొన్నాయి. ఈ వెంచర్‌తో జపాన్‌కి చెందిన ఒసాకా గ్యాస్ భారతీయ గ్రీన్ ఎనర్జీ మార్కెట్లోకి ప్రవేశించినట్లవుతుంది. ఒప్పందంలో భాగంగా ఒసాకా గ్యాస్ సింగపూర్, జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ (జేబీఐసీ) ఈ జేవీలో ఇన్వెస్ట్ చేస్తాయి.

25 వేల 'జెంజో' ప్రైవేట్ అంబులెన్స్‌లు



ముంబై: ఎమర్జెన్సీ సేవల సంస్థ జెంజో దేశవ్యాప్తంగా 450 నగరాల్లో 25,000 ప్రైవేట్ అంబులెన్స్‌లను ప్రవేశపెట్టింది. 15 నిమిషాల్లోపే స్పందించే విధంగా ఈ నెట్‌వర్క్ ఉంటుందని సంస్థ తెలిపింది. ఎమర్జెన్సీ సర్వీసులు, ప్రథమ చికిత్స, సీపీఆర్ ట్రైనింగ్ మొదలైన వాటిపై అవగాహన పెంచేందుకు జొమాటోతో పాటు ఇతరత్రా డెలివరీ ప్లాట్‌ఫాంలు, ఈకామర్స్ సంస్థలతో చేతులు కలిపినట్లు వివరించింది. దీని టోల్ ఫ్రీ నంబరు 1800 102 1298గా ఉంటుంది. 5 కి.మీ. పరిధికి బేసిక్ అంబులెన్స్ చార్జీలు రూ. 1,500గా ఉంటాయి. ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు అదనంగా రూ. 50 చెల్లించాలి. కార్డియాక్ అంబులెన్స్‌కైతే 5 కి.మీ.కు రూ. 2,500, ఆ తర్వాత నుంచి ప్రతి కిలోమీటరుకు రూ. 100 చార్జీలు వర్తిస్తాయి. రాబోయే రోజుల్లో డిమాండ్‌ను బట్టి మరిన్ని నగరాల్లో మరిన్ని అంబులెన్స్‌లను జోడిస్తామని సంస్థ సహ వ్యవస్థాపకురాలు శ్వేతా మంగళ్ తెలిపారు.

గేమింగ్ కంపెనీలకు నైతిక నియమావళి



న్యూఢిల్లీ: యూజర్ల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, బాధ్యతాయుతమైన గేమింగ్ విధానాలను ప్రోత్సహించే దిశగా రియల్ మనీ గేమింగ్ సంస్థలు నైతిక నియమావళిని (సీవోఈ) రూపొందించుకున్నాయి. ఆలిండియా గేమింగ్ ఫెడరేషన్ (ఏఐజీఎఫ్), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫ్యాంటసీ స్పోర్ట్స్ (ఎఫ్ఐఎఫ్ఎస్), ఈ-గేమింగ్ ఫెడరేషన్ దీనిపై సంతకాలు చేశాయి. కేవైసీ ధృవీకరణ, వ్యయ పరిమితులు, వయో పరిమితులు మొదలైన అంశాలకు సంబంధించి పాటించాల్సిన నిబంధనలు ఇందులో ఉన్నాయి. డ్రీమ్11, ఖేలో ఫ్యాంటసీ లైవ్, విన్‌జో తదితర సంస్థలు ఈ గేమింగ్ సమాఖ్యల్లో ఉన్నాయి. నైతిక నియమావళిలో పేర్కొన్న నిబంధనలు, వివిధ ఫెడరేషన్లలోని ఆన్‌లైన్ గేమింగ్ ఆపరేటర్లందరికీ వర్తిస్తాయని, 50 కోట్ల పైగా ఉన్న దేశీ గేమర్ల ప్రయోజనాలను పరిరక్షించేవిగా ఇవి ఉంటాయని సంయుక్త ప్రకటనలో సమాఖ్యలు తెలిపాయి. పరిశ్రమ దిగ్గజాలతో కలిసి నైతిక గేమింగ్‌లో కొత్త ప్రమాణాలు నెలకొల్పుతున్నామని, ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ విశ్వసనీయతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని ఏఐజీఎఫ్ సీఈవో రోలాండ్ ల్యాండర్స్ తెలిపారు. అనైతిక గ్యాంబ్లింగ్ ఆపరేటర్ల వల్ల చాలాకాలంగా ప్రభుత్వ ఖజానాకు, వినియోగదారులకు, పరిశ్రమ ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఈజీఎఫ్ సీఈవో అనురాగ్ సక్సేనా చెప్పారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

సుంకాల ప్రభావం ఫార్మాపై ఎక్కువే

- కొత్త మార్కెట్ అవకాశాలపై దృష్టి
- ఆటో రంగంపై పరిమితమే
- నిపుణుల అంచనాలు



న్యూఢిల్లీ: అమెరికా ప్రతికార సుంకాలు విధిస్తే.. అప్పుడు భారత ఫార్మా రంగంపై అధిక ప్రభావం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అధిక టారిఫ్‌లతో అమెరికాలో భారత ఫార్మా ఉత్పత్తుల ఖరీదు, ఇతర దేశాలతో పోల్చితే పెరిగిపోతుందంటున్నారు. అదే సమయంలో భారత ఆటోమొబైల్ కంపెనీలపై సుంకాల ప్రభావం చాలా పరిమితంగానే ఉంటుందంటూ.. అమెరికాకు ఆటో ఎగుమతులు చాలా తక్కువగా ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. అమెరికా ఉత్పత్తులపై భారీ సుంకాలు మోపుతున్న భారత్‌పై ఏప్రిల్ 2 నుంచి తాము కూడా అదే స్థాయిలో ప్రతిసుంకాలు అమలు చేస్తామని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అదే పనిగా ప్రకటిస్తుండడం గమనార్హం. ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతి అవుతున్న ఔషధాలపై భారత్ 10 శాతం సుంకం అమలు చేస్తోంది. భారత్ నుంచి వచ్చే ఉత్పత్తులపై అమెరికా ఎలాంటి సుంకాలు వసూలు చేయడం లేదు. చరిత్రను గమనిస్తే దేశీ డిమాండ్‌ను తీర్చుకునేందుకు అమెరికా ఇప్పటి వరకు ఫార్మా ఉత్పత్తుల విషయంలో నికర దిగుమతిదారుగా ఉన్నట్టు శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కో పార్ట్‌నర్ అరవింద్ శర్మ తెలిపారు.

ఫార్మా రంగానికి కొత్త దారులు

అమెరికా అధిక సుంకాలతో కొత్త మార్కెట్ అవకాశాల దిశగా భారత ఫార్మా రంగానికి ప్రోత్సాహం లభిస్తుందని శర్మ అంచనా వేస్తున్నారు. భారత కంపెనీలు యూరప్, ల్యాటిన్ అమెరికా లేదా ఆఫ్రికాలపై ఎక్కువ దృష్టి పెట్టొచ్చన్నారు. అమెరికా మార్కెట్‌కు భారత ఆటో ఎగుమతులు చాలా తక్కువ కావడంతో ఈ రంగంపై సుంకాల ప్రభావం తక్కువే ఉంటుందని ఇండస్ లా పార్ట్‌నర్ శశి మాథ్యూస్ అభిప్రాయపడ్డారు. కాకపోతే భారత ఆటో విడిభాగాల కంపెనీలపై కొంత ప్రభావం ఉండొచ్చన్నారు. అమెరికా డిమాండ్ చేస్తున్నట్టు ఆ దేశ ఆటో ఉత్పత్తులపై భారత్ సుంకాలను సున్నా స్థాయికి సమీప కాలంలో తగ్గించకపోవచ్చన్న విశ్లేషణ వ్యక్తం చేశారు.

''భారత్ నుంచి వచ్చే ఫార్మా ఉత్పత్తులపై గణనీయ స్థాయిలో టారిఫ్‌లు విధించాలని అమెరికా ఇటీవల నిర్ణయించడం భారత ఫార్మా రంగంపైనా చెప్పుకోతగ్గ ప్రభావం చూపిస్తుంది. అంతిమంగా దేశీ వినియోగంపైనా దీని ప్రభావం ఉంటుంది''అని చెప్పారు.

అమెరికన్లకు గణనీయంగా ఆదా..

అమెరికాలో ప్రతి నాలుగు ఔషధాల్లో ఒకటి భారత్ నుంచి సరఫరా అవుతుండడం గమనార్హం. చౌకగా భారత్ అందిస్తున్న ఔషధాలతో అమెరికాకు 2022లో 219 బిలియన్ డాలర్లు ఆదా అయినట్టు పరిశ్రమ వర్గాల అంచనా. 2013 నుంచి 2022 వరకు చూస్తే పదేళ్ల కాలంలో 1.3 ట్రిలియన్ డాలర్లను అమెరికన్లు ఆదా చేసుకున్నారు. అంతేకాదు భారత చౌక జనరిక్ ఔషధాలతో అమెరికాకు వచ్చే ఐదేళ్లలో మరో 1.3 ట్రిలియన్ డాలర్లు ఆదా అవుతుందని అంచనా. భారత ఫార్మా ఎగుమతులకు అమెరికా పెద్ద మార్కెట్ అని శర్మ చెప్పారు. భారత మొత్తం ఔషధ ఎగుమతుల్లో అమెరికా వాటాయే మూడింట ఒక వంతుగా ఉన్నట్టు తెలిపారు. ఉన్నట్టుండి టారిఫ్‌లు పెంచితే, అది భారత్‌లో ఔషధ తయారీని, దిగుమతి వ్యయాలను పెంచుతుందన్నారు. అదే జరిగితే అప్పుడు ఇతర దేశాలతో పోల్చితే భారత ఔషధ ఉత్పత్తులు ఖరీదుగా మారతాయన్నారు. ఇది అమెరికా ఆరోగ్య సంరక్షణ వ్యయాలను పెంచుతుందని, వినియోగదారులపై భారాన్ని మోపుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.



విజేత పంకజ్

ముంబై: క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (సీసీఐ) క్లాసిక్ స్నూకర్ టోర్నమెంట్‌లో భారత దిగ్గజం, జాతీయ, ఆసియా చాంపియన్ పంకజ్ అద్వానీ అదరగొట్టాడు. సోమవారం ముగిసిన ఈ టోర్నీలో పంకజ్ చాంపియన్‌గా నిలిచాడు. హోరాహోరీగా సాగిన ఫైనల్లో పంకజ్ 8-6 (15-57, 26-101, 18-75, 100-25, 36-93, 118-0, 59-68, 45-77, 64-47, 93-72, 70-60, 75-32, 73-32, 75-47) ఫ్రేమ్‌ల తేడాతో భారత్‌కే చెందిన ఇష్‌ప్రీత్ సింగ్ చద్దాపై గెలిచాడు. టైటిల్ నెగ్గిన పంకజ్‌కు రూ. 3 లక్షల 50 వేలు... రన్నరప్ ఇష్‌ప్రీత్ సింగ్ చద్దాకు రూ. 1 లక్షల 75 వేలు ప్రైజ్‌మనీ లభించింది.

చాంప్స్ సుకాంత్, నితేశ్


సుకాంత్


నితేశ్

న్యూఢిల్లీ: పారిస్ పారాలింపిక్స్ చాంపియన్ నితేశ్ కుమార్‌తో పాటు సుకాంత్ కదమ్ స్పానిష్ పారా బ్యాడ్మింటన్ అంతర్జాతీయ టోర్నీలో బంగారు పతకాలు సాధించారు. స్పెయిన్‌లోని విక్టోరియాలో జరిగిన ఈ టోర్నీలో 'ఎస్‌ఎల్3' ఫైనల్లో నితేశ్ 21-19, 21-19తో జపాన్‌కు చెందిన దాయ్‌సుకె ఫుజిహారాపై విజయం సాధించాడు. 'ఎస్‌ఎల్4' కేటగిరీ టైటిల్ పోరులో సుకాంత్ 21-13, 21-10తో భారత్‌కే చెందిన తరుణ్‌పై గెలుపొందాడు. మహిళల 'ఎస్‌హెచ్6' తుదిపోరులో నిత్యశ్రీ విజేతగా నిలిచింది. ఆమె పోలాండ్‌కు చెందిన స్మిజిల్‌ను ఓడించింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో నితేశ్ కుమార్-తరుణ్ జోడీ 21-14, 23-25, 22-20తో భారత్‌కే చెందిన జగదీశ్ దిల్లీ-నవీన్ శివకుమార్ జంటపై గెలిచింది. 'ఎస్‌హెచ్6' మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో కృష్ణ-నిత్యశ్రీ ద్వయం 21-14, 21-11తో షెఫర్డ్-చూంగ్ (ఇంగ్లండ్) జంటపై గెలిచింది. ఎస్‌ఎల్3-ఎస్‌యూ5 కేటగిరీ ఫైనల్లో నితేశ్-మనీషా రామదాస్ జోడీ 21-9, 21-15తో రికడ్ నిల్సన్ (స్వీడన్)-హెలో సోఫీ సగోయ్ (డెన్మార్క్) జంటపై గెలిచింది.

ఫైనల్లో హరియాణా, జార్ఖండ్

పంచ్‌కులా: జాతీయ సీనియర్ మహిళల చాంపియన్‌షిప్‌లో హరియాణా, జార్ఖండ్ జట్లు టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. సోమవారం జరిగిన సెమీఫైనల్స్‌లో హరియాణా 4-0 గోల్స్ తేడాతో మిజోరం జట్టుపై నెగ్గగా... జార్ఖండ్ జట్టు 'షూటౌట్'లో 3-2 గోల్స్ తేడాతో మహారాష్ట్ర జట్టును ఓడించింది. ఫైనల్ బుధవారం జరుగుతుంది. హరియాణా తరఫున సోనమ్ (41వ నిమిషంలో), మోనిక (42వ నిమిషంలో), మనీషా (47వ నిమిషంలో), కెప్టెన్ రాణి (57వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు.

ఈసారైనా 'ఆల్ ఇంగ్లండ్' అందేనా!

- నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్
- భారత్ నుంచి 17 మంది బరిలోకి
- అందరి దృష్టి పీవీ సింధు, లక్ష్య సేన్, ప్రణయ్‌లపైనే
- డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్; గాయత్రి-ట్రెసా జోడీలపై ఆశలు


ప్రతి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కెరీర్‌లో ఒక్కసారైనా ఆడాలనుకునే టోర్నీ, గెలవాలనుకునే టోర్నీ ఏదైనా ఉందంటే అది ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ మాత్రమే. బ్యాడ్మింటన్ క్రీడలో అతి పురాతన టోర్నీలలో ఒకటిగా, ప్రపంచ చాంపియన్‌షిప్ స్థాయి ఉన్న టోర్నీగా ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌నకు పేరుంది. 126 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ మెగా టోర్నీకి రంగం సిద్ధమైంది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య వరల్డ్ టూర్ టోర్నమెంట్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టాక... అత్యున్నత శ్రేణి సూపర్-1000 నాలుగు టోర్నీలలో (మలేసియా, ఆల్ ఇంగ్లండ్, ఇండోనేసియా, చైనా ఓపెన్) ఒకటిగా ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ కొనసాగుతోంది. మంగళవారం నుంచి ఆదివారం జరిగే ఈ టోర్నీకి బర్మింగ్‌హమ్ ఆతిథ్యమివ్వనుంది.

బర్మింగ్‌హమ్: బ్యాడ్మింటన్ సీజన్‌లోని మరో మెగా టోర్నీకి భారత క్రీడాకారులు సమాయత్తమయ్యారు. నేటి నుంచి ఆదివారం వరకు జరిగే ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో భారత్ నుంచి మొత్తం 17 మంది ప్లేయర్లు బరిలోకి దిగనున్నారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు, రైజింగ్ స్టార్ మాళవిక బన్సోద్... పురుషుల సింగిల్స్‌లో ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ మాజీ రన్నరప్ లక్ష్య సేన్, ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత హెచ్‌ఎస్ ప్రణయ్ పోటీపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో ఆసియా క్రీడల చాంపియన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి... మహిళల డబుల్స్‌లో గత రెండేళ్లలో సెమీఫైనల్ చేరిన పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ... పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడ్డ అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో.. శ్రుతి మిశ్రా-ప్రియా కొంజెంగ్‌బమ్... మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుత్విక-రోహన్ కపూర్... తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల... ఆద్యా-సతీశ్ కుమార్ జోడీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. భారత్ నుంచి పురుషుల సింగిల్స్‌లో మాత్రమే ఇద్దరు చాంపియన్స్‌గా నిలిచారు. 1980లో ప్రకాశ్ పదుకొనే... 2001లో పుల్లెల గోపీచంద్ ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్స్ సాధించారు. ఆ తర్వాత భారత్ నుంచి మరో ప్లేయర్ ఆల్ ఇంగ్లండ్ టైటిల్ అందుకోలేకపోయారు. 2015లో మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్... 2022లో పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ ఫైనల్‌కు చేరినా చివరకు రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నారు.

ఈసారి స్టార్ ప్లేయర్లు సింధు, లక్ష్య సేన్, ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిలపై భారత క్రీడాభిమానులు ఆశలు పెట్టుకున్నారు. గతంలో 12 సార్లు ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ఆడిన సింధు అత్యుత్తమంగా 2018, 2021లలో సెమీఫైనల్ దశకు చేరుకుంది. ఈసారి సింధుకు కాస్త క్లిష్టమైన 'డ్రా'నే ఎదురైంది. తొలి రౌండ్‌లో దక్షిణ కొరియా ప్లేయర్ గా యున్ కిమ్‌తో సింధు ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 4వ ర్యాంకర్ హాన్ యువెతో సింధు తలపడే అవకాశముంది. భారత్‌కే చెందిన మాళవిక నేడు జరిగే తొలి రౌండ్‌లో జియా మిన్ యో (సింగపూర్)తో తలపడుతుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో లి యాంగ్‌సు (చైనీస్ తైపీ)తో లక్ష్య సేన్...టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)తో ప్రణయ్ ఆడతారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో డానియల్ లిండ్‌గార్డ్-మాడ్స్ వెస్టర్‌గాడ్ (డెన్మార్క్)లను సాత్విక్-చిరాగ్ ఢీకొంటారు.


సింధు


ప్రణయ్


లక్ష్య సేన్


సాత్విక్-చిరాగ్


గాయత్రి-ట్రెసా

లీగ్‌లో పొగాకు, మద్యం ప్రకటనలొద్దు

- ఐపీఎల్ చైర్మన్‌కు కేంద్రం లేఖ
- నిషేధం అమలు చేయాల్సిందే

న్యూఢిల్లీ: విశ్వవ్యాప్త ఆదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో పొగాకు, మద్యం ప్రకటనలను పూర్తిగా నిషేధించాలని భారత ప్రభుత్వం క్రికెట్ వర్గాలకు స్పష్టం చేసింది. ఈ నెల 22 నుంచి 18వ ఐపీఎల్ సీజన్ మొదలుకానుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ ఐపీఎల్ చైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్‌కు లేఖ రాసింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా పొగాకు, మద్యం సంస్థల ఉత్పత్తుల ప్రకటనలకు లీగ్‌లో చోటు ఉండరాదని అందులో పేర్కొంది. 'క్రికెట్ క్రేజీ అభిమానులకు ఆదర్శంగా నిలిచే ఆటగాళ్లు పొగాకు, మద్యం ప్రకటనల్లో ఏమాత్రం కనిపించేందుకు వీల్లేదు. ఆ ప్రకటనల్లో క్రికెటర్లు ఎవరూ పాలుపంచుకోరాదు. దాంతో పాటు పొగాకు-మద్యం అనుబంధ ఉత్పత్తుల ప్రచార చిత్రాల్లోనూ ఆటగాళ్లు పాల్గొనరాదు. టీవీలు, స్మార్ట్ ఫోన్లతో పాటు గ్రౌండ్ రైట్స్‌లో భాగంగా స్టేడియం లోపల, వెలుపల హోర్డింగ్‌లు, ఎల్‌ఈడీ ప్యానెల్స్ లోనూ అలాంటి ప్రకటనలు ప్రదర్శించడం నిషిద్ధం. ఈ నిబంధనలను పాటించాల్సిందే' అని ఆరోగ్యశాఖ డైరెక్టర్ జనరల్ అతుల్ గోయల్ ఆ లేఖలో పేర్కొన్నారు. క్రీడా ఈవెంట్లు, క్రీడా ప్రాంగణాల్లో ఇది వరకే పొగాకు-మద్యం ఉత్పత్తుల అమ్మకాలపై నిషేధం అమల్లో ఉందని ఆయన అందులో ప్రస్తావించారు. పొగాకు, మద్యం తయారీ సంస్థలు అనుబంధ ఉత్పత్తుల ముసుగులో ప్రకటనలు ఇవ్వడంపైనా నిషేధం విధిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఐపీఎల్ జరిగినన్ని రోజులు క్రికెట్ అభిమానులతో పాటు ప్రజలంతా టీవీలు, డిజిటల్ స్ట్రీమింగ్ స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్నారని అలాంటి సమయంలో ఇలాంటి నిషేధిత ప్రకటనలు కనిపించకూడదని కేంద్ర ఆరోగ్యశాఖ సూచించింది. దేశంలో మృత్యువాత పడుతున్న 70 శాతం మందిలో దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, ఊపిరితిత్తుల సంబంధిత రోగులే ఉండటం ఆందోళన పరుస్తోంది. ప్రతి ఏటా 14 లక్షల మంది మరణించడం దేశ ఆర్థిక, సామాజిక రంగాల్ని కుంగదీస్తుంది.

'కామన్వెల్త్ స్పోర్ట్'గా సీజీఎఫ్

లండన్: కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్) తమ పేరు మార్చుకుంది. ఇకపై 'కామన్వెల్త్ స్పోర్ట్'గా సేవలందించనుంది. కామన్వెల్త్ దినోత్సవం అయిన మార్చి 10న మారిన పేరును సంస్థ ప్రకటించింది. తమ బ్రాండ్ పేరు ఇక మీదట 'కామన్వెల్త్ స్పోర్ట్'గా ప్రాచుర్యంలోకి వస్తుందని... నవతరం కామన్వెల్త్ క్రీడల్లో ఇదొక ముందడుగులాంటిదని సంస్థ సీఈఓ కేటీ సాడ్లేయిర్ తెలిపారు. 2026 కామన్వెల్త్ గేమ్స్ స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో జరుగుతాయి.



బోపన్న జోడీ ఓటమి

కాలిఫోర్నియా: భారత టెన్నిస్ డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న ఈ ఏడాది తన నిరాశాజనక ప్రదర్శన కొనసాగిస్తున్నాడు. ప్రతిష్టాత్మక ఇండియన్ వెల్స్ మాస్టర్స్-1000 సిరీస్ టోర్నీలో బోపన్న కథ తొలి రౌండ్‌లోనే ముగిసింది. సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న (భారత్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) ద్వయం 3-6, 4-6తో జేక్ డ్రేపర్ (బ్రిటన్)-టొమాస్ మఖచ్ (చెక్ రిపబ్లిక్) జంట చేతిలో ఓడిపోయింది. 64 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ నాలుగు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. ఫస్ట్ సర్వ్‌లో 27 పాయింట్లకుగాను 16 పాయింట్లు... సెకండ్ సర్వ్‌లో 26 పాయింట్లకుగాను 16 పాయింట్లు సంపాదించింది. తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. తొలి రౌండ్‌లో ఓడిన బోపన్న-డోడిగ్‌లకు 19,050 డాలర్ల (రూ. 16 లక్షల 63 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. ఈ ఏడాది బోపన్న ఐదు టోర్నీలలో పాల్గొన్నాడు. అడిలైడ్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్, దుబాయ్ ఓపెన్, ఇండియన్ వెల్స్ ఓపెన్ టోర్నీలలో తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన బోపన్న దోహా ఓపెన్‌లో మాత్రం ప్రిక్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలయ్యాడు.



మళ్లీ ఐపీఎల్‌కు బ్రూక్ దూరం

వరుసగా రెండో ఏడాది వైదొలిగిన ఇంగ్లండ్ స్టార్ క్రికెటర్ • రెండేళ్ల నిషేధం పడే అవకాశం

లండన్: ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ వరుసగా రెండో ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్ మొత్తానికి దూరమవుతున్నట్లు ప్రకటించాడు. ఈ నెల 22న ఐపీఎల్ 18వ సీజన్ మొదలుకానుండగా... ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగాల్సిన బ్రూక్ ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపాడు. 'త్వరలో జరిగే ఐపీఎల్ నుంచి తప్పుకుంటున్నాను. ఇది చాలా కఠినమైన నిర్ణయం. కానీ తప్పట్లేదు. ఢిల్లీ ఫ్రాంచైజీకి, అభిమానులకు క్షమాపణలు చెబుతున్నాను. అంకితభావంతో ఇంగ్లండ్ జాతీయ జట్టుకు సేవలందించాలనుకుంటున్నాను. రాబోయే సిరీస్‌లకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలనే లీగ్ నుంచి వైదొలిగాను. బిజీ క్రికెట్ షెడ్యూల్‌కు ముందు చక్కగా రీచార్జ్ కావాలనుకుంటున్నా. దీన్ని అందరూ అర్థం చేసుకోలేరు. కానీ దేన్నయితే నేను గట్టిగా విశ్వసిస్తానో దాని కోసం తప్పకుండా నిర్ణయం తీసుకుంటాను. ప్రధానంగా దేశానికి ఆడేందుకే ప్రాముఖ్యత ఇస్తా. దానిపైనే దృష్టి పెడతాను' అని సోషల్ మీడియా వేదికగా బ్రూక్ వెల్లడించాడు. అయితే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త నిబంధన ప్రకారం వేలంలో పాల్గొని అమ్ముడైన ఆటగాడు గాయమైతే తప్ప ఫ్రాంచైజీకి ఆడాల్సిందే. ఇతరత్రా సాకులతో తప్పుకుంటే మాత్రం రెండేళ్ల ఐపీఎల్‌లో, వేలంలో పాల్గొనకుండా నిషేధం విధిస్తారు. 26 ఏళ్ల బ్రూక్ గతేడాది కూడా తన నానమ్మ మృతి కారణంగా పూర్తి సీజన్ ఆడలేదు. 2023 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తరఫున 11 మ్యాచ్‌లు ఆడిన బ్రూక్ 123.37 స్ట్రయిక్‌రేట్‌తో 190 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ కూడా ఉంది.

రూ. 12 కోట్లు ఇస్తున్నారు

హాకీ ఇండియా వార్షిక అవార్డులకు పెరిగిన ప్రైజ్‌మనీ • 8 కేటగిరీల్లో 32 మంది నామినేట్


సవిత శ్రీజేశ్ హర్మన్‌ప్రీత్

న్యూఢిల్లీ: హాకీ ఇండియా (హెచ్‌ఐ) వార్షిక అవార్డుల విజేతలకు ఈసారి భారీగా ప్రైజ్‌మనీ దక్కనుంది. 2024 సీజన్‌కు సంబంధించి అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా 8 కేటగిరీల్లో 32 మంది నామినేట్ అయ్యారు. వీరందరికి కలిపి ఏకంగా రూ. 12 కోట్ల ప్రైజ్‌మనీ అందజేయనున్నట్లు హెచ్‌ఐ తెలిపింది.

శనివారం న్యూఢిల్లీలో అవార్డుల వేడుక నిర్వహించనున్నారు.

- మహిళలు, పురుషుల కేటగిరీలో 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచిన వారికి బల్బీర్‌సింగ్ సీనియర్ అవార్డు... వర్ధమాన ప్లేయర్లకు పురుషుల విభాగంలో జుగ్‌రాజ్ సింగ్ పేరిట... మహిళల్లో అసుంత లాక్రా పేరిట 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డులను అందజేస్తారు.
- 'గోల్‌కీపర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచిన వారికి బల్జీత్ సింగ్ అవార్డును... 'డిఫెండర్ ఆఫ్ ద ఇయర్'కు పర్గత్ సింగ్ అవార్డు, 'మిడ్ ఫీల్డర్ ఆఫ్ ద ఇయర్'కు అజిత్‌పాల్ సింగ్ అవార్డును... 'ఫార్వర్డ్ ఆఫ్ ద ఇయర్'కు ధన్‌రాజ్ పిళ్లై అవార్డును బహూకరిస్తారు.
- భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ (1975) టైటిల్ గెలిచి 50 ఏళ్లు పూర్తికావడం, అలాగే అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) గుర్తింపు పొంది 100 ఏళ్లు (1925) పూర్తికావడంతో స్వర్ణోత్సవ వేడుకలు ఈ అవార్డుల కార్యక్రమంలోనే జరుగనుంది. ఈ నేపథ్యంలో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన పురుషుల జట్టును, ఆసియా చాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన పురుషులు, మహిళల జట్లను ఘనంగా సన్మానించనున్నారు. సీనియర్ జట్లతో పాటు జూనియర్ ఆసియాకప్ సాధించిన పురుషులు, మహిళల జట్లను సత్కరిస్తారు.
- బల్బీర్‌సింగ్ సీనియర్ అవార్డు రేసులో రిటైరైన పీఆర్ శ్రీజేశ్, కృష్ణన్ బహదూర్ పాఠక్‌లతో పాటు మహిళా ప్లేయర్లు సవిత, బిచూ దేవి ఖరిబం కూడా ఉన్నారు.
- డిఫెండర్ అవార్డు కోసం సంజయ్, అమిత్ రోహిదాస్, హర్మన్‌ప్రీత్ సింగ్, ఉదిత పోటీపడుతున్నారు.
- మిడ్‌ఫీల్డర్ అవార్డు కోసం జర్మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, నీలకంఠ శర్మ, సుమిత్ నామినేట్ అయ్యారు.
- ఫార్వర్డ్ అవార్డు కోసం లాల్‌రెమ్సియామి, అభిషేక్, సుఖ్‌జీత్, నవ్‌నీత్ కౌర్ బరిలో ఉన్నారు.
- అండర్-21 మహిళలకు ఇచ్చే వర్ధమాన ప్లేయర్ అవార్డు రేసులో బ్యూటీ డుంగ్‌డుంగ్, దీపిక, వైష్ణవి ఫాల్కే, సునెలితా టొప్పో ఉన్నారు.
- అండర్-21 పురుషులకు ప్రదానం చేసే వర్ధమాన ప్లేయర్ పురస్కారం కోసం అర్ష్‌దీప్ సింగ్, అమీర్ అలీ, శర్దానంద్ తివారి, అరిజీత్ సింగ్ బరిలో ఉన్నారు.

మెట్రో విస్తరణకు రాష్ట్రాలు కలిసి రావాలి

న్యూఢిల్లీ: అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్ కలిగిన దేశంగా ఎదిగేందుకు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి సహకారం అందించాలని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి కోరారు. అమెరికాలో 1,400 కిలోమీటర్ల మేర మెట్రో వ్యవస్థ ఉందన్నారు. దేశంలో ప్రస్తుతం 23 నగరాల్లో 1,011 కిలోమీటర్ల పొడవైన మెట్రో రైల్ నెట్‌వర్క్‌తో ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని ఆయన వివరించారు. మరో 979 కిలోమీటర్ల మేర నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. భూమి, పట్టణ రవాణా అంశాలు రాష్ట్రాల పరిధిలో ఉన్నందున, కేంద్రం మెట్రో నెట్‌వర్క్ ఏర్పాటులో ఆర్థిక విషయాల్లో మాత్రమే సాయం అందించ గలదని వివరించారు. చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టుకు గతేడాది అక్టోబర్‌లో క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సభలో లేకపోవడంతో ఆయనకు బదులుగా పురి సమాధానమిచ్చారు. ఢిల్లీలోని గత ఆప్ ప్రభుత్వం కారణంగా గురుగ్రామ్‌లో వేయాల్సిన 28.5 కిలోమీటర్ల మెట్రో మార్గం పనులు నిలిచిపోయినట్లు వెల్లడించారు.

కేవీల్లో ఎంపీల కోటా ప్రతిపాదనేదీ లేదు

న్యూఢిల్లీ: కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు పార్లమెంట్ సభ్యుల(ఎంపీ) కోటాను తిరిగి ప్రవేశపెట్టేందుకు ఉద్దేశించిన ఎలాంటి ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద లేవని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ సమాధానమిచ్చారు. విద్యాబోధనపై తీవ్ర ప్రభావం చూపుతున్నందునే తరగతికి మంజూరైన విద్యార్థులకు మించి ఎంపీలకు ప్రత్యేక కోటా వంటి నిబంధనలను 2022లో రద్దు చేశామని వివరించారు.

'మహాకుంభ్' స్నానానికి అనుకూలమే

న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమంలో ఇటీవల ముగిసిన మహాకుంభ మేళా సమయంలో గంగా జలాలు భక్తుల స్నానానికి తగ్గట్లుగానే ఉన్నాయని కేంద్రం సోమవారం పార్లమెంట్‌కు తెలిపింది. ఇందుకు సంబంధించి కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డ్(సీపీసీబీ)నివేదికను ఉటంకించింది. గంగా నదిని శుద్ధి చేసేందుకు 2022–2025 మార్చి వరకు నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ(ఎన్ఎంసీజీ)కింద రూ.7,421 కోట్లను వెచ్చించామని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. పీహెచ్, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్(డీవో), బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ), ఫెకల్ కొలిఫామ్(ఎఫ్‌సీ) వంటివి అన్ని ప్రాంతాల్లోనూ పరిమితులకు లోబడే ఉన్నట్లు సీపీసీబీ తెలిపిందన్నారు.

రూ.1.95 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేత

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్–జనవరి మధ్య కాలంలో నమోదైన 25, 397 కేసుల్లో రూ.1.95 లక్షల కోట్ల మేర పన్ను ఎగవేత జరిగినట్లు కేంద్ర జీఎస్ అధికారులు గుర్తించారని కేంద్రం సోమవారం లోక్‌సభలో తెలిపింది. అదేవిధంగా, గత ఐదేళ్లలో నమోదైన మొత్తం 86,711 కేసుల్లో ఎగవేత రూ.6.79 లక్షల కోట్ల పైమాటేనని వివరించింది. ఇదే సమయంలో, రూ.21, 520 కోట్లను ఎగవేత దారులు స్వచ్ఛందంగా చెల్లించారని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు.

ఏఎస్ఐ 'హిందుత్వ'ను బలపర్చదు

న్యూఢిల్లీ: భారత పురాతత్వ శాఖ(ఏఎస్ఐ) హిందుత్వ భావనకు అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ వచ్చిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రధాని మోదీ ప్రభుత్వం సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అన్న భావనకు కట్టుబడి ఉందని తెలిపింది. ఏఎస్ఐ ఏ ఒక్క మతానికీ ప్రత్యేకంగా అనుకూలంగా వ్యవహరించదని తెలిపింది. హిందుత్వ సిద్ధాంతాన్ని అనుసరిస్తున్న ఏఎస్ఐని ప్రక్షాళన చేయాలన్న ఎంఐఎం అధినేత ఒవైసీ అనుబంధ ప్రశ్నకు సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పైవిధంగా సమాధానమిచ్చారు.

విమానాల తయారీకి ఎస్‌పీవీని ఏర్పాటు చేస్తాం

న్యూఢిల్లీ: ప్రాంతీయ రవాణా విమానాల తయారీకి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం ఎస్‌పీవీ(స్పెషల్ పర్పస్ వెహికల్)ని ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమై ఉందని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఐదేళ్లలో విమానాలను తయారు చేయడమే దీని లక్ష్యమని వివరించారు. విమానాలు, విడి భాగాల ఉత్పత్తికి అవసరమైన విధానాలు ప్రస్తుతం అమల్లో ఉన్నాయని మంత్రి సోమవారం రాజ్యసభలో తెలిపారు. దేశంలో వైమానిక రంగం శరవేగంగా వృద్ధి చెందుతోందని చెప్పారు. దేశీయ విమాన యాన సంస్థలు డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా 1,500కు పైగా విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయని వివరించారు. దేశంలో ప్రస్తుతం 58 ఎఫ్‌టీవో(ఫ్లయింగ్ ట్రెయినింగ్ ఆర్గనైజేషన్స్)లు పని చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. దేశీయంగా 19 సీట్ల తేలికపాటి రవాణా విమానం సరస్ ఎంకే2 నిర్మాణం పురోగతిలో ఉందన్నారు.

రైల్వే బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ: రైల్వే బోర్డుకు మరింత స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తూ రూపొందించిన రైల్వే (సవరణ) బిల్లు, 2024కు పార్లమెంటు ఆమోదముద్ర పడింది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రవేశపెట్టిన బిల్లును రాజ్యసభ సోమవారం ఆమోదించింది. దీన్ని లోక్‌సభ గత డిసెంబర్లోనే ఆమోదించింది. 1905 నాటి రైల్వే చట్టాన్ని ఇది భర్తీ చేయనుంది. దీని ప్రకారం రైల్వే బోర్డు చైర్మన్, సభ్యుల నియామకం, ప్రాతిపదిక, అర్హతలు, పదవీకాలం తదితరాలన్నీ పూర్తిగా కేంద్రం చేతుల్లో ఉంటాయి. రైల్వేల పనితీరును నియంత్రించేందుకు స్వతంత్ర రెగ్యులేటర్‌ను కూడా కేంద్రం నియమించవచ్చు. రైల్వే బోర్డు స్వతంత్ర ప్రతిపత్తికి ఇది గొడ్డలిపెట్టని విపక్షాలన్నాయి. రాజ్యసభలో బిల్లును అవి తీవ్రంగా వ్యతిరేకించాయి. సమగ్ర పరిశీలనకు వీలుగా బిల్లును పార్లమెంటు సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.51,462.86 కోట్ల అదనపు వ్యయానికి పార్లమెంటును కేంద్రం అనుమతి కోరింది. ఈ మేరకు సప్లిమెంటరీ డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభ ముందుంచారు.

ఇద్దరు బ్రిటిష్ దౌత్యవేత్తల్ని బహిష్కరించిన రష్యా

మాస్కో: గూఢచర్యానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మాస్కోలోని బ్రిటిష్ ఎంబసీకి చెందిన ఇద్దరు దౌత్యాధికారులను సోమవారం రష్యా బహిష్కరించింది. తప్పుడు వ్యక్తిగత సమాచారం అందించి వీరిద్దరూ దేశంలోకి ప్రవేశించేందుకు అనుమతి పొందారని, రష్యా భద్రతకు భంగం కలిగించేలా నిఘా, విధ్వంసక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఫెడరల్ భద్రతా విభాగం ఎఫ్ఎస్‌బీ తెలిపినట్లు రియా నొవొస్తి వార్తా సంస్థ వెల్లడించింది. ఆ ఇద్దరు అధికారుల దౌత్య గుర్తింపును రద్దు చేసిన ప్రభుత్వం రెండు వారాల్లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించినట్లు రియా నొవొస్తి కథనం వివరించింది. బ్రిటిష్ ఎంబసీ అధికారికి ఈ విషయమై సమన్లు జారీ చేసినట్లు రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

కాంగోలో పడవ మునిగి 25 మంది మృతి

కిన్షాసా: కాంగోలోని క్వా నదిలో పడవ మునిగిన ఘటనలో 25 మంది జల సమాధి అయ్యారు. వీరిలో అత్యధికులు ఫుట్‌బాల్ క్రీడాకారులున్నట్లు సమాచారం. మైఎన్‌డొంబె ప్రావిన్స్‌లోని ముషీ నగరంలో ఆదివారం రాత్రి మ్యాచ్ ముగిసిన అనంతరం తిరిగొస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. పడవలోని మరో 30 మంది వరకు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. రాత్రి వేళ చీకట్లో సరిగ్గా కనిపించకపోవడమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని చెబుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో నదీ రవాణాపైనే ఎక్కువమంది ఆధార పడుతుంటారు



ఈ ఫొటో చూస్తే.. ప్రపంచ మ్యాప్‌లో ఓ బోట్ దూసుకెళ్తున్నట్లుగా ఉంది కదూ. నిజానికిది మ్యాప్ కాదు.. గ్రీన్‌ల్యాండ్ రాజధాని న్యూక్ సమీపంలోని గడ్డకట్టిన సముద్రం..! ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీప దేశమైన గ్రీన్‌ల్యాండ్ ఆర్కిటిక్, అంటార్కిటిక్ సముద్రాల మధ్యన ఉంది.

సాదీలో నేడు

అమెరికా-ఉక్రెయిన్ చర్చలు

- జెద్దా నగర వేదికగా విస్తృత చర్చలు
- ఉక్రెయిన్ తరపున జెలెన్‌స్కీ, అమెరికా తరపున విదేశాంగ మంత్రి హాజరు

జెద్దా/ దుబాయ్: అమెరికా, ఉక్రెయిన్ దేశాధ్యక్షుల వాగ్యుద్ధం అనంతరం ఈ రెండు దేశాల మధ్య నేడు సౌదీ అరేబియా వేదికగా కీలక సమాలోచనలు జరగనున్నాయి. నెలల తరబడి కొనసాగుతున్న రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి ఇకనైనా ముగింపు పలకాలనే ఏకైక లక్ష్యంతో అమెరికా, ఉక్రెయిన్ మధ్య దౌత్యపరమైన చర్చలకు సౌదీ అరేబియా ఆతిథ్యం ఇస్తోంది. సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆధ్వర్యంలో జరిగే ఈ శాంతి చర్చలు చారిత్రాత్మకంగా నిలవనున్నాయని అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు. గత నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వైట్‌హౌస్‌లో మీడియా సమక్షంలోనే అనూహ్యరీతిలో మాటల యుద్ధానికి దిగిన విషయం విదితమే. రష్యాతో యుద్ధాన్ని నిలువరిస్తే బదులుగా తమకు ఉక్రెయిన్‌లోని అత్యంత విలువైన, అరుదైన ఖనిజాలపై అజమాయిషీ ఇవ్వాలని అమెరికా డిమాండ్‌చేయడం, ఆ ప్రతిపాదనను జెలెన్‌స్కీ తిరస్కరించడం, జేడీ వాన్స్, ట్రంప్‌లతో జెలెన్‌స్కీ వాగ్వాదం తెల్సిందే. ఆ తర్వాత ఉక్రెయిన్, అమెరికా సత్సంబంధాలు క్షీణించాయి. ఆగ్రహించిన ట్రంప్ ఉక్రెయిన్‌కు సైనిక, నిఘా సాయాన్ని నిలిపేయడం, తర్వాత జెలెన్‌స్కీ దిగొచ్చి ఖనిజ, శాంతి ఒప్పందానికి సుముఖత వ్యక్తంచేయడం విదితమే.

జెద్దా వేదికగా దౌత్యం

ఈ నేపథ్యంలో మరోసారి దౌత్యపరమైన చర్చలకు ఇరు దేశాలు అంగీకరించాయి. సాధారణంగా సౌదీ అరేబియాలో చర్చలు రియాద్ వేదికగా జరుగుతాయి. కానీ ఈసారి ఎర్రసముద్రం తీరంలోని ఓడరేవు నగరమైన జెద్దా వేదికగా చర్చలు జరగనున్నాయి. అద్భుతమైన రాజభవనాలకు నిలయంగా ఉన్న జెద్దా గతంలో కొన్ని దౌత్య సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చింది. ఉక్రెయిన్ సంక్షోభాన్ని అంతం చేయడానికి, శాంతిని నెలకొల్పడానికి తమ వంతు కృషిచేస్తామని సౌదీఅరేబియా సోమవారం తెలిపింది.

సౌదీకి చేరుకున్న జెలెన్‌స్కీ

చర్చలకు ముందే జెలెన్‌స్కీ సోమవారం జెద్దాకు విచ్చేశారు. జెలెన్‌స్కీతోపాటు ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సిబిహా, చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆంద్రీ యెర్మాక్, రక్షణమంత్రి రుస్తెమ్ ఉమెరోవ్‌లు తమ దేశం తరపున చర్చల్లో పాల్గొంటారు. అమెరికా తరపున ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఇతర ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొంటారు. అమెరికా, ఉక్రెయిన్ చర్చలపై రష్యా అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ స్పందించారు. 'రష్యా ఏం కోరుకుంటోంది అనేది ముఖ్యం కాదు. అమెరికా ఏం ఆశిస్తుందనేది ఇక్కడ ముఖ్యం'అని అన్నారు. యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించడానికి అధ్యక్షుడు ట్రంప్ కృత నిశ్చయంతో ఉన్నారని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. 'సౌదీ అరేబియా చర్చల్లో మీరు మంచి ఫలితాలను చూడబోతున్నారు'అంటూ ట్రంప్ ఆదివారం చేసిన వ్యాఖ్యలు ఇందుకు ఊతమిస్తున్నాయి.

పశ్చిమాసియాలో ఆధిపత్య శక్తిగా ఎదిగే యత్నం

పశ్చిమాసియాలో ఆధిపత్య శక్తిగా ఎదిగేందుకు సౌదీ శతథా ప్రయత్నిస్తోంది. ఇరాన్ ఒప్పందం, సూడాన్, గాజా స్ట్రిప్‌ల యుద్ధాల చర్చల్లోనూ కీలకమైన పాత్ర పోషించింది. రష్యాతోనూ సౌదీకి సత్సంబంధాలున్నాయి. రష్యా, అమెరికా చర్చలకు ఆతిథ్యమివ్వడం, పెట్టుబడులు, ఇతర దౌత్యపరమైన సమావేశాల కోసం ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడయ్యాక తొలి విదేశీ పర్యటనగా తమ దేశానికి రప్పించాలని సౌదీ అరేబియా భావిస్తోంది. తద్వారా తమ ప్రతిష్టను పెంచుకోవాలని చూస్తోంది. తమ దేశంలో ఒకరకంగా నిరంకుశ పాలన కొనసాగడం, యుద్ధ భయాలు లేకపోవడం, అత్యంత గోప్యత పాటించడం తదితర అంశాలతో ఈ సిటీ చర్చలకు సరైనదని సౌదీ భావిస్తోంది.

భూపేశ్ భగెల్ కుమారుడి ఇంటిపై ఈడీ దాడులు

దాడులను కుట్రగా అభివర్ణించిన కాంగ్రెస్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ భగెల్ కొడుకు, మరికొందరి ఇళ్లపై ఈడీ సోమవారం సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈడీ దుర్గ్ జిల్లా భిలాయ్‌లోని భూపేష్ కొడుకు చైతన్య భగేల్, లక్ష్మీ నారాయణ్ బన్సాల్ అలియాస్ పప్పు బన్సాల్ నివాసంతో పాటు మొత్తం 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిపారు. కాగా, కాంగ్రెస్ పార్టీ దాడులను కుట్రగా అభివర్ణింది. తిరిగి ప్రారంభమైన పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపక్షాల ప్రశ్నలకు ఎదుర్కోలేక... పతాక శీర్షికల నుంచి తప్పించుకోవడం కోసం దాడులు నిర్వహించిందని మండిపడింది. మరోవైపు కేంద్రం కుట్రగా ఆరోపిస్తూ ఈడీకి వ్యతిరేకంగా చైతన్య ఇంటికి ముందు భగెల్ మద్దతుదారులు ఆందోళనకు దిగారు. ఈ దాడులపై భగేల్ కార్యాలయం మండిపడింది. ఏడేళ్లపాటు నడిచిన తప్పుడు కేసును కోర్టు కొట్టేసిందని, అయినా మళ్లీ ఈడీ వచ్చి తనిఖీలు చేస్తోందని తప్పుబట్టింది. కాగా, 2019-2022 వరకు భూపేశ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా మద్యం కుంభకోణం జరిగిందని ఈడీ తెలిపింది. దీంతో రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లిందని, మద్యం సిండికేట్‌కు రెండువేల కోట్ల లబ్ధి చేకూరిందని ఈడీ పేర్కొంది.

నేడు మారిషస్‌కు ప్రధాని

రెండు రోజుల పాటు పర్యటన

న్యూఢిల్లీ: రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం మారిషస్ వెళ్లనున్నారు. ఇరు దేశాల మధ్య సరికొత్త అధ్యాయానికి తన పర్యటన బాటలు పరుస్తుందని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు. ''హిందూ మహాసముద్రంలో భారత్‌కు మారిషస్ కీలక భాగస్వామి. అంతేగాక ఆఫ్రికా ఖండానికి ముఖద్వారం కూడా. భౌగోళికంగా, చారిత్రికంగానే గాక సంస్కృతిపరంగా కూడా ఆ దేశంతో మనకు అవినాభావ బంధముంది. విజన్ సాగర్ (సెక్యూరిటీ అండ్ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ద రీజియన్)లో భాగంగా హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రత, అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్-మారిషస్ మరింత సన్నిహితంగా కలిసి పని చేయనున్నాయి'' అని వివరించారు. సోమవారం ఈ మేరకు ప్రధాని ఒక ప్రకటన విడుదల చేశారు. మారిషస్ ప్రధాని నవీన్ చంద్ర రామ్‌గులాం ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మారిషస్‌లో జరిగే వేడుకల్లో భారత సైనిక దళాలు పాల్గొంటాయి.

16 నుంచి భారత్‌లో న్యూజిలాండ్ ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ: న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లుక్సన్ ఐదు రోజుల పర్యటనకు గాను ఈ నెల 16న భారత్‌కు రానున్నారు. ప్రధాని హోదాలో భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. లుక్సన్ వెంట మంత్రులు, సీనియర్ అధికారులు, వ్యాపారవేత్తలు, భారత సంతతి ప్రముఖులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి వర్గం ఉంటుంది. ఈనెల 17న ఆయన ప్రధాని మోదీతో భేటీ అవుతారు. వాణిజ్యం, పెట్టుబడులు తదితర కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు గల అవకాశాలపై ఇరువురు నేతలు చర్చించనున్నారు. అదే రోజు ఢిల్లీలో జరిగే 10వ రైజినా డైలాగ్ ప్రారంభ సదస్సులో లుక్సన్ ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం ఇవ్వనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతోనూ ఆయన భేటీ అవుతారు. లుక్సన్ గౌరవార్థం ప్రధాని మోదీ విందు ఇవ్వనున్నారు. అనంతరం, 19, 20వ తేదీల్లో ఆయన ముంబైని సందర్శిస్తారు. ముంబై నుంచి వెల్లింగ్టన్‌కు తిరుగు పయనమవుతారు. లుక్సన్ పర్యటన భారత్, న్యూజిలాండ్‌ల మధ్య చిరకాల మైత్రికి నిదర్శనమని విదేశాంగ శాఖ పేర్కొంది. అదేవిధంగా, భారత్‌తో మరింత సమగ్ర ఆర్థిక భాగస్వామ్యాన్ని సాధించడమే పర్యటన లక్ష్యమని లుక్సన్ ఆదివారం మీడియాతో వ్యాఖ్యానించారు. భారత్‌తో వాణిజ్య సంబంధాలను సమూలంగా మార్చాలని నిశ్చయించుకున్నట్లు చెప్పారు.

జపాన్ వీధుల్లో డ్రైవర్‌లెస్ కారు

యోకొహామా: మితిమీరిన వేగంతో వెళ్తూ డ్రైవర్లు దారుణ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న కాలమిది. డ్రైవర్ రోడ్డు చూసి నడిపితేనే ఇంతటి దారుణాలు జరుగుతుంటే ఇక డ్రైవింగ్ సీట్లో డ్రైవర్ లేకుంటే ఆ వాహనం ఎటు పోతుందో ఎవరికీ తెలీదు. కానీ జపాన్ రాజధాని టోక్యో సమీపంలోని యోకొహామా సిటీలో గత గురువారం ఒక కొత్త తెల్లకారు గంటకు 40 కిలోమీటర్ల వేగంతో వీధుల్లో దూసుకుపోయింది. అయితే ఈ కారు డ్రైవింగ్ సీట్లో ఎవరూ లేకపోవడం విశేషం. డ్రైవర్‌రహిత సాంకేతికతను పరీక్షించే ఉద్దేశంతో జపాన్‌కు చెందిన నిస్సాన్ మోటార్ కార్పొరేషన్ సంస్థ ఈ అధునాతన కారుకు తుదిరూపునిచ్చింది.

చుట్టూతా కెమెరాలు, రాడార్లు

అధునాతన కారు అనుక్షణం అప్రమత్తంగా ఉండేలా 14 కెమెరాలను కారుకు చుట్టూతా అమర్చారు. తొమ్మిది రాడార్లను బిగించారు. సమీప వస్తువులపైకి లేజర్ కాంతిని ప్రసరింపజేసి దాని ద్వారా ఆ వస్తువు ఎంతదూరంలో ఉందో కనిపెట్టి అందుకు అనుగుణంగా ఆదేశాలిచ్చే లిడార్ సెన్సార్‌లను ఆరింటిని ఈ కారుకు అమర్చారు. గూగుల్‌కు చెందిన సెల్ఫ్‌డ్రైవింగ్ 'వేమో' కారు త్వరలో జపాన్ మార్కెట్లోకి రానున్న నేపథ్యంలో నిస్సాన్ సైతం ఈ రంగంలో ప్రవేశించింది. ప్రపంచస్థాయి ఆటోమొబైల్ సంస్థలకు చిరునామా అయిన జపాన్ ఇప్పుడిప్పుడే స్వయంచాలిత వాహనాల రంగంలోకి అడుగుపెడుతోంది. ఈ విభాగంలో అమెరికా, చైనాలు ఇప్పటికే దూసుకుపోతుండటంతో జపాన్ సైతం తన వంతు కృషిచేస్తోంది. ''కొత్త టెక్నాలజీని సెరేనా మినీవ్యాన్‌లో అమర్చాం. మానిటర్ సెన్సార్లతో కారు తనంతట అదే ప్రయాణిస్తుంది. ఇందులో ఏమైనా సమస్యలొస్తే, ప్రమాదానికి గురయ్యే అవకాశముంటే వెంటనే నిస్సార్ ప్రధాన కార్యాలయంలో సిబ్బంది రిమోట్ కంట్రోల్ సాయంతో కారును తమ నియంత్రణలోకి తీసుకుంటారు. అది కూడా సాధ్యంకాకపోతే చిట్టచివరి ప్రయత్నంగా కారులోనే ముందువైపు పక్క సీట్లో కూర్చున్న వ్యక్తి ఆ కారును అదుపుచేస్తారు. ముందుజాగ్రత్త కోసం ఈ ఏర్పాటుచేశాం.





రోడ్డుపై వెళ్తున్న కారు(ఇన్‌సెట్‌లో) కారు పైభాగంలో అమర్చిన సెన్సార్లు

ప్రస్తుతం కారు పరీక్ష రెండో దశలో ఉంది. త్వరలో ఇలాంటి 20 కార్లను రంగంలోకి దింపి కిక్కిరిసిన రోడ్లపై పరీక్షిస్తాం. నాలుగో స్టేజీ పరీక్ష కూడా విజయవంతంగా పూర్తయితే కారుకు రిమోట్ పద్ధతిలో కూడా ఎలాంటి బ్యాకప్ సిబ్బంది ఉండబోరు. దానంతట అదే కారు వెళ్తుంది. మరో నాలుగైదు ఏళ్లలో ఇది సాకారమవుతుంది''అని నిస్సాన్ మొబిలిటీ, కృత్రిమమేధ లేబొరేటరీ ఇంజనీర్ తకేషి కిమురా చెప్పారు.

హోలీ రోజు ముస్లింలు ఇళ్లలోనే ఉండాలి

బిహార్ బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు

పట్నా: హోలీ పండగనాడు ముస్లింలు ఇళ్లలోనే ఉండిపోవాలంటూ బిహార్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే హరిభూషణ్ ఠాకూర్ బచౌల్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సోమవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. 'ఏడాదిలో 52 శుక్రవారాలుంటాయి. అయితే, వచ్చే శుక్రవారం రోజే హోలీ కూడా ఉంది. ఆ రోజు హిందువులు రంగుల వేడుక జరుపుకుంటారు. ఈ సమయంలో ఒకవేళ రంగులు మీదపడితే ముస్లింలు బాధపడకూడదు. అలాంటి సమస్య రాకూడదంటే ఇళ్లలోనే ఉండిపోవాలని వారిని కోరుతున్నా. మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు ఇది ఎంతో అవసరం'అని పేర్కొన్నారు. డబ్బుల కోసం దుకాణాల్లో రంగులను విక్రయిస్తారు కానీ, దుస్తులపై రంగులు పడితే సహించలేరని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే బచౌల్ వ్యాఖ్యలపై ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ మండిపడ్డారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్న ఆయనపై వెంటనే కేసు నమోదు చేయాలని సీఎం నితీశ్ కుమార్‌ను డిమాండ్ చేశారు.

ఎంపీ ఇంజనీర్ రషీద్‌కు ఎదురుదెబ్బ

కస్టడీ పెరోల్ తిరస్కరించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు వీలుగా కస్టడీ పెరోల్ కోరుతూ జమ్మూకశ్మీర్ ఎంపీ ఇంజనీర్ రషీద్ పెట్టుకున్న పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు తోసిపుచ్చింది. అంతేకాదు, ఎంపీ రషీద్ పెట్టుకున్న రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేస్తూ అదనపు సెషన్స్ జడ్జి జిత్ సింగ్ సోమవారం తీర్పు వెలువరించారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న రషీద్ తన విధులను కొనసాగించేందుకు వచ్చే సెషన్‌లో పాల్గొనేందుకు వీలు కల్పించాలంటూ ఆయన తరఫు లాయర్ ఫిబ్రవరి 27న పిటిషన్ వేశారు. దీనిపై వాదనలు విన్న కోర్టు అభిప్రాయం తెలపాలంటూ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు మార్చి 3న కోర్టు ఆదేశాలిచ్చింది. 2017 నాటి ఉగ్ర నిధుల కేసులో షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్ 2019 నుంచి తిహార్ జైలులో ఉంటున్నారు. దిగువ కోర్టు ఆయనకు 2022లో జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, కోర్టు అనుమతితో గతేడాది సెప్టెంబర్ 10 నుంచి అక్టోబర్ 27వ తేదీ వరకు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేయడం తెలిసిందే.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో 53.68% మంది మహిళలే

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, పథకాల అమలు కోసం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువమంది ఉన్నారు. మొత్తం 30.68 కోట్ల అసంఘటిత కార్మికులు పేర్లను నమోదు చేసుకోగా, మహిళలు 53.68 శాతం మంది, అంటే 16-47 కోట్ల మంది ఉన్నారని కేంద్రం తెలిపింది. సోమవారం లోక్‌సభలో కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి 82,78,582 మంది, తెలంగాణకు సంబంధించి 44,82,351 మంది పేర్లను నమోదు చేసుకున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా పేర్లు నమోదు చేసుకున్న కార్మికుల్లో పురుషులు 14.21 కోట్ల మంది, ఇతరులు 7,355 మంది ఉన్నారని వెల్లడించారు. ఇందులో వ్యవసాయ రంగ కార్మికులు అత్యధికంగా 15.99కోట్ల మంది ఉన్నారని పేర్కొన్నారు.

బాంబు బెదిరింపులతో ముంబైకి తిరిగొచ్చిన ఎయిర్ ఇండియా విమానం

ముంబై: ముంబై నుంచి టేకాఫ్ అయిన ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపులు రావడంతో తిరిగి ముంబైకి చేరుకుంది. బోయింగ్ 777-300 ఈఆర్ విమానం ముంబై నుంచి న్యూయార్క్ వెళ్తోంది. విమానంలో 19 మంది సిబ్బందితో సహా 320 మంది ప్రయాణికులున్నారు. నాలుగు గంటల ప్రయాణం తరువాత గగనతలంలో ఉండగా విమానంలో టాయిలెట్ లోపల బాంబు బెదిరింపు లేఖ దొరికింది. అది గమనించిన ప్రయాణికుడు సిబ్బందిని అప్రమత్తం చేశాడు. దీంతో విమానాన్ని ముంబైకి మళ్లించి ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఉదయం 10.25 గంటలకు విమానం ల్యాండ్ అయింది. వెంటనే బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. అయితే అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విమానాన్ని తిరిగి మంగళవారం ఉదయం 5 గంటలకు రీ షెడ్యూల్ చేశామని, అప్పటివరకు ప్రయాణికుల సౌకర్యాలు, భద్రత తమ సిబ్బంది చూసుకుంటారని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది.

బాలికను చంపి.. గుడి మెట్లపై రక్తం జల్లి..

గుజరాత్‌లో ఐదేళ్ల చిన్నారి నరబలి

బొడెలి (గుజరాత్): గుజరాత్‌లోని చోటాదేవ్ పూర్‌జిల్లాలో దారుణం జరిగింది. జిల్లాలోని పనేజ్ గ్రామంలో ఐదేళ్ల బాలిక గొంతు కోసి చంపి.. రక్తాన్ని గుడి మెట్లపై ధార పోశారు. నిందితుడిని లాలా తాడ్వీగా గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలో గిరిజన జనాభా అధికం. గ్రామంలో సోమవారం ఉదయం తన ఇంటి దగ్గర ఆడుకుంటున్న బాలికను తల్లి ముందే తాడ్వీ తీసుకెళ్లాడు. గొడ్డలితో మెడిపై తీవ్రంగా గాయపరిచాడు. మెడ నుంచి కారుతున్న రక్తాన్ని తీసుకెళ్లి తన ఇంట్లో ఉన్న చిన్న గుడి మెట్లపై పోశాడు. మెడ తెగి తీవ్ర రక్తస్రావం కావడంతో బాలిక మృతి చెందింది. అతను ఘాతుకానికి పాల్పడుతుండగా గ్రామస్తులు కొందరు చూసినా.. అతని చేతిలో గొడ్డలి ఉండటంతో భయపడ్డారు. నిందితుడు క్షుద్రవైద్యుడిగా కనిపించడం లేదని, హత్య వెనుక కచ్చితమైన కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తాడ్వీపై అపహరణ, హత్య కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహారాష్ట్రలో ట్రక్కు బోల్తా

ఆరుగురు కూలీలు మృతి, 11 మందికి గాయాలు

ఔరంగాబాద్: మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున చెరుకులోడుతో వెళ్తున్న ట్రక్కు బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురు కూలీలు మృతి చెందారు. 11 మంది గాయపడ్డారు. తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కన్నడ్ నుంచి పిషోర్ వెళ్తుండగా పిషోర్ ఘాట్ సెక్షన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో వాహనంలో 17 మంది కూలీలు ఉన్నారు. ట్రక్కు బోల్తా పడటంతో కూలీలు అంతా చెరుకు కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో చెరుకు కింద చిక్కుకుపోయిన కూలీలను వెలికి తీశారు. అక్కడికక్కడే నలుగురు మృతి చెందగా, చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మరో ఇద్దరు ప్రాణాలొదిలారు. వీరంతా కన్నడ్‌లోని సత్కుంద్, ఇతర సమీప ప్రాంతాలకు చెందినవారు.

ట్రక్కు, ఎస్‌యూవీ ఢీ.. 8 మంది మృతి

సిద్ధి: చిన్నారికి తలవెంట్రుకలు తీయించేందుకు ఆలయానికి వెళ్తున్న ఓ కుటుంబం అనుకోని ప్రమాదానికి గురైంది. రాంగ్ రూట్‌లో వేగంగా వెళ్తున్న వారి ఎస్‌యూవీ ఎదురుగా వచ్చిన ట్రక్కును ఢీకొంది. ఈ ఘటనలో 8 మంది చనిపోగా 13 మంది గాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో సోమవారం తెల్లవారు జామున 2.30 గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. వీరంతా మైహార్‌లోని శారదామాత ఆలయానికి వెళ్తుండగా ఎదురుగా బ్రహ్రీ నుంచి వస్తున్న ట్రక్కు ఉప్పి పెట్రోల్ బంక్ వద్ద ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఎస్‌యూవీలోని ఏడుగురు అక్కడికక్కడే చనిపోగా, మరొకరు తీవ్ర గాయాలతో మృతి చెందారు. క్షతగాత్రుల్లో 9 మందిని రేవాలోని ఆస్పత్రికి, నలుగురిని సిద్ధి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌యూవీ రాంగ్ రూట్‌లో వెళ్లడమే ఘటనకు కారణమని ఎస్పీ రవీంద్ర వర్మ చెప్పారు. ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు

హైకోర్టు బెంచ్ ఉన్న ఏకైక కేంద్రపాలిత ప్రాంతం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ



రాష్ట్ర న్యాయవ్యవస్థ

భారతదేశంలో స్వయం ప్రతిపత్తి గల ఏకీకృత న్యాయవ్యవస్థను ఏర్పాటు చేశారు. స్వయం ప్రతిపత్తి న్యాయవ్యవస్థ అంటే శాసన నిర్మాణ శాఖకు, కార్యనిర్వాహక శాఖకు బాధ్యత వహించకుండా స్వతంత్రంగా పనిచేసే న్యాయశాఖ. ఏకీకృత న్యాయవ్యవస్థ అంటే అన్ని న్యాయస్థానాలు ఉన్నత న్యాయస్థానం నియంత్రణలో పనిచేసే విధానం. మనదేశంలో శాసన, పరిపాలన సంబంధమైన అధికార పంపిణీ జరిగింది. కానీ న్యాయపరమైన అధికార పంపిణీ జరగలేదు.

రాష్ట్ర న్యాయవ్యవస్థ గురించి ప్రకరణ 214 నుంచి 237 వరకు తెలియచేస్తాయి. వాటిని రాజ్యాంగంలో VI భాగంలో చేర్చారు. ప్రకరణ-214 ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఒక హైకోర్టు ఉండాలి. రాష్ట్రంలో అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు. ప్రకరణ- 231 ప్రకారం ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలకు పార్లమెంట్ చట్టం ద్వారా ఉమ్మడి హైకోర్టును ఏర్పాటు చేయొచ్చు. ప్రస్తుతం కింది రాష్ట్రాలకు ఉమ్మడి హైకోర్టులు ఉన్నాయి.

1. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్- హైదరాబాద్
2. హరియాణా, పంజాబ్ - ఛండీగఢ్
3. మహారాష్ట్ర, గోవా - ముంబై
4. అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ మిజోరాం- గౌహతి.

ప్రకరణ-241 ప్రకారం కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రత్యేక హైకోర్టు ఉండొచ్చు, లేదా దగ్గరి హైకోర్టుకు కలపొచ్చు. ప్రత్యేక హైకోర్టు ఉన్న ఏకైక కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీ. దీన్ని1966లో ఏర్పాటు చేశారు.అండమాన్ నికోబార్ దీవులను కలకత్తా హైకోర్టు, పాండిచ్చేరిని మద్రాస్ హైకోర్టు, లక్షద్వీప్‌ను కేరళ హైకోర్టు, దాద్రానగర్ హవేలి, డయ్యూ డామన్‌లను ముంబై హైకోర్టు పరిధిలో చేర్చారు.

దేశంలో మొత్తం హైకోర్టుల సంఖ్య 24. మొదట హైకోర్టును 1862లో కలకత్తాలో ఏర్పాటు చేశారు. అదే ఏడాది బాంబే, మద్రాసు హైకోర్టులను ప్రారంభించారు. చివరగా 2013లో మణిపూర్, మేఘాలయ, త్రిపురల్లో మూడు హైకోర్టులను ఏర్పాటు చేశారు.

హైకోర్టు నిర్మాణం

ప్రకరణ- 216 ప్రకారం ప్రతి హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు ఉంటారు. వీరి సంఖ్యను రాష్ట్రపతి నిర్ణయిస్తారు. గరిష్ట, కనిష్ట న్యాయమూర్తుల సంఖ్యను నిర్ణయించలేదు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ హైకోర్టులో అత్యధికంగా ప్రధాన న్యాయమూర్తి, 56 మంది న్యాయమూర్తులు ఉన్నారు. సిక్కింలో అతి తక్కువగా ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు న్యాయమూర్తులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల ఉమ్మడి హైకోర్టులో గరిష్టంగా 49 మంది న్యాయమూర్తులు ఉండొచ్చు.

హైకోర్టు న్యాయమూర్తుల నియామకం

అధికరణ- 217 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు. ఈ క్రమంలో కిందివారిని సంప్రదిస్తారు.

1. సంబంధిత రాష్ట్ర గవర్నర్
2. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
3. సంబంధిత రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
4. సంబంధిత రాష్ట్ర హైకోర్టు వ్యవహారాలు తెలిసిన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

అర్హతలు

అధికరణం-217(2) హైకోర్టు న్యాయ మూర్తుల అర్హతల గురించి తెలియజేస్తుంది. దీని ప్రకారం..

1. భారతీయ పౌరుడై ఉండాలి.
2. ఏదైనా హైకోర్టులో న్యాయవాదిగా 10 ఏళ్ల అనుభవం ఉండాలి.
3. ఏదైనా జిల్లా కోర్టు న్యాయమూర్తిగా 10 ఏళ్ల అనుభవం ఉండాలి.

పదవీ ప్రమాణం

ప్రకరణ- 219 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులతో గవర్నర్ పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీని గురించి రాజ్యాంగంలో షెడ్యూల్-3లో పేర్కొన్నారు.

పదవీ కాలం

హైకోర్టు న్యాయమూర్తుల పదవీ కాలాన్ని నిర్ణయించలేదు. పదవీ విరమణ వయస్సు ప్రారంభంలో 60 ఏళ్లు ఉండేది. 1963లో 15వ రాజ్యాంగ సవరణ ద్వారా 62 ఏళ్లకు పెంచారు. 2011లో 114వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా 65 ఏళ్లకు పెంచేందుకు ప్రతిపాదించారు.

జీతభత్యాలు

ప్రకరణ- 221 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది. వీటిని రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తికి రూ.90,000, ఇతర న్యాయమూర్తులకు రూ.80,000 చెల్లిస్తున్నారు. పదవీ విరమణ తర్వాత కేంద్ర సంఘటిత నిధి నుంచి పెన్షన్ చెల్లిస్తారు. వీరి జీతభత్యాలకు ఆదాయపన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. జీతభత్యాలను ఆర్థిక అత్యవసర సమయంలో మాత్రమే తగ్గించొచ్చు.

రాజీనామా

ప్రకరణ-217(1) ప్రకారం ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు తమ రాజీనామా లేఖలను రాష్ట్రపతికి సమర్పిస్తారు. పదవీ విరమణ తర్వాత సుప్రీంకోర్టులో మాత్రమే న్యాయవాద వృత్తి చేపట్టవచ్చు.

తొలగింపు

ప్రకరణ- 218 హైకోర్టు న్యాయమూర్తుల తొలగింపు గురించి తెలియజేస్తుంది. దీని ప్రకారం పార్లమెంటు అభిశంసన తీర్మానం మేరకు రాష్ట్రపతి వీరిని తొలగిస్తారు. ఇంతవరకు ఏ హైకోర్టు న్యాయమూర్తిని తొలగించలేదు. గతంలో అభిశంసన తీర్మానాన్ని కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి సౌమిత్రిసేన్‌పై ప్రవేశపెట్టారు. తీర్మానం రాజ్యసభలో నెగ్గిన తర్వాత లోక్‌సభకు రాక ముందే రాజీనామా చేసి సేన్ తప్పుకున్నారు. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దినకరణ్‌కు నోటీస్ జారీ చేశారు.

న్యాయమూర్తుల బదిలీ

ప్రకరణ- 222 ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను ఏ హైకోర్టుకైనా బదిలీ చేయొచ్చు.

హైకోర్టు- విధులు, అధికారాలు

1. **ప్రారంభ అధికారం- అధికరణ- 225** ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ఎంఎల్ఏ, ఎంఎల్సీ,ఎంపీల ఎన్నిక వివాదాల పరిష్కారం, ఆస్తి,ఆర్థిక వ్యవహారాల్లో వివాదాల పరిష్కారం, దిగువ న్యాయస్థానాల నుంచి వచ్చే అన్ని అప్పీళ్ల విచారణ, వివాహం, విడాకులు, వారసత్వం మొదలైన వివాదాలు ప్రారంభ అధికారాల్లోకి వస్తాయి.
2. **కోర్ట్ ఆఫ్ రికార్డ్:** అధికరణ- 215 ప్రకారం హైకోర్ట్ 'కోర్ట్ ఆఫ్ రికార్డు'గా వ్యవహరిస్తుంది. హైకోర్టు తీర్పులను ప్రతి దిగువ న్యాయస్థానం, ప్రతి సంస్థ గౌరవించాలి. హైకోర్టు తీర్పులను కింది న్యాయస్థానాలు ఆధారాలుగా, సాక్ష్యాలుగా తీసుకొని తమ తీర్పులను వెలువరించాలి. హైకోర్టు తీర్పులను ధిక్కరిస్తే కోర్టు ధిక్కారం కింద శిక్షిస్తుంది.
3. **రిట్‌ల అధికార పరిధి:** అధికరణ - 226 ప్రకారం ప్రాథమిక హక్కుల సంరక్షణ కోసం రిట్లను జారీ చేస్తుంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు కంటే ఎక్కువ అధికార పరిధి హైకోర్టుకు ఉంటుంది. హైకోర్టు ప్రాథమిక హక్కుల రక్షణతోపాటు మిగతా హక్కుల రక్షణకు కూడా రిట్లను జారీ చేస్తుంది.
4. **న్యాయ సమీక్ష అధికారం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాల రాజ్యాంగ బద్ధతను పరిశీలించి, అవి రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకమైతే ఆ చట్టాలను హైకోర్టు న్యాయసమీక్ష అధికారం ద్వారా కొట్టేస్తుంది.
5. **దిగువ న్యాయస్థానాలపై నియంత్రణ:** అధికరణ-227 ప్రకారం తన పరిధిలో ఉన్న కింది న్యాయస్థానాలు,ట్రిబ్యునళ్లపై పర్యవేక్షణ అధికారం ఉంటుంది. దిగువ న్యాయస్థానాల నుంచి కావాల్సిన సమాచారాన్ని తెప్పించుకోవచ్చు. దిగువ న్యాయస్థానాలకు విధివిధానాలను సూచిస్తుంది. న్యాయాధికారుల నియామకం, పదోన్నతి, క్రమశిక్షణ మొదలైన సర్వీసు విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును సంప్రదించాలి.

దిగువ కోర్టులు

రాజ్యాంగంలోని 6వ భాగంలో ప్రకరణలు 233 నుంచి 237 వరకు ఆధీన న్యాయస్థానాల గురించి తెలియజేస్తాయి. హైకోర్టు తర్వాత వచ్చే దిగువ న్యాయస్థానాలను సబార్డినేట్ కోర్టులంటారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటీ సివిల్ కోర్టులు, మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌లు ఉంటాయి. ప్రకరణ - 233 ప్రకారం జిల్లా కోర్టు న్యాయమూర్తులను నియమించి, తొలగించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఈ విషయంలో గవర్నర్ హైకోర్టును సంప్రదిస్తారు. కింది కోర్టుల న్యాయమూర్తుల నియామకం, తొలగింపు విషయంలో రాష్ట్ర సర్వీసు కమిషన్ హైకోర్టును సంప్రదిస్తుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రత్యేక హైకోర్టు ఉన్న ఏకైక కేంద్రపాలిత ప్రాంతం ఏది?
   ఎ) ఛండీగఢ్ బి) ఢిల్లీ
   సి) అండమాన్ నికోబార్ దీవులు
   డి) పైవేవీ కావు
2. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ కాలం?
   ఎ) 4 ఏళ్లు బి) 5 ఏళ్లు
   సి) 6 ఏళ్లు డి) పైవేవీకావు

సమాధానాలు: 1) బి; 2) డి.

మాదిరి ప్రశ్నలు

1. చివరగా అంటే 2013లో ఏర్పాటు చేసిన హైకోర్టులు ఏవి?
   ఎ) జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్
   బి) మిజోరాం, మేఘాలయ, నాగాలాండ్
   సి) మణిపూర్, మేఘాలయ, త్రిపుర
   డి) మిజోరాం, నాగాలాండ్, సిక్కిం
2. హైదరాబాద్ హైకోర్టును ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   ఎ) 1948 బి) 1952
   సి) 1954 డి) 1956
3. హైకోర్టు బెంచ్ ఉన్న ఏకైక కేంద్రపాలిత ప్రాంతం?
   ఎ) లక్షద్వీప్
   బి) అండమాన్ నికోబార్ దీవులు
   సి) దాద్రానగర్ హవేలి
   డి) పైవేవీ కావు
4. కిందివాటిలో సరైనవి?
   ఎ) అన్నా ఛాంది - మొదటి హైకోర్టు మహిళా న్యాయమూర్తి
   బి) అమరేశ్వరి దేవి - ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
   సి) లీలాసేథ్- హైకోర్టు మొదటి మహిళ ప్రధాన న్యాయమూర్తి
   డి) పైవన్నీ సరైనవే
5. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా పనిచేసి, తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసినవారు?
   ఎ) కొండా మాధవరెడ్డి
   బి) కోకా సుబ్బారావు
   సి) యోగేశ్వర్ దయాళ్ డి) జీవన్ రెడ్డి
6. ప్రాథమిక హక్కుల రక్షణ కోసం ఏ అధికరణ ప్రకారం హైకోర్టు రిట్లను జారీ చేస్తుంది?
   ఎ) 32 బి) 215
   సి) 226 డి) 219
7. దేశంలో మహిళ న్యాయమూర్తులతో ధర్మాసనాన్ని ఏర్పాటు చేసిన మొదటి హైకోర్టు?
   ఎ) లక్నో బి) కలకత్తా
   సి) హైదరాబాద్ డి) మద్రాస్
8. జాతీయ న్యాయ వ్యవస్థకు సంబంధించి ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ప్రవేశపెట్టినప్పుడు ఉన్న భారత ప్రధాన న్యాయ మూర్తి ఎవరు?
   ఎ) ఎ.ఎం. అహ్మదీ
   బి) ఎం.హిదయతుల్లా
   సి) ఎస్.ఆనంద్ డి) పి.ఎన్.భగవతి
9. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 62 నుంచి 65 ఏళ్లకు పెంచేందుకు ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ ఏది?
   ఎ) 104 బి) 110
   సి) 112 డి) 114
10. భారత రాజ్యాంగంపై అంతిమ వ్యాఖ్య చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
   ఎ) సుప్రీంకోర్టు బి) రాష్ట్రపతి
   సి) పార్లమెంటు డి) అటార్నీ జనరల్
11. హైకోర్టు న్యాయమూర్తులను ఎవరు నియమిస్తారు?
   ఎ) భారత ప్రధాన న్యాయమూర్తి
   బి) న్యాయశాఖామంత్రి
   సి) రాష్ట్రపతి డి) గవర్నర్

సమాధానాలు

1) సి; 2) సి; 3) బి; 4) డి; 5) బి; 6) సి; 7) సి; 8) డి; 9) డి; 10) ఎ; 11) సి.

'ఈ జంట నగరాలు హేమంత శిశిరాలు' గ్రంథకర్త?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

రచయితలు - రచనలు

1. 'వెన్నెల' పాఠ్యభాగం ఎర్రన రచించిన ఏ గ్రంథంలోనిది?
   1) హరివంశం 2) నృసింహపురాణం
   3) రామాయణం
   4) అరణ్యపర్వశేషం
2. కిందివాటిలో ఎర్రన కవితా గుణం ఏది?
   1) అక్షర రమ్యత
   2) ప్రసన్న కథాకలితార్థ
   3) సూక్తి వైచిత్రి
   4) వ్యంగ్య వైభవం
3. ఎర్రన వెన్నెలను ఏవిధంగా వర్ణించారు?
   1) అమృతపు జల్లు
   2) మంచిగంధపు పూత
   3) ఆనంద తరంగం
   4) పైవన్నీ
4. 'ధన్యుడు' పాఠ్యభాగ రచయిత ఎవరు?
   1) విష్ణుశర్మ 2) చిన్నయసూరి
   3) వీరేశలింగం 4) చిలకమర్తి
5. చిన్నయసూరి రచించిన ప్రామాణిక వ్యాకరణ గ్రంథం ఏది?
   1) ఆంధ్రశబ్ద చింతామణి
   2) ఆంధ్రభాషాభూషణం
   3) బాల వ్యాకరణం
   4) ప్రౌఢ వ్యాకరణం
6. నీతిచంద్రికకు మూలం ఏది?
   1) పంచతంత్ర కథలు
   2) హితోపదేశం
   3) సుభాషిత త్రిశతి
   4) కాశీమజిలీ కథలు
7. 'మాతృభావన' పాఠ్యభాగం గడియారం వేంకటశేషశాస్త్రి రాసిన ఏ గ్రంథంలోనిది?
   1) రఘునాథీయం
   2) శివభారతం
   3) మల్లికామారుతం
   4) పుష్పబాణ విలాసం
8. గడియారం వేంకటశేషశాస్త్రి బిరుదు ఏది?
   1) కవితావతంస 2) కవిసింహ
   3) అవధాన పంచానన
   4) పైవన్నీ
9. వేంకటశేషశాస్త్రి 'శ్రీనాథ కవితా సామ్రాజ్యం' ఏ ప్రక్రియకు చెందిన గ్రంథం?
   1) పద్యకావ్యం 2) గద్యకావ్యం
   3) విమర్శగ్రంథం
   4) చంపూకావ్యం
10. బోయి భీమన్న 'జానపదుని జాబు'లో ఇతివృత్తం ఏది?
   1) విలువలు 2) శ్రమపట్ల గౌరవం
   3) గ్రామీణ వర్ణనలు
   4) నైతిక ప్రబోధం
11. బోయి భీమన్నకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఏ గ్రంథానికి లభించింది?
   1) పాలేరు 2) రాగవైశాఖి
   3) గుడిసెలు కాలిపోతున్నాయి
   4) ధర్మం కోసం పోరాటం
12. బోయి భీమన్నకు లభించిన అత్యున్నత భారత పురస్కారం ఏది?
   1) కళాప్రపూర్ణ 2) పద్మశ్రీ
   3) గౌరవ డాక్టరేట్ 4) పద్మభూషణ్
13. జానపదుడు సెలవుల్లో తన ఊరికి మిత్రుడు వస్తే ఏ తినుబండారాలు తినిపిస్తానన్నాడు?
   1) నారింజ పండ్లు
   2) వెలగ పండ్లు
   3) కొబ్బరి కురిడీలు
   4) పైవన్నీ
14. స్త్రీలను అవమానించకూడదని శాసనం చేసిన రాజు ఎవరు?
   1) అశోకుడు 2) సోన్‌దేవుడు
   3) శివాజీ మహారాజు 4) షాజహాన్
15. మల్లభూపాలీయ శతకకర్త ఎవరు?
   1) ఏనుగు లక్ష్మణకవి
   2) ఎలకూచి బాలసరస్వతి
   3) కూచిమంచి తిమ్మకవి
   4) పావులూరి మల్లన
16. మల్లభూపాలీయ శతకం ఏ ఛందస్సులో ఉంది?
   1) ఉత్పలమాల 2) మత్తేభం
   3) శార్దూలం 4) చంపకమాల
17. యాదవ రాఘవ పాండవీయం త్ర్యర్థి కావ్యకర్త ఎవరు?
   1) పింగళి సూరన
   2) రామరాజభూషణుడు
   3) ఎలకూచి బాలసరస్వతి
   4) ఏనుగు లక్ష్మణకవి
18. చిత్త శతకకర్త శ్రీపతి భాస్కర కవి ఎన్నో శతాబ్దానికి చెందినవారు?
   1) క్రీ.శ. 16 2) క్రీ.శ. 17
   3) క్రీ.శ. 15 4) క్రీ.శ. 18
19. చిత్త శతకం ఏ ఛందస్సులో ఉంది?
   1) చంపకమాల 2) శార్దూలం
   3) ఉత్పలమాల 4) మత్తేభం
20. తరిగొండ వెంగమాంబ రాసిన శతకం?
   1) నింబగిరి నరసింహ శతకం
   2) సింహాద్రి నారసింహాశతకం
   3) తరిగొండ నృసింహాశతకం
   4) పెంచలకోన నరసింహాశతకం
21. తరిగొండ వెంగమాంబ రచన ఏది?
   1) వేంకటాచల మాహాత్మ్యం
   2) శివనాటకం
   3) నారసింహ విలాస కథ యక్షగానం
   4) పైవన్నీ
22. భక్తి చింతామణి శతక కర్త?
   1) అందె వేంకటరాజం
   2) సత్యనారాయణాచార్యులు
   3) వ.సు.రాయకవి
   4) లక్ష్మీనరసింహాశర్మ
23. భక్తి చింతామణి శతకం ఏ ఛందస్సులో ఉంది?
   1) మత్తేభం 2) శార్దూలం
   3) చంపకమాల
   4) సీసం
24. వ.సు.రాయకవి పూర్తి పేరు ఏమిటి?
   1) వడ్డాది సుందర రాయకవి
   2) వడ్డాది సుబ్బరాయకవి
   3) వంగూరి సుబ్బరాయకవి
   4) వావిలకొలను సుబ్బారావు
25. వ.సు. రాయకవి రచన ఏది?
   1) వేణీ సంహారం
   2) ప్రబోధ చంద్రోదయం
   3) నందనందన శతకం
   4) పైవన్నీ
26. ఉత్పలమాల శతక కర్త?
   1) అందె వేంకటరాజం
   2) ఉత్పల సత్యనారాయణాచార్యులు
   3) నంబి శ్రీధరరావు
   4) లక్ష్మీనరసింహాశర్మ
27. 'ఈ జంట నగరాలు హేమంత శిశిరాలు' గ్రంథకర్త?
   1) డాక్టర్ సి.నారాయణ రెడ్డి
   2) డాక్టర్ జి. బాపురెడ్డి
   3) ఉత్పల సత్యనారాయణాచార్యులు
   4) కుందుర్తి
28. విశ్వనాథేశ్వర శతక కర్త?
   1) సత్యనారాయణాచార్యులు
   2) నంబి శ్రీధర రావు
   3) గుమ్మన్న గారి లక్ష్మీనరసింహాశర్మ
   4) దాశరథి
29. నింబగిరి నరసింహశతక కర్త ఎవరు?
   1) అందె వేంకటరాజం
   2) రామడుగు వేంకటేశ్వరశర్మ
   3) నంబి శ్రీధరరావు
   4) భాస్కర కవి
30. నింబగిరి నరసింహ శతకం ఏ ఛందస్సులో ఉంది?
   1) శార్దూలం
   2) కందం 3) సీసం
   4) మత్తేభం
31. 'అవధాన చతురానన', 'కవి శిరోమణి' అనే బిరుదులున్న శతక రచయిత ఎవరు?
   1) లక్ష్మీనరసింహాశర్మ
   2) అందె వేంకటరాజం
   3) వ.సు. రాయకవి
   4) నంబి శ్రీధరరావు
32. 'వానమామలై వరదాచార్యులు కృతులు- అనుశీలన' అనే సిద్ధాంత గ్రంథకర్త?
   1) పుల్లాబొట్ల వేంకటేశ్వర్లు
   2) నంబి శ్రీధరరావు
   3) అందె వేంకటరాజం
   4) అలిశెట్టి ప్రభాకర్
33. శ్రీ లొంక రామేశ్వర శతక కర్త?
   1) రామేశ్వర రావు
   2) నంబి శ్రీధరరావు
   3) ఆచార్య తిరుమల
   4) దాశరథి
34. 'నేనెరిగిన బూర్గుల' పాఠ్యభాగం ఏ ప్రక్రియకు చెందింది?
   1) విమర్శ వ్యాసం
   2) అభినందన వ్యాసం
   3) ప్రశంసా వ్యాసం
   4) చారిత్రక వ్యాసం
35. బహుభాషావేత్త పి.వి. నరసింహారావు అనర్గళంగా మాట్లాడగలిగిన భాషలెన్ని?
   1) 14 2) 16
   3) 17 4) 12
36. పి.వి. నరసింహారావు నిర్వహించిన పత్రిక పేరు?
   1) తెలంగాణ 2) నగారా
   3) త్రివేణి 4) కాకతీయ
37. పి.వి.నరసింహారావు ఆత్మకథ పేరు?
   1) ఒక విజేత ఆత్మకథ
   2) ది ఇన్‌సైడర్
   3) మై ఎక్స్‌పీరియన్స్ విత్ ట్రూత్
   4) గ్రేట్ స్కాలర్
38. బూర్గుల రామకృష్ణారావు ఏ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు?
   1) ఆంధ్ర 2) ఆంధ్రప్రదేశ్
   3) హైదరాబాద్ 4) మహారాష్ట్ర
39. పి.వి.నరసింహారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఏ గ్రంథానికి వచ్చింది?
   1) రామాయణ్ కల్పవృక్ష్
   2) తెలంగాణ కథల సంపుటి
   3) సహస్రఫణ్ (వేయిపడగలు హిందీలో)
   4) విమర్శవ్యాసాలు సంపుటి
40. హైదరాబాద్ సంస్థానంలో జాగీర్‌దార్ వ్యవస్థను రూపుమాపినవారు?
   1) హైదరాబాద్ నవాబు
   2) బూర్గుల రామకృష్ణారావు
   3) నీలం సంజీవరెడ్డి
   4) సురవరం ప్రతాపరెడ్డి
41. 'నగరగీతం' పాఠ్యభాగ రచయిత?
   1) కుందుర్తి 2) శీలా వీర్రాజు
   3) ఆరుద్ర 4) అలిశెట్టి ప్రభాకర్
42. 'నగరగీతం' పాఠ్యభాగాన్ని ఏ గ్రంథం నుంచి గ్రహించారు?
   1) ఎర్రపావురాలు
   2) ఎన్నికల ఎండమావి
   3) సిటీ లైఫ్
   4) సంక్షోభ గీతం
43. రచయిత నగరాన్ని ఏవిధంగా వర్ణించాడు?
   1) అర్థంకాని రసాయనశాల
   2) అంతుచిక్కని పద్మవ్యూహం
   3) మెర్క్యూరీ నవ్వులు-పాదరసపు నడకలు
   4) పైవన్నీ
44. 'యక్షుడి అప్పు' హాస్యనాటిక రచయిత?
   1) మునిమాణిక్యం నరసింహారావు
   2) భమిడిపాటి కామేశ్వరరావు
   3) విశ్వనాథ సత్యనారాయణ
   4) చిలకమర్తి

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 2;
5) 3; 6) 1; 7) 2; 8) 4;
9) 3; 10) 2; 11) 3; 12) 4;
13) 4; 14) 3; 15) 2; 16) 2;
17) 3; 18) 2; 19) 3; 20) 3;
21) 4; 22) 3; 23) 1; 24) 2;
25) 4; 26) 2; 27) 3; 28) 3;
29) 1; 30) 3; 31) 2; 32) 3;
33) 2; 34) 2; 35) 3; 36) 4;
37) 2; 38) 3; 39) 3; 40) 2;
41) 4; 42) 3; 43) 4; 44) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 12 ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

కోల్‌కతాలోని హుగ్లీ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఆఫీసర్(సేఫ్టీ)-01, ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్)-05, ప్రాజెక్ట్ ఆఫీసర్(ఎలక్ట్రానిక్స్)-01, ప్రాజెక్ట్ ఆఫీసర్(ఎలక్ట్రికల్)-01, ప్రాజెక్ట్ ఆఫీసర్ (సివిల్)-02, ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్)-01, ప్రాజెక్ట్ ఆఫీసర్(ఎలక్ట్రికల్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, సేఫ్టీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 24.03.2025 నాటికి 45 ఏళ్లు నిండి ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.03.2025.
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

సీఎస్ఐఆర్-ఎన్ఐఎస్‌సీపీఆర్, న్యూఢిల్లీలో 12 సైంటిస్ట్ పోస్టులు

న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్(ఎన్ఐఎస్‌సీపీఆర్) సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఎస్సీ, ఎంఈ, ఎంటెక్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 02.04.2025 నాటికి 32 ఏళ్లు నిండి ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.67,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.04.2025.
» **వెబ్‌సైట్:** https://niscpr.res.in

భారతదేశంలో విస్తీర్ణపరంగా అతిపెద్ద టైగర్ రిజర్వ్ ఏది?


గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో భారత ఉపఖండంలోని దేశం కానిది ఏది?
 1) బంగ్లాదేశ్ 2) శ్రీలంక
 3) పాకిస్థాన్ 4) అఫ్గానిస్థాన్
2. ఒకవైపు భూభాగం, మూడువైపుల జల భాగం ఆవరించి ఉండేదాన్ని ఏమంటారు?
 1) ద్వీపం 2) ద్వీపకల్పం
 3) అగాధదరి 4) అగ్రం
3. కింది ఏ రాష్ట్రం ద్వారా కర్కటరేఖ ($23\frac{1}{2}^\circ$ ఉత్తర అక్షాంశం) వెళ్లదు?
 1) త్రిపుర 2) మధ్యప్రదేశ్
 3) ఛత్తీస్‌గఢ్ 4) అసోం
4. భారత్ ఎన్ని కి.మీ. పొడవైన భూ సరిహద్దును కలిగి ఉంది?
 1) 3,214 2) 6,100
 3) 15,200 4) 7,516
5. పాకిస్థాన్‌తో సరిహద్దు పంచుకోని భారతదేశ రాష్ట్రం ఏది?
 1) జమ్ము-కశ్మీర్ 2) హిమాచల్ ప్రదేశ్
 3) పంజాబ్ 4) గుజరాత్
6. మయన్మార్‌తో భూ సరిహద్దు పంచుకోని రాష్ట్రం ఏది?
 1) అసోం 2) నాగాలాండ్
 3) మిజోరాం 4) అరుణాచల్‌ప్రదేశ్
7. 'సూర్యుడు ఉదయించే రాష్ట్రం'గా దేన్ని పేర్కొంటారు?
 1) గుజరాత్ 2) తమిళనాడు
 3) అరుణాచల్ ప్రదేశ్ 4) జమ్ము-కశ్మీర్
8. భారతదేశానికి ఉత్తర చివరన ఉన్న ప్రాంతం ఏది?
 1) ఇందిరా పాయింట్
 2) కిలిక్ దావన్‌పాస్
 3) రాణా ఆఫ్ కచ్
 4) పిగ్మోలియన్ పాయింట్
9. భారతదేశంలోని ఏ నదిని 'రెడ్ రివర్' అని పిలుస్తారు?
 1) గంగా 2) బ్రహ్మపుత్ర
 3) సింధు 4) యమున
10. 'పాంబన్' శిలా ఉపరితలం ఉన్న దీవి ఏ రెండు దేశాల మధ్య ఉంది?
 1) భారత్, శ్రీలంక 2) భారత్, మాల్దీవులు
 3) భారత్, చైనా 4) భారత్, బంగ్లాదేశ్
11. 8° చానల్ ఏ దీవి నుంచి వెళుతోంది?
 1) లిటిల్ అండమాన్ 2) గ్రేట్ నికోబార్
 3) చెర్ బానియన్ 4) మినికాయ్
12. భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న భారత దేశ దీవి ఏది?
 1) కార్ నికోబార్ 2) గ్రేట్ నికోబార్
 3) దక్షిణ అండమాన్ 4) మినికాయ్
13. ప్రపంచ భూ విస్తీర్ణంలో భారతదేశ భూ విస్తీర్ణ శాతం ఎంత?
 1) 17.44% 2) 7%
 3) 2.4% 4) 4.2%
14. బాలాసోర్ దీవి ఏ రాష్ట్రంలో ఉంది?
 1) ఒడిశా 2) గోవా
 3) తమిళనాడు 4) గుజరాత్
15. 'డంకన్ పాస్' ఏ ప్రాంతాల మధ్య ఉంది?
 1) ఉత్తర అండమాన్, మధ్య అండమాన్
 2) మధ్య అండమాన్, దక్షిణ అండమాన్
 3) అండమాన్, నికోబార్
 4) గ్రేట్ అండమాన్, లిటిల్ అండమాన్
16. భారతదేశ ప్రాదేశిక జలాల పరిధి ఎంత?
 1) 12 కి.మీ.
 2) 12 నాటికల్ మైళ్లు
 3) 200 నాటికల్ మైళ్లు 4) 200 కి.మీ.
17. కాంచన్‌జంగ (కాంచనగంగ) పర్వత శిఖరం ఏ ప్రాంతంలో ఉంది?
 1) నేపాల్ 2) ఉత్తరాఖండ్
 3) సిక్కిం 4) అరుణాచల్ ప్రదేశ్
18. 'డూన్'లు ఏయే శ్రేణుల మధ్య విస్తరించి ఉన్నాయి?
 1) హిమాద్రి, హిమాచల్
 2) హిమాచల్, శివాలిక్
 3) హిమాద్రి, ట్రాన్స్ హిమాలయ మండలం
 4) హిమాద్రి, శివాలిక్
19. అజంతా కొండలు ఏ రాష్ట్రంలో విస్తరించి ఉన్నాయి?
 1) మహారాష్ట్ర 2) మధ్యప్రదేశ్
 3) ఛత్తీస్‌గఢ్ 4) జార్ఖండ్
20. పశ్చిమబెంగాల్‌లోని సుందర్‌బన్స్ తీరాన్ని ఏమని పిలుస్తారు?
 1) ఉత్కల్ తీరం 2) సర్కార్ తీరం
 3) కోరమండల్ తీరం 4) వంగా తీరం
21. 'కె2 (గాడ్విన్ ఆస్టిన్)' శిఖరం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
 1) హిమాద్రి 2) హిమాచల్
 3) శివాలిక్ 4) కారకోరం
22. సాత్పురా, వింధ్య పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
 1) తపతి 2) గండక్
 3) నర్మద 4) గోదావరి
23. నీలగిరి కొండల్లో ఎత్తయిన శిఖరం ఏది?
 1) పంచ్‌మర్హి 2) అనైముడి
 3) మౌంట్ అబూ 4) దొడబెట్ట
24. కిందివాటిలో ఏ పర్వత శ్రేణి 'వేసవి విడిది'కి ప్రసిద్ధి చెందింది?
 1) ట్రాన్స్ హిమాలయ మండలం
 2) హిమాద్రి హిమాలయాలు
 3) హిమాచల్ హిమాలయాలు
 4) శివాలిక్ హిమాలయాలు



25. అసోం హిమాలయాలు ఏ రెండు నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
 1) సింధు, సట్లేజ్ 2) తీస్తా, బ్రహ్మపుత్ర
 3) కాళీ, తీస్తా 4) సట్లేజ్, కాళీ
26. ఉత్తరప్రదేశ్‌లోని చవిటి నేలలను ఏమని పిలుస్తారు?
 1) రే 2) బాబర్
 3) టెరాయి 4) భంగర్
27. కథియావార్ పీఠభూమి ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
 1) మధ్యప్రదేశ్ 2) ఛత్తీస్‌గఢ్
 3) గుజరాత్ 4) రాజస్థాన్
28. 'రూఫ్ ఆఫ్ ది సౌత్' అని ఏ రాష్ట్రాన్ని పిలుస్తారు?
 1) కేరళ 2) కర్ణాటక
 3) గోవా 4) తమిళనాడు
29. ఈశాన్య రుతుపవనాల వల్ల ఏ రాష్ట్రంలో వర్షం అధికంగా కురుస్తుంది?
 1) ఆంధ్రప్రదేశ్ 2) మహారాష్ట్ర
 3) తమిళనాడు 4) కేరళ
30. భారత వాతావరణ శాఖ ప్రకారం ప్రస్తుతం భారత్‌లో ఈశాన్య రుతుపవన కాలం ఏది?
 1) జూన్ - సెప్టెంబరు
 2) అక్టోబరు - నవంబరు
 3) డిసెంబరు -ఫిబ్రవరి
 4) మార్చి - మే
31. భారతదేశంలో ఏర్పడే చక్రవాతాలను ఏమని పిలుస్తారు?
 1) విల్లీ విల్లీ 2) హరికేన్లు
 3) టోర్నడో 4) సైక్లోన్
32. 'మాన్‌సూన్' అనే మాట ఏ భాష నుంచి వచ్చింది?
 1) గ్రీక్ 2) అరబిక్
 3) లాటిన్ 4) సంస్కృతం
33. నైరుతి రుతుపవనాల ద్వారా మొదటిసారిగా వర్షాలు పొందే రాష్ట్రం ఏది?
 1) తమిళనాడు 2) మహారాష్ట్ర
 3) కేరళ 4) ఆంధ్రప్రదేశ్
34. భారతదేశంలో విస్తీర్ణపరంగా అడవులు తక్కువగా ఉన్న రాష్ట్రం ఏది?
 1) పంజాబ్ 2) హర్యానా
 3) అరుణాచల్ ప్రదేశ్ 4) గోవా
35. 'మహాగని' వృక్షాలు ప్రధానంగా ఏ అరణ్యాల్లో పెరుగుతాయి?
 1) ఆకురాల్చు అరణ్యాలు
 2) సతతహరిత అరణ్యాలు
 3) ముళ్లజాతి అరణ్యాలు
 4) టైడల్ అరణ్యాలు
36. భారతదేశంలో వంట చెరకుకు ప్రసిద్ధి చెందిన రాష్ట్రం ఏది?
 1) మిజోరాం 2) కేరళ
 3) తమిళనాడు 4) కర్ణాటక
37. భారత ప్రభుత్వం తొలిసారిగా 'జాతీయ అటవీ విధానం' ఎప్పుడు ప్రకటించింది?
 1) 1976 2) 1988
 3) 1952 4) 2006
38. హిమాలయ పర్వతాల్లోని హిమాద్రి పర్వత శ్రేణుల్లో పెరిగే అరణ్యాలు ఏవి?
 1) అల్పైన్ అడవులు
 2) టైడల్ అడవులు
 3) ఆకురాల్చు అడవులు
 4) ముళ్లజాతి అడవులు
39. భారతదేశంలో విస్తీర్ణపరంగా అతిపెద్ద టైగర్ రిజర్వ్ ఏది?
 1) బందీపూర్ టైగర్ రిజర్వ్
 2) పెంచ్ టైగర్ రిజర్వ్
 3) నాగార్జునసాగర్- శ్రీశైలం టైగర్ రిజర్వ్
 4) సుందర్‌బన్స్ టైగర్ రిజర్వ్
40. భారతదేశంలో అతి పురాతన జాతీయ పార్క్ 'జిమ్‌కార్బెట్' ఏ రాష్ట్రంలో ఉంది?
 1) అసోం 2) ఉత్తరాంచల్
 3) కర్ణాటక 4) ఒడిశా
41. భారత ప్రభుత్వం 'ఆపరేషన్ టైగర్ ప్రాజెక్టు'ను ఏ సంవత్సరంలో ప్రకటించింది?
 1) 1952 2) 1975
 3) 1992 4) 1973
42. భారతదేశంలో మొట్టమొదటి పక్షి సంరక్షణ కేంద్రం ఏది?
 1) వేదాంతగల్ 2) సలీం అలీ
 3) రంగన్ తిట్టు 4) కియోల్ దేవ్ ఘనా
43. ఆకురాల్చు అరణ్యాల్లోని ముఖ్యమైన అటవీ ఉత్పత్తి ఏది?
 1) టెండు 2) ఎబోని
 3) టేకు 4) ఫర్
44. ఉష్ణమండలంలో 'చెర్నోజెమ్' నేలలు అని వేటిని పిలుస్తారు?
 1) ఒండ్రు నేలలు 2) నల్లరేగడి నేలలు
 3) ఎర్ర నేలలు 4) జేగురు నేలలు
45. శివాలిక్ పర్వత పాదాల వద్ద ఉన్న చిత్తడి నేలలను ఏమంటారు?
 1) ఖాదర్ 2) భంగర్
 3) రే 4) టెరాయి
46. 'బసాల్ట్' శిలలు ఎక్కువగా విస్తరించి ఉండే మృత్తికలు ఏవి?
 1) ఒండ్రు మృత్తికలు 2) ఎర్ర మృత్తికలు
 3) నల్లరేగడి 4) జేగురు
47. సింధునదికి ఉపనది కానిది ఏది?
 1) బియాస్ 2) జీలం
 3) రావి 4) చంబల్
48. 'అసోం దుఃఖదాయని'గా ఏ నదిని పేర్కొంటారు?
 1) బ్రహ్మపుత్ర 2) యమున
 3) కోసి 4) గండక్
49. 'వృద్ధగంగ' అనే పేరున్న నది ఏది?
 1) గంగానది 2) సింధునది
 3) గోదావరి నది 4) కృష్ణానది
50. మంజీర నది జన్మస్థానం ఏది?
 1) మహాబలేశ్వర్
 2) బాలాఘాట్ కొండలు
 3) బ్రహ్మగిరి కొండలు
 4) నందిదుర్గ కొండలు
51. కృష్ణానది తెలంగాణ రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ప్రవేశిస్తుంది?
 1) హంసలదీవి 2) సంగెం
 3) తంగడి 4) దివిసీమ
52. కిందివాటిలో దేన్ని 'లాంగులాగ్య' అని పిలుస్తారు?
 1) వంశధార 2) నాగావళి
 3) సువర్ణరేఖ 4) కావేరి
53. కిందివాటిలో పశ్చిమం వైపు ప్రవహించే నది ఏది?
 1) గోదావరి 2) తపతి
 3) మహానది 4) వంశధార
54. 'కుంతల' జలపాతం ఏ జిల్లాలో ఉంది?
 1) ఆదిలాబాద్ 2) వరంగల్
 3) ఖమ్మం 4) నల్గొండ
55. కోల్‌కతా నగరం ఏ నదీ తీరంలో ఉంది?
 1) మహానది 2) బ్రహ్మపుత్ర
 3) సువర్ణరేఖ 4) హుగ్లీ
56. భారతదేశంలో అతిపెద్ద ఉప్పునీటి సరస్సు ఏది?
 1) ఊలర్ 2) సాంబర్
 3) చిలుకా 4) లోక్‌తక్
57. 'దాల్' సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
 1) ఉత్తరాంచల్ 2) ఛత్తీస్‌గఢ్
 3) జమ్ము-కశ్మీర్ 4) ఒడిశా
58. 'సరోవరీయ' రాష్ట్రంగా దేన్ని పిలుస్తారు?
 1) కేరళ 2) ఒడిశా
 3) రాజస్థాన్ 4)జమ్ము-కశ్మీర్
59. 'దుదుమా' జలపాతం ఏ నదిపై ఉంది?
 1) వంశధార 2) మాచ్‌ఖండ్
 3) కృష్ణానది 4) కావేరి నది
60. 'మార్బుల్ రివర్' అని ఏ నదిని పిలుస్తారు?
 1) తపతి 2) మహానది
 3) నర్మద 4) బ్రాహ్మణి
61. 'భీమ' ఏ నదికి ఉపనది?
 1) గోదావరి 2) మహానది
 3) కృష్ణ 4) కావేరి
62. ఏ నదిని 'బంగ్లాదేశ్'లో 'పద్మా' అని పిలుస్తారు?
 1) గంగా 2) బ్రహ్మపుత్ర
 3) మెకాంగ్ 4) హుగ్లీ
63. కిందివాటిలో ఏ నది పశ్చిమ కనుమల్లో ఉద్భవించలేదు?
 1) గోదావరి 2) కృష్ణ
 3) శరావతి 4) మహానది
64. 'సోన్' ఏ నదికి ఉపనది?
 1) యమున 2) సట్లేజ్
 3) గంగా 4) నర్మద

సమాధానాలు

1) 4	2) 2	3) 4	4) 3	5) 2
6) 1	7) 3	8) 2	9) 2	10) 1
11) 4	12) 2	13) 3	14) 1	15) 4
16) 2	17) 3	18) 2	19) 1	20) 4
21) 4	22) 3	23) 4	24) 3	25) 2
26) 1	27) 3	28) 2	29) 3	30) 2
31) 4	32) 2	33) 3	34) 2	35) 2
36) 4	37) 3	38) 1	39) 3	40) 2
41) 4	42) 1	43) 3	44) 2	45) 4
46) 3	47) 4	48) 1	49) 3	50) 2
51) 3	52) 2	53) 2	54) 1	55) 4
56) 2	57) 3	58) 4	59) 2	60) 3
61) 3	62) 1	63) 4	64) 3.	

Continue using paper as before..

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q. No. 1 - 5): In each question below a relationship between different elements is shown in the statement(s). The statements are followed by two conclusions.

Give answer:
1) If only conclusion I is true
2) If only conclusion II is true
3) If either conclusion I or II is true
4) If neither conclusion I nor II is true
5) If both conclusions I and II are true


1. **Statements:** K>R^{3}D, P=K, P£ L
 Conclusions: I. K>D II. L >R
 Solution: K > R ^{3} D
 Hence, K > D. Conclusion I is true.
 L ^{3} P = K > R
 Hence, L > R. Conclusion II is also true. **Ans: 5**
2. **Statements:** D >A, M £ T £ R, A < M
 Conclusions: I. R >D II. A > T
 Solution:
 R ^{3} T ^{3} M > A < D. Hence, R and D cannot be compared. Conclusion I is not true.
 T ^{3} M > A. Hence, T >A. So, conclusion II is not true. **Ans: 4**
3. **Statements:** S ^{3} P > L, P =N < A, S < B
 Conclusions: I. B = A II. N £ S
 Solution: B > S ^{3} P = N < A.
 As B and A cannot be compared, conclusion I is not true.
 S ^{3} P = N. Hence, S ^{3} N. So, conclusion II is true. **Ans: 2**
4. **Statements:** V > D = X, X ^{3} Q, Z £ Q
 Conclusions: I. D = Z II. D > Z
 Solution: D = X ^{3} Q ^{3} Z. Hence, D ^{3} Z, which means D > Z or D = Z. Either I or II is true. **Ans: 3**
5. **Statements:** S ^{3} P > L, P = N<A, S < B
 Conclusions: I. B >A II. B £ A
 Solution: B > S ^{3} P = N < A.
 As contradictory symbols (>, <) are there between the terms B and A, they cannot be compared. But, they can form a **complementary pair**. So, Either I or II follows. **Ans: 3**

Directions (Q. No. 6 - 10): In each question below there are three statements followed by two conclusions numbered I and II. You have to take the three given statements to be true even if they seem to be at variance from commonly known facts and then decide which of the given conclusions logically follows from the three given statements disregarding commonly known facts. Then decide which of the answers (1), (2), (3), (4) and (5) is the correct answer.


Give answer:
1) If only conclusion I is follows
2) If only conclusion II is follows
3) If either conclusion I or II follow
4) If neither I nor II is follows
5) If both I and II follow

6. **Statements:** All pages are books.
 Some books are plans.
 All plans are bundles.
 Conclusions:
 I. Some bundles are pages.
 II. No page is a bundle.
 Solution:

Basic Diagram




Alternate Diagram




As all the given statements are affirmative, there is a possibility of 'some pages are bundles'. Hence, both the conclusions form a complementary pair. Answer is 'Either I or II' follows.
Ans: 3

7. **Statements:** All tables are desks.
 All desks are sofas.
 All sofas are benches.
 Conclusions:
 I. Some benches are not desks
 II. All benches are desks
 Solution:




Basic Diagram Alternate Diagram



As all the given statements are affirmative, there is a possibility of 'All benches are desks'. Hence, both the conclusions form a complementary pair. Answer is 'Either I or II' follows. **Ans: 3**

8. **Statements:** All curtains are rods
 Some rods are sheets.
 Some sheets are pillows.
 Conclusions:
 I. Some pillows are rods.
 II. Some rods are curtains.
 Solution:


Basic Diagram



As the given conclusions are both 'affirmative', the validity of these have to be checked in the basic diagram. Clearly, only II conclusion is valid. **Ans: 2**

9. **Statements:**
 All pads are boards.
 All doors are roofs.
 No board is roof.
 Conclusions:
 I. No door is pad.
 II. No roof is board.
 Solution:


Basic Diagram



Both I and II follow.
Ans: 5

10. **Statements:**
 All spoons are utensils.
 Some utensils are bulbs.
 All bulbs are sockets.
 Conclusions:
 I. All sockets need not necessarily be bulbs.
 II. All spoons being bulbs is a possibility.
 Solution:

Basic Diagram



Clearly, both the conclusions are valid. **Ans: 5**

Directions (Q. No. 11 - 13): In each question below is given a statement followed by two or three assumptions. An assumption is something supposed or taken for granted. You have to consider the statement and the following assumptions and decide which of the assumption(s) is/ are implicit in the statement.

11. **Statement:** The Govt. has decided to auction construction of highways to private entities in several blocks across the country on build-operate-transfer basis.
 Assumptions:
 I. An adequate number of private entities may not respond to the Government's auction notification.
 II. Many private entities in the country are capable of constructing highways within reasonable time.
 III. The Government's proposal of build-operate-transfer may financially benefit the private entities.

Give answer:
1) Only I and II are implicit
2) Only II and III are implicit
3) Only II is implicit
4) Only I and III are implicit
5) None of these

Explanation: As government believes in the capabilities of the private entities and also it would commercially benefit them, it has decided to go ahead with the auction of construction of highways.
Ans: 2

12. **Statement:** Government has urged all the citizens to use electronic media for carrying out their daily activities, whenever possible, instead of using paper, as the manufacture of paper requires the cutting down of a large number of trees causing severe damage to the ecosystem.
 Assumptions:
 I. Most people may be capable of using electronic media to carry out various routines.
 II. Most people may have access to electronic media for carrying out their daily routine activities.
 III. People at large may reject the Govt.'s appeal and continue using paper as before.

Give answer:
1) Only I is implicit
2) Only II is implicit
3) Only I and II are implicit
4) Only III is implicit
5) None of these

Explanation: Clearly, government's plea is based on the assumption that people would be capable of using electronic media and it is in reach of them. **Ans: 3**

13. **Statement:** The apex body controlling universities in the country has decided to revise the syllabus of all the technical courses to make them focused towards the present needs of the industry thereby making the technical graduates more employable than they are at present.
 Assumptions:
 I. Technical colleges affiliated to different universities may not welcome the apex body's decision and may continue with the same syllabus as at present.
 II. The industry may welcome the decision of the apex body and scale up their hiring from these colleges.
 III. The Government may not allow the apex body to implement its decision in all the colleges as it may lead to chaos.

Give answer:
1) None is implicit
2) Only I is implicit
3) Only II is implicit
4) Only III is implicit
5) Only I and II are implicit

Explanation: When the apex body has taken such kind of a decision it would have thought that the industry appreciates and welcomes the decision, and the government may not oppose it.
Ans: 3